# పూర్ణిమ



ఆచార్య శేషయ్య కందమూరు
పిహెచ్.డి.

# పూర్ణిమ

ఆచార్య శేషయ్య కందమూరు, పి.హెచ్‌డి.

# పూర్ణిమ

## ఆచార్య శేషయ్య కందమూరు

ప్రచురణ : మార్చి 2017

ప్రతులు : 1000

వెల : రూ. 125/- ($7)

ముఖచిత్రం : రమణ - రమణ ఆర్ట్స్

ముద్రణ : సి.ఎన్. ప్రింటర్స్, తిరుపతి.

ప్రతులకు : ఆచార్య శేషయ్య కందమూరు
**Kashyapa Academy of Leadership**
201, నారాయణ విహార్ అపార్ట్‌మెంట్స్
నెహ్రూనగర్, తిరుపతి - 517 507
ఫోన్ : 0877-2240998
సెల్ : 98481 10196
Email : seshaiahk@yahoo.co.in

విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్ (ఫోన్ : 24602946)
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్ (ఫోన్ : 24652387)
నవయుగ బుక్ హౌస్, హైదరాబాద్
మరియు అన్ని బుక్‌షాపులలో లభించును.

# అంకితం

జీవితంలో, జ్ఞాన ధన సద్వినియోగాన్ని, ప్రేమ, త్యాగాల ఔన్నత్యాన్ని ఆకళింపుచేసుకొని, జీవితాలను అర్పణ చేసిన పూర్ణిమ లాంటి మహోన్నత వ్యక్తులకు,

జీవితాలను ప్రేమతో ముడివేసుకుని, ప్రేమోన్నత శిఖరాలను అధిరోహించి, రమించిన త్యాగధనులకు,

ప్రేమతో పెనుగులాడి, ప్రేమలో కరిగి, ప్రేమలో కాలి బూడిదై, ప్రేమ భ్రమల అగాధాల్లో పడి, చితికిపోయిన బాధాతప్తులకు, ప్రేమతో, నమ్రతతో, శిరస్సు వంచి...

**రచయిత**

22-02-2017
తిరుపతి

**ఆచార్య శేషయ్య కందమూరు**

# రచయిత హృదయం

నాకు జీవితంలో ఒకే ఒక్క నవల రాయాలని, అందులో క్రొత్తదనం యధార్థత ఉండాలనే  కోరిక చాలాకాలంగా, చాలాబలంగా ఉన్నది. నా పదహారవ యేట నా తండ్రి చనిపోయినప్పుడు నా చదువుకు ఆరేడు సంవత్సరాలు ఆటంకాలు కలిగి అనేకసార్లు పరీక్షలు తప్పుతూ, ఒకవైపు ఔన్నత్యపు ఆశయాలతో, మరొకవైపు చిలిపి చేష్టలుతో తిరుగాడుతూ, పోకిరి అన్నబిరుదులు, సత్కార చీత్కారాలు పొందుతూ, జీవితాన్ని, సమాజాన్ని అనేక కోణాలనుంచి అర్థంచేసుకోవడానికి నాకు వీలైంది.

అయితే ఏమి రాయాలి? నవలకు ఒక 'వస్తువు' కావాలి. ఉప్పు కప్పురం, సారా నీరు, రెండింటి రూపాలు ఒకటైనా, రుచులు లక్షణాలు, భిన్నధృవాలుగా ఉంటాయి. వాటి ప్రభావం రెండు అంచులు, అంది అందనివిగా ఉంటాయి. అందుచేత 'థీమ్' ఒక ప్రత్యేకతతో జీవితపు రెండంచులు అందనివిగా ఉండాలి. ఒకవేళ ఊహ ఉన్నప్పటికి దానిని అక్షరమాలగా కూర్చాలంటే, అనేక కుప్పిగంతుల తరువాత యూనివర్శిటిలో విద్య ఉద్యోగం సాగించడంతో, ఇంగ్లీషులో రాతకోతలు జరపడం కారణంగా, తెలుగు వ్రాసే అవసరం అలవాటు తప్పిన కారణంగా తెలుగులో అంత మంచిగా, రాయలేననే సందేహం ఉన్నా ఆ ప్రయత్నాన్ని విరమించుకునే ఇష్టంలేక, ఈ చిన్నిప్రయత్నం చేశాను.

నే పుట్టిన ఊరులో ఉన్నంత వైవిధ్యం నేను మరెక్కడా చూడలేదు. మా ఊరిలో ధనిక పేద, దురాశ త్యాగం, సుఖం దుఃఖం, సౌందర్యం అందవిహీనం, అన్నీ తారస్థాయిలో ఉండడం, నా చిన్నవయసులోనే చూచాను.  అ తరువాత సాహిత్యంలో, శాస్త్రవిజ్ఞానంలో ఏవైనా సంఘటనలు తారసిల్లినప్పుడు, అవి మా ఊరిలోని వ్యక్తుల జీవితాల ఛాయలుగా అనిపించేవి.

నేను ప్రకృతి సౌందర్య అభిలాషిని. ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించడంలో ఉన్న మాధుర్యం, ఆనందం, అనుభవం మాటలకు అందదు. ఆ కారణాలతో నా జ్ఞానం, ఆవేశం, అనుభవం, జీవన సంఘర్షణలు, నేను చూచిన విభిన్న వస్తుతత్త్వపు ఛాయలు, ఇందులో చోటుచేసుకున్నాయి. నాకు సాహిత్యం అన్నది సమాజ హితాన్ని

కోరుతూ, సమకాలీన సమస్యలను, వర్తమానాన్ని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, సమస్యలకు సమాధానాలను, సాధనా పద్ధతులను, స్పృశిస్తే బాగుంటుందని అనిపించింది. ఆ దిశగా చేసిన ఆలోచనే ఈ పూర్ణిమ ఇతివృత్తం.

నా దృష్టిలో సాహిత్యం ఎంత మంచిచేసిందో అంత చెడునుకూడా చేసింది. ఉదాహరణకు బెంగాలి శరత్ వ్రాసిన 'దేవదాసు' నవల, సినిమా రూపంలో ఆవిష్కరింప బడినప్పుడు, ప్రేమలో విఫలమైన అనేక వ్యక్తులు పక్కా తాగుబోతులై, ఆత్మహత్యలకు ద్వారాలు తెరుచుకుని, జీవితాలను సర్వనాశనం చేసుకున్నారన్నది తెలిసినదే.

మహాకవులు రచయితలు అయిన, శ్రీశ్రీ, చలం, కృష్ణశాస్త్రి, 'సాయుధ పోరాటానికి', 'స్త్రీ వాదానికి', 'ప్రేమ వైఫల్యానికి' పునాదిరాళ్ళై, ఎంతోమంది అమాయకులు, మేధావులు, తమ తమ జీవితాలను అడ్డదోవలో నడిపించుకున్నారు. వారి కవిత్వాలు ఎన్నో ఉద్యమాలకు బాటలు వేశాయి. అనేకమంది అమాయక జీవులను ప్రక్కదారిలో నడిపించాయి. చివరకు, వాళ్ళు నమ్మిన సిద్ధాంతాలు, ఆలోచనలు, వాళ్ళదగ్గిరే రంగు వెలిసిపోయాయి అని అనిపిస్తుంది. నిజానికి వాళ్ళ చివరి దశల్లో పశ్చాత్తాపం చెందలేదని చెప్పడానికి వీలు లేదు.

ఏ సాహిత్య ప్రక్రియలోనైనా థ్రిల్ (రొమాంటిసిజం), తర్కం (లాజిక్) అనగా కార్యకారణ సంబంధం, ముడిపడి ఉండకపోతే దానిలోని ఆహ్లాదము, అభిరుచి ఉత్సుకతతో కూడిన సంపూర్ణత్వం లోపిస్తుందన్న నా విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకొని సాగించిన పయనం ఈ నవలా రచన.

**రచయిత**

**ఆచార్య శేషయ్య కందమూరు**

# పూర్ణిమ

సౌందర్యాన్నంతా ఒక మూసలో పోస్తే అది పూర్ణిమలాగా ఉంటుంది. తల వెంట్రుకల ముంగురులు ముందుకు జారినప్పుడు మబ్బుల చాటు చంద్రునిలా, జుత్తు వెనకవైపుకు జారినప్పుడు సూర్యుడిలా వెలిగిపోతుంది. తన సౌందర్యాన్ని చూచినవారి మనసులో కలిగే తన్మయత్వ భావన పర్వతాలకంటే ఎత్తుగా, సముద్రం కంటె లోతుగా విశాలత్వాన్ని సంతరించుకొని ఉంటుంది.

పూర్ణిమ అనగానే వెన్నెల చంద్రుడు, పున్నమి  పౌర్ణిమ, చల్లదనం తెల్లదనం, ప్రేయసీ ప్రియుల రాగఝురులు, ఉవ్వెత్తున లేచే ప్రేమతరంగాలు, సముద్రపు కెరటాల లాంటి ప్రియరాగాలు, నీటి అలలమీద అనంతరూపాల్లో తేలియాడే చందమామ, పూర్ణత్వం గుర్తుకు వస్తాయి. అందరు ఇష్టపడేది, కోరుకునేది పూర్ణిమ. చల్లని గాలి వీస్తుంటే ఆకాశంలో చంద్రుని చూస్తూ ఆనందంతో తమను తాము మరచిపోయేంతగా మురిపింపచేయడం కాలాన్ని క్షణంలో కరిగించడం ఒక్క చంద్రునికే సాధ్యం. అయితే చంద్రునికి కూడా వృద్ధిక్షయాలుంటాయి.

సంపదోమహతామేవ మహతామేవ చాపదః ।
వృద్ధతే క్షీయతే చంద్రః నతుతారాగణమ్ క్వచిత్ ॥

అనగా సంపదలు గాని ఆపదలు గాని మహాత్ములకు వస్తాయి తప్ప సాధారణ మానవులకు ఉండవు.  అంటే వృద్ధిక్షయాలు చంద్రునికి తప్ప నక్షత్రాలకు ఉండవు కదా! పెరుగుతూ తరుగుతూ, పూర్ణత్వాన్ని పౌర్ణమినాడు,  శూన్యత్వాన్ని అమావాస్య నాడు, కలిగి ఉండడం జీవితంలోని ఎగుడుదిగుడులకు ఒక సింబాలిజం. సూర్యుడు లేకుండా చంద్రుడు లేడు. కొంతమంది కొన్నింటినే ఇష్టపడతారు. అన్నింటినీ ఇష్టపడే వాళ్ళు ఎవ్వరూ ఉండరు. కాని పూర్ణిమను ఇష్టపడనివారిని, ఆకర్షితులు కాని వారిని దివిటీపట్టి వెతకాల్సిందే. ఎంతసేపు ఆస్వాదించినా వెన్నెల తరగనిది. పైగా ప్రతివాడు పున్నమి తన స్వంతం అనుకుంటాడు. తన దగ్గిరే తోడుగా ఉందనుకుంటాడు.  కాని పున్నమి ఏ ఒక్కరి స్వంతమూ కాదు.

నిజానికి ప్రతి ఒక్కరి జీవితం పూర్ణం. దానికి కాలవ్యవధితో పనిలేదు. ఒక్క సంవత్సరం అయినా కోట్ల సంవత్సరాలు అయినా అది పూర్ణమే. అది ఒక అంతులేని

మహా ప్రవాహం. అందువల్ల ప్రతిక్షణం పూర్ణమే. ప్రతి అణువు, పరమాణువు కూడా పూర్ణమే. ఆ కారణంగా మానవుని మనసు అర్థంచేసుకోవాల్సింది ప్రతి అణువు పూర్ణమని, అనుభవాన్ని అర్థంచేసుకునే మనసు పూర్ణమని, ఎక్కడైనా ఖాళీవుంటే అది శూన్యం కాదు పూర్ణమని, తెలుసుకోవడం పరిపూర్ణతత్త్వం. అది వేదాంతానికి చివరి అంకం. నాణేనికి రెండువైపులు. మనసు, ఖాళీగా ఉండే చెంబు అనుకుంటే, సహజంగా దాంట్లో ఉండేది శూన్యం అనుకుంటాం. కానీ శూన్యం కాదు.ఆ శూన్యం కూడా నిండుగా నిండిపోయి నందున పూర్ణం అవుతుంది. ఈ భావాన్నే విశ్వానికి అన్వర్తించుకో వచ్చు. అందుకే ఈశావాస్యోపనిషత్తులో ‘‘ఓం పూర్ణమదః పూర్ణమిదం....” శ్లోకం చెప్పబడింది.

# అంకురం

సకల శాస్త్రాలు, వేదాంత గ్రంథాలు, చరిత్రలు, పురాణాలు, ఇతిహాసాలు, సిద్ధాంతాలు, మానవజాతి యొక్క ఆలోచనా పరిశీలనా, పరిశోధనా ఫలితమే. ఈ ప్రయత్నాలు, ప్రయోగాలు, మానవుడి జీవితాలను సుఖశాంతులతో ఆనందమయం చేసుకోవడానికే. కాని గతం (జరిగినది), ఆగతం (జరుగుతున్నది), అనాగతం (జరుగబోతున్నది) దానికివ్యతిరేకమే. కొన్ని సంఘటనల ఆధారంగా ఒకవేళ మానవుడు పరిపూర్ణానందంతో జీవిస్తున్నాడని ఋజువులు చూపించినా అవి బ్రహ్మమయమైన భ్రమ అనీ, మాయ అనీ కొట్టేయవలసిందే.

నిజానికి ఆనందంగా ఉండటానికి, స్వార్థం లేని త్యాగాన్ని ఆసరాగా చేసుకుంటే, ఇంత తతంగం అవసరం లేదు. తతంగం ఉందంటే మానవుడు దుఃఖభాజనుడు కాక తప్పదు. గుణవంతునికి దేవునితో పనిలేదు. గుణహీనునికి దేవుడు లేడు. ఈ ప్రాపంచిక కార్యక్రమాలన్నీ ఈ రెండు జాతుల మధ్య జరుగుతున్న తంతే. అలాంటి పూర్ణం శూన్యంతో మేళవింపబడిన కథ ఈ ‘పూర్ణిమ’ నవలా ఇతివృత్తం.

# కృతజ్ఞతలు

నేను ఈ పుస్తకాన్ని నవల అని నామకరణం చేయడానికి ధైర్యం లేదు. దీన్ని వ్రాయడానికి కారణం ఏదైనా నా మనఃపరిధిలోని, ప్రతి అణువు, వ్యక్తి సంఘటన వస్తువు, అనుభవము కారణాలు కావు అని చెప్పేందుకు మనసు అంగీకరించదు.

నా తల్లిదండ్రులు, నా కుటుంబం, మిత్రులు, ఆప్తులు, పరిచయస్తులు, సమాజం, నా చుట్టూ ఉన్న ప్రకృతి, ఉన్నాడో లేడో తెలియని భగవంతుడు, నా విద్యార్థినీ విద్యార్థులు, నా పరిశోధక విద్యార్థులు, నా ప్రసంగాలు విన్న శ్రోతలు, నాకు అనేక సందేహాలను ఎక్కుపెట్టిన జ్ఞానులు ఎందరెందరో ఇందుకు కారణభూతులు కాకుండా ఎలా సాధ్య మౌతుంది. ఇది నాకే కాదు. ఏ రచయితకైనా ఇదే అనుభవం ఉంటుందని అనుకొంటు న్నాను. అందుచేత నా కృతజ్ఞతలు ఈ సృష్టి అంతటికి చెందాలని తపిస్తున్నాను.

*నాకు కాలువిరిగి, విజయ హాస్పిటల్లో ఉన్నప్పుడు, ఆర్థోపీడిక్ సర్జన్, మంచికి, నైపుణ్యానికి, వ్యక్తిత్వానికి మారుపేరు అని చెప్పుకోగల్గిన మహోన్నత వ్యక్తి, డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి గారు నా కాలు సరిచేసి నన్ను మంచంలో సుఖంగా ఉంచిన సందర్భంలో, నాకు చాలారోజులుగా మిగిలిన నవలా రచన కల నెరవేరేందుకు అవకాశం చిక్కింది. అందుకు ఆ మహానుభావునికి తరగనన్ని కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

ప్రత్యేకంగా నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, నా పుస్తకం చదివి, వాళ్ళ అంగీకారం తెలిపిన, ప్రొఫెసర్ ఎం. మునిరామిరెడ్డి, డా॥ ఎస్.వి.ఎస్. కిషోర్, డా॥ బి. జనార్ధనరాజు మిత్రులు, శ్రీమతి డి. ప్రసన్నకుమారి, (మా శ్రేయోభిలాషులు), శ్రీ కె.శివనారాయణరావు (సోదరుడు), శ్రీమతి కె.పద్మావతి, (నా శ్రీమతి), కుమారి ఎం. గిరిజ (మేనకోడలు), శ్రీమతి ఆర్. మీనా, శ్రీమతి కె. వసంత, శ్రీమతి కె. అనూరాధ (కుమార్తెలు) లకు నా కృతజ్ఞతలు, ఆశీర్వవచనములు. నా జిలుగు రాతను కష్టపడి కంప్యూటర్ మీదికి ఎక్కించిన శ్రీఎస్.చంద్రశేఖర్ శ్రమకు నా కృతజ్ఞతలు.

నేను మంచంమీద విశ్రాంతి తీసుకున్న కారణంగా, నాకు గుర్తున్నంత వరకూ వ్రాయడం వలన, నా రచనలో ఉదహరించిన పద్యాలలో, శ్లోకాలలో కొన్ని తప్పులు దొర్లి ఉండవచ్చు. అందులకు నేనే బాధ్యుడను. సహృదయ పాఠకులు తప్పులను తెలిపితే , నమ్రతతో కృతజ్ఞతలు తెలుపుకుంటూ రెండవ ముద్రణకు, ఒకవేళ నోచుకుంటే, సరిదిద్దుకోగలను. పరిమాణ భారం దృష్ట్యా ఒరిజినల్ ప్రతిని సంక్షిప్తం చేయడం జరిగిందని నమ్రతతో విన్నవించుకుంటున్నాను.

**రచయిత**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అరుణోదయ రాగం | 11 |
| 2. | బృందావనం | 27 |
| 3. | ఎడారి పయనం | 39 |
| 4. | తెగిన సంకెళ్ళు | 67 |
| 5. | పరుగు పందెం | 89 |
| 6. | వృద్ధాప్య పరితాపం | 107 |
| 7. | ఉషోదయం | 125 |
| 8. | శిఖరాగ్రం | 147 |
| 9. | సృష్టి స్థితి లయ | 155 |
| 10. | అంజలి అంతరంగం | 171 |
| 11. | భావ అవధానం | 181 |
| 12. | నిష్క్రమణ | 195 |
| 13. | పూర్ణిమ జ్ఞాపకాలు | 213 |

# ఆశయం

నాకు సుఖం మీద కోరికలేదు.

నాకు అధికారం మీద మక్కువ లేదు.

నాకు మోక్షం మీద మోహం లేదు.

అయితే శోక తప్త హృదయాలకు

స్వాంతన కల్పించాలనే తపన ఉంది.

– పూర్ణిమ

# 1. అరుణోదయ రాగం

సూర్యోదయం అవుతున్నది. సూర్యుడు తన దుప్పటిని తొలగించుకొని కొంచెం కొంచెంగా బయటకు వస్తున్న కిరణాలు కిటికీలోనుండి దయానంద్‌రావు మీద పడడంతో తన దుప్పటిని మొఖంమీద నుండి తొలగించుకొన్నాడు. రెండ్రోజులుగా ప్రయాణం బడలిక వలన ముందురోజు సాయంత్రం 6 గంటలకు పడుకొన్న వ్యక్తికి సూర్యోదయానికి గాని మెలకువ రాలేదు. మంచం దిగి, బాత్రూమ్‌కు వెళ్ళి బ్రష్‌చేసుకొని బయటకువచ్చి మెట్లుదిగి వీధిలోకి వచ్చాడు. రెండు నెలలుగా ఊరులో లేని సమయంలో తన ఇంటికి ఎదురుగా వెలసిన రేకుల షెడ్ ముందర రెండు బల్లలు నాలుగు కుర్చీలతో ఒక టిఫెన్ సెంటర్ దర్శనమియ్యడం సాయంత్రం గమనించలేదు. తాను ఊరికి వెళ్ళినప్పుడు ఈమార్పు జరిగినట్లు అర్థమయింది. ఇంకొంచెం ముందుకు కదిలాడు. రెండు పొయ్యిలు, నాలుగు గిన్నెలు కనబడినాయి. పొయ్యిలో నుంచి వచ్చే పొగ మధ్య తానుచూచేటప్పటికి ఒక చంద్రబింబం లాంటి ఒక స్త్రీ కూర్చుని ఉంది. ఇంకొంచెం ముందుకు వచ్చాడు. పొయ్యిలో నుండి వచ్చే పొగ మధ్య, పాలునీళ్ళు తెర్లుతున్నప్పుడు వచ్చే ఆవిరి, మేఘాల్లా ఉండడం వలన ఆమె ముఖం చంద్రబింబమా అని అనిపిస్తున్నది. పొయ్యి కాంతి ఎక్కువైనప్పుడు ఆమె ముఖం సూర్యబింబమా అని అనిపిస్తున్నది.

మనసు చెప్పలేనన్ని ప్రశ్నలతో నిండిపోయింది. ఆమె ఎవరు? ఎక్కడనుండి వచ్చింది, అంత సౌందర్యరాశి ఈ సెంటర్‌లో పనిచేయవలసిన అవసరం ఏమి వచ్చింది

అన్న ఆలోచనలతో తాను కూడా ఒక బల్లమీద కూర్చున్నాడు. ఇంతలో ఒక కుర్రాడు వెనుక రూమునుండి వచ్చి, ఇద్దరికి రెండు గ్లాసుల్లో కాఫీ తెచ్చి ఇచ్చాడు. రావు కూడా తనకు ఒక కాఫీ ఇమ్మని అడిగాడు. కొద్ది నిమిషాల్లో రావుగారికి ఒక కాఫీని అందించాడు. కాఫీ తాగుతూ తన మనసులో మూగిన ఆలోచనలకు జవాబులు తానే ఊహించు కుంటూ, కాఫీ త్రాగడం పూర్తిచేశాడు. ఒక పదినిమిషాలు అక్కడే కూర్చుని పరిసరాలను గమనిస్తున్నాడు. రావుకు కాఫీ ఎక్కువగా తాగే అలవాటున్న కారణంగా మరొక కప్పు కావాలని అడిగాడు. రెండవ కప్పు వచ్చింది.ఆ కప్పు కూడా పూర్తయింది.

జేబులో నుండి డబ్బులు తీసి ఇస్తూ దయానందరావు అని, తాను ఎదురింట్లో ఉంటానని, ఇంజనీరుగా పనిచేసి రిటైరైనానని, తన భార్య రెండు సంవత్సరాల క్రిందట చనిపోయిందని, ప్రస్తుతం తాను ఒంటరిగా ఉంటున్నానని, ఒక మిత్రుని పనిమీద వెళ్ళినందున రెండు నెలలుగా ఊరిలో లేనని రాత్రే వచ్చానని, ఈలోగా ఇంటి ముందర టిఫెన్ సెంటర్ రావడం ఆశ్చర్యకరంగా ఉందని తనకు తాను పరిచయం చేసుకున్నాడు. ఈ లోగా శశిధర్‌ను ఉద్దేశించి, మీరు....? అన్నాడు.

శశి వెంటనే “నాపేరు శశిధర్. నేను ఎం.ఏ. చదివాను. ఉద్యోగం సంపాదించడం ఈ రోజుల్లో కష్టంగా ఉంది. అందుచేత మేమే ఉద్యోగాలను సృష్టించుకొన్నాము. ఆమె పూర్ణిమ” అని ఆమె వైపు చేయి చూపించాడు. “మొదట్లో భయపడినా, ఇప్పుడు మీలాంటి వారి ఆసరాతో కొంచెం పుంజుకుంటున్నాం” అని ముగించాడు. రావు ఒక గంట తర్వాత టిఫెన్ చేయడానికి వస్తానని చెప్పి అక్కడనుండి కదిలాడు.

జీవితంలో మనస్సు చేసే గారడి ఎవరికీ అర్థంకాదు. అందుకే పెద్దలంటారు. మనసుకు అధికారం ఇస్తే మనిషిని సేవకునిగా చేసుకుంటుందని. నిద్రాణంగా ఉన్న యవ్వనపు శక్తులన్నీ ఒక్కసారిగా విజృంభించి మనస్సును, శరీరాన్ని ఒక కుదుపు కుదిపినట్టయ్యింది పూర్ణిమ అందాన్ని చూచిన రావుకు. అంత అందాన్ని తన ఆరుపదులలో ఎప్పుడూ చూడలేదు.

శశి, పూర్ణిమ బాగా బిజీ అయిపోయారు. రోజురోజుకు టిఫెన్‌కు వచ్చేవాళ్ళ సంఖ్య పెరుగుతున్నది. సెంటర్ ప్రారంభించినప్పుడు ఒక బల్ల నాలుగు కుర్చీలు తప్ప మరే ఫర్నిచర్ లేదు. ఈరోజు టేబుళ్లు, కుర్చీలతో నిండుగా ఉన్నది. పనిమనిషి కూరలు

తరుగుతున్నది. పూర్ణిమ చిన్న చిన్న పనులు చేసుకుంటున్నది. శశిధర్ హోటల్ పనితో బాగా బిజీ అయ్యాడు.

ఈ మూడు నెలలలో రావు శశివాళ్ళకు చాలా ముఖ్యమైన వ్యక్తి వి.వి.ఐ.పి. అయినాడు. కరెంటు బిల్లు దగ్గర నుండి అనేక పనులు, రావు శశిని అడిగిందే తడవుగా చేసిపెట్టేవాడు. తనకు కావలసిన విధంగా భోజనం చేసిపెడుతున్నారు. తాను రోజు డబ్బులియ్యడం కష్టం అని ముందుగానే వెయ్యి లేదా రెండువేల రూపాయలు ఇచ్చిపెట్టేవాడు. దానికి లెక్క చూచుకోవడం లేదు. శశిధర్ ఎంత చెబితే అంతే. పైపెచ్చు, డబ్బులు ఏమైనా అవసరమయితే తనను అడగమని, తాను ఏమీ అనుకోనని భరోసా ఇచ్చాడు. ఈ కారణాల వల్ల శశి పూర్ణిమకు రావు గారంటే ఒక ప్రత్యేక అభిమానం. అందుకే రావు ఏదైనా పనిచెబితే వాళ్లిద్దరూ కాదనడం ఉండేదికాదు. సంతోషంగా స్వీకరించేవాళ్ళు. మధ్యాహ్నం టీకి వచ్చినప్పుడు ఎవరూ పెద్దగా రారు. శశి, పూర్ణిమ తీరిగ్గా ఉంటారు. కాబట్టి అనేక విషయాలు మాట్లాడడం రావుకు చాలా సంతోషంగా ఉండేది.

మరొక నాలుగు నెలలు గడచిపోయాయి. ఒకరోజు ఉదయం 11 గంటలకు రావు పూర్ణిమ క్యాంటిన్‌కి వచ్చి ఒక కుర్చీ లాక్కొని కూర్చున్నాడు. "శశిధర్ ఎక్కడికి వెళ్ళాడు?" అని అడిగాడు. చిల్లర సామాన్లు కావలసిఉంటే అంగడికి వెళ్ళాడని జవాబు చెప్పింది పూర్ణిమ. రావు "వీలైతే ఒక కాఫీ ఈయగలవా" అని పూర్ణిమను అడిగాడు. "అదెంత పని! ఒక ఐదు నిమిషాలు ఆగండి!" అన్నది ఆమె. ఇంతలో శశిధర్ వచ్చాడు. "నమస్తే సార్! ఈరోజు చాలా త్వరగా వచ్చారే? ఎక్కడికైనా వెళ్ళాల్సిన పనిఉందా?" పూర్ణిమా! "సార్‌కు కొంచెం కాఫీ ఇయ్యడానికి వీలవుతుందా" అని అడిగాడు. దానికి రావు "పూర్ణిమను కాఫీ అడగడం తాగడం అన్నీ అయిపోయాయి" అన్నాడు.

శశిధర్ "ఓకే! ఓకే! చాలా సంతోషం. ఎప్పుడు మీతో మాట్లాడాలన్నా ఎవరో ఒకరు ఉంటారు. మనసు విప్పి మాట్లాడాలంటే కుదరదు. ఎందుకో తెలీదు కాని మీరు వస్తే చాలా ఆనందంగా ఉంటుంది. మీరు వచ్చేది పోయేది కూడా తెలీయదు. ఒక్కరోజు కూడా ఇది బాగలేదు, అది సరిగా లేదు అన్నమాట మీదగ్గర వినలేదు. ఏదైనా అంటూ ఉంటే అది మెచ్చుకోవడమే" అని అన్నాడు.

అందుకు జవాబుగా, "ఏదైనా చూచేవాళ్ళ కళ్ళలో ఉంటుంది శశిధర్" అన్నాడు రావు. కొద్దిసేపు నిశ్శబ్దం. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఇంతలో రావు కల్పించుకొని "నిజానికి నేను ఈరోజు మీతో మాట్లాడ్డానికి కావాలని ముందుగా వచ్చాను". ఒక్క క్షణం నిశ్శబ్దం. ఇంతలో రావు అందుకొని "మీతో ఒక విషయం మాట్లాడాలి. ఎందుకు? ఏమిటి? అని అడగవద్దు. ఇది చాలా కాన్ఫిడెన్షియల్. కాబట్టి మధ్యాహ్నం ఒకసారి వీలుచూసుకొని మా ఇంటికి రండి" అన్నాడు. ఇద్దరూ ఆశ్చర్యంగా ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు ఏం చెప్పాలో తెలియక.

రావు పైకి లేస్తూ "తప్పక రావాలి, వస్తారు కదూ! ఒకటి మాత్రం నిజం. అంతా మీ మంచికే నమ్మండి. మీకోసం ఎదురుచూస్తుంటాను" అని లేచి వెళ్ళిపోయాడు. వెళ్ళాలా వద్దా ఏ విషయమై రమ్మన్నారు అని ఇద్దరూ కొంచెంసేపు తర్జన భర్జన పడ్డారు. "ఏమో ఒకసారి వెళితే సరిపోతుంది. ఎందుకో తెలుస్తుంది. పెద్దాయనపై గౌరవంతో వెళ్ళాలి కదా అంది పూర్ణిమ". సరేనని తలూపాడు శశి. సాయంత్రం 3 గంటల సమయంలో ఫ్లాస్క్‌లో టీ తెచ్చారు పూర్ణిమ, శశిధర్. రావు టీ త్రాగాడు. రావు "నేను మీతో ఒక విషయం క్లుప్తంగా చెప్తున్నాను. నేను మీకు రెండు కవర్లు ఇస్తున్నాను. ఒక కవరులో లెటర్ వుంటుంది. మరొక కవరులో నేను వ్రాసిన వీలునామా, మరొక లెటరు ఉంటాయి. వాటిని జాగ్రత్తగా మీవద్ద ఉంచుకోండి. మీకు వీటివలన ఉపకారమే గాని అపకారము ఉండదు.

నేను వెళ్ళిన తర్వాత ఆ కవరు చించి దాంట్లో విషయాలు మీరిద్దరేచదువుకోండి. దానిని ఎవరికీ చూపించవద్దు. దానిని గురించి ఎవరితో చర్చించవద్దు. అందులో వ్రాసిన విధంగా ధైర్యంగా నడుచుకోండి. ఇంతకుమించి నేను చెప్పాల్సింది ఏమీ లేదు. అంతా ఆ లెటర్‌లో వ్రాసిఉన్నాను. నేను మీ మంచికోరేవాడిని. నేను నా తల్లిదండ్రుల మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నేను చేస్తున్న ఈ పనివలన మీకు చాలా మంచి జరుగుతుంది. జీవితంలో మీ కాళ్ళమీద మీరు నిలబడండి.ఎవరు ఏమి అడిగినా మాకేమి తెలియదని చెప్పండి. మీరు ఈ విషయాలు 'ఎవరికీ చెప్పమని' ప్రమాణం చేస్తున్నారని నేననుకుంటున్నాను" అని అన్నాడు.

రావు బెడ్‌రూమ్‌లోకి పోయి బీరువా తలుపులు తీసి ఒక పెద్దకవరు, మరొక చిన్నకవరు వాళ్ళచేతుల్లో పెట్టాడు. దాంతో కూడా ఒక లక్షరూపాయల కట్ట మరియు

ఆ ఇంటితాళాలు మొత్తం వాళ్ళచేతికి అందించాడు. "బయట తాళం ఒకటి డూప్లికేటు మాత్రం నాదగ్గర ఉంది. నేను వెళ్ళేటప్పుడు ఆ ఒక్క తాళం వేసిపోతాను. మీరు సాయంత్రంగా వచ్చి మిగతా తాళాలన్ని వేసుకోండి. మీకు మంచిరోజు ఎప్పుడనిపిస్తే అప్పుడు ఈ ఇంట్లో చేరండి. మిగతా వివరాలు ఎలాగూ నేను రాసిన లెటర్లో ఉన్నాయి" అని ముగించాడు.

పూర్ణిమ శశిధర్‌లకు దిక్కుతోచడం లేదు. వాళ్ళకు అనుమానం రాకుండా ఉండేందుకు "భగవంతుడు కరుణిస్తే మరలా ఏ జన్మలోనో కలుసుకునే అదృష్టం ఉంటే కలుసుకుందాం" అన్నాడు రావు. ఇద్దరూ ఆయన పాదాలకు నమస్కారం చేసి వాకిలి దాటారు. వాకిలి దగ్గర వాళ్ళు ఏదో అడగబోతుంటే "అన్ని విషయాలు లెటర్‌లో ఉన్నాయి" ముక్తసరిగా అని గబగబా అడుగులేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

సాయంత్రం 5 గంటలు అయ్యింది. సూట్‌కేసు తీసుకొని రోడ్లోకి వచ్చి ఎదురింట్లో పూర్ణిమ శశిధర్‌కు కనబడకుండా ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు రావు. సాయంత్రం హోటల్ పనిలో కాస్త తీరిక దొరికినపుడు, 8 గంటల సమయంలో పూర్ణిమ శశిధర్ ఒకటో నెంబరు వేసియున్న కవర్‌ను మొదట చించి చదవడం మొదలుపెట్టారు.

పియమైన పూర్ణిమకు శశిధర్‌కు!

ప్రీతితో ఆశీస్సులు, ప్రేమతో అభినందనలు

నా జీవితంలో నీలాంటి వ్యక్తిని చూస్తానని కాని తద్వారా కలిగిన ఊహలతో ఉక్కిరి బిక్కిరి అయి ఇలాంటి ఉత్తరం రాయాల్సి వస్తుందని కాని ఉహించలేదు. మొదటిసారి నీవు పొయ్యి దగ్గర కూర్చుని దోసెలు పోస్తుంటే చూచిన రూపం అపురూపం. పొయ్యిలోని మంట నీ ముఖంపై వెలుగును చిమ్ముతుంటే, పొయ్యిలోని పొగ కాంతిని అడ్డగిస్తుంటే నేను చూచిన ఆ సౌందర్యం ఏ చిత్రకారుడైనా తన కుంచెతో క్యాన్వాస్‌మీద మలచివుంటే అదొక అపూర్వ కళాఖండం అయివుండేది.

పికాసో, డావిన్సి లాంటి కళాకారులకు అలాంటి అవకాశం దొరికి ఉండదు. మా ఇంట్లో వాళ్ళవి రెండు చిత్రాలు ఉండడం వలన వాళ్ళ పేర్లు నాకు తెలుసు. అంతకు మించి చిత్రకారులను గురుంచి నాకేమి తెలియదు. అలాంటి వాళ్ళకు దొరికివుంటే ఆ చిత్రం మరొక మోనాలిజా అయ్యివుండేది. నాలాంటి వానికి అలాంటిది

దొరికినా ఉపయోగం లేదు. అయితే అలాంటి వాళ్ళకు దొరికి చిత్రంగా తయారు కాకపోయినా, అలాంటి అనుభూతిని నేను పొందగలిగానని ఆనందించాను. నాకు ఊహ తెలిసిన తర్వాత ఈ 60 వసంతాలలో అలాంటి మెరుపు గగుర్పాటు అనుభవంలోకి తొంగిచూచిన నన్ను నేనే అభినందించుకుంటున్నాను. ఆ క్షణంలో నన్ను నేనే మరచిపోయాను అన్నది సత్యం. అందాన్నంతా ఒక రాసిగాపోసిన మీ తల్లిదండ్రులకు ఆత్మార్పాణం చేయాలనిపించింది. సుందోపసుందులు ఒకరినొకరు చంపుకునేట్టు చేయడానికి నువ్వులను ఒకదానిమీద ఒకటి పేర్చి కూర్చి ప్రకృతిలోని అన్ని రంగులను, మంచును, తేనెను కలిపి ఇంద్రియాలను మైమరపింపచేసే ఒక సౌందర్యరాశిని చేసి బ్రహ్మ ప్రాణం పోశాడు అన్నది పురాణ కథనం. అంతటి దానికి ముగ్ధులైన సుందోప సుందులు తమను తాము తప్ప మరెవ్వరు చంపలేరన్న సత్యాన్ని మర్చిపోయి ఒకరితో ఒకరు తలపడి చంపుకోవడం విన్నాను. రాక్షస సోదరులకు మత్తెక్కించిన తిలోత్తమ కూడా నీలాగా అందంగా ఉండిఉంటుంది కదా?

రెండు నెలలు నేను ఊరిలో లేనప్పుడు నా ఇంటి ఎదురుగా ఉన్న ఒక  రేకుల షెడ్ ఒక సౌందర్య సంపదతతో నిండిపోయి ఉండడం నాకు అయోమయం కలిగించింది. షెడ్‌లో ఉన్న సౌందర్య సంపదను చూచి ఆనందించేందుకు అక్కడ కూడిన వ్యక్తి సంపదను చూస్తే విచిత్రంగా ఉంది. అసలు అక్కడికివచ్చే వాళ్ళలో 50 శాతం టిఫిన్ తినడానికి అని నేననుకోవడం లేదు. మీచేతితో తయారైన దోసెలు తినే అదృష్టాన్ని పొందాలనే ఆశతో వచ్చేవాళ్ళే.  ఆకలిని ఆహారంతో తృప్తిపరచాలనే ఆలోచన కంటే కళ్ళకు విందుచేయడానికి, మనసుకు ఆనందం కలిగించడానికి అక్కడికి వస్తారని అనిపిస్తుంది.

భగవంతుడి మీద నాకు సుముఖత విముఖత రెండూ లేవు. కాదంటే గుడికి పోవడం దేవుడికి దణ్ణం పెట్టడం, దినచర్యగా కాకపోయినా, అవకాశాన్ని బట్టి పోతుండే వాడిని. మాది మధ్యతరగతి కుటుంబం. మాతల్లిదండ్రులు వ్యవసాయం చేసుకొని నన్ను మా అన్నయను చదివించారు. దాంతోనే మా ఇద్దరు అక్కచెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేసి పంపించేశారు. మా అన్నయ్య పి.యు.సి. పాసై చదువుకు స్వస్తిచెప్పి సేద్యం చూసుకుంటూ ఊర్లోనే ఉండిపోయాడు. నేను చదువుల బండి ఎక్కి నిదానంగా ప్రయాణిస్తూ చివరకు ఇంజనీరింగ్ పూర్తిచేశాను. వెంటనే ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు

వరుస క్రమంలో జరిగిపోయాయి. నాకు ఒక కుమారుడు కుమార్తె. ఇద్దరూ మంచి చదువులు చదివి అమెరికాలో స్థిరబడ్డారు. అక్కడే, వేరేజాతివాళ్ళతో పెళ్ళిళ్ళు చేసుకొని వాళ్ళ జీవితాలను వాళ్ళు గడుపుతున్నారు. ఆ విషయంలో నా భార్య మనసు కలత పడింది.

విచిత్రమేమిటంటే నా భార్య ఒక మరమనిషిలాంటిది. ఒక రకంగా నేను అదే వరుసకు చెందిన వాడిని. కాదంటే ఉద్యోగరీత్యా అనేకమందితో కలసిమెలసి ఉండడం, అనేక వ్యవహారాల వలన అనుభవం సంపాదించడం కారణంగా నేను కొంచెం మెరుగుపడ్డాను. నిజానికి ప్రకృతిని చూచి పరవసించే, సౌందర్యాన్ని చూచి ఆరాధించే తత్త్వం కలిగినవాడిని కాదు. అయినా ఎందుకనో నాలో నిన్ను చూచినప్పుడు ఒక గిలిగింత కలిగింది. అంటే నేనేదో నిన్ను నా స్వంతం చేసుకోవాలని ఆలోచించానని అపార్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. కాకుంటే నువ్వు ఆ స్థితిలో ఉండడం మనసును కలచివేసింది. అదే నీవు నా కోడలో, కూతురో అయివుంటే నీ కష్టాన్ని చూచి కడుపు తరుక్కుపోయి వుండేది కదా? ఇది అట్లాంటిదే. అది అభిమానమో, ప్రేమో, సింపతీనో అర్థంకాదు. నా దృష్టిలో నీవొక హిమాలయానివి ఒక సముద్రానివి. దాని దగ్గర కూర్చొని అలాగా చూస్తూ ఉండాలని, ఆనందిస్తూ కాలాన్ని గడిపేయాలని అనిపించింది. నువ్వొక అందమైన చిత్రపటానివి. ఎంతసేపైనా చూడొచ్చు. ఎంతసేపు చూచినా తనివితీరదు. ఎంతసేపు చూచినా దానిలో మార్పు ఉండదు. నేను కవిని, రచయితను, చిత్రకారుడ్ని, సంగీత విద్వాంసుడ్ని కాను. కాని ఎక్కడో అంతరాంతరాల్లో వాటి అనుభూతితో సాధారణమైన ఆనందాన్ని పొందగలిగిన మనసు గలవాడిని. కేవలం ఒక ప్రేక్షకుడిని.

నేను ఒక మనిషినని, నాకు కూడా ఒకమనసున్నదని, నేను కూడా అందాన్ని ఆరాధించగలనని, అందానికి స్పందించగలనని మొట్టమొదటిసారి నిన్ను చూచినప్పుడు తెలిసింది. పైగా ఇంతకాలం నేను పరిపక్వత చెందిన మనిషిగా జీవించలేదన్న వెలితిగూడా అర్థమైంది. దానికి ఇప్పుడు పశ్చాత్తాపపడితే ఉపయోగంలేదు అన్న విషయం కూడా నాకు స్పృహలో ఉంది.

నేను గత కొన్ని నెలలుగా రోజూ నీ దగ్గరకు వచ్చి నాకు మీరిచ్చే ఆహారం తినడం మనసుకు ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కలిగించింది. నిజానికి నా భార్య నాకు,

నా బిడ్డలకు వడ్డించేది నూటికి తొంబై శాతం కూడా ఉండదు. టేబుల్ మీద అన్నీ అమర్చివుంటే మాకు మేమే పెట్టుకుని తినేవాళ్ళం. నేను నా కుమార్తెను కొడుకును చూచి పది సంవత్సరాలు అయ్యింది. వాళ్ళకు మామీద ప్రేమ లేదు, ద్వేషం లేదు. కాని ఎందుకో వాళ్ళమ్మంటే వాళ్ళకు గిట్టదు. కారణం నాకు తెలియదు. వాళ్ళమ్మకు వాళ్ళ పుట్టింటి వాళ్ళంటే మహాఇష్టం. ఆమె ఇలాకా చాలామంది మా ఇంటికి వచ్చిపోయేవాళ్ళు. అది వాళ్ళకు నచ్చేదికాదు. వాళ్ళమీదున్న ప్రేమ, ఆమెకు మామీద లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. నేను ఉద్యోగరీత్యా క్యాంపులు పోవడం, ఎప్పుడో రావడం జరగుతుండేది. నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చినపుడల్లా నేను ఆ ఊళ్ళలో ఒక్కడినే ఉండే వాడిని. కుటుంబాన్ని కదిలిస్తే పిల్లల చదువులు డిస్టర్బ్ అవుతాయని నేను ఆవిధంగా ఒంటరిగా ఉండేవాడిని. నా కూతురు హాస్టల్లో ఉండి ఎం.టెక్. చేసి ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్ళింది. అక్కడే ఎవర్నో పెళ్ళిచేసుకుంది. నా భార్య చనిపోయి  రెండు సంవత్సరాలు అవుతున్నది.

ఈ ప్రపంచంలో ఎవరికి ఏ ఆలోచన వస్తుందో, ఎవరు ఎప్పుడు ఏంచేస్తారో, ఎవరికీ తెలియదు. అంతా యాదృచ్ఛికంగా జరిగిపోతుంది. అందుచేత ఇప్పుడు నేను కూడా అలానే ఆలోచిస్తున్నాను, ప్రవర్తిస్తున్నాను. ఇన్ని సంవత్సరాల తర్వాత కనీసం నా ఇష్టానికి తగ్గట్టు చేయాలని అనిపించింది. ఇన్నాళ్ళు ఏమి చేశానో ఎందుకు చేశానో స్పృహతో చేయలేదు. కాని ఈనాడు బాగా ఆలోచించి నేను మనస్ఫూర్తిగా నడుచుకోవాలని ప్రస్తుత ఆలోచనను ఆచరణలో పెడుతున్నాను. సాధారణంగా నేను ఎవరికి ఏదీ కాదని  చెప్పే తత్త్వం ఉండేవాడిని కాదు. ఎవరు ఏంచేసినా సర్దుకొనిపోయే మనస్తత్వం కలవాడ్ని. ఇప్పటివరకు నాభార్యకు, పిల్లలకు, స్నేహితులకు, ఆఫీసర్లకు, ఎవ్వరికీ కాదనడం ఎరుగని వాడిని. దాంట్లో ఇష్టం అయిష్టం అని రెండూ లేవు. వాళ్ళు అడిగారు మనం చేస్తున్నాము. కేవలం అంతే. కాని ఇప్పుడు నాకంటూ ఒక ఇష్టం ఏర్పడింది. ఆ ఇష్టాన్ని ఆచరించి ఆనందపడాలని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. ఇది ఇష్టాఇష్టాలకు తావులేకుండా తటస్థంగా చేసేపనికాదు. ఆనందంగా చేస్తున్న పని అని అర్థంచేసుకొనండి.

నేను లంచగొండిని కాదు. నా ఉద్యోగంలో నేను కావాలనుకుంటే ఎంతైనా సంపాదించి ఉండవచ్చు. అట్లని నేను లంచం తీసుకోలేదని చెప్పడం  లేదు. నేనుగా

ఎవరినీ అడిగేది లేదు. ఎవరైనా ఏదైనా ఇస్తే కాదనేది లేదు. ఇచ్చినందుకు సంతోషం లేదు. ఈయనందుకు దుఃఖంలేదు. అది ఒక తటస్థ జీవితం. నాదగ్గర చాలామంది అప్పుతీసుకొని ఇవ్వని వాళ్ళు ఉన్నారు. అయినా నా శక్తికి మించి నేను ఎవరికీ సహాయం చేయలేదు. ఇచ్చిన దాన్ని మరలా అడగడం అన్నదీ లేదు. ఇస్తే తీసుకుంటాను, లేకుంటే లేదు. నేను పెద్దగా దానధర్మాలు చేసినవాడను కాను. ఎప్పుడు ముభావంగా వుండే వ్యక్తిని కాబట్టి నన్ను దానధర్మాలు అడగడానికి ఎవరూ ముందుకు వచ్చే వాళ్ళు కారు. ఒక్కమాటలో చెప్పాలంటే నాది ఒక స్తబ్దమైన జీవితం. దాంట్లో అలలు లేవు, తరంగాలు లేవు, ఆటుపోటులు లేవు, తుఫానులు లేవు, సునామీలు లేవు.

నా మనస్సులో అలజడి, అశాంతి, ఆనందం, ఆవేశం కలిగింది నిన్ను చూచినప్పుడే. నిన్ను చూచినతర్వాత జీవితం అంతా కటిక చీకటి లాగా, జ్ఞాపకాలు కారుమబ్బుల్లా కనిపించాయి. అది ఒక మైమరుపు. దాన్ని ప్రేమ అనలేను. నేను అసలు పరాయి స్త్రీపై మోజు లేనివాడిని. ఆ ఉన్మత్తతను, ఆవేశాన్ని, అనురాగాన్ని గురించి చెప్పడానికి మాటలు లేవు. గతంలో మీకు ఏదైనా పెద్ద మొత్తంగా డబ్బిచ్చి దాంతో ఏదైనా మంచి వ్యాపారం పెట్టించాలని అనేకసార్లు అడగాలనిపించింది. అయినా ధైర్యం చేయలేకపోయాను.

ఒకవైపు నాకు జీవితం మీద ఒక వైరాగ్యం ఏర్పడింది. రెండవవైపు మీరు సుఖంగా జీవించేట్టు చేయాలనే తపన నన్ను వేధిస్తున్నది. అందుచేత నేను ఒక సందిగ్ధంలో పడ్డాను. ఇది నా ఆశయం. మీరు నిరంతరం పడే కష్టాన్ని చూస్తూ వుండడం నాకు చాలా ఇబ్బందిగా వుంది. దీని భారం రోజు రోజుకు ఎక్కువ అవుతున్నది. నేను ఎంత త్వరగా వెళ్ళితే మీరు అంత సుఖంగా వుంటారని భావిస్తున్నాను. దాన్ని భౌతికంగా చూడలేకపోయినప్పటికీ అది జరుగుతుందన్న ఆలోచన, ఆశయం, ఆశ నాకు కలిగించే ఆనందం చాలు. మీరు నేను ఇచ్చే సంపదను స్వీకరించి సుఖంగా జీవించకుండా వుంటే నా ఆత్మ క్షోభిస్తుందన్న విషయాన్ని మీరు మర్చిపోవద్దు. మీరు ప్రతిరోజు ప్రీతిగా మూడుపూటలు పెట్టే టిఫిన్ భోజనం తాలూకా అనుభవాలు ఈ జన్మకు చాలు. ఇంత ఆనందం నేను ఈ అరవై సంవత్సరాల్లో ఎప్పుడూ పొందలేదు. ఈ మధ్యకాలంలో ప్రతిదినం నేననుభవించిన ఆనందానికి అవధుల్లేవు. ఆ అనుభవాన్ని మీరు కూడా అర్థంచేసుకోలేరు. అది ఒక భ్రమ

అనుకోవచ్చు. అది భ్రమ అయితే నా జీవితం కూడా ఒక భ్రమే అవుతుంది. ఈ విషయాల్లో తర్కానికి తావు లేదు. నాకు అవసరం కూడా లేదు. నేను చేయాలనుకున్నది చేస్తున్నా. అంతే. ఇవన్నీ ఎందుకు? ఎవరికీ చెప్పుకోలేని, ముఖ్యంగా మీతో నేరుగా పంచుకోలేని బ్రహ్మానందాన్ని గురించి చెబితే మీకు కూడా అర్థంకాదు. పైగా నేను నేరుగా చెప్పలేను కూడా. అందుచేత ఈ విధంగా జాబు రాయాలనిపించింది. ఒకసారి రాస్తే బాగా కుదరక ఇది నాలుగో సారి వ్రాసిన లెటర్ ప్రతి.

సంతోషంగా మీ నుండి సెలవు తీసుకుంటున్నాను. భవిష్యత్తును మీ ఆనందానికి, సంతోషానికి వదిలిపెడుతున్నా.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి

లెటర్ చదువుతుంటే ఇద్దరికీ అయోమయమైపోయింది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఏ పని చేయడానికి బుద్ధిపోవడం లేదు. ఒకవైపు భయం మరొక వైపు ఆశ్చర్యం మనసును కలతపెడుతున్నాయి. అసలు ఆ కవర్లో ఏముంది? ఆయన ఎక్కడికి పోయాడు? ఎప్పుడు వస్తాడు? అనేక ప్రశ్నలు జవాబులు లేవు. ఆ కవర్లో ఏముందో చూడాలని ఆతృత ఎక్కువైంది. అయినా ఎవరైనా రావచ్చు. పైగా హోటల్ పని కొంత మిగిలిపోయింది. అందుచేత చీకటిపడ్డ తర్వాత, వాళ్ళిద్దరికి నాలుగు చపాతీలు చేసిపెట్టుకొని, 2వ నెంబర్ వేసివున్న కవర్ చించి చదవడానికి ప్రారంభించారు. కాని మరలా సందేహం వచ్చి దాన్ని మడిచి కవర్లో పెట్టుకొని ఇంటి తలుపులు వేసుకొని ఇద్దరూ రావు ఇంటికిపోయారు. బయట గేటు దగ్గరికి వేసుంది. లోపలికి వెళితే మెయిన్ డోర్ తాళం వేసివుంది. అంటే రావు ఇంట్లో లేడని అర్థమయ్యింది. కాబట్టి తమదగ్గర ఉన్న తాళాలతో తలుపుతెరచి లోపలికి వెళ్ళారు.

బయటవాళ్ళు ఎవరైనా చూస్తారేమోనన్న భయంతో గబగబా తలుపుతీసి లోపలికివెళ్ళి లైటువేసుకొని కుర్చీలో పక్కపక్కనే కూర్చున్నారు. ఎవరినోటా మాటరావడం లేదు. వారిద్దరు ఒకరినొకరు చూసుకునేదానికి భయపడే పరిస్థితి. చివరకి ఎలాగో తేరుకొని "ఇప్పుడు ఏంచేయాలి?" అని అన్నది పూర్ణిమ. మనస్సు స్థిమితం చేసుకొని చేతిలో ఉన్న పెద్దకవరులో వున్న చిన్న కవరులోని లెటర్‌తీసి చదవడం మొదలుపెట్టారు.

ప్రియమైన పూర్ణిమ, శశిధర్‌కు !

నేను ఈ రోజు సాయంత్రం నా జీవన ప్రయాణం చివరి అధ్యాయం కొరకు బయలుదేరుతున్నాను. రాబోయే 24 గంటల్లో కొన్ని వేల మైళ్ళ దూరం దాటిపోతాను. ఆ తర్వాత కూడా నేను ఎవ్వరికి అందనంత దూరం వెళ్ళిపోతాను. నన్ను గురించి ఆలోచించవద్దు. బెంగపడవద్దు. మీరు నా జాడకోసం ప్రయత్నం చేయవద్దు. మీరు నన్ను ఎలాగూ చేరుకోలేరు. ఈ విషయాలు ఎవరికైనా తెలిస్తే అనేక నిందలు మీ మీద మోపుతారు. మిమ్ములను ఎవరైనా ఏదైనా అడిగితే నేను 6-12 నెలల వరకు హిమాలయాల ప్రాంతాలకు వెళ్ళిపోతానని, ఇల్లు మూసివుంచితే అరిష్టమని, ఇంతకాలం మీరు నాకు చాలా సహాయ సహకారాలు చేసిన మూలంగా, మిమ్ములను నేనొచ్చేంత వరకు కాపురం ఉండమని చెప్పానని చెప్పండి.

ఇంకా తృప్తి చెందని మనుషులకు ఇంటిని బాడుగకు ఇవ్వాల్సిన అవసరం లేదని, మెయింటనెన్స్ విషయాలు చూసుకోమని చెప్పానని చెప్పండి. ఆపైన ఏమడిగినా ఏమీ తెలియదని చెబుతూ ఉండండి. ఈలోగా మీ హోటల్ వ్యాపారాన్ని సాగిస్తూ, వీలుచూచుకొని నేను మీకు ఇచ్చిన రెండవ కవర్లో ఉన్న వీలునామా ద్వారా దత్తత చేసిన ఆస్తులతో, ఏదైనా మంచి వ్యాపారాన్ని ప్రారంభించి పది మందికి పనికివచ్చే విధంగా చేసుకోండి.

ఈ విల్లు రిజిష్టరు చేయబడి వుంది. దీనివల్ల మీరు ఎవరికీ జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదు. ఈ విషయాలను ఇతరులకు చెప్పవద్దు. ఈ విల్లు ద్వారా నేను ప్రస్తుతం కాపురం వుంటున్న ఇల్లు, 20 లక్షల రూపాయలు మీకు చెందుతుంది. మా పూర్వీకులు సంపాదించిన మిగతా ఆస్తులు మా సంతానం వచ్చి తీసుకుంటే తీసుకుంటారు. వాళ్ళు నా తదనంతరం వస్తారని నేను అనుకోవడం లేదు. ఇప్పుడు మీకు చెందే ఆస్తిపాస్తులు అన్నీ నేను సంపాదించినవి. దానిమీద ఎవరికి ఎలాంటి అధికారం లేదు. మిగతా విషయాలు నేనిచ్చిన కవర్లోని వీలునామా చెబుతుంది. ఈ విషయాలు మీకూ, నాకూ తప్ప మరెవ్వరికి తెలియకూడదు. ఎలాంటి పరిస్థితుల్లో ఈ లెటర్‌ను మరెవ్వరికి చూపించవద్దని మనవి.

ఇట్లు

శాశ్వతంగా సెలవు తీసుకుంటున్న మీ శ్రేయోభిలాషి

ఈ జాబు చూచిన వీరిద్దరికి వెన్నులో వణుకు పుట్టింది. ఇంత పెద్ద సమస్యను ఎలా మలచుకొని పరిష్కరించుకోవాలో అర్థంకావడం లేదు. ఇప్పుడు సమస్యంతా పెద్ద కవరును తెరచి దాంట్లో ఏముందో చూడాలి. పూర్ణిమ ఆనాడు తన భర్త, నవీన్ చేతిలో మోసపోయినప్పటి మానసిక ఒత్తిడి కంటే, ఎక్కువ ఒత్తిడి ఎదుర్కొంటానని ఊహించలేదు. అయితే ఈరోజు తనకు శశిధర్ తోడు, కొంత ధైర్యాన్ని ఇస్తున్నది. ఆనాడు వాళ్ళు చేసినదానికి కసి పగ ఉండేది. ఈనాడు ఒకరకమైన అయోమయం, భయం, తన్మయత్వం, సందిగ్ధం కలుగుతున్నది. పూర్ణిమ నిశ్శబ్దాన్ని ఛేదించింది.

“శశిధర్ రేపటి వరకు మనం కాచుక్కూర్చుంటే ఏమౌతుందో నన్న ఒత్తిడిని తట్టుకోవడం కష్టమనిపిస్తుంది. అందువల్ల సమస్యను ఎదుర్కొందాం. ప్రస్తుతం ఆ కవర్‌ను కూడా తీసి చూద్దాం తర్వాత చేయవలసిన కార్యక్రమాన్ని ఆలోచిద్దాం”.

శశిధర్ మాట్లాడే స్థితిలో లేడు. మౌనంగా కూర్చున్నాడు. నిశ్శబ్దం తాండవం చేస్తున్నది. గంట 10 అయ్యింది. ఇద్దరి మనస్సులో చీకటి, బయట చీకట, రోడ్డు మీద జనసంచారం తగ్గిపోయింది. ఈ రాత్రివేళ ఎవరూ రావు ఇంటివైపు రారు. కాబట్టి మిగిలిన కవరు తెరచి చూద్దామనిపించింది. ఎలాగైతేనేం గుండె బిగపట్టుకొని కవరును తెరిచారు. దాంట్లో ఒక వీలునామా, కొన్ని డాక్యుమెంట్లు, ఇరవై డ్రాఫ్టులు, ఒక్కొక్కటి ఒక లక్షరూపాయలతో మూడు బ్యాంకుల మీద ఉన్నాయి. మొత్తం 20 లక్షల రూపాయలు. వాటిలో కొన్ని పూర్ణిమ పేరుతో, మిగిలినవి శశిధర్ పేరుతో ఉన్నాయి. విషయం అర్థమైంది. కాని ఇదంతా ఎందుకో అర్థంకాలేదు. మరొక సమస్య ఏమిటంటే అక్కడే ఏమీ జరగనట్టు ఉండడమా, లేక ఎక్కడికైనా వెళ్ళడమా? వెళితే ఎదుర్కునే సమస్యలు వెళ్ళకుంటే వచ్చే ఇబ్బందులు రకరకాలుగా ముసురు కుంటున్నాయి. ఏది ఏమైనా ప్రేమతో, నమ్మకంతో, ప్రీతితో, తన జీవితాన్ని, తమ ఉన్నతి కొరకై చేసిన త్యాగాన్ని విస్మరించి పారిపోవడం కంటే దౌర్భాగ్యం, పొరపాటు మరొకటి ఉండదనిపించింది పూర్ణిమకు. ఇద్దరూ కొంచెంసేపు చర్చించుకొని ఇప్పటి వరకు జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నాం. ఇప్పుడు కూడా ఎదుర్కొందాం అని తీర్మానించుకొన్నారు. పూర్ణిమ “మనం ఎలాంటి తప్పు చేయనపుడు, ఎవరికి భయపడాలి? ఎందుకు భయపడాలి?” అని అన్నది. ఆ ఆలోచనతో ఇద్దరికీ ఒక ఊరట కలిగింది.

రాత్రి పదకొండు గంటలు దాటింది. ఇద్దరూ అన్ని తలుపులకూ తాళాలు వేసి గేటు తాళం వేసుకొని ఇంటికి వెళ్ళి సాయంత్రం చేసిపెట్టుకొనిన చపాతీలు ఆకలి లేకున్నా ఏదో కొంచెం తిని పడుకున్నారు. కాని నిద్ర సుదూరంలో ఉంది. తెల్లారింది. యధాప్రకారం హొటల్ తెరచి కార్యక్రమాలు జరపాలి. ఇద్దరి మనసుల్లో రెండు తేనె తుట్టెలు ఆలోచనలతో తయారై సతమతమౌవుతున్నారు. అన్నిటికంటే రావు తమకు ఇక కనబడడు, ఈ భూమ్మీద ఉండడు అని అనిపిస్తున్న ఆలోచన వాళ్ళను బాగా కృంగదీస్తున్నది. ఒక ఆశాకిరణం, ఒక నిర్వేదం మధ్య మనస్సు గానుగలో నలుగుతున్నది. ప్రస్తుత సమస్య రావుగారు చెప్పిన విషయం ఇతరులకు ఎలా తెలపాలి.

ఏమిటి ఈ జీవితం ఇన్ని మలుపులు తిరుగుతున్నది. ఊహించని పరిణామాలు జరుగుతున్నాయి. ఇంత ఐశ్వర్యాన్ని ప్రసాదించి తన గమ్యాన్ని మార్చుకున్న రావుగారి మనస్తత్వం అర్థంకావడంలేదు. మానవుని ఉత్సాహానికి, ఉద్రేకానికి, దశా దిశా, హద్దు పొద్దు, వివేకం విచక్షణకు తావుండదు అని ఆలోచిస్తున్నది పూర్ణిమ.

* * * * *

యధాప్రకారం కష్టమర్ల రాకపోకలు జరిగిపోతున్నాయి. పూర్ణిమవాళ్ళు రావు ఇంటికి పోతే రాబోయే ప్రశ్నలకు, వదంతులకు, అపోహలకు జవాబులు తయారు చేసుకోవడానికి వారి మనస్సులు తంటాలుపడుతున్నాయి. ఇప్పటి వరకు పూర్ణిమ శశిధర్ భార్యాభర్తలు అని అందరూ అనుకుంటున్నారు. కాని ఎవరికీ ఏమీ తెలియదు. ఇప్పుడు గతమంతా బయటపడే అవసరం వస్తే ఏం చేయాలి. శశిధర్ దేనికీ స్పందించే స్థితిలో, సమస్యను ధైర్యంగా ఎదుర్కొనే స్థితిలో లేడనిపించింది. ఆలోచించి ఆలోచించి పూర్ణిమ ఒక నిర్ణయానికి వచ్చింది.

నాలుగురోజులు గడిచాయి. యథాప్రకారం హొటల్ కార్యక్రమం యాంత్రికంగా జరుగుతున్నది. పూర్ణిమ రోజు వచ్చే ఒక ప్రత్యేక కస్టమర్లు ఆనందయ్య, ఆంజనేయులతో ఆ మాట ఈ మాట మాట్లాడుతూ కాకతాళీయంగా అన్నట్టు "మేము రెండు రోజులలో రావుగారి ఇంట్లోకి మకాం మారుస్తున్నాము. ఆయన 6 నెలల వరకు ఈవైపు రాడట. తలుపువేసి దీపం పెట్టకుండా ఉంచితే ఇల్లు చెడిపోతుందని పైగా తనకు ఇంతకాలం కడుపునిండా తృప్తిగా భోజనం పెట్టామని మమ్ములను ఉండమన్నారు. పైగా

'అంతబాడుగ ఇచ్చుకోలేము' అని అన్నదానిమీద బాడుగ అసలు అక్కర్లేదని ఇంటిని శుభ్రంగా ఉంచుకోమని, మున్సిపల్ టాక్స్ కూడా తానే కట్టే ఏర్పాటు చేస్తానని చెప్పారు. మేము ఎంత కాదన్నా, "లేదు మీరుంటే నాకు తృప్తిగా ఉంటుంది అని తాళాలిచ్చి వెళ్ళారు" అని అన్నది. "ఇన్ని రోజులకు కూతుర్ని, కొడుకును చూడలేదని బెంగ వచ్చిందేమో" అని అంటూ "పోనీలే పెద్ద ఇల్లు వసతిగా ఉంటుంది. మీరు చక్కగా ఉండిపోండి. మీ మంచితనమే మిమ్మల్ని కాపాడుతుంది. అయితే రేపట్నుంచి మాకు నామం పెట్టినట్లేనా" అని అడిగారు ఇద్దరు. "లేదు లేదు దీన్ని వదలం. మీకెలాంటి ఇబ్బంది ఉండదు. ప్రతిరోజు మీ దర్శనం మాకు కావాలి" అని అన్నాడు శశిధర్.

రెండురోజులు జరిగాయి. అక్కడికి వచ్చేవాళ్ళందరికీ పూర్ణిమవాళ్ళు రావు ఇంట్లో చేరుతారని తెలిసిపోయింది. అయినా ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అడపాదడపా ఒకటి రెండు ప్రశ్నలు కొంతమంది వేయడం, ఏదో ఒక జవాబు చెప్పడంతో దానికొక ముగింపు పలికినట్టు అయ్యింది. వచ్చేవాళ్ళ మనసులో మాత్రం "ఒక్కోసారి అదృష్టం కొంతమందిని వరిస్తుంది. బాడుగ కూడా తీసుకోకుండా అంతపెద్ద ఇల్లు ఇవ్వడం విచిత్రంగా ఉంది", అని చిన్న చిన్న సందేహాలు వాళ్ళలో వాళ్ళే వేసుకుని వాటికి జవాబులు కూడా వాళ్ళే చెప్పుకుంటున్నారు. పదిరోజుల్లో అసలు ఆ విషయాన్ని అందరూ మర్చిపోయారు.

## గృహప్రవేశం

మొదట్లో తాను ఉదయాన్నే లేవడం, టిఫెన్ సెంటర్ చూసుకోవడం, మధ్యాహ్నం వీలైతే హాస్టలుకు పోవడం, లేకపోతే ఉండిపోవడం, రాత్రికి హాస్టల్లో భోజనం, పడక జరుగుతుండేది. అయితే సెంటర్ లాభాల బాటలో పడడంతో వెనుక భాగంలో, ఉండడానికి కావల్సినంత స్థలం ఉండడంచేత, రెండు చిన్న మంచాలను కొనుక్కొని వాళ్ళు అక్కడే రాత్రింబవళ్ళు ఉండడానికి తీర్మానించుకున్నారు. పూర్ణిమ హాస్టల్ ఖాళీచేసి టిఫెన్ సెంటర్లో మకాం పెట్టింది. ఇలా జరుగుతున్న సమయంలో రావుగారి వీలునామా వగైరాలు సంఘటనలు జరిగిపోయాయి.

నెలరోజులు గడచిపోయాయి. దీనిగురించి ఎవరికీ ఏ ఆలోచనా నెగటివ్‌గా లేదని అనిపించిన వెంటనే ఒక మంచిరోజు చూసుకొని, పూర్ణిమ, శశిధర్ ఇల్లు

శుభ్రం చేసుకొని ఇంట్లో పాలు పొంగించి చేరిపోయినారు. పూర్ణిమకు పెద్ద ఇంట్లో ఉండడం, మంచాలు పరుపులు మీద పడుకోవడం, డైనింగ్ టేబుల్ మీద భోంచేయడం లాంటి విలాసమైన జీవితం తెలియనిది కాదు.  కాకుంటే కాలం తెచ్చిన మార్పుకు పైనుంచి కిందబడ్డ బంతి మరలా పైకి ఎగిరినట్లైంది. కాని శశిధర్‌కు ఈ మార్పులు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. జీవితం విచిత్రమైన మలుపులు తిరుగుతున్నట్టు ఆలోచిస్తున్నాడు శశిధర్. పూర్ణిమ శశిధర్ ప్రతివాళ్ళతో చాలా గౌరవంగా సఖ్యంగా ఉండసాగారు. ఎందుచేతనంటే ఎవరికి వారిని గురించి అసూయా వైషమ్యాలు లేకుండా ఉండేట్టు నడచుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. ప్రతివాళ్ళు వాళ్ళకేదైనా సహాయం కావాలంటే చేస్తామని ముందుకు వస్తున్నారు. కాని వాళ్ళ అసలు స్థితిగతులు ఎవరికీ తెలియదు. యథాప్రకారం రాత్రి తొమ్మిది గంటలకు హోటలు మూసివేసి పడుకొనేందుకు రావుగారి కాదు కాదు పూర్ణిమ శశిధర్ స్వంత ఇంట్లో కాలుపెట్టారు. ఆరోజు ఉదయాన్నుండి పనివాళ్ళను బెట్టి ఇంటిని శుభ్రంచేసి కొత్త ఇంటిలాగా తీర్చిదిద్దింది  పూర్ణిమ.

అది మొదటి రోజు. కొంచెంసేపు కాలం తెచ్చిన మార్పును గురించి మాట్లాడు కొని, నిద్రకు ఉపక్రమించే ప్రయత్నాలు చేయసాగారు. ఆ ఇంట్లో మూడు బెడ్‌రూము లున్నాయి. మాస్టర్ బెడ్‌రూములో దుప్పట్లు మార్చి అన్నీ సవరించి పెట్టినందున పూర్ణిమ మంచం ఎక్కింది. శశి తాను మరొక బెడ్‌రూములోకి పోయి పడుకోవడానికి ప్రయత్నం చేస్తూ, “గుడ్‌నైట్” అంటూ తలుపు దగ్గరకు వేయబోతుంటే పూర్ణిమ “ఎక్కడికి పోతావు శశీ!? అంటే నన్ను ఒంటరిదాన్ని చేసి పోవడానికి సిద్ధపడ్డావన్న మాట” అన్నది.

అందుకు శశి “అదికాదు నీవు పడుకుంటావు కదా. నేను ఆ బెడ్‌రూములో.... ఏం చెప్పాలో తెలియలేదు”.

“నీ తెలివి ఊరేగినట్టున్నది. ఇది డబుల్ బెడ్. ఇద్దరు పడుకోవచ్చు. నీవు నేను పక్కపక్కనే పడుకుంటే మన పాతివ్రత్యానికి భంగం కలుగుతుందని నీకు అనుమానమా? నీవు వేరే రూములో పడుకొన్నంత మాత్రాన ఇతరులు మనమీద, మన ఇద్దరి మధ్య ఉన్న సంబంధాన్ని గురించి యోచించేది, వేరేవిధంగా ఉంటుందని కలలుకంటున్నావా? లేక నా ప్రక్కన పడుకున్నంత మాత్రాన నీ పవిత్రతకు మరక పడుతుందని అనుకుంటున్నావా?” అన్నది.

శశికి ఏమి చెప్పాలో తెలియలేదు. ఎలా మాట్లాడాలో అని ఆలోచిస్తున్నాడు. మరల పూర్ణిమ అందుకొని "వచ్చి ఈ మంచంమీద పడుకో. మాట్లాడుకోవచ్చు. పక్కన పక్కనే మంచాల మీద పడుకున్నంత మాత్రాన మనం భార్యాభర్తలు కావడమో కాకుండపోవడమో ఉండదు. వివాహాన్ని, ప్రేమను శరీరాల మధ్య ఉన్న దూరం కంటే, మనసుల మధ్య ఉన్న దూరం తీర్మానంచేస్తుంది. అయినా అవన్నీ ఇప్పుడెందుకు. రా! వచ్చి పడుకో" అన్నది. శశి వచ్చి పక్కనే పడుకున్నాడు. జీవితంలో మరలా అలాంటి సందిగ్ధ పరిస్థితి ఏనాడూ రాలేదు.

పడుకున్న కొద్దిసేపట్లో శశి నిద్దురలోకి జారాడు. పూర్ణిమ మనసు అలసిపోయి ఉన్నా, నిద్దుర, మెలకువ ఒకదాని వెంట ఒకటి తరుముకొస్తూ ఒకరకమైన మానసిక అలసటతో, మగతతో తెల్లవారి జామున నాలుగు గంటలకు మెలకువ వచ్చింది. ఇంక నిద్దర పట్టలేదు. జరుగుతున్న దాని నుండి, జరిగిపోయిన జీవితం అలలు అలలుగా వచ్చిపోతున్న జ్ఞాపకాలతో ఒక్కసారి మనస్సు గతంలోకి జారింది. తన ఊరు తల్లి దండ్రులు, బాల్యం తదనంతరం జరిగిన మార్పులు అన్నీ గుర్తుకొస్తున్నాయి.

* * * * *

# 2. బృందావనం

పామేరు ఒక పెద్ద పల్లెటూరు. రైతులు, కూలీలు అన్ని రకాల వృత్తుల వారు సుఖంగా జీవిస్తున్న ఊరు. పాడి పంటలు సమృద్ధిగా ఉండే ఊరు. పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలలు, రెండు పెద్ద ఆలయాలు, రాముడు, శివుడుతో సహా గ్రామదేవతల గుడులతో, మంచి సంస్కృతి కలిగిన ప్రజలతో నిండిన ఊరు. ఆ ఊరిలో ఎప్పటి నుంచో ఒక గ్రంథాలయం కూడా ఉన్నది. అందుచేత ఊరిలో ఉన్నది ఎలిమెంటరీ స్కూలయినా కూడా తెలుగు చదువుకున్న వారు, సాహిత్యంతో పరిచయం ఉన్న వారు చాలా మంది ఉన్నారు. ఆ ఊరికి ప్రక్కనే అట్లూరు అనే మరో పెద్ద గ్రామం మండల కార్యాలయం, పోలీసుస్టేషన్, హైస్కూలు ఉన్నాయి. అందుచేత ఆ ఊరిలో సంస్కారానికి కొదవ లేదని చెప్పాలి.

ఆ ఊరిలో కోటయ్య మోతుబరి రైతు. ఆయనకు 15 ఎకరాల మాగాణి, నాలుగు జతల ఎద్దులు, కొట్టాలు, ఆవులు, పాలేర్లు వారి మీద అజమాయషీకి ఒక తలమనిషి ఉన్నారు.  మాటకు కట్టుబడే మనిషి అని ఆయనకు ప్రతీతి. మనసున్న మనిషి అని పేరు కలిగి, రోజూ ఇంటిలో నలుగురు భోజనం చేస్తూ బాగా బతుకుతున్న కుటుంబం. భార్య సుబ్బలక్ష్మమ్మ తన అమ్మగారి నుంచి సంపదనూ, మంచి సంస్కారాన్ని తనతో కూడా తీసుకుని వచ్చిన ఇల్లాలు. సుఖంగా బతుకు సాగిస్తున్న కుటుంబంలో ఒక కుమారుడు పుట్టి ఏడేళ్ళ వయస్సులో చనిపోవడం వారికి చాలా బాధను కలిగించింది. మరి కొన్నాళ్ళకు ఒక కూతురు కలగడంతో గతాన్ని మరచిపోయేట్లు చేసింది. ఆ

బిడ్డకు పూర్ణిమ అని పేరు పెట్టి చిన్ననాటి నుంచి ముద్దు మురిపాలతో పెంచసాగారు. పూర్ణిమ పుట్టిననాటి నుండి ఇల్లు కళకళలాడుతూ మూడు పూవులు, ఆరుకాయలుగా సాగింది. పేరుకే కాక అందంలో కూడా పూర్ణత్వాన్ని సొంతం చేసుకుంది పూర్ణిమ.

పూర్ణిమ ఊరిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువు పూర్తిచేసి మూడు కిలోమీటర్ల దూరంలోని అట్లూరులో హైస్కూలు, కాలేజిలో ఇంటర్ వరకూ చదువు పూర్తి చేసింది. అయితే పూర్ణిమ అదృష్టం ఏమిటంటే వాళ్ళ ఊరిలో నూరు సంవత్సరాల నుంచి తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు, ఇతర భాషల్లోని అనువాదాలు ఉన్నందున ఇంగ్లీషు, బెంగాలీ, తెలుగు తదితర బాషల్లోని పుస్తకాలను చదివే అవకాశం రావడం శ్రద్ధ కలగడం, తన పాలిట ఒక వరం. తాను బెంగాలీ సాహిత్యంలో శరత్‌బాబు, ఠాగూర్, ఇలాచంద్రజోషీ, జైనేంద్ర కుమార్, ప్రేమచంద్ లాంటి మహా మహుల సాహిత్యాన్ని చదివింది. అలాగే చెకోవ్, గగోల్, పుష్కిన్, గోర్కీ, విక్టర్‌హ్యూగో లాంటి మేధావుల గ్రంధాలను చదివే అవకాశం లభించింది. అలెగ్జాండర్ డ్యూమాస్, టాల్‌స్టాయ్, ఆస్కార్ వైల్డ్ లాంటి వారి గ్రంధాలు చదవటం అలవాటైంది. దానితో కూడా లత, చలం, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, నండూరి, లత, కృష్ణశాస్త్రి, రంగనాయకమ్మ లాంటి ఆధునిక తెలుగు రచయితల రచనలను చదవడానికి వీలు కుదిరింది. అడపాదడపా ఇంగ్లీషు పుస్తకాలు చదవడంతో ఎన్నో విషయాలు, చరిత్ర, జీవిత సారం చిన్న వయస్సుల్లోనే అర్థమయిందని చెప్పాలి.

వయస్సుకు మించిన పరిపక్వత తనకు అబ్బింది. దాంతో జీవితం మీద, సమాజం మీద, రాగద్వేషాల మీద, ప్రేమ పగల మీద, భక్తి వైరాగ్యాల మీద ఒక విషయ సంబంధమైన జ్ఞానం పరిచయమైంది. అంటే 18 సంవత్సరాల వయస్సులోనే నలభై సంవత్సరాల పరిపక్వతను సంపాదించింది. అందుచేత జీవితం మీద ఒక ఆశ, ఆశయం, ఔన్నత్యం, త్యాగం, జీవితం, ప్రేమ, పెళ్ళి, సంసారం, అనురాగం లాంటి విషయాల మీద అవగాహన, ఊహలు, కలలు కనే ఆలోచనాపరిణతి ఏర్పడింది. తన మనసులోని ఆలోచనల పరిపక్వతకు, వ్యవసాయ కార్య క్రమాలు, పండుగలు, సుఖాలు, సంతోషాలతో గడిపే జనులు తనకు చాలా స్వచ్ఛంగా కనపడసాగారు. తన ఆలోచనలను, కలలను, జీవనసౌందర్యాన్ని, ప్రకృతి ఔన్నత్యాన్ని, ప్రగతి పథాలను తనలో తానే అర్థం చేసుకుని మననం, స్మరణం చేయడం తప్ప ఎవరితోనైనా పంచుకుందామంటే

తనకు సరైన జోడీ దొరకని నిరాశ, నిస్పృహ బాధిస్తుండేవి. తనకు దగ్గరైన స్నేహితురాలు నిర్మల, తాను చెప్పే సాహిత్య విషయాలను ఏదో విధిలేక విన్నట్లు నటిస్తూ ఉండేది.

పూర్ణిమ ఇంటర్ స్కూల్ ఫస్టులో పాసైంది. తరువాత ఏమి చేయాలన్నది పెద్ద ప్రశ్నగా తయారైంది. తండ్రి మనస్తత్వం తనకు తెలుసు. తనకు ఒకటే కూతురు. ఆయన సరస్వం తానే. సుఖంగా కాలు చేయి కదపకుండా జీవితాన్ని సాగించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎవరైనా బాగా చదువుకున్న పిల్లవాడిని ఇచ్చి పెళ్ళి చేస్తే, తనకు మనశ్శాంతిగా ఉంటుంది. పూర్ణిమ అందాన్ని చూసి ఎంతటి ధనవంతుడైనా, విద్యావంతుడైనా పెళ్ళి చేసుకోవడానికి అట్టే మురిసిపోతాడు. పూర్ణిమ అందాన్ని సొంతం చేసుకోవడానికి ఆస్థిపాస్తుల గురించి, కట్న కానుకల గురించి యోచించేందుకు ఎవరైనా సిగ్గు పడకతప్పదు. పూర్ణిమ అమ్మకు ఒక తమ్ముడు అభిలాష్ బీకాం చదివాడు, ఆస్థిపాస్తులు కూడా బాగానే ఉన్నాయి. అతనికి తన బిడ్డను ఇచ్చిపెళ్ళిచేస్తే తనకు సంతోషంగా ఉంటుంది. తన తమ్ముడు అభిలాష్ పూర్ణిమకు నిజానికి తగడు. కాకి ముక్కుకు దొండపండన్న సామెత సరిపోతుంది. అయినా కూడా పుట్టింటి మీద ఆశ, మమకారం, తమ్ముడి మీద ప్రేమ వలన, అతడిలోని లోపాలు పెద్దలోతుగా కనబడలేదు. సుగుణానికి ఉన్న బలం కంటే బలహీనతకు ఉన్న బలం ఎక్కువ.

పూర్ణిమకు ఎలాగైనా మంచి చదువు చదువుకుని తనకున్న పరిజ్ఞానంతో తనేమిటో సమాజానికి రుజువు చేసుకుని ఐఏఎస్ లాంటి చదవులు చదవాలని ఉంది. కానీ తాను చదివిన సాహిత్యం తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన స్థానాన్ని గుర్తు చేస్తున్నాయి. వారి మనసును కష్టపెట్టడం ఏమాత్రం ఇష్టపడటం లేదు. పైగా అంతరాంతరంలో ఎక్కడో తల్లిదండ్రులు తనమీద చూపిన ప్రేమకు ఒక కృతజ్ఞతాభావం నిండి ఉన్నది. ఆ ఊరిలో లేదా చుట్టుపక్కల ఊళ్ళలో తన అందాన్ని ఆడ, మగ ఎలా చూస్తుంటారో, వాళ్ళ మనసులలో ఆశ, అసూయలు ఎలా ఉంటాయో, ఎంతో కొంత సాహిత్యం చదివిన తనకు తెలియనిది, అర్థం కానిది కాదు.

పూర్ణిమకు, తల్లిదండ్రులకు, ఆదిశంకరుడు అన్నట్లు 'తదక్కం,తదక్కం', 'తరువాత ఏమిటి, ఏమిటి' అన్న చర్చలు రోజూ సాగుతూనే ఉన్నాయి. తన స్నేహితురాలు, ఇంటర్లో పాఠాలు చెప్పిన లెక్చరర్లు, ఇరుగు పొరుగు వారు, అందరి బలవంతం మీద కరేడు పట్టణం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మంచి కాలేజీ అక్కడ ఉన్నందు వల్ల అక్కడ చేర్పించి పై చదువులు చదివించడానికి తీర్మానం చేశారు. ఎంత ఆలస్యమైనా

ఎవరు రావాలన్నా, బస్సు, రైలు ప్రయాణం రెండు మూడుగంటలకంటే ఎక్కువ పట్టదు. కాబట్టి ఒక ప్రైవేటు ఇల్లు తీసుకుని వంటమనిషిని పెట్టి చదివించాలని నిర్ణయించు కున్నారు. అనేక లాభనష్టాల పట్టిక వేసి ఆడవాళ్ళ హాస్టల్లో చేర్పించడం ఉత్తమమన్న అభిప్రాయానికి వచ్చారు. గబగబా ప్రయాత్నాలు జరిగిపోయాయి. ఇందులో అమ్మ తమ్ముడు అప్పటికే అదే కాలేజీలో బీకాం చేసి ఉన్నందున, తండ్రికి ఈ విషయాలు పెద్దగా తెలియనందున ఆయన గారి పాత్ర మెండుగా పోషించబడింది. చివరకు పూర్ణిమను బి.ఎ. మొదటి సంవత్సరంలో చేర్పించడం జరిగింది.

కాలానికి ఉన్న చక్రాలు, టైర్లు, ట్యూబులు, బేరింగులు, మిగతావాహనాల్లా పాతపడటం చెడిపోవట ఉండదు. కాబట్టి, ఒకే స్పీడులో నిరంతరం ఇంధనం లేదన్న బెంగలేకుండా సాగిపోతుంది. అలా ఒక సంవత్సరం గడిచిపోయింది. పూర్ణిమ తన వ్యక్తిత్వం, తనకున్న జ్ఞానసంపద వలన ఒకే గదిలో నలుగురు ఇరుక్కుని ఉన్నా హాస్టల్లో కూడా ఇతరులతో మంచి స్నేహభావంతో గడపగలుగుతున్నది. తన గదిలోని వారే కాక, మరో నలుగురు స్నేహితురాళ్ళతో హాయిగా రోజులు గడిచిపోతున్నాయి. పూర్ణిమ కాలేజిలో అందరికీ తనంటే ఒక ప్రత్యేకత. కొట్టొచ్చినట్టు ఉండే తన రూపం, మంచిమాట, అణకువ వలన టీచర్లకు, వార్డెన్‌కు, సిబ్బందికి స్టూడెంట్స్‌కు బాగా దగ్గరయ్యింది.

పూర్ణిమ అమ్మ, వారం వారం అనేక పిండి వంటలతో అనగా చేగోడిలు, కజ్జికాయలు, అరిసెలు, పచ్చుళ్ళు, తేగలు, బుర్రగుంజు లాంటి వస్తువులు డబ్బాలకు డబ్బాలు తన మేనమామ అభిషేక్ ద్వారా పంపడం, వాటిని అందరూ పంచుకుంటూ ఆనందించడం వలన హాస్టల్ భోజన వసతిలోని లోపాలు పెద్దగా ఇబ్బంది పెట్టడం లేదు. ముఖ్యంగా సునీత, స్వప్న, రంజిత, హేమ లాంటి స్నేహితులకు తనంటే పడిచచ్చేటంత ఇష్టం. కాలగమనం రోజుకు ఇరవైనాలుగు గంటలైనా, వీరి స్నేహభావం వలన రిలెటివిటీ థియరీ (ఐన్‌స్టీయిన్ సాపేక్ష సిద్ధాంతం) త్వరగా నడిచిపోతున్నది. ఒక రోజు యధాప్రకారం రోజూ అనేక ప్రశ్నలు వేసినట్లే పూర్ణిమను తన్న స్నేహితు రాళ్ళు 'థియరీ ఆఫ్ రిలెటివిటీని గురించి చెప్పమని అడిగారు.

దానిని గురించి చెబుతూ ఎక్కడో తాను చదివిన జోక్ రూపంలో ఐన్‌స్టీయిన్ చెప్పిన విషయాన్ని చెప్పింది. అదేమిటంటే "ఒకామె ఐన్‌స్టీయిన్ దగ్గరకు వచ్చి మీ థియరీ నాకు అర్థం కావడం లేదు. అర్థమైన భాషలో ఉదాహరణలతో చెప్పండి అని అడిగిందట. అప్పుడు ఆయన 'ఒక స్త్రీ ప్రియుడి కౌగిలిలో ఉన్నప్పుడు, నడిచే గంటలకు

రోజులకు పదిమందిలో లంగా ఊడిపోతే, తత్తరబిత్తరగా సర్దుకుని పరుగెత్తే నిమిషానికి మధ్య ఉన్న తేడానే' అని చెప్పాడట". ఆ మాట చెప్పిన వెంటనే ఎగిరి గంతేసి కౌగిలించుకుని, ముద్దు పెట్టుకుంటూ ఇంతజ్ఞానం ఎలా సంపాదించావే! భగవంతుడు చాలా మోసగాడు. సౌందర్యంతో పాటు జ్ఞానాన్ని ఇచ్చి మాలాంటి వాళ్లకు అసూయ పుట్టించేటట్లు చేశాడు, పోనీలే ఆయన మంచి పని చేశాడు. చదువు నెపంతో నీ సహచర్యం మాకు కలిగేటట్లు చేశాడు. ఆయనకు మేము సదా కృతజ్ఞులం అని తలా ఒకమాట అన్నారు.

సంవత్సరం పరీక్షలైపోయాయి. కాలేజీ సెలవులు రెండు నెలలు. ఎవరి ఊరికి వారు వెళ్ళి పోవాలి. పునర్ దర్శనం మరలా రెండు నెలలకు. పూర్ణిమ తనతో కూడా తన మిగిలిన ఆరుగురు జిగిరీ దోస్తులను వాళ్ళ ఊరికి వచ్చి వారం రోజులు గడిపి పొమ్మని కోరింది. వాళ్ళ ఊరు చాలా బాగుంటుందని, పల్లె వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని, వాళ్ళ అమ్మ నాన్న, చాలా సంతోషిస్తారని ఎలాగో నచ్చజెప్పింది. నిజానికి వారికి కూడా చాలా ఆనందకరమైన విషయమే. కానీ అంతమంది ఒక్కసారిగా వెళితే ఇబ్బందికరంగా ఉంటుందేమోనని వారికి సందేహం కలిగింది. చివరకు అందరి ఇష్టం మీదనే ప్రయాణమయ్యారు. పూర్ణిమ మామయ్య ప్రయాణానికి ఒక వ్యాన్‌ను ఏర్పాటు చేశారు.

అందరూ పూర్ణిమ ఇంట్లో దిగారు. ఇల్లు చాలా పెద్దది. కావలసినంత ఖాళీ జాగా, మేడ మీద గదులు. పక్కనే పశువుల కొట్టాలు. బావి మోటార్లు. చుట్టూరు టెంకాయ, జామ, సపోటా, మామిడి, నారింజ లాంటి పండ్ల చెట్లు. పూలచెట్లతో ఉన్న ఆ ఇంటి పరిసరాలను చూసి స్నేహితులు ఆశ్చర్యం, ఆనందం వెలిబుచ్చారు. అన్ని పనులకు పాలేర్లు, పనివాళ్లు తయారుగా ఉన్నారు. ఉదయాన్నే బీళ్ళలో మేయడానికి ఎద్దులు, ఆవులు, గేదెలను గుంపులు గుంపులుగా తోలుకుని పోవడం, మేకలు, గొర్రెలు లాంటి జంతువులు, వాటి మెడలోని గంటల శబ్దాలను చూసి పూర్ణిమ స్నేహితురాండ్రు మురిసిపోయారు. ఆ ఊరిలో రోడ్లు చాలా విశాలంగా, చక్కగా ఉన్నాయి. ఊరికి తూర్పున పెద్ద చెరువు, గట్టుమీద అక్కడక్కడా మర్రి, వేప, ఊడగ లాంటి చెట్లు వేసవి కాలమైనా కూడా, సగానికి నీళ్ళతో నిండి ఉన్న చెరువు చాలా ముచ్చట గొలిపేదిగా ఉంది. ఆ సంవత్సరం వర్షాలు బాగా కురిసినందున నీరు పుష్కలంగా ఉండి, చిన్న పిల్లలు వచ్చి గోచి ఉండిలేకుండా స్నానాలు చేయడం లాంటి దృశ్యాలు, పూర్ణిమ స్నేహితురాండ్రను బహుముచ్చట గొలిపాయి.

పూర్ణిమ స్నేహితుల్లో సునీత కొద్దిపాటి ధనవంతురాలు. మిగిలిన వారి స్థితి అంతంతమా త్రమే. పూర్ణిమ ఇంట్లో ప్రతి రోజూ విందు భోజనాలే. పూర్ణిమ అమ్మకు ఒక వైపు తన కూతురు భోగాన్ని ఇతరులకు చూపించాలనే తాపత్రయం అంతరాంతరాల్లో దాగి ఉంటే, మరోవైపు వచ్చిన వారికి మంచి మర్యాదలను వసతులను కల్పించాలనే తాపత్రయం ఉంది. మొత్తానికి అనుకున్నదానికంటే చాలా ఆనందంగా గడుపగలుగుతున్నారు వారు. సాయంత్రం పూట షటిల్ ఆటలు, రాత్రి వేళల్లో పాటల పోటీలు లాంటి కార్యక్రమాలతో కాలం స్తంభించిపోయేది. ఒక రోజు ఆ ఊరిలో ఉన్న తన స్నేహితురాంఢ్రు మరో ఇద్దరిని కూడా రమ్మనమని కాలేజీ మిత్రులకు పరిచయాలు చేసి, మామిడితోటలో పిక్నిక్ పెట్టుకున్నారు. అంతా సందడే సందడి. పూర్ణిమ ఇంట్లో అమ్మ, నాన్న పనివాళ్లు, ఆనందంతో, శ్రద్ధతో చేస్తున్న ఆదరణతో వారనుకున్న పోగ్రామ్ పది రోజులకు నెట్టబడింది. స్నేహితులకు వారి తల్లిదండ్రుల నుంచి ఫోన్లురావడంతో పదకొండో రోజు తిరుగు ప్రయాణమయ్యారు. పూర్ణిమ అమ్మ అందరికీ వస్త్రాలు, డబ్బు కానుకగా ఇచ్చి వీడ్కోలు చెప్పారు. చివరకు పనివారి దగ్గర నుంచి అందరికి ఒక కొత్త అనుభవం చవిచూసినట్లు అనిపించింది. ఈ పది రోజులు తిరునాళ్ళసందడిలాగా గడచిపోయాయి.

* * * * *

రెండో సంవత్సరం ప్రారంభమైంది. అంతా మామూలే. కొత్తగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. అదే కాలేజీ , అదే లెక్చరర్లు, అదే భోజనం, పడక, మాటలు. కొత్తదనం కనపడటం లేదు. పెద్దపెద్ద దేవాలయాల్లో చివరి అంకం రథోత్సవం ఉంటుంది. పెద్ద మోకులను రెండు వైపులా కట్టి వందలాది మంది పట్టుకుని రథాన్ని లాగుతుంటారు. ఆవిధంగా ప్రజలు పగలు, రాత్రి అన్న రెండు తాళ్లతో కాలమనే రథాన్ని లాగుతున్నారని పిస్తుంది. చంద్రుడికి దొంగ పోలీసు ఆట ఆడుకోవడానికి ఒక నెల సరిపోతుంది. సూర్యుని గమనం మన జీవితాలకు ఒక దిక్సూచి. ఆ కారణంగా దిన చర్యల మార్పులు, చేర్పులు జరుపుకుంటూ ఉంటాము.

రెండో సంవత్సరం తరగతులు పూర్తయ్యాయి. ఈ లోగా సంక్రాంతి సెలవులకు పూర్ణిమ సొంతూరు చేరింది. సెలవులు పూర్తయ్యి కాలేజీకి వెళ్ళాల్సి ఉంది. ముందు రోజు రాత్రి పూర్ణిమ మంచి నిద్రలో ఉంది. ఏదో కల, పీడకల, ఇంట్లో పెద్ద కేకలు, అరుపులు వినపడుతున్నాయి. ఎవరో పిలుస్తున్నారు. పూర్ణిమ, పూర్ణిమ అన్న అరుపులు ఎక్కువయ్యాయి.

దబాలున లేచి పరిగెత్తుకుంటూ మేడ మీద నుంచి రెండు రెండు మెట్లు దిగుతూ పరుగెత్తింది. కింద పదిమంది గుమిగూడి ఉన్నారు. నాన్నను పడుకోబెట్టి ఉన్నారు. పిలిస్తే పలుకరు. తన తల మీద చేయిపెట్టి తనను ముద్దాడే నాన్న ఇకలేరు. అంతా అయిపోయింది. బంధం తెగిపోయింది. అమ్మ నాన్న తలదగ్గర కూర్చుని పైనపడి ఏడుస్తోంది. పూర్ణిమ అమ్మను, నాన్నను కౌగిలించుకుంది. అంతా ఏడుపులు, పెడబొబ్బలు. తన తల మీద పిడుగులు పడుతున్నట్లు ఉంది. తెల్లవారుతున్నది. సూర్యుడు మొలకెత్తుతున్నాడు. పూర్ణిమ మామయ్యకు ఫోన్ చేశారు. అభిలాష్ వచ్చాడు. అమ్మ మామయ్యను పట్టుకుని దుఃఖిస్తోంది. ఎంత మంది ఏడ్చినా నాన్న ఇకరారు. అది తనకు, అందరికీ తెలుసు. అయినా బాధను ఎలా అణచుకోవాలో దుఃఖాన్ని ఎలా ఆపుకోవాలో తెలియడం లేదు. అనేక ఆలోచనలు. ఇక తనకు దిక్కు ఎవరు? తనను, అమ్మను ఎవరు దగ్గరికి తీస్తారు? తమకు రక్షణ ఏది? రేపు అంటే, భవిష్యత్ అంటే భయం. ఏమి జరుగుతుందో అని భయం. అమ్మ అమాయకురాలు ఏమీ తెలియదు. భర్తచాటు భార్య.

నాన్న మంచితనం ఊరి మొత్తాన్ని కదిలించింది. ఊరిలో ఉన్న పెద్దలు గుమిగూడారు. ఆయన మంచితనాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. పొగడ్తలు, ఏడుపులు, మంచిమాటలు, ఏవి కూడా ఆయనకు వినపడవు. చుట్టాలు, తెలిసిన వారు అందరూ వచ్చారు. ఆయన భార్యను, పూర్ణిమను సముదాయించి ధైర్యం చేప్పే ప్రయత్నాలు ఎవరికి తోచినట్లు వారు చేస్తున్నారు. ప్రతి వారు చెప్పేది వేదాంతమే.

కాలం తీరిపోయింది. ఆయన తెచ్చుకున్న నూకలు అయిపోయాయి. మంచి వారిని దేవుడు త్వరగా తీసుకు వెళ్తాడు. ఈ భూమి మీద శాశ్వతంగా ఎవరుంటారు? పోయిన వాళ్ళతో మనం కూడా పోతామా? అయినా ఏం వయసు ముదిరిందని ఈయనను దేవుడు తీసుకువెళ్ళాడు? ఎవరు వచ్చినా నోటి నిండా పలుకరించే వాడు. ఎవరికి ఏ అవసరం వచ్చినా, లేదని చెప్పే మనస్తత్వం లేని వాడని చర్చలు జరుగుతున్నాయి. మరొక వైపు ఆయన చివరి ప్రయాణానికి ఏర్పాట్లు జరిగిపోతున్నాయి.

సాయంత్రం ఐదుగంటలకు కోటయ్య పార్థివశరీరాన్ని తీసుకుపోయారు. ఇంక కోటయ్య రారు. ఆ ఇల్లు స్థలం, భూమి, బంగారం, వస్తువులు అన్నీ కోటయ్యవే. అయినా వాటికి మా త్రం కోటయ్యతో ఎలాంటి సంబంధం లేదు. ఆ ఇంట్లో ఇప్పుడు ఆయన ఒక్కడు తప్ప మిగతా అంతా ఉంది. పశువులు ఉన్నాయి, బావిలో నీళ్లు

ఉన్నాయి, మనుషులు ఉన్నారు, ఆకలి ఉంది, నిద్ర ఉంది, బాధ ఉంది, జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ చెప్పుకోవడానికి కోటయ్య లేడు. ఏమి చేసినా ఇక రాడు.

పూర్ణిమకు సాహిత్య ప్రపంచంతో సంబంధం ఉన్నందున, మానవ పరిణామం, జీవన ప్రమాణం, జీవుడి ప్రయాణం తెలుసు. అన్ని విషయాలు అమ్మ సుబ్బలక్ష్మమ్మ, పెద్దమ్మ అంటే మీనాక్షమ్మ, పూర్ణిమ మామ అభిలాష్‌తో చర్చించి జరగవలసినది జరిపిస్తున్నారు. కోటయ్య మరణాంతరం జరుగవలసిన కర్మకాండ పద్ధతిగా జరిపించారు. ఎవరి పనులలో వారు మునిగిపోయి ఉన్నారు. కోటయ్యను భార్య, కూతురు తప్ప మిగతా అందరూ కూడా దాదాపు మరచిపోయారు. ఏదైనా కారణంగా గుర్తు చేస్తే తప్ప గుర్తుకు రాదు. పంచభూతాలు, ఇంద్రియాలుగా మారి ఎటునుంచి వచ్చాయో మరలా అచటకే చేరే పెద్ద ప్రయాణం ఈ పుట్టడం గిట్టడం.

గత పది రోజులుగా గతస్మృతులతో, భవిష్యత్ ప్రణాళికలతో అవునని , కాదని అనేక ఆలోచనలతో తలమునకలై పోతున్నారు. పూర్ణిమ, సుబ్బలక్ష్మమ్మలు. అడపాదడపా అభిలాష్ వచ్చి పోతున్నాడు. పూర్ణిమ పెద్దమ్మ అంటే మీనాక్షమ్మ, ఏవో కారణాల వల్ల దినాలు తరువాత తన ఊరికి వెళ్ళి, మరలా చెల్లి ఇంటికి వచ్చింది. ఆమెకు ఒక కొడుకు, కూతురు ఇద్దరు లక్నోలో పనిచేస్తున్నారు. వారి సంసారాలు వారు చూసుకుంటూ ఉంటే, ఈమె ఊరిలోని పొలం ఇల్లు చూసుకుంటూ ఉంటుంది. భర్త చాలా చిన్న వయస్సులోనే పోయాడు. కొడుకుకు పెళ్లి అయిన తరువాత అతడితో ఉండి మనుమలు, మనుమరాళ్ళతో కాలం గడిపేద్దామని అనుకుంది. కొంత కాలం అలానే గడిచింది. కానీ అందరూ మానవులే కదా. అందరికీ కోరికలు ఉంటాయి. అన్నిటికంటే మానవుడు కోరుకునేది స్వాతంత్ర్యం. అత్తా కోడళ్ళు మధ్య ముఖ్యంగా సమస్య తలెత్తేది ఆ స్వాతంత్ర్యం దగ్గరే. పరాయి పాలనలో మగ్గిన భారతదేశాలలాంటి దేశాలలో కూడా సమస్య స్వాతంత్రమే. ఎవరూ తమకు అడ్డు చెప్పకూడదు. ప్రతివారు తాము చెప్పినట్లు వినాలి. చివరకు కొడుకులు కూతుళ్లు కూడా తల్లిదండ్రులతో సంబంధాలు తెగ్గొట్టుకోవడానికి కారణం స్వాతంత్ర్య సమరమే.

మీనాక్షమ్మ దగ్గర కూడా అదే సమస్య వచ్చి పడింది. కోడలు చేసినది ఏదో తిని ఒక మూల పడి ఉంటే సరిపోదా. కానీ కుదరదు. 'నాకు కావాల్సింది నేను చేసుకునే స్వాతంత్ర్యం నాకు లేదా అని ఆమె అనుకోవడం సహజం'. భర్త పోయిన నాటి నుండి తాను స్వతంత్రంగా బతికింది. అలాంటప్పుడు తన అధికారాన్ని కుంచించితే సహించే మనసు లేదామెకు. నాకు మొదట కొడుకైతేనే కదా నీకు మొగుడైంది. ఈ

వరుస క్రమంలో అనేక ప్రయోగాలు, చేయగా వచ్చిన ఫలితం ఇద్దరు ఒక చోట ఉండటం కుదరదని. కొడుకుకు సంసారం ఉంది కనుక, ఆమె ఒంటరిగా ఉండటం మంచిదని తీర్మానం జరిగింది. అందుచేత ఆమె ఒంటరిగా సొంతింట్లో సర్వస్వతంత్రు రాలిగా బ్రతుకు సాగిస్తోంది. అడిగే వారు లేరు. చెప్పేవారు లేరు. దీంతో కొడుకుకు పెద్ద రిలీఫ్. కోడలికి ఇది మహదానందం. కొడుకు తన దగ్గర ఉంచుకోలేదని కూతురు దగ్గర ఉండటం తనకు నామూషిగా భావించింది. ఇప్పుడు తన చెల్లెలు కష్టాల్లో ఉంది. దానిని చూసే వారు ఎవరూ లేరని అక్కడి పనులను ఇతరులకు అప్పజెప్పి, అవసరమైతే నాలుగు రోజులు 80 కిలోమీటర్ల దూరం ఎంతసేపట్లో వచ్చి పోవచ్చు అన్న ఆలోచనలతో చెల్లెలు దగ్గరకు వచ్చింది.

జీవితంలో చిన్ననాటి నుంచి అన్ని సంసార బాధ్యతలను నెత్తిన వేసుకుని కొడుకు, కూతురును చదివించి పెళ్ళిళ్ళు చేసి తనకు తోచిన విధంగా ఆలోచిస్తూ పెద్ద మనసు కలిగిన  కోటయ్య ఆలోచనలతో అండదండలతో ఇంతకాలం జరుపుకుంటూ వచ్చింది. అందుచేత ఏది ఎలా చేస్తే ఏమవుతుంది. అన్న అవగాహన తనకు ఉన్నంతగా తన చెల్లెలకు ఉండదు కాబట్టి తాను అన్ని విషయాలు కూలంకుషంగా చర్చించి ఆమె చెల్లెలకు సహాయ సహకారాలు అందిచడానికి, ఎక్కువ కాలం గడపడానికి నిశ్చయించుకుంది. తండ్రి చనిపోయిన తరువాత పూర్ణిమకు కాలేజీ చదువు మానేయలనిపించింది. కానీ పెద్దమ్మ ఎలాగైనా పూర్ణిమ చదువు పూర్తి చేయించాలని నిర్ణయించి పూర్ణిమను ప్రయాణానికి సిద్ధం చేసింది.

పూర్ణిమ ప్రయాణమై కాలేజీ చేరింది. తన స్నేహితురాండ్రు తండ్రి మరణానికి వారివారి బాధను, ఓదార్పును వెలిబుచ్చి ఆమెలో బాధను మర్చిపోయేటట్లు చేయడానికి ప్రయత్నించారు. పూర్ణిమ ప్రతి రోజూ తల్లికి ఫోన్ చేస్తూ ఆమె బాగోగులు కనుక్కుంటూ, శ్రద్ధతో చదువుతూ పరీక్షలు రాసి మరలా ఊరికి చేరింది. నాలుగు నెలలుగా పెద్దమ్మ చూసుకుంటున్నది కాబట్టి, పూర్ణిమ కాలేజీలో నిశ్చింతగా ఉండగలిగింది. ఇప్పుడు తాను ఇంటికి వచ్చినందున, పెద్దమ్మ ఊరికి పోయి అక్కడి పనులు చూసుకునే వసతిని కల్పించింది.

సెలవులు గడుస్తున్నాయి. మానసిక ప్రశాంతత కోసం గ్రంథాలయానికి పోయి తాను గతంలో వదిలేసిన పుస్తకాలను చదువుతూ, ఇంటి వ్యవహారాలను అమ్మతో చర్చించుకుంటూ కాలం గడుపుతోంది. సెలవుల్లో అమ్మ, పెద్దమ్మ కలిసి చేసిన పెద్ద

తీర్మానం మూడవ సంవత్సరం పూర్తయ్యేంత వరకూ పూర్ణిమకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చెయ్యాలని, పెళ్ళి వాయిదా వెయ్యాలని అన్నది. మరి రెండు నెలలు గడచిపోయాయి. కాలేజీలు తెరిచారు. పూర్ణిమ మళ్లీ ప్రయాణం కట్టింది. సెలవులు వచ్చినప్పుడల్లా ఒక రోజు ఆలస్యంగా కాలేజీకి పోతూ, ఊర్లో ఒకటి రెండు రోజులు ఎక్కువగా గడుపుతూ, తండ్రికి జరుపవలసిన పితృకార్యాలు కూడా పూర్తి చేయడం జరిగింది.

మూడు సంవత్సరాలలో పూర్ణిమ చదువు పూర్తి అయింది. స్నేహితులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల వద్ద సెలవు తీసుకుని పూర్ణిమ ఊరికి చేరింది. నెల రోజుల్లో పరీక్ష ఫలితాలు వచ్చాయి. పూర్ణిమకు కాలేజీలో రెండవ స్థానం సంపాదించింది. నిజమైన సమస్య పూర్ణిమకు ఇక్కడ ప్రారంభమైంది. చదువు పూర్తయింది. పైచదువులా? కాక పోతే వివాహమా? అన్న తర్జన భర్జనలు పడుతున్నారు. పూర్ణిమ మేనమామ కుటుంబం నుంచి రోజురోజుకూ ఒత్తిడి పెరగసాగింది. నిజానికి అమ్మకిష్టమైనా, పెద్దమ్మకు ఈ వివాహం చేయడం సుతరాము ఇష్టం లేదు. అట్లని కారణం చెప్పే ధైర్యం లేదు. అంటే మొహమాటం అడ్డం వస్తుంది. ఇంట్లో మగదిక్కులేని పరిస్థితుల్లో ముక్కు, మొహం తెలియని కుటుంబాల నుంచి సంబంధాలను తెచ్చుకుంటే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో అన్న భయం. మగదిక్కు లేకుంటే వారి చెప్పు చేతుల్లో ఉండాల్సి వస్తుందని ఒక జంకు. ఆడబిడ్డను ఇచ్చేటప్పుడు మొగదిక్కు ఉన్నా కూడా వారి పరిస్థితి బలహీనంగానే ఉంటుదన్న విషయం సమాజాంలో సహజమైంది.

## పూర్ణిమ వివాహం

పూర్ణిమ మేనమామ అభిలాష్ రాకపోకలు బాగా పెరిగాయి. అనేక అవకాశాలు కల్పించుకుని, పూర్ణిమతో మాట్లాడటం. తనకు పూర్ణిమంటే చాలా ఇష్టమని తన జీవితం ధన్యమవుతుందని తన శక్తి వంచన లేకుండా పూర్ణిమను సంతోషపెడతానని తీయని మాటాలు చెప్పసాగాడు. పంచతంత్రం కథలాగా, బ్రాహ్మణుడు యజ్ఞానికి భుజం మీద తీసుకుపోతున్న మేక పిల్లను కుక్క అని ముగ్గురు దొంగలు వరుసగా చెప్పేసరికి, జ్ఞాని కూడా బోల్తాపడ్డాడన్న చందాన, ఇటువంటి పరిస్థితుల్లో తాను నిర్ణయం తీసుకునే శక్తి ప్రస్తుత పరిస్థితుల్లో లేదు. ఎలాగూ జీవితంలో తన కలలు కల్లలైనాయి. తాను ఐఏఎస్ చేసి దేశానికి ఏదైనా సేవ చేయాలన్న ఆలోచనలకు స్వస్తి చెప్పవలసివచ్చింది. చివరకు తల్లిని తనను నమ్ముకున్న వారిని సంతోషపెడదామని తీర్మానానికి వచ్చింది పూర్ణిమ.

పూర్ణిమ పెద్దమ్మకు ఏ మాత్రం ఇష్టం లేదు. వీడు జులాయి వెధవ. పెళ్ళయితే బాగుపడతాడన్నది ఒక ఆశ మాత్రమే. అట్లా జరిగితే సంతోషమే. కానీ లేకపోతే ఏమవుతుందోనన్న సందిగ్ధం పీడిస్తున్నది. ఎలాగైతేనేం 'పెళ్ళిళ్ళు స్వర్గంలో చేయ బడతాయన్న పెద్దల నమ్మకం' పూర్ణిమ విషయంలో లేదా ఎవరి విషయంలో నైనా నిజం కాదు. ఎందుకంటే 'పెళ్ళిళ్ళు స్వర్గంలో తీర్మానించబడతాయి. భూమి మీద జరుగుతాయి' అన్న చందాన పెళ్ళి నిశ్చయమైంది.

అభిలాష్‌లోని వెలితి అందరి మనసుల్లో మెదులుతున్నది. ఊరిలో పెళ్ళి చేస్తే అందరినీ పిలవాలి. అది చాలా పెద్ద తంతవుతుంది. అందుచేత ఏదైనా గుడిలో ముక్తసరిగా జరిపేస్తే ఏ గొడవ ఉండదని తీర్మానానికి వచ్చి నరసింహస్వామి కొండమీద ముఖ్యులైన చుట్టాల సమక్షంలో జరిపించేందుకు తీర్మానం చేసి కార్యక్రమం పూర్తి చేశారు. పూర్ణిమకు వివాహం జరుగుతున్న ఆనందంకన్నా, తండ్రి తమసమక్షంలో లేడన్న బాధ చాలా ఎక్కువగా ఉంది. అసలు పెళ్లి చేసుకోకుండా ఉండాలని అనుకుంది. కానీ అమ్మ పెద్దమ్మలు ఒప్పుకోకపోవడంతో అంగీకరించాల్సి వచ్చింది.

జీవితంలో విచిత్రమేమిటంటే కొన్ని మన ఇష్ట ప్రకారం జరుగుతాయి. కొన్ని విధిలేక కట్టేయ బడతాయి. మరి కొన్ని కాకతాళీయంగా జరిగిపోతాయి.

ఎలా జరిగినా స్థితి గతుల, కార్యకారణాల వల్ల జరిగేది జరుగుతుంది. జరగనిది జరుగదు. బండి నీటిమీద ప్రయాణం చేయదు. పడవ భూమి మీద పయనించదు. జరిగింది మంచి కావచ్చు, బాగుండచ్చు, బాగలేక పోవచ్చు, ఇష్టం లేక ఉండవచ్చు. కానీ తనకింతకంటే మార్గం లేదన్న భావన వెంటాడి, మేనమామను పెళ్ళి చేసుకునేటట్టు చేసింది.

జరగవలసిన తంతు జరిగిపోయింది. కొంత కాలం అమ్మ దగ్గరే ఉండి అత్తవారింటికి వెళ్ళింది. సంసార రంగంలోకి అడుగుపెట్టింది. అయినా ఏదో ఒక నిరాశ నిస్పృహ, నిర్లిప్తత. ఏ పనిలో కూడా అందం లేదు. సొంపులేదు. సౌందర్యం లేదు. ఆనందం లేదు. థ్రిల్ లేదు. పని చేస్తుండాలి కాబట్టి చేస్తున్నాం. రాత్రికి పగలుకు తేడాలేదు. ఉన్నదానికి లేనిదానికి తేడా లేదు. ఆకర్షణ లేదు. వికర్షణ లేదు. అంతా అద్వైతంలా ఉంది. రెండు లేవు. ఉన్నది ఒకటేననిపిస్తున్నది. అది నిరాశ.

చుట్టాలు, పక్కాలు ఉండేసరికి వారం రోజుల కాలం ఎలా గడిచిందో తెలియ లేదు. తరువాత ఇంట్లో మామయ్య, అత్తయ్య, అభిలాష్, పూర్ణిమలు మాత్రమే మిగిలారు.

విచిత్రమేమంటే ఒకరితో ఒకరికి సంబంధం లేదు. ఎవరి పనివారిది. అభిలాష్ పొద్దున్నే పది గంటలకు నిద్రలేవడం, టిఫిన్ తినడం బయటకు వెళ్ళడం. భోజనానికి మధ్యాహ్నం మూడు గంటలకు రావడం. తను తినాలో తినకూడదో తెలియదు. ఒక వేళ వస్తే మరలా ఆరు గంటలకు బయటకు వెళ్ళడం. తిరిగి రాక రాత్రి ఒకటి నుంచి మూడు గంటల మధ్య ఎప్పుడైనా రావచ్చు, రాక పోవచ్చు. పలుకరించేవారు లేరు, స్నేహితులు లేరు. కనీసం మంచి పుస్తకాలు లేవు. ఉన్నా చదివే మానసిక స్థితి కూడా లేదు. రోజులు బహునెమ్మదిగా సాగుతున్నాయి. కాలం మంచుగడ్డలా ఘనీభవించదని పించింది. ఎవరికి చెప్పుకోవాలి. అమ్మ రోజూ ఫోన్ చేస్తుంది. కుశల ప్రశ్నలు. “ఎలాగున్నావ్?” అని అడుగుతుంది. అంతా బావుందని తననుంచి సమాధానం. ఒకరికి చెప్పుకునేది కాదు. అదొక ఒత్తిడి. కాదు కాదు. ఒత్తిడితో కూడిన వేదన. ఒత్తిడికి కనీసం కారణం ఉంటుంది. సందిగ్దానికి, ఆరాటానికి కారణం ఉండదు. అందుచేత ఏమి చేయాలనో, ఎటుపోవాలనో తెలియదు. కాదంటే అగ్ని పర్వతాలు పగులుతుంటాయ్, అయినా కూడా లావా బయటికి రాదు. లోలోపలే ఉండిపోతుంది.

* * * * *

# 3. ఎడారి పయనం

## అభిలాష్ విముఖత

అభిలాష్ తన ఇష్టాన్ని కష్టంగా మార్చుకున్నాడనీ, తనని తప్పించుకు తిరుగుతున్నాడని, మొదట్లో పూర్ణిమకు అర్థమయ్యేది కాదు. రానురాను అర్థం కావడం మొదలైంది. అభిలాష్‌కు పెళ్లికాక ముందు, పూర్ణిమ పచ్చగడ్డితో పరచిన తివాచిలా దూరంగా ఉండే కొండ. ఇప్పుడు దగ్గరికి వచ్చేసరికి లోయలు, అగాధాలు, శిఖరాగ్రాలు కనపడుతున్నాయి. తమ మధ్య పొంతన లేదన్న విషయం, అభిలాష్‌కు పూర్ణిమకు అర్థమయింది. ఎందుకంటే పూర్ణిమ శిఖరాగ్రం. అభిలాష్ ఆ శిఖరాగ్రం నుండి ఏర్పడిన లోయ కాదు. వేరే లోయ. అందుచేత ఒకటి మరొకదాన్ని ఆసరాచేసుకోలేవు.

తనను తప్పించు కోవడానికి అభిలాష్ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాడు. ఏదో అర్జంటు పనులని ఊరికి ప్రయాణమని రకరకాల సాకులు వెతుక్కొంటున్నాడు. నిజానికి అతడు ఎక్కడికీ పోడు. ఏ పనీ లేదు. కేవలం క్లబ్‌లో కాలం గడపడం తప్ప, అదికూడా తనని తప్పించుకోవడానికి. దీనికంతటికీ కారణం తనలో ఒక ఆత్మన్యూనతాభావం (ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్) ఏర్పడింది. తాను పూర్ణిమకు సరైన జోడీ కాదని అర్థం చేసుకున్నాడు. తనను చూసి భయపడుతున్నాడు. తాను భరించలేనని అనుకుంటున్నాడు. అందుచేత రోజు గడపడానికి పాత అలవాట్లను మరలా ప్రారంభించి

జూదంతో, తాగుడుతో, సరసంతో కాలాన్ని గడుపుతున్నాడు. పూర్ణిమకు అన్నీ అర్థమవుతున్నాయి. కానీ ఏమి చేయాలో తెలియడం లేదు. తన సాహిత్య జ్ఞానంతో పరిస్థితి అర్థమైనా ఆ జ్ఞానం పరిష్కారమార్గం చూపడానికి పనికిరావడం లేదు.

చివరకు పూర్ణిమ చాలా సార్లు మాట్లాడి, బుజ్జగించి దగ్గరకు తీసుకుని తనలోని భయాన్ని, న్యూనతను పోగొట్టాలని ప్రయత్నించింది. అది కూడా అభిలాష్‌ని కించపరచకుండా తనలో ఏమీ తప్పులేనట్లే నమ్మిస్తూ పూర్ణిమలో ఏమైనా లోపం ఉందాని తెలుసుకోవాలని కూడా ప్రయత్నం చేసింది. అయినా దేనికీ జవాబు లేదు. మార్పు లేదు. యధాప్రకారం తనను తప్పించుకుని తిరుగుతున్నాడు. తప్పు తనదైనప్పుడు పూర్ణిమ ఆ తప్పు, తన మీద వేసుకుంటున్నది అని అర్థం చేసుకున్న అభిలాష్ ఇంకా క్రుంగిపోయాడు.

ఊరిలో ఆ కుటుంబానికి తెలిసిన వారందరూ అంత అందం, ఆస్తి కలిగిన అమ్మాయి దొరకటం అభిలాష్ పూర్వజన్మ సుకృతమని పొగిడి, అసూయ చెందేవాళ్ళే. అనేక మంది లోగుట్టు తెలిసిన వ్యక్తులు ఇంట్లో రంభ ఉండగా, అభిలాష్ ఈ పనులు చేయడమేమిటని ఈసడించుకుంటున్నారు. పల్లెటూళ్లలో అన్నివిషయాలు అందరికీ ఇట్టే తెలిసిపోతాయి. పైగా ఇలాంటి సంసార విషయాలు ఇతరుల కష్టాలు, బాధలు ఒక్కళ్ళతో మరొకరు గోరంతను కొండతను చేసి చర్చించుకునే ఉత్సాహం అమితా నందాన్ని కలిగిస్తుంది.

ఎద్దు పుండు కాకికి రుచి. వేరే వారి బాధ మనకు ఎందుకు ఆనందాన్ని కలిగిస్తోందో మనస్తత్వ శాస్త్రవేత్తలకు కూడా తెలియదు. తనకు లేనిది ఇతరులకు ఉంటే అసూయ. తమలానే లేదా తమకంటే ఎక్కువగా ఇతరులు కూడా కష్టాలు పడుతుంటే మంచి ఊరట. ఇది ఈ ప్రపంచ లక్షణం. ఇవన్నీ తెలిసిన పూర్ణిమకు దిక్కుతోచడం లేదు.

కొంతకాలానికి అమ్మకు, పెద్దమ్మకు, చుట్టాల్లో కొందరు అనేక రకాలుగా అసలు విషయాన్ని చేరవేస్తుంటే బాధపడేవాళ్ళు. ఎలాగయితేనేం పూర్ణిమ జీవిత చరిత్ర కొంతమందికి పుక్కిటి పురాణంగా మాట్లాడు కోవడానికి పనికివస్తున్నది. ఇంటి పరిస్థితి మరొక రకంగా ఉంది. అత్తమామలు వయసు పైబడి అనారోగ్యం వల్ల సలహాచెప్పి సరిదిద్దే స్థితిలో లేరు. కానీ తప్పంతా తన కొడుకు దగ్గర ఉంది

అని అర్థం చేసుకున్నారు. అప్పటికీ తండ్రి చాలా సార్లు మంచిగా చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఫలించలేదు.

## ఆశాకిరణం

ఆ వూరి గ్రామదేవత పోలేరమ్మ. ఆమె జాతర ప్రతిసంవత్సరం వారం రోజులు జరుగుతుంది. కాని జాతరలో జన సందోహం, జంతు బలులు, తప్పెట్లు, తాళాలు, తిట్టుకోవడాలు, కొట్టుకోవడాలు, అంతా రచ్చరచ్చగా ఉంటుంది. అందుచేత జాతర తరువాత వచ్చే శుక్రవారం నాడు అత్తగారి ఇంటి ఆనవాయితీ ప్రకారం చీర సారె, అమ్మవారికి సమర్పించుకోవాలి. అందుకని సారె తీసుకొని వస్తుంటే, గుడికి వెళ్తున్న సందర్భంలో, ఎవరో పిలిచినట్టు వినబడింది.

వెనుకకు తిరిగిచూచిన పూర్ణిమకు ఒకవ్యక్తి చేయి ఊపుతూ దగ్గరకు వచ్చి "నమస్తే, మీరూ అంటూ... కొంచెం తటపటా యించి, ఎప్పుడో చాలారోజుల క్రిందట, మీ వూరిలో మా నాన్నగారు డాక్టరుగా పనిచేస్తుండేవారు. మేము కోటయ్య అనే ఆసామి ఇంటికి నాలుగిళ్ళ దూరంలో ఉండేవాళ్ళం. మీ పేరు మరిచాను. కోటయ్యగారి కూతురేకదా!" అని అడిగాడు. "అయినా మీ రూపం నా మనసులో నుంచి మాసిపోలేదు. మీరే కదూ" అని మరలా అన్నాడు.

"అవునండి, నేను కోటయ్యగారి కూతురినే. నాపేరు పూర్ణిమ".

"అబ్బ ఇప్పుడు గుర్తుకొచ్చింది" అని ఆవేశంతో, ఇంతలేసి కన్నులతో స్వరం హెచ్చించి, "ఇక్కడ మీరు" అని ఆపాడు.

"నేను పోలేరమ్మ గుడికి వెళుతున్నాను. జాతర టైంలో జనంతో రద్దీగా ఉంటుందని, ఈ శుక్రవారం మా అత్తయ్యగారు పొమ్మంటే కదిలాము. ఇంతకు మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు" అని అన్నది. "మా నాన్నగారు గవర్నమెంటు డాక్టరుగా పనిచేస్తున్నందున అనేక చోట్లకు ట్రాన్స్‌ఫర్ అయ్యేది. ప్రస్తుతం రిటైరై ఆయన తన సొంత ఊరిలో ఉంటూ మాకున్న కొద్దిపాటి భూమిని పర్యవేక్షిస్తూ కాలక్షేపం చేస్తుంటారు. నేను ఎం.ఏ. చదివి పి.హెచ్‌డి. చేశాను. నాపేరు నవీన్ కుమార్. నేను ఈ సంవత్సరం కొత్తగా ప్రారంభించిన ఈ వూరి కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేరాను. మిమ్ములను దారిలోనే నిలబెట్టి మాట్లాడటం సభ్యతకాదు. సారీ! మరల తీరిగ్గా కలుసుకొని మాట్లాడుకొందాం. ఈ ఎదురుగా ఉండే మేడపైన నేను బాడుగకు

ఉంటున్నాను. చాలా రోజుల తర్వాత మిమ్ములను చూడటం వలన ఈరోజు చాలా సంతోషంగా ఉంది. మీరు వెళ్ళి రండి" అని ముగించాడు.

పూర్ణిమ, "మీకు చాలా థ్యాంక్స్ అండి. ఎప్పుడో చూచినా గుర్తుపట్టి పలకరించారు. మా ఇల్లు పై వీధిలో మూడంతస్థుల మేడ. ఆ వీధిలో అదొక్కటే పెద్ద ఇల్లు. ఇటుగా వెళ్ళేటప్పుడు ఎడమవైపుకు ఉంటుంది. గేటుకు రెండువైపుల రెండు టెంకాయచెట్లు ఉంటాయి. ఈ గుర్తులతో ఆ వీధిలో మరొక ఇల్లు కనబడదు. వచ్చే ఆదివారం వీలైతే తీరిక చూచుకొని రండి. నాకు కూడా సాహిత్యంతో కొంచెం పరిచయం ఉన్నది. కాబట్టి కొంచెంసేపు ముచ్చటిచ్చుకుంటే తెలియని విషయాలు తెలుసుకోగలుగుతాం. వచ్చేటప్పుడు ఇంగ్లీషు అయినా తెలుగైనా ఏదైనా పుస్తకాలుంటే తీసుకొని రండి. నేను పుస్తకాల పురుగును" అని నమస్కారం చెప్పి బయలుదేరింది.

శనివారం సాయంత్రం 4 గంటలయ్యింది. "అమ్మగారు" అంటూ లోపలికి వచ్చిన మంగ "మీకోసం ఎవరో పొడగాటి వ్యక్తి వచ్చి ఉన్నారు. మిమ్ములను కలవాలని ఉన్నారు. వాకిట్లో నిలబడి ఉన్నారు అని" చెప్పింది. ఆ మాట వినడంతో పూర్ణిమ బెడ్‌రూమ్ లో నుండి హాల్ దాటి వరండాలోకి వచ్చింది. టెంకాయచెట్ల దగ్గర గేటును ఆనుకొని నవీన్‌కుమార్ చేతులో కొన్నిపుస్తకాలు పట్టుకొని నిలబడి ఉన్నాడు.

అంతలో నాలుగడుగులు ముందుకేసి "సారీ! మిమ్ములను ఇబ్బంది పెట్టాను. వచ్చే ఆదివారం ఒక అర్జంట్ పనిమీద ఊరు వెళ్ళాల్సి ఉంది. అందుచేత కాలేజీ నుంచి వస్తూ మీకు ఈ పుస్తకాలు ఇచ్చిపోదామని వచ్చాను" అంటూ వరండా మెట్ల దగ్గర పుస్తకాలను అందించి "వస్తాను" అంటూ వెనుకకు తిరిగాడు.

పూర్ణిమ అందుకొన్న పుస్తకాల టైటిల్ చూచి ఈ పుస్తకం "ఓల్గా నుండి గంగాతీరం వరకు" నేను చదివాను రెండవది చెంగిజ్‌ఖాన్ నేను చదవలేదు. నా లైబ్రరీలో చూచాను అని అంటూ, "అదేంటి లోపలికి వచ్చి మంచినీళ్ళు కూడా తీసుకోకుండా వెళ్ళిపోతున్నారు. రండి! కూర్చోండి" అని వరండాలో వేసి ఉన్న రెండు సోఫాలు నాలుగు కుర్చీలవైపు చూపించింది. మంగను కేకవేసి మంచినీళ్ళు తీసుకురమ్మని పురమాయించింది. మంగ ట్రేలో రెండు నీళ్ళ గ్లాసుల్తో ప్రత్యక్షమైంది. ట్రేతో నవీన్ దగ్గరు పోయి ట్రేను ముందుకు చాచింది. గ్లాస్‌ను అందుకొన్న నవీన్ గబగబా గ్లాసు పూర్తిచేసి "అభ్యంతరం లేకుంటే రెండవది కూడా" అంటూ రెండవగ్లాస్

చేతిలోకి తీసుకొని, నేను నిదానంగా తాగుతాను, మీరు వెళ్ళచ్చు అని సైగచేశాడు. మంగ "మీకు నీళ్ళు తెచ్చేదా అమ్మా!" "నాకు అక్కర్లేదు, పళ్ళెంలో తినుబండారాలు తీసుకొని రా" అని అన్నది.

"అంత దాహంగా ఉండి వెళ్ళిపోతున్నారే. ఏ సందర్భంలోనైనా దాహంగా ఉన్నప్పుడు నీరు అడిగి త్రాగాలి. ప్రతి ఇంట్లో కనీసం రెండుగ్లాసులు దొరికే వస్తువు నీళ్లు. ఒకవేళ కాఫీ టీలు, భోజనాలు చటుక్కున అడిగితే అన్ని ఇళ్ళలో ఉండకపోవచ్చు, కాని నీరు అడిగితే ఇబ్బంది లేదు" అని అంటుంటే మంగ ఒక టీపాయ్ తెచ్చి నవీన్ ముందరపెట్టి, ఒక పెద్ద ట్రేలో చిన్న చిన్న ప్లేట్లలో అనేక రకములైన ఫలహారాలను విడిగా తీసిపెట్టింది.

"నవీన్ కళ్ళు పెద్దవిచేసి కనుబొమ్మలు పైకెత్తి ఇవన్నీ నాకేనా! నావల్లకాదు" అంటూ ఒక సున్నివుండ తీసుకొని నీళ్ళు తాగాడు. "నీళ్ళు ఎక్కువ తాగవద్దు. ఫలహారం అయిన తర్వాత నీళ్ళు తాగితే హాయిగా ఉంటుంది" అన్నది పూర్ణిమ.

కొంచెంసేపు రష్యాలోని ఓల్గా నది నుండి గంగాతీరం వరకు విస్తరించిన నాగరికత విశేషాలు మాట్లాడింది. "ఆనాటికి స్త్రీ కేవలం సంతానోత్పత్తి చేసే ఒక యంత్రంగా, కుటుంబాలు మాతృవ్యవస్థలుగా ఎలా మారాయో, స్త్రీ ఎలా అధికారం చలాయించిందో మాట్లాడింది. ఆనాటి స్త్రీలు, తన బిడ్డలు వేటకు పోయి తన కళ్ళముందే జంతువుల చేతిలో బలవుతుంటే అదేదో సర్వసాధారణ విషయంగా అచేతనంగా ఉండడం, ఆనాటి మానసిక స్థితి ఎలా వుండినదో చర్చించింది. పూర్ణిమ మరలా "పైపెచ్చు సందర్భానుసారంగా జంతువుల్లా వావివరుసలు లేకుండా అవసరాన్ని బట్టి సంతానం కోసం కొడుకులతో మనవళ్ళతో సంసారం చేయడం, నేటి సమాజానికి మింగుడు పడదు. ఏ జీవికైనా ముఖ్యమైన ఇన్‌స్టింక్ట్, ఎలాగైనా బ్రతకాలనే కోరిక దాన్నే 'సర్వైవల్' అంటాము. అన్నికష్టాలను భరిస్తూ, వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తూ బ్రతుకు సాగించడం, తద్వారా వంశాన్ని నిలబెట్టడం తెలియకుండానే జరిగిపోయింది. ఆ విషయంలో నాటికి నేటికి పెద్ద తేడా కనబడదు. ప్రస్తుతం కూడా ఎలాగైనా బ్రతకాలి అన్నది పెద్ద తీరని కోరిక. ఎవరూ చూస్తూచూస్తూ బ్రతుకుదాం అన్నంత తీవ్రంగా, చచ్చిపోదామని ప్రయత్నించరు. ఎంత బాధనైనా దిగమింగుకొని బ్రతుకు సాగిస్తారు. ఏదో క్షణికావేశంలో జరిగే ఆత్మహత్యలు తప్ప జీవితాన్ని ప్రేమించేవాళ్ళకు అది సాధ్యం కాదు" అని ఆపింది.

నవీన్ సున్ని వుండ తీసుకొన్న తర్వాత చేగోడి చేతిలోకి తీసుకున్నాడు గాని, తనకు తెలియని విషయాలు, ఒక ప్రవాహంలా చెబుతుంటే నోరు తెరచుకొని వినడంతో పరిసరాలు మరచిపోయాడు. చేగోడీని మరలా ప్లేట్‌లో పెట్టి, తన్మయత్వంతో చప్పట్లు చరిచి, "భలే! భలే! ఒక వక్త మాట్లాడుతుంటే ఇలా ఉండాలి. కొంతమంది గొప్పవాళ్ళు మాట్లాడితే విన్నాను. కాని ఇంత సొంపుగా వచనానికి సంగీతాన్ని జోడించినట్టు, పద్యాన్ని రాగయుక్తంగా పాడినట్టు వినడం, ఇదే మొదటిసారి. మొత్తంమీద నాకు మంచి లెక్చరర్ అని పేరుంది కాని, అవతల మనిషిని తన్మయత్వంలోకి తోసేంత నేర్పు, మీలా నాకు లేదు. అలాంటివాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. నిజానికి నేను ఈ రెండు పుస్తకాలు చదవలేదు" అని అన్నాడు.

పూర్ణిమ, ముక్తసరిగా "ఏదో చాలారోజుల క్రింద చదివిన విషయం. రాహుల్ సాం కృత్యాయన్ మహాజ్ఞాని. 36 భాషల్లో పరిచయం ఉన్నవాడు. అది గుర్తుకు వచ్చి చెప్పాను. మంచి పుస్తకం ఇచ్చే ఆనందం, దానిని అనుభవించిన వాళ్ళకు తప్ప ఇతరులకు అర్థంకాదు".

ఇంతకూ "కాఫీ టీ మజ్జిగ, ఏం తీసుకుంటారు" అన్నది పూర్ణిమ.

"ఇప్పటి వరకు నాచేత పాయసం తాగించారు. మీ ఇష్టం. మీరేం తాగుతారో నేను అదే తాగుతాను" అన్నాడు నవీన్.

"నేను కాఫీ ప్రియురాలను" అన్నది పూర్ణిమ.

"అలాగైతే నాకు కూడా కాఫీయే" అన్నాడు నవీన్.

మంగమ్మకు ఆర్డర్ వెళ్ళడం మంచి ఫిల్టర్ కాఫీ రావడం, కాఫీ రుచిని మెచ్చుకోవడం, ఇంకొంచెం సేపు మాట్లాడుకొని పూర్ణిమ దగ్గర సెలవు తీసుకొనడం జరిగిపోయింది.

పూర్ణిమ ఆరు నెలలుగా అనుభవిస్తున్న నరకం నుండి ఒక్కసారిగా కొంచెం ఊరట లభించింది. జీవితంలో జరిగిన మంచి అనుభూతులు తల్లితో, తండ్రితో, స్నేహితులతో కాలేజీలోని ఉపాధ్యాయులతో గడిపినకాలం గుర్తుకువచ్చి ప్రస్తుత బాధాకరమైన జ్ఞాపకాలను తరిమికొట్టినట్లైంది. త్వరత్వరగా స్నానంచేసి, దేవుడికి దణ్ణంపెట్టుకొని, తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. సాయంత్రంపూట స్నానంచేసి మూడు

నెలలైంది. నిరాశా నిస్పృహలు కనీస నిత్యావసరాలకు కూడా విరోధులుగా తయారౌతాయి. సోఫాలో కూర్చొని చెంఘిజ్‌ఖాన్ పుస్తకం చదవడం ఆరంభించింది.

* * * * *

పూర్ణిమకు జీవితం మీద ఎక్కడో ఒక ఆశ చిగురిస్తున్నట్టు అనిపిస్తున్నది. రెండురోజుల్లో పుస్తకం చదవడం పూర్తయ్యింది. తన మనసులో ఒక ఆలోచన ప్రారంభం అయ్యింది. ఖాళీగా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకుండా ఎం.ఏ. ఇంగ్లీష్ లిటరేచర్, లేదా తెలుగు చేస్తే బాగుంటుందని ఆలోచన ప్రారంభమైంది. తన అత్తమామలతో అదేవిషయాన్ని ప్రస్తావించింది. వాళ్ళకు తన కొడుకు నిర్వాకం అర్థం అవుతుండడం వల్లన ఒకసారి కొడుకుతో కూడా చెప్పమని సలహా ఇచ్చారు. ఆరోజే అభిలాష్‌తో ప్రస్థావించింది. తాను ముభావంగా ఉండిపోయాడు. మధ్యాహ్నాం మరలా రెండవసారి కూడా అడిగింది. తన ఇష్టప్రకారం చేయమని చెప్పాడు.

ఈ విషయాన్ని నవీన్‌తో ముచ్చటిస్తే బాగుంటుందనిపించింది. పైగా కొద్దిసేపు మాట్లాడినట్టు ఉంటుంది. వీలైతే ఏదైనా పుస్తకాలు తీసుకునే అవకాశం ఉంటుందని, కాలేజీ దగ్గరకు పోయింది. తాను కాలేజీ వరండాలో నడచిపోతుంటే ప్రతివాళ్ళు తనని ఎగాదిగా చూస్తూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొంటున్నారు. ఎవరినన్నా అడిగితే స్టాఫ్ రూమ్ తెలుస్తుందేమో అనుకునేలోగా తాను పోయే వరుసలోనే ఒక గదిలో నవీన్ పాఠం చెబుతున్నాడు. తాను గదిలోకి చూడడం, నవీన్ కనపడడం, నవీన్ కూడా వరండాలో పోతున్న పూర్ణిమను చూడడం ఒకేసారి జరిగింది. నవీన్ పాఠం ఆపి గబగబా బయటికి వచ్చి, “రండి! మిమ్ములను మా స్టూడెంట్స్‌కు పరిచయం చేయాలని ఉంది” అంటూ తన అంగీకారానికి వెయిట్ చేయకుండా లోపలికి నడిచాడు. ఆయన వెంటే పూర్ణిమ క్లాస్‌లోకి వెళ్ళింది. ఆమెను చూచి క్లాస్ పిల్లలందరూ ఆశ్చర్యంతో లేచి నిలబడి కూర్చోమన్నా కొద్దిసేపు కూర్చోలేకపోయారు. తాము ఒక అసాధారణమైన వ్యక్తిని చూస్తునట్టు అనిపించింది. పూర్ణిమ 5 అడుగుల 8 అంగుళాల పొడవు, పసుపు కొమ్ములాంటి పచ్చని పసిమి, పెద్ద జడ, విప్పారిన కళ్ళు, అందమైన ముక్కు, మూతి, చూచి అందరూ పులకరించి పోయారు.

నవీన్‌కు తనను పరిచయం చేయడం చాలా కష్టమైంది. పొడిపొడిగా పాత పరిచయాన్ని గురించి చెప్పి అనేక పుస్తకాలను జల్లెడ పట్టిందని, మంచి జ్ఞాని అని,

తాను వాళ్ళ ఇంట్లో కలుసుకొన్నప్పుడు జరిగిన సంభాషణను గురించి మాట్లాడాడు. విద్యార్థులు, విద్యార్థినులు ఆమెను చూడడంలో మైమరచిపోయారు. నవీన్ ఆమెతో "మా పిల్లలకు నాలుగు మాటలు చెప్పి ఆశీర్వదించండి" అని అభ్యర్థించాడు. విద్యార్థులు కూడా ధైర్యంచేసి మేడమ్‌ను, ఏదైనా చెప్పమని, తన మాటలను వినాలని ఉందని, పట్టుబట్టారు. పూర్ణిమ ఏంచేయాలో ఆలోచించేలోగా అందరూ చప్పట్లు కొడుతూ మాట్లాడమని గొంతులు కలుపుతున్నారు.

పూర్ణిమ "నేను మీ సార్‌ను కలిసి లైబ్రరీలో ఏదైనా పుస్తకాలు తీసుకపోవడానికి వచ్చాను. నేను మాట్లాడడానికి రాలేదు. పైపెచ్చు నేను లెక్చరర్‌ను కాదు. నేను అండర్ గ్రాడుయేషన్ కోర్సు చదివిన దాన్ని. అందుచేత నాకు మాట్లాడే అలవాటు కూడా అంతగాలేదు. కాలేజీరోజుల్లో చిన్న చిన్న సందర్భాల్లో తప్ప, పెద్ద పెద్ద స్పీచ్‌లు ఇచ్చే అనుభవం తక్కువే. పైగా స్టేజిమీద మాట్లాడాలంటే కొంచెమైనా తయారుకాకుంటే పది మందిలో మాట్లాడడం కష్టమైన పని".

మరలా "అయినా జీవితంలో ఎవరు ఎవరినైనా, ఏదైనా అడిగితే అది ఇవ్వ గలిగినదైతే, ఇవ్వగలిగినంత ఇవ్వలేకపోవడం పొరబాటు. ఇవ్వకపోవడానికి కారణాలు చాలా చెప్పవచ్చు. అన్నిటికంటే మనిషికి ప్రతివిషయంలో భయం చాలా చెడ్డది. ఎందుకు ఇవ్వకూడదు, ఎందుకు ఇవ్వాలి అన్నది జీవితాన్ని తికమక పెడుతుంది. ఎందుకు పుట్టాం. ఎందుకు చదువుతున్నాం. ఎందుకు కొన్ని పనులను చేయగలుగు తున్నాం. ఎందుకు చేయలేకపోతున్నాం. ఒక సరైన వ్యక్తి, సరైన పనిని, సరైన సమయంలో లేదా సందర్భంలో, సరైన పద్ధతిలో, సరైన వ్యక్తులతో కూడి, సరైన ప్రమాణాలతో, సరైన లక్ష్యాలు సాధించేందుకు చేయడం వలన కలిగేది, జరిగేది, మిగిలేది విజయం".

మరలా రెండు క్షణాలు ఆగి "ఈ ప్రపంచం ఒక యుద్ధభూమి. జీవితం ఒక యుద్ధం. పుట్టినలగాయతు చనిపోయేంత వరకు మానవుడు చేసేపని యుద్ధం. ఆకలి అయ్యింది. అన్నం తిని ఆకలితో యుద్ధం చేసి ఆకలిని జయిస్తాం. అలాగే అజ్ఞానాన్ని విజ్ఞానంతో, దుఃఖాన్ని ఆనందంతో, దారిద్ర్యాన్ని సంపదతో, వ్యాధిని వైద్యంతో, రాత్రిని పగలుతో, చీకటిని వెలుగుతో, దిగంబరత్వాన్ని వస్త్రధారణతో, చిక్కుబడ్డ జుట్టును దువ్వెనతో, చెడును మంచితో, వేడిని చల్లదనంతో, జ్వరాన్ని మందుతో,

కారాన్ని ఉప్పుతో, జతచేసి మార్పును తీసుకొచ్చే ప్రతిపని యుద్ధమే. రేపు చదువు పూర్తి చేస్తారు. ఉద్యోగం కావాలి. దాన్ని సాధించేందుకు యుద్ధం చేయాలి. అంటే మన జ్ఞాన సంపాదనను ఉపయోగించి ఉద్యోగాన్ని సాధించాలి. ఈ యుద్ధంలో రెండు రకాల వారిని చూస్తాం. ఒకరు విజయం సాధించేవాళ్ళు, రెండవవారు ఓడిపోయేవాళ్ళు. విజయం సాధించే వారి ఆలోచనలు:

చూద్దాం, ప్రయత్నం చేద్దాం, గతంలో చాలామంది సాధించినదే కదా! మనం చేయలేమా. ఇంతమంది చేసిన దానిని చేయలేకపోతే మన బ్రతుకు ఎందుకు? అని పాజిటివ్‌గా ఆలోచిస్తారు. మరికొందరు అసలు ఎందుకు చేయాలి అని ఆలోచించి, ఆలోచించి అర్థంచేసుకునేందుకు ప్రయత్నించి కాలాన్ని గడుపుతూ ఉంటే జీవితం అయిపోతుంది.వాళ్ళ ఆలోచనలు అసలు ఎందుకు చేయాలి? అయినా మనం చేయగలమా? మనదగ్గర ధనం ఎక్కడుంది. మన తల్లిదండ్రులు దానికి ఒప్పు కుంటారా? ఇవన్నీ ఎందుకు, ఏదో ఒకవిధంగా జీవితం గడిపేస్తే పోదా, ఉద్యోగాలు చేసిన వాళ్ళే బతుకుతున్నారా! లేనివాళ్ళు అందరూ బ్రతకు సాగించడం లేదా. అసలు ఎందుకు పుట్టాము. ఎందుకు చదివాము. పెళ్ళి సంసారం పిల్లలు ఇవన్నీ ఎందుకు? ఆశ, ఆశయం, అసూయ, రాగం, ద్వేషం, ఇవన్నీ ఏంది? అని ఆలోచిస్తూనే అసలు పనిని వదిలేస్తారు. జీవితం రోజాపూల పాన్పు కాదు. దాని సువాసన ఆస్వాదించాలంటే చాలా జాగ్రత్తగా సంపాదించి, సాధించి అనుభవించాలి. అంతేగాని ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఇతరుల మీద ఆధారపడడం ఒక పెద్ద బలహీనత. ఆ బలహీనత నుండి బయటపడాలంటే ఒక ఘర్షణ, రాపిడి కావాలి. అంటే యుద్ధం చేయాలి. చిలికే కొద్దీ వెన్న పడుతుంది. నూరే కొద్దీ గోరింటాకు ఎరుపునిస్తుంది. పుటం వేసే కొద్దీ బంగారు అపరంజిగా తయారౌతుంది.

కృషితో నాస్తి దుర్భిక్షం జపతో నాస్తి పాతకః

కష్టే ఫలి. కృషి వుంటే మనిషి ఋషి అవుతాడు, అన్నారు పెద్దలు.

విజయానికి అసలు రహస్యం జ్ఞానం కలిగి ఉండడం, ఆ జ్ఞానాన్ని ఒక నైపుణ్యంగా మలచుకోవడం, దానిని అభ్యాసం చేయడం, దానిమీద అవగాహన పెంచుకోవడం. దానిని సద్వినియోగం చేసుకోవడం. ఇవన్నీ అయిన తర్వాత, అంటే యుద్ధంచేసి జయించి సాధించి సంపాదించి, ఇతరులతో పంచుకోగలగడం. అనగా త్యాగం చేయడం. ఇదీ జీవితం.

చివరగా, పది మాటల కంటే ఒక చిన్నపని, ఒక సహాయం చాలా గొప్పవి. అలాంటి ఆలోచనకు, చర్యకు మీకు భగవంతుడు సంకల్ప బలాన్ని కల్పించాలని ప్రార్థిస్తూ, మీకందరికీ పేరు పేరున శుభాకాంక్షలను తెలుపుతూ, మీ టీచర్ నవీన్ గారికి ధన్యవాదాలు తెలుపుకొంటూ ముగిస్తున్నాను.

జైహింద్.

టీచర్, పిల్లలు నిలుచుకొని 5 నిమిషాలు ఆగకుండా చప్పట్లు తప్పెట్లలా కొడుతుంటే, అన్ని క్లాసుల నుండి టీచర్లు స్టూడెంట్స్ మీగతా వాళ్ళందరూ వచ్చి, అసలు విషయాన్ని తెలుసుకొని, చాలా సంతోషించి, మీకు తీరికైనప్పుడు మిగతా పిల్లలకు కూడా ఇలాంటి ప్రేరణను కలిగించే ఉపన్యాసాలు ఇవ్వాలని టీచర్లు అభ్యర్థించారు.

పూర్ణిమ నవీన్‌తో లైబ్రరీకి పోయింది. అప్పటికే అనుకున్నదానికంటే చాలా టైం అయిపోయ్యిందని, తాను గతంలో చదవని రెండు పుస్తకాలు చేతికందినవి తీసుకుని బయలుదేరింది. నవీన్ గేట్ వరకు వస్తున్నప్పుడు, తన ఆలోచన దూరవిద్య ద్వారా ఎం.ఏ. ఇంగ్లీష్‌గాని తెలుగు గాని చెయ్యాలనే ఆశను తెలిపింది. దాని వివరాలు విచారించి వీలైనంత త్వరలో తెలిపితే దానికి అప్లై చేస్తానని చెప్పింది. అందుకు నవీన్ చాలా సంతోషంగా నాలుగు రోజుల్లో అన్ని విషయాల్తో మీ ఇంటికి వస్తాను అని చెప్పాడు.

నవీన్ "అయినా మీ వాక్పటిమ, విషయ పరిజ్ఞానానికి నా జోహార్లు. నా జీవితంలో పెద్ద పెద్ద సీనియర్ టీచర్లు కూడా ప్రిపరేషన్ లేకుండా అంత చక్కగా శృతిబద్ధంగా లింకు వదలకుండా మాట్లాడ్డం నేను చూడలేదు. నేను ఇంటర్లో ఉన్నప్పుడు ఒక టీచర్ ఇన్స్పెక్షన్ పనిమీద వచ్చాడు. అవి నాకు అంతగా భాషాజ్ఞానం లేనిరోజులు, అయినా ఆయన మాటలు ఈనాటికి మరిచిపోలేదు. భాగవతంలో రుక్మిణి కల్యాణంలో మొదటి పద్యాన్ని తీసుకొని దాన్లోని సూర్యోదయం, దాని రంగులు, ఆ రంగుల కలయికతో సూర్యుని వెలుగు, ఆకాశమంతా ఒక పెళ్ళి పత్రికగా, ఈ సృష్టి ఉన్నంతకాలం రుక్మిణి కల్యాణం ఉంటుందని సింబాలిజంలోని అంతరార్థాన్ని చెబుతుంటే, ఎంతో ఆనందించాను.

ఈరోజు సామాన్యమైన విషయాన్ని మీరు అసమాన్యంగా, మైకలాంజిలో రాతిని శిల్పంగా మలచినట్టు మాముందు వుంచితే ముగ్దులమయ్యాము. నాకంటే కొంచెం

వయసులో చిన్నదాని వైనందున, మీ కాళ్ళకు దణ్ణం పెట్టలేకపోయినందుకు వెలితిగా ఉంది. ఈరోజు జీవితంలో మరచిపోలేని రోజు. మహత్తరమైన రోజు. మదిని కదిలించిన రోజు, గగుర్పాటు చెందించిన రోజు. మీరు మాకు బహుమతిగా ఇచ్చారు. కనపడని ప్రపంచం మూలల్లో ఎంతమంది మహామహులున్నారో అన్నదానికి మీరే నిదర్శనం. పైపెచ్చు మీ వినయాన్ని చూస్తే విస్మయం వేస్తుంది. బహుశా నాకు మా స్టూడెంట్స్‌కు ఈ సంధిలో నుండి తేరుకోవడానికి చాలారోజులు పడుతుందని పిస్తుంది" అని గేటుదాకా వచ్చిన నవీన్ సెలవు తీసుకొని అక్కడే నిలబడ్డాడు. ఆమె, బాయ్ చెప్పి, ముందుకు సాగింది. పూర్ణిమ తాను అలా మాట్లాడడానికి తనలో ఎంతో కసి మంచులా గడ్డకట్టి ఉన్న విషయం ఎవరికి తెలుసు?

* * * * *

రోజులు కదులుతున్నాయి. ఆలోచనలు తరుము తున్నాయి. ఆశలు పెనవేసుకుంటున్నాయి. అనుమానాలు బందీలుగా చేస్తున్నాయి. భవిష్యత్తు ప్రణాళికలు కట్టిన కట్ల ముడులను విడదీస్తున్నాయి. అదొక అయోమయ అవస్థ. ఏమిటి? ఎలా? ఎందుకు? ప్రశ్నలకు జవాబులు దొరకడం లేదు. ఏది ఏమైనా పూర్ణిమ ఆలోచనలు బలంగా తయారౌతున్నాయి. పెద్ద ఇల్లు, సంపద, వసతులు తనను సంతోష పెట్టలేక పోతున్నాయి.

ప్రస్తుతం తాను బంగారు పంజరంలో చిలుకలాగున్నది. స్వేచ్ఛ కావాలి. తనకు ఆధారం కావాలి. తనకు ఆదరణ కావాలి. తాను అనాధ కాదు. తనకున్న శక్తిని, సంపదలను, వనరులను, పదిమందికి పంచిపెట్టాలి. కూపస్థమండూకంలా బ్రతక కూడదు. తాను ఎగరడానికి రెక్కలు, ఆకాశం, అవకాశం కావాలి. ఈదడానికి ఒక సముద్రం కావాలి. తాను ఇప్పుడు ఒక బంది. చేతులు కట్టేయబడి ఉన్నాయి. నోరు కుట్టేయబడింది. కళ్ళకు గంతలు కట్టబడి ఉన్నాయి. కాళ్ళకు మాత్రము సంకెళ్ళు లేవు. వీటినుండి బయట పడాలి. దీనికి ఒక మగాడు కావాలి. చాలాకాలంగా తన మగడు కట్టిన కట్లను ఒక్కసారి తృంచివేయగల మగాడు కావాలి. పూర్ణిమ ఆలోచనలు పరిపరివిధాలా పోతున్నాయి.

జీవితం అంటే ఇంతేలే అని సరిపెట్టుకొని, సర్దుబాటనే ఉరితాడు లేకుండా, కాలము, కష్టము అన్న ఉరితాళ్ళతో కొద్ది కొద్దిగా నొప్పి తెలియకుండా ఉరివేసుకుంటూ

జీవితాలను గడపకుండా, గడుపుతున్నామనే భ్రమలో జీవించిన వారి కథల్ని తాను చాలా విన్నది, చదివింది. కాని తాను ఇలాంటి ఉచ్చులో తగులుకొంటే జీవితానికి ఒక అర్థంలేదు. నిజానికి దానికొక బలమైన సహేతుకత లేదు. ప్రతి విషయానికి, నాణానికి ఉన్నట్లే, రెండవ వైపు కూడా ఉంటుంది. అందుకే ప్రతిపదానికి వ్యతిరేకపదం ఉంటుంది. భావానికి వ్యతిరేక భావం ఉంటుంది. విరగ కాచిన మంచి మామిడి లేదా మరేదైనా చెట్టును రాళ్ళతో కొడతారు. మంచి పూలను చూచి ఆనందించి కోసేస్తారు. పొడవైన చెట్టును నరికి దూలంగా వాడతారు. లావుపాటి చెట్లను నరికి అనేక వస్తువులుగా మలుచుకుంటారు. సన్న చెట్లను నరికి పొయ్యిలో పెట్టుకుంటారు. అందమైన స్త్రీలను చూచి అసూయతో హింసిస్తారు. యాసిడ్ పోస్తారు. ధనవంతుల సొమ్మును దొంగిలిస్తారు. ఇలాగ సుగుణానికి, మంచికి ఒక చెడ్డ చేరువై, నాశనం చేస్తుంది. దీన్నే భగవంతుని సృష్టి అని 'మాయ' అని 'లీల' అని అంటారు. ఎందుకంటే దానికి సరైన జవాబు ఎవరూ చెప్పలేరు. లాజిక్, రీజన్‌కు అంతు పట్టదు. లేనిదాన్ని ఉన్నట్టు, ఉన్నదాన్ని లేనట్టు చెప్పడానికి తర్కాన్ని ఉపయోగించుకొంటారు. తర్కం కత్తిలాంటిది. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా చేయగలిగినది. కత్తి డాక్టరుకు ఆపరేషన్ చేయడానికి ఉపయోగపడి వ్యాధిగ్రస్తుడిని బతికిస్తుంది లేదా హంతకుడికి వేరే వ్యక్తిని చంపేందుకు ఆయుధమవుతుంది.

కాలంతోపాటు ఆలోచనలు బలపడుతున్నాయి. తాను ఏదో ఒక తీర్మానానికి రావాలి. తనకున్న అవకాశాలు, అభిలాష్ నుడి విడాకులుతీసుకోవడం, తర్వాత వేరొకర్ని పెళ్ళిచేసుకోవడం లేదా నిర్లిప్తజీవితానికి ఏదో విధంగా ఒక అలవాటు పడడం లేదా తన ఊరికి వెళ్ళి బ్రతికినంత కాలం తన ఇంట్లో ఆనందంగా పుస్తకాల మధ్య బ్రతకడం. ఆలోచిస్తుంటే అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మను చూడాలనిపించింది. ఆమె తనను గురించి ఎంత బాధపడుతున్నదో. ఒంటిరిగా కూర్చొని రోజంతా దిగాలుగా జీవితం గడపడం తల్చుకొన్నప్పుడు, కడుపంతా ఏదో దేవినట్టు అయ్యింది.

అమ్మను చూడాలనిఉందని మధ్యాహ్నం అభిలాష్‌ను అడిగింది. అతను సంతోషంగా ఒప్పేసుకొని ప్రయాణానికి ఒక కారును అరేంజ్ చేశాడు. అభిలాష్‌కు పూర్ణిమను ఎదుర్కొనే సాహసం లేదు. తన కళ్ళలోకి కళ్ళుపెట్టి చూడలేడు. తనతో కూర్చొని భోజనం చేయలేడు. తనతో పడుకొని కులాసాగా కబుర్లు చెప్పలేడు. తనతో సరసమాడటానికి భయం. ఏదో తప్పుచేసిన వాడిలా, భయం తరుముతుంటే పిక్కబలం

అంతా ఉపయోగించి పరిగెత్తి పారిపోతున్నాడు. ఆగితే చచ్చిపోతానని భయం. ఆగకుంటే ఎదురుగా నిలబడలేక లజ్జతో, అసమర్థునిగా కృంగి కృశించి నశించి పోతాననే భయం. అందుకని పూర్ణిమ ప్రయాణమౌతుంటే ఎంతో సంతోషం.పూర్ణిమకు కూడా కావాల్సింది కూడా ఈ ఒంటరితనాన్ని నుండి తప్పించుకుని అమ్మదగ్గరికి వెళ్ళాలని. నిజానికి ఇద్దరూ ఒక సన్నన్ని ఇరుకుదారిలో నడుస్తున్నారు. ఎవరు ముందు నడుస్తున్నారో! ఎవరు వెనుక నడుస్తున్నారో చెప్పడం కష్టం. ఇద్దరూ వడివడిగా అడుగులేసుకుంటూ పోతున్నారు.

పూర్ణిమ అత్తమామలకు కూడా చెప్పి, వాళ్ళ అంగీకారంతో ప్రయాణమైంది. అయితే లోలోపల ఒకసారి నవీన్‌కు చెప్పి వెళ్ళితే బాగుండుననిపించింది. నవీన్‌కు సెల్‌ఫోన్ చేసే అవకాశం లేదు కాబట్టి, తర్వాత కాలేజీకి ఫోన్ చేద్దాంలే అని సమర్థించు కొని ప్రయాణమైంది. అన్నిటికంటే అమ్మను చూడాలన్న ఆత్రుత ఇంక ఏ ఆలోచనలకు తావివ్వడం లేదు. పైగా అభిలాష్ ఇంట్లో వాళ్ళు అంత తొందరగా వప్పుకుంటారని అనుకోలేదు. సామాన్లు కార్లో సర్దారు. తాను వెనుక సీట్లో కూర్చొంది. అభిలాష్‌ను తాను రమ్మని చెప్పలేదు, వద్దని అనలేదు. ఇదే అదనుగా అభిలాష్ తనకేదో అర్జెంటు పని వుందని వీలుచూసుకొని వస్తానని అక్కను అడిగినట్లు చెప్పమని చెప్పాడు. కారు కదిలింది. ఒక్కొక్కసారి మన ఆలోచనలకు తగినట్టు సంఘటనలు జరుగు తుంటాయి. మరికొన్ని ఆలోచనలకు చాలా వ్యతిరేకంగా జరుగుతుంటాయి. కారు రెండవ సందు మలుపు తిరుగుతుంటే ఎదురుగా నవీన్ పుస్తకాలు చేతులోపట్టుకొని నడిచివస్తున్నాడు. పూర్ణిమకు కొండంత పని చిటికేస్తే అయిపోనట్టు ఫీలయి కారును ఆపమన్నది. అప్పటికే కారుదాటాడు నవీన్. కారు ఆగిన వెంటనే డోర్ తెరచుకొని డ్రైవర్‌ను నవీన్‌ను పిలువమని పురమాయించింది. డ్రైవర్ గబగబా నాలుగడుగులు వేసి "మాష్టారూ! మిమ్ములను మేడమ్ పిలుస్తున్నారు" అని కారువైపు చూపాడు. నవీన్ గబగబా నడుచుకుంటూ కారు వద్దకు వచ్చి "ఏమిటి ప్రయాణంలో ఉన్నట్టు ఉన్నారు" అని అడిగాడు.

పూర్ణిమ అందుకొని "మా అమ్మను చూచి కొంతకాలం గడపాలని అనిపించింది. అందుచేత ప్రొద్దున్నే అనుకోకుండా ప్రయాణం అయినాను. అయినా మిమ్మల్ని కలసి, చెప్పి వెళితే బాగుటుందని అనుకున్నా. అనుకున్నట్టు మీరే ఎదురుపడ్డారు. కోరిక బలమైతే టెలిపతి లాంటిది పనిచేస్తుంది" అన్నది.

“మరలా రాక ఎప్పుడు, అసలు కాలేజి స్థాపించిన రోజు కాలేజి డే జరుపుతారు. ఈ వారం చివర్లో. దానికి మిమ్మల్ని చీఫ్ గెస్ట్‌గా పిలవాలని కాలేజీవాళ్లు తీర్మానించారు” అని గుక్కతిప్పుకోకుండా మాట్లాడాడు.

పూర్ణిమ “ఏమో ఊరికి పోతేగాని మరలా ఎప్పుడు వచ్చేది చెప్పలేను. ఇంతకూ సంతకం పెట్టిన అప్లిక్లేషన్ చలానా కట్టి ఆఫీసులో ఇచ్చారా!” అని అడిగింది.

“ఆ పక్కరోజు పని పూర్తయింది. రీడింగ్ మెటీరియల్ ఒక నెల రోజులలో మీ అడ్రస్సుకు వస్తాయి” అని అన్నాడు. పూర్ణిమ “సరే అయితే నేను బయలుదేరుతాను. నేను రెండురోజుల్లో ఫోన్ చేస్తాను. నా నెంబరు రాసుకోండి” అని తన నెంబరు చెప్పింది.

పూర్ణిమ “తీరిగ్గా చాలా విషయాలు మాట్లాడాలి. మీకు వీలైతే మా ఊరికి రావచ్చు గదా” అని అన్నది. ఇద్దరూ బై బై చెప్పుకున్నారు. పూర్ణిమ కార్లో కూర్చొంది, కారు కదిలింది. మధ్యాహ్నం రెండు గంటలకు తన ఇంటివద్ద ఆగింది. కార్లో నుండి ఎవరు దిగుతున్నారు చెప్మా అనేలోగా “అమ్మా” అంటూ వాళ్ళ అమ్మను కౌగిలించు కుంది పూర్ణిమ. చాలాసేపు కౌగిలిలోనే ఉండిపోయింది. కళ్ళల్లో వస్తున్న నీళ్లు ఆమెకు కనబడకుండా ఉండాలని సర్దుబాటుచేసుకొని నీకు ఆశ్చర్యం కలిగించాలని ఇలా చెప్పకుండా వచ్చేశాను. నిన్ను చూడాలనిపించింది. కల్లోకి వస్తున్నావు అని అన్నది”. పాలేరు కారులోనుండి సామానులు దించి కారును వెనుకకు పంపించేశాడు.

పూర్ణిమ కుర్చీలో కూర్చుంటుంటే, పనిపిల్ల పాలేరు అందరూ వచ్చి అంతా బాగున్నారా అని అడగడం లాంటి కుశల ప్రశ్నలు జరిగిపోయాయి. “పొద్దెక్కింది మరలా కుర్చీల్లో కూర్చొంటున్నావు, భోజనం తిందువు గాని రా” అన్నది అమ్మ. తనక్కూడా అమ్మచేతి భోజనం తినాలని తాపత్రయం ఉన్నది కదా. అమ్మ డైనింగ్ టేబుల్ మీద కంచంలో అన్నీ వడ్డిస్తున్నది.

పూర్ణిమ “నీ చేత్తో కలిపి పెడితే తినాలని ఉన్నది” అన్నది వాళ్ళమ్మవైపు చూసి. “అది ఎంత భాగ్యమే తల్లీ” అని కంచం దగ్గరికి లాక్కుని, కొత్త ఆవకాయతో సహా అన్నీ కలిపి ముద్దలు తినిపించింది. మొదటి ముద్దను తింటున్నప్పుడు పూర్ణిమ కళ్ళు చెమర్చాయి. ఎలాగైనా అమ్మకంట పడకూడదని ప్రయత్నించింది. కాని అమ్మదగ్గర ఎవరూ ఏమీ దాచలేరు కదా? తల్లి తన బిడ్డలను వెయ్యికళ్ళతో చూచుకొంటుంది. అమ్మ కళ్ళలో కన్నీళ్ళను చూస్తూ “ఏమైంది తల్లీ? ఏమైందిరా?

ఎందుకు ఆ కళ్ళనీళ్ళు. ఎవరు ఏమన్నారు”? అని బొంగురు గొంతుతో తనకు కూడా కళ్ళనీళ్ళు తిరుగుతుంటే, పూర్ణిమను అడిగింది. పూర్ణిమ సర్దుకొని “ఏమి లేదులే అమ్మా! నీచేతి ముద్దలు తిని ఎన్నోరోజులు అయ్యింది కదా! అందుకని అలా అనిపించింది” అన్నది. చాలారోజుల తర్వాత అమ్మచేతి నాలుగు ముద్దలు కడుపు నిండేందుకు దోహదపడ్డాయి. ఆ తృప్తిని అనుభవిస్తే తప్ప దాని విలువ తెలియదు. భోజనం అయ్యింది. అమ్మను మరలా కౌగిలించుకోవాలనిపించింది. అయినా ఏమన్నా అనుమానం వస్తుందేమో అనుకొని కూడా తనను తాను కంట్రోలు చేసుకోలేక గట్టిగా కౌగిలించుకుంది మరోసారి.

ఇప్పుడు తాను తన ఇంటికి వచ్చింది. తాను స్వర్గంలోకి అడుగుపెట్టినట్టు అనిపిస్తున్నది. గబగబా ఇల్లంతా నాలుగువైపులా తిరిగింది. మేడపైకి వెళ్ళింది. తాను వచ్చింది కాబట్టి తన రూమును అప్పుడే తెరచిపెట్టారు. కిందికి దిగివచ్చి కొట్టంలోకి పోయి ఆవుదూడలను చూచింది. తనకు అంత ఆనందం మొట్టమొదటి సారి అనుభవానికి వచ్చినట్టు అనిపించింది. ఆనందం ఇంత అందంగా ఉంటుందని ఇంతకాలం తెలియలేదనిపించింది.

గత కొన్ని నెలలుగా అదే పనిగా హృదయంలో పలుగు పార తీసుకొని ఎన్నో గుంటలను త్రవ్వుకొన్నది. ఆ గుంటలన్నింటిని ఈ పూర్ణిమ ఈరోజు ఆనందంతో నింపివేసింది. జీవితంలో అన్నిటికన్నా కష్టమైనది దుఃఖాన్ని భరించడం, దాన్ని దాచిపెట్టడం. సంతోషాన్ని మౌనంగా లోలోపల ఆనందించవచ్చు గాని దుఃఖాన్ని దాచలేము. కడుపునిండా తిండి కంటినిండా నిద్ర అనుభవించి ఎన్నిరోజులు అయ్యిందో! అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది. రాత్రి 8 గంటలయ్యింది. అమ్మవచ్చి లేపి కొంచెం భోజనం చేయమంది. ఆకలిగా లేదని బలవంతంగా అమ్మ తెచ్చి ఇచ్చిన ఒక గ్లాసు పాలు తాగి క్రిందకు వెళ్ళి వాళ్ళమ్మ పక్కన పడుకొన్నది. తెల్లవారింది. ఒక్కసారి గతమంతా గుర్తుకువచ్చింది. ఒక్కరోజు బాధ సెలవు తీసుకున్నది. చాలారోజుల్నించి బాధతో అలసిపోయింది కాబట్టి ఒకరోజు విశ్రాంతితో కొంచెం స్వాంతన పొందింది. అయితే మరలా అవే ఆలోచనలు. అదే సందిగ్ధం. అదే ఆరాటం.

అమ్మ ఒక్కమాట కూడా అడగలేదు. అడిగే ధైర్యం లేదు. అడిగితే ఎలాంటి విషయాలు వినాల్సి వస్తుందో అన్న భయం. ఏమీ లేనట్టు, ఏమీ జరగనట్టు ఆమె

పనిలో ఆమె నిమగ్నమైపోయింది. పూర్ణిమ పరిస్థితి కూడా అలాగే వుంది. రెండవ రోజు సాయంత్రం 7 గంటలకు నవీన్ ఫోన్ చేశాడు. యోగక్షేమాలు విచారించాడు. పూర్ణిమ అమ్మ సంతోషాన్ని గురించి తన ఆనందాన్ని గురించి ముచ్చట్లు జరిగాయి. అభిలాష్ దూరం కావడంతో పూర్ణిమకు నవీన్ అంటే రోజుకు రోజుకు ఇష్టం ఎక్కువౌతున్నది. పంచతంత్రంలాంటి గ్రంథాల్లో రాసినట్టు రాజులు, గురువులు, జంతువులు, స్త్రీలు, పూలతీగలు, తమకు దగ్గరగా ఉన్నవారిని ఆసరా కల్పించిన వాటిని అట్టే వాటేసుకొని అల్లుకుపోతాయి. ఆ అభిమానం, ప్రేమ ముందర లోపాలు, గతుకులు కనపడవు. నీకు దూరం అయితే, ఆవల ఉన్న నాకు దగ్గరౌతావు అన్న చందాన అభిలాష్‌కు దూరం అవుతున్న భావన బలపడ్డట్టే, తన పరిధిలోకి వచ్చిన నవీన్ మీద అభిమానం ఇనుమడిస్తున్నది. తాను తనకు దగ్గరైతే బాగుండునను భావన కలుగుతున్నది.

పూర్ణిమ పక్కరోజు నవీన్‌కు ఫోన్‌చేసి శని ఆదివారాలు సెలవు కాబట్టి తన ఊరికి రమ్మని ఆహ్వానించింది. రెండురోజులు వ్యవధి ఉంటుంది కాబట్టి అనేక విషయాలు ముచ్చటిచ్చుకోవచ్చని తన ఊరి లైబ్రరీని చూడవచ్చని అన్నది. నవీన్‌కు వేరే పనులు ఆలోచనలు ఉన్నాకూడా పూర్ణిమతో మాట్లాడ్డం దగ్గరగా ఉండడం తనను చూస్తూ, రోజులకొద్ది గడపడం బాగుంటుందన్న భావన చాలా లోతుగా పాతుకొని ఉన్నది. ఆ కారణంగా తాను తప్పక వస్తానని అడ్రస్సు వివరాలు తెలుసుకొని ఎప్పుడు వచ్చేది ఫోన్ చేస్తానని ముగించాడు.

పూర్ణిమ శనివారం కొరకు ఆత్రుతగా కాచుకొని ఉంది. ఈలోగా తనకున్న చిన్న చిన్న స్థలాలు, మెట్టభూములు అక్కడక్కడా చెదురుమదురుగా ఉన్నందున, వాటిని సంరక్షించడం తమవల్ల కాదు కాబట్టి, వాటిని బేరం పెట్టి, తెలిసి, తెలిసి కొంచెం తక్కువ ధరకే వెనువెంటనే డబ్బులిచ్చేవాళ్ళకు అమ్మి వేసింది. దాన్ని అమ్మ పేరుతో బ్యాంకులోవేద్దామంటే ఆమె కాదన్నందున తన అకౌంట్‌లోనే వేసుకుంది.

శనివారం వచ్చింది. నవీన్ 10 గంటలకు వచ్చాడు. నవీన్‌కు అనుకున్న దానికంటే, మర్యాదగా సత్కారాలు జరుగుతున్నాయి. తనని అమ్మకు పరిచేయం చేసింది పూర్ణిమ. ఆయన సహాయంతో ఎం.ఏ. చదవుతున్న విషయం చెప్పింది. నవీన్ గతంలో పూర్ణిమ పరిచయం అయిన నాటినుంటి తన అనుభవాలు, ఆమె

జ్ఞాన సంపద, అనర్గళమైన  వాక్ప్రవాహం అన్నింటినీ ఎంతో ఆనందంతో హృద్యంగా వివరించి చెప్పాడు. అమ్మకు ఒకవైపు సంతోషం కలిగినా కూడా, లోలోపుల పూర్ణిమ జీవితం ఆనందంగా లేదన్న వెలితిని బయటపడనీయకుండా ఉన్నది.

కాఫీ ఫలహారాలు ముగించుకొని ఇద్దరూ మేడమీద తన గదిలో చెరొక కుర్చీలో కూర్చొని అనేక విషయాలు మాట్లాడుకున్నారు. మధ్యాహ్నం అయ్యింది. మరల చర్చలు ప్రారంభం. ఎన్నో వాదోపవాదాలు జరుగుతున్నాయి. మధ్యలో నవీన్ అందుకొని "నాలాంటి లిటరేచర్ పరీక్షల కొరకు చదివిన వాళ్ళకు, నీలా జీవిత కథలు, నవలలు, చరిత్ర అన్నీ కలిపిన ఒక నిర్దిష్టమైన భావనాసంపుటి ఉండదు. మీ దగ్గర  మానసిక, సామాజిక, ఆర్థిక, వేదాంతం లాంటి అనేక  సబ్జెక్టుల సామర్థ్యం ఉన్నది.

అందుకు పూర్ణిమ, "సాధారణ సబ్జెక్టులలో ఆత్మ ఉండదు. ఈ సబ్జెక్ట్‌లు ప్రాణం లేనివి. అదే సాహిత్యంలో ఉన్న పాత్రల ద్వారా మన శరీరం, మెదడు, ఆత్మ, మరెన్నో విషయాలను, అవగాహన చేసుకొనే అవకాశం ఉంటుంది.  జీవితానికి సంబంధించిన అన్నివిషయాలు సాహిత్యంలో ఉంటాయి. ఈ ద్వంద్వ మయమైన ప్రపంచంలో ఉన్న సర్వస్వం సాహిత్యంలో ఉంటుంది. ఉదాహరణకు నేను చదివిన పుస్తకాల్లో రెండు పుస్తకాలు, ఒకటి అలెగ్జాండర్ డ్యూమాస్, "కౌంట్ ఆఫ్ మోంట్ క్రిస్టో" రెండవది, విక్టర్ హ్యూగో రాసిన "లే మిసరబుల్స్ (బీదలపాట్లు)", చదివితే సాహిత్యంలో ద్వంద్వాలు అర్థమై సగంసాహిత్యం చదివినట్లు అవుతుంది. ఒకదానిలో పగ–కసి, రెండవ దానిలో త్యాగం–దయ ఉంటాయి.

ఆత్మ పరమాత్మ భగవంతుడు, మోక్షంలాంటి వాటిని ప్రక్కన పెట్టితే ఈ భౌతిక ప్రపంచంలో మానవుడి ద్వంద్వ ప్రకృతి కసి (ప్యాషన్) అండ్ దయ (కంప్యాషన్). మిగతా ఎన్ని పుస్తకాలు చదివినా ఈ రెండు పుస్తకాల ఛాయలే మిగతావాటిలో ఉంటాయి. "ఈ ప్రపంచం ప్రేమ నుండి జనించింది. పగ ప్రేమ నుండి పుట్టింది. కాదంటే నీ శత్రువుకు శత్రువు నీకు మిత్రుడు అవుతాడు అన్న చందాన ఉంటుంది. మొత్తానికి పగకున్న శక్తి ప్రేమకు లేదు. ప్రపంచ సాహిత్యంలో పగకున్న స్థానం మరిదేనికి లేదు. ఇలియడ్ ఒడిస్సి, మిల్టన్ ప్యారడైజ్ లాస్ట్, చివరకు రామాయణం, భారతం కూడా పగతో నిండి ఉంటుంది. సీతారాములు, రాధాకృష్ణుల ప్రేమలాంటి సంఘటనలు ప్రేమను వల్లెవేసినా మూలంలో ఎక్కడో, పగ, బీజం నక్కి ఉంటుంది.

ఈ ప్రపంచంలో తల్లిదండ్రుల ప్రేమలు మినహాయిస్తే, మిగతా ప్రేమలు సాదాసీదాగా ఉంటాయనిపిస్తుంది. అవన్నీ అవసరాలమీద ఆధారపడినవే. కాని పగ అనేక కారణాల వల్ల జనించి, స్వార్థం అసూయలతో, వ్యక్తులను కుటుంబాలను, వ్యవస్థలను, రాజ్యాలను, దేశాలను సర్వనాశనం చేస్తుంది. ఆ వైనమే చరిత్ర సారం. ఏదేశ చరిత్ర చూచినా ఏ మున్నది గర్వకారణం. నరజాతి సమస్తం పరపీడన పరాయణత్వం, అన్న శ్రీశ్రీ మాటలు గుర్తుచేసుకోవలసినదే".

రెండురోజులు గడచిపోయాయి. అసలు నవీన్‌ను రమ్మనమని పిలిచిన కారణం వేరు. కాని ఎలా ప్రారంభించాలో తెలియలేదు పూర్ణిమకు. తనకు తాను బయటపడలేదు. అతని గతమేమిటో తెలియదు. ఇష్టాయిష్టాలను గుర్తించినపుడు మాట్లాడాలనుకున్నా విషయాన్ని కదిలించలేదు. నవీన్ తనను గౌరవభావంతో మర్యాదతో చూస్తున్నాడని అర్థమౌతున్నది. కాని, తనను ప్రేమించి, తనతో జీవితం గడపాలనేంత కోరిక ఉన్నదని రూఢికావడం లేదు.

పూర్ణిమ ఆలోచించసాగింది. అభిలాష్‌తో వైవాహిక జీవితం నడవడం, తనకు జీవితంపైన ఉన్న తపన, ఏదో సాధించాలన్న కాంక్షను తీర్చుకునేందుకు వీలుకాదన్నది స్పష్టమైపోయింది. ఇప్పుడైనా తాను అతనితో తెగతెంపులు చేసుకొని, ఎం.ఏ. ప్రైవేటుగా చేస్తూ ఐ ఏ ఎస్ కు తయారు కావాలి. అందుకు ఒక తోడు ఉండాలి. నవీన్ అదే వృత్తిలో ఉండడం కొంత వసతిని కల్పిస్తున్నది. తాను అడిగితే కాదన గలడని అనిపించడం లేదు. నిజానికి అభిలాష్‌కు కూడా తనమీద ఇష్టంలేక కాదు. కాని తనలో ఒక శూన్యం ఏర్పరచుకొన్నాడు. దాంట్లో నుంచి బయటపడలే కున్నాడు. ఇలా ఆలోచించి, చివరకు, అయినా ఒక ప్రయత్నం చేద్దాం అనిపించింది పూర్ణిమకు.

"నవీన్ గారు! మిమ్ములను  పిలిచిన కారణం, నన్ను బాధిస్తున్న ఒక పెద్ద సమస్యకు ఏదైనా పరిష్కార మార్గం దొరుకుతుందేమోనని. రెండురోజులుగా ఆ విషయం మాట్లాడాలని ఉన్నా, నేను దాటేస్తూ వస్తున్నాను. వేరే అనేక విషయాలు మాట్లాడు కున్నాం. కాని నన్ను మానసిక క్షోభకు గురిచేస్తున్నది మాట్లాడలేదు" అని తన గతం అంతా పూసగుచ్చినట్టు చెప్పింది నవీన్‌కు. "అయినా మేనమామ, చిన్నప్పటినుంచి తెలిసిన దానివి, పైగా నీవలన ఏ తప్పులేదు, సౌందర్యం ఉంది, చదువు ఉన్నది, అయినా అభిలాష్ అలా ప్రవర్తించేందుకు బలమైన కారణం ఉండాలి కదా" అని ప్రశ్నార్థకంగా చూచాడు.

పూర్ణిమ అందుకుంది, "ఈ మనస్సు చాలా సున్నితమైంది. ఒకదానికి కట్టుబడితే, దాని ముడిని విప్పుకోవడం అంత సులభంకాదు. నన్ను పెళ్ళిచేసుకునే ముందే తాను స్వేచ్ఛా జీవి. ఏ అడ్డంకులు లేనివాడు. అన్నిటికంటే బలమైనది భయంకరమైనది అలవాటు (హేబిట్). ఒకదానికి అలవాటు పడ్డ వ్యక్తి మరొక అలవాటుకు మారాలంటే ఒక తపస్సు చేయాలి. త్రాగుడు, పొగ, విచ్చలవిడిగా తిరగడం లాంటి చెడ్డవైనా లేక దానం, ధర్మం, త్యాగం లాంటివైనా సరే వాటినుండి తప్పించు కోవడం చాలా కష్టమైన పని. మీకు టూకీగా ఒకమాట చెప్తాను. నాలో ఏదో ఒకలోపం ఉందని తాను నాకు దూరంగా ఉండడం లేదు. ఎందుకో నన్ను చూస్తే ఒక జంకు ఏర్పడింది. అది ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ కావచ్చు. ఒకటి ఆ కారణంగా, రెండవది తనకు జీవితంలో జులాయిగా గడుపుకునే దానికి వలసిన వసతులు ప్రపంచంలో అనేకం ఉన్నాయి. పొద్దునే లేచి ఫలహారం చేసి ముస్తాబై క్లబ్‌కు పోయి ఏ అర్ధరాత్రో అపరాత్రో ఇంటికి వస్తూ, తన సంతోషానికి సుఖానికి కొరత ఏమీ కనబడనప్పుడు, ఇంటివాళ్ళ విషయం చూడవలసిన అగత్యం ఎందుకుంటుంది?"

నవీన్‌కు పూర్ణిమ మాటలు వింటుంటే చమటలుపడుతున్నాయి. తర్వాత తాను ఏం మాట్లాడబోతున్నదో తెలియదు. ఒకవేళ అవసరం వస్తే ఏం చెప్పాలో తెలియదు. దీనికి పరిష్కార మార్గం చూపించగలనన్న పూర్తి నమ్మకం అతనిలో లేదనే సందేహం ఉంది.

పూర్ణిమ "ఇదంతా చూస్తుంటే, ఒక్క కథ, అంటే చిన్ని నాటిక, బుచ్చిబాబు రాసింది, కొంతవరకు నాకు గుర్తు ఉంది. దానిలో, ఉమర్‌ఖయ్యాం ఆశ్రమాన్ని గురించి చాలా దుష్ప్రచారాలు ఉండేవి. ఆశ్రమ జీవితమంటే సుఖించడం అని, సాహిత్యం, మధువు, మగువ లాంటివి ఉంటాయని, ఆయన బోధనల వల్ల చాలామంది చెడిపోతున్నారని పుకార్లుండేవి.

ఆదేశానికి చెందిన రాణికి ఎందుకో ఉత్సుకత కలిగింది. దీనిలోని నిజానిజాలు తెలుసుకోవాలని, మారు వేషంలో సాదాసీదా స్త్రీలాగా ఆశ్రమానికి వెళ్ళింది. అక్కడ ఒకాయన కళ్ళుమూసుకుని తలవంచుకొని కూర్చుని వుంటాడు. వచ్చిన ఆమె "మీపేరు ఉమర్‌ఖయ్యామా?" అని అడుగుతుంది. దానికి ఆ వేదాంతి తలకూడా పైకెత్తకుండా "నన్ను ఈ ప్రపంచం ఆ పేరుతో పిలవడానికి నిశ్చయించు కుంది" అని అంటాడు.

ఆమె మరల "నా భర్త మీ బోధనలకు ఆకర్షితుడై మీ ఆశ్రమంలో చేరి ఉన్నాడని విన్నాను. నా భర్తను నావద్దకు పంపించేయండి" అంటుంది. అప్పుడు తలపైకెత్తి చూచిన ఖయ్యాం, ఆమెవైపు సునిశితంగా చూచి తనకున్న జ్ఞానంతో "మీరు సాధారణ స్త్రీ కారు! మీరు ఒక మహారాణి. నాకే అధికారం ఉంటే మిమ్ములను పర్వతశిఖరాగ్రం మీద కూర్చోబెట్టి, ప్రజలు మిమ్ములను చూచి చనిపొమ్మని చెప్పేవాడిని. అయినా అలాంటి శిష్యుడు నాదగ్గర ఎవరూ లేరు. ఒకవేళ అట్లా మీ నుండి పారిపోయి వుంటే, నా బోధనలను విని మాత్రం కాదు. మీ సౌందర్య బంధనాలను తట్టుకోలేక పారిపోయి ఉంటాడు అని అంటాడు" అని ముగించింది పూర్ణిమ.

నవీన్‌కు పూర్ణిమ జ్ఞానం, సంస్కారం, ధైర్యం, మాట చూస్తుంటే దేవుడు తనకు అలాంటి శిక్ష ఎందుకు వేశాడా అని అనిపించింది. ఒక్కసారి అంత బరువైన విషయాన్ని వినేసరికి తన శరీరం, మెదడు మొద్దుబారిపోతున్నట్టు ఫీలయ్యాడు. అయినా ఆమెకు ఏదో చెయ్యాలని ఉంది. కాని చేసే ధైర్యం ఉందన్న నమ్మకం తనలో ఉందా అన్న సందేహం కూడా ఉంది. ఇంతలో పూర్ణిమ మరలా అందుకొంది. "అంతా విన్నావు కదా! నా భర్త అభిలాష్‌తో చూచాయిగా చెప్తాను. అతని ఇష్టా యిష్టాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఎలాంటి చట్టబద్ధమైన ఇబ్బందులు లేకపోయేవరకు నాకు తోడుగా మీరు ఉండగలరా? ఎక్కడైనా 200 లేక 300 కి.మీ. దూరంలో ఏదో ఒక పెద్ద టౌన్‌లో ఎవరికీ తెలియకుండా ఉండిపోదాం. నా జీవితం నాకు పనికిరాకుండా పోయినా, కనీసం ఇతరులకు కూడా ఉపయోగపడకుండా ఇలానే గడిపేస్తే ఆ వెలితిని పూడ్చేందుకు చివరకు ఆత్మహత్యే శరణ్యమౌతుంది. నాతో మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇక్కడున్న ఆస్తిపాస్తులను సొమ్ముచేసుకుని మీరూ నేను వేరే ఎక్కడికైనా వెళ్ళి సహజీవనం చేసుకుంటూ హాయిగా గడిపేద్దాం. అందుచేత నాతో సహజీవనం చేయడానికి లేదా పెండ్లిచేసుకున్నాం అనేదానికి ఒకమాట చాలు. ఎలాంటి తంతు అక్కర్లేదు. "మామిడాకుతో మాంగల్యం చేయొచ్చు, లేదా మర్డర్ చేయొచ్చు. ఏదైనా సరే మీ ఇష్టం."

మరలా మాటల్లో "మీవాళ్ళు మీకు మ్యారేజ్ సంబంధాలు చూస్తున్నారు అన్నారు. అందుచేత బాగా ఆలోచించుకొని, మీకిష్టమైతే మీ అంగీకారం తెలపండి. తర్వాత

కార్యక్రమం ఆలోచించుకుందాం. మీరు సరేనంటే మా అమ్మతో కూడా ఒకమాట చెబుతాను. అలాకాక మీకిష్టంలేని పక్షంలో మీరు కాదని చెబితే నేనేమి అనుకోను. ఎవరి ఇబ్బందులు వాళ్ళకుంటాయి. అందుకని అపార్థం చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. మనిద్దరం స్నేహితులుగా, సాహితీ ప్రియులుగా ఇలానే ఉండిపోదాం. పరిమితమైన జీవితంతో, రాజీపడి జీవచ్ఛవంలా బ్రతుకు సాగించడం కుదరదు. జీవితంతో సమాజంతో యుద్ధం చేయాలనుకుంటున్నాను. చేస్తాను కూడా. ఈ యుద్ధంలో నేను తప్పక గెలుస్తాను". నవీన్ పూర్ణిమ దగ్గిర, వాళ్ళమ్మ దగ్గిర సెలవు తీసుకొని ప్రయాణమయ్యాడు.

పూర్ణిమను ఎన్నో ఆలోచనలు తరుముతున్నాయి. నవీన్‌కు అంత ధైర్యం ఉందని అనిపించడం లేదు. జీవితం ఒక పోటీ, ఒక పోట్లాట, ఒక పోరాటం. తాను బలహీనుడనని అసమర్థుడనని లోలోపల నమ్ముతూ బయట ప్రపంచానికి తాను ధనికుడనని గొప్పవాడనని, గెలుపును స్వంతం చేసుకున్నవాడినని ఇతరులచేత అనిపించు కునేందుకు చేసే ఆరాటం, పోరాటం చాలామందిలో ఉంటుంది. నిజానికి మానవుడు మానసికంగా దారిద్ర్యంతో జీవిస్తుంటాడు. దీనికి భౌతిక దారిద్ర్యం తోడైతే ఇంకా ఘోరంగా ఉంటుంది.

ప్రతిమనిషికి అనేక రకాల ఆకలిదప్పులుంటాయి. అవి ఆ మనిషికి దశ దిశా చూపిస్తుంటాయి. పుట్టగానే ఆకలితో పాలకొరకు ఏడుస్తాడు. నెలలు గడిచేటప్పటికి గోరుముద్దలకు ఏడుస్తాడు. సంవత్సరాలు గడిచేటప్పటికి బొమ్మల కోసం ఏడుస్తాడు. తల్లి చనుబాలు తాగిస్తుంటే పళ్ళులేకపోయినా చిగుళ్ళతో నొప్పి పుట్టేట్టు కసితో కొరుకుతాడు. రెండో చేత్తో గోళ్ళతో గిచ్చుతుంటాడు. అక్కదగ్గర తమ్ముని దగ్గర ఉన్న బొమ్మలు, తనకు కావాలని వాళ్ళకు ఉండకూడదని ఏడుస్తాడు. ఎదురింటి బాబు దగ్గర ఉన్న సైకిల్ లాంటివి లేదని ఏడ్చి నేలమీద పడి దొర్లుతుంటాడు. వయసు వచ్చిన తరువాత, తనమిత్రునికున్నట్టు బెంజి కారు లేదని ఏడుస్తాడు. తన మిత్రునికి ఉద్యోగం వచ్చిందని, తనకు రాలేదని ఏడుస్తాడు. తన చెల్లెలు కొడుకుకు బంగారు ముంగురులున్నాయని, వెండి గిన్నెలో అన్నం తింటున్నాడని తమకు లేదని ఏడుస్తాడు. స్నేహితులు రెండస్థుల మేడ కట్టుకున్నారని ఏడుస్తాడు. జీతం చాలలేదని, ప్రమోషన్ లేదని ఏడుస్తూ, చివరి దశలో చనిపోతానన్న భయంతో ఏడుస్తాడు. ఇది మానవ సహజం.

* * * * *

ప్రస్తుతం పూర్ణిమ తన నాన్న చనిపోయాడని, అనుకోని కష్టాలు వచ్చాయని, జీవితాన్ని ఎలా మలచుకోవాలని తెలియని సందిగ్ధంలో ఉన్నానని ఏడుస్తున్నది. ఏది ఏమైనా భోజనాన్ని సంపాదించవచ్చు. కాని ఆకలిని కొనలేము. డాక్టర్లు ఇచ్చిన మందులను, డాక్టర్లను, నర్సులను కొనగలం. కాని ఆరోగ్యాన్ని కొనలేము. అయితే ఆనందం సంతోషం మనసు నిండా ఉంటే మిగతా వేటితో పనిలేదు.

నిజానికి జీవితంలో ధనం, అధికారం, అహంకారం గర్వం వలన సంపాదించిన ఆనందం నూటికి తొంబై శాతం అనిపించినా నిజానికి అది పదిశాతం మాత్రమే. ఎందుకంటే దాంట్లో కొంత వెలితి ఉంటుంది. త్యాగం, దయ, ధర్మం వల్ల వచ్చే ఆనందం, నూటికి తొంబైశాతం అవుతుంది.

గతంలో వ్యక్తులు వాళ్ళకు తెలిసిన మిడిమిడి జ్ఞానంతో తెలియని విషయాలను ఇతరుల వద్ద తెలుసుకుంటూ సుఖంగా జీవితాన్ని గడుపుకుంటూ ఉండే వారు. ఈరోజు అవసరమైంది, అనవసరమైన విషయాలు అనేకం తెలియడం వల్ల చాలామంది చాలామార్గాల ద్వారా అనేకరకాల ప్రయత్నాలు ప్రణాళికలు ఓటములతో ఎక్కువ బాధపడుతున్నారు. జీవితానికి ఏది అవసరమో ఏది అనవసరమో తెలియక ఆలోచించి ఆలోచించి ఇతరులతో పోటీపడి మెదడును మొద్దు బారేట్టు తయారుచేసుకుంటున్నారు. మానవుని మెదడును, అనేకములైన సమాచారం చెదపురుగుల్లా తినివేస్తుంటే, అవసరమైన దానికి వలసినమేథస్సు బ్యాలన్స్ లేక ఖర్చుయిపోతున్నది. అందుచేత మెదడు శరీరం కంటే ముందుగా ముసలిదై పోతున్నది. నేటి వైద్యశాస్త్ర సాంకేతిక నైపుణ్యంతో ప్రతిమనిషి ఆయుష్షు ప్రమాణం బాగా పెరిగింది కాని అదే మోతాదులో మెదడు ప్రశాంతంగా ఆరోగ్యంగా ఉన్నదని చెప్పడానికి వీలు లేకపోతున్నది. పూర్ణిమ మనసు ఒక క్షణం కూడా తీరికలేకుండా అనేక ఆలోచన లతో సతమతమౌతున్నది.

పూర్ణిమ అమ్మ సుబ్బలక్ష్మమ్మ రోజురోజుకు మానసికంగా నలిగిపోతున్నది. తనకు ఏమి జరిగిందో తెలియదు. ఏమి జరిగింది పూర్ణిమ అమ్మతో చెప్పుకోలేదు. కాని అమ్మ పదే పదే దుఃఖిస్తుంటే చూడలేక జరిగిన విషయం అమ్మతో చెప్పుకొని ఏడ్చింది. ఒకవైపు కూతురి జీవితం, మరొకవైపు స్వంత తమ్ముడు. ఆనాడు వాళ్ళ పెద్దమ్మ మాటలు వినివుంటే ఇంత ఇబ్బంది ఉండేదికాదు. ఎవరు ఎవర్ని ఓదార్చాలో తెలియడం లేదు. ఎవరు ఎవరిని తప్పు బట్టాలో అర్థంకాలేదు. అప్పటికీ చాలాసార్లు

అమ్మ అభిలాష్‌కు ఫోన్‌చేసింది. ఎప్పుడు చేసినా బిజీగా ఉన్నాను. రెండు రోజుల్లో వస్తాను వారంరోజుల్లో వస్తాను అన్న జవాబులే తప్ప రాకపోకలు లేవు.

నాలుగు నెలలు కావస్తున్నది పూర్ణిమ వచ్చి. ఒకరోజు ఉదయాన్నే అభిలాష్ వచ్చాడు. ఉభయ కుశలోపరి. తర్వాత సుబ్బలక్ష్మమ్మ బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి గుచ్చి గుచ్చి విషయాలు అడిగి నిష్ఠూరాలాడింది. అంత ఇష్టంలేని వాడు ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందని బాధవెళ్ళగక్కింది. కాపురం అన్న తర్వాత సర్దుకుపోవాలి కాని ఇలా రోడ్డున పడ్డం ఏం బాగుంటుంది అని, ప్రవచనం చేయసాగింది. పైపెచ్చు పూర్ణిమ తనకంటే దేంట్లో తక్కువని ఏం లోపం ఉందో చెబితే సర్దుకుంటుందని అనేక విధాలా నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. అలాంటి స్త్రీ భార్య కావడానికి ఎన్ని జన్మలు తపస్సు చేసుకోవాలి అని అనేక రకాలుగా దెప్పిపొడిచింది. ఏడ్చింది. కాళ్ళు పట్టుకుంది. తనబిడ్డకు అన్యాయం చెయ్యొద్దని బ్రతిమలాడింది. బయట నుండి జరుగు తున్న తతంగమంతా గమనిస్తున్న పూర్ణిమ లోపలికి వచ్చి ఎప్పుడు మాట్లాడనంత కటువుగా అడిగింది.

“నీకేం కావాలో, నీకే తెలియకపోతే ఇతరులకు ఏం తెలుస్తుంది? చదువుకున్న వాడివైయుండి కారణం లేకుండా, కారణం తెలియనీయకుండా హింసపెడుతుంటే ఎంతకాలం భరించాలి? ఎవరైనా ఎట్లా భరిస్తారు?” అని నిలదీసింది. అభిలాష్ అడిగినవాటికి జవాబు చెప్పడం వదిలేసి “అందుకే నేను ఇక్కడికి రాకుండా ఉన్నాను” అని చివుక్కున లేచి గబగబా తలుపుతీసుకొని బయటకు వెళ్ళి కారు ఎక్కి ప్రయాణ మయ్యాడు.

గత నాలుగు నెలలుగా వారానికి కనీసం రెండుసార్లు నవీన్ గాని, పూర్ణిమ గాని ఫోన్ చేసుకొని మాట్లాడుకుంటున్నారు.ఎన్నిసార్లు ఫోన్లో మాడ్లాతున్నప్పటికి ఎలా ఉన్నారంటే ఎలా ఉన్నారు, అని కాలేజీ చదువులు ఎం.ఏ. దూరవిద్య, లాంటి విషయాలు తప్ప, పూర్ణిమ ప్రపోజల్‌కు నవీన్ నుండి జవాబులేదు. మొదటి పదిహేను రోజుల్లేనే పూర్ణిమకు అర్థం అయ్యింది. తనమీద నవీన్‌కు మంచి అభిప్రాయమే కాక చాలా యిష్టం కూడా ఉంది. పూర్ణిమ కోసం త్యాగానికి సిద్ధపడగలడు అని అనిపించింది అతని మాటలను బట్టి. కాని పూర్ణిమకు ఒక విషయం తెలియదు.

నవీన్ తాను తన ప్రాణ స్నేహితుడితో పూర్ణిమ విషయాన్ని చర్చిస్తే అతను చెప్పిన ఇబ్బందులు, అడ్డంకులు తనతో పోవని, తన కుటుంబం ఇబ్బందుల్లో పడవచ్చని

ఒక చాకలిపద్దు (ల్యాండ్రి లిస్ట్) తయారు చేశాడు. దాంతో ఏమి మాట్లాడే ధైర్యం లేదు నవీన్‌కు. అయినా ఎక్కడనో తప్పు చేశాననిపిస్తుంది. ఏమైనా కాని ముందుకు సాగిపోవాలని మనస్సు ఆరాటపడుతున్నది. పూర్ణిమ తనను ఎంతగానో నమ్మి కఠోర సత్యాన్ని తనతో పంచుకున్నది. తాను అంగీకరించవచ్చు అన్న ప్రగాఢ నమ్మకం లేకుంటే మనస్సు విప్పి ఒక స్త్రీ తన పర్సనల్ విషయాలు చెప్పగలదా. ఇదంతా ఆలోచిస్తుంటే తాను మగవాడి జాబితాలో నుండి తొలగింపబడ్డాడని అతనికే అనిపిస్తున్నది.

అసలు మిత్రునితో సంప్రదించడం తాను చేసిన తప్పని చాలాసార్లు తనను తానే నిందించుకొన్నాడు. ఎందుకో తనలో ఒక గిల్ట్ బాధిస్తున్నది. తాను చేతగాని వాడినని, ఒక దేవతలాంటి వ్యక్తి వరమిస్తే సందేహాల సమాహారంతో కాలం గడిపేస్తున్నానని బాధపడసాగాడు. అంతటి సౌందర్యమూర్తితో సంస్కారంఉన్న స్త్రీతో క్షణకాలం గడిపినా జీవితానికి ఒక అర్థం ఉంటుంది. కాకిలా చిరకాలం ఉంటేకూడా ఏం మిగులుతుంది అని ఆలోచిస్తున్నాడు.

ఎందుకో షేక్స్‌పియర్ క్లియోపాత్ర అందాన్ని గురించి వ్రాసిన వాక్యాలు గుర్తుకువచ్చాయి. క్లియోపాత్ర సౌందర్యాన్ని గురించి ఇద్దరు సైనికులచేత చెప్పించిన మాటలు పూర్ణిమను తలచుకుంటే మురిపిస్తాయి.

| | |
|---|---|
| Age cannot wither her | వయస్సుతో మార్పు రాదు. |
| Nor custom stale | పరిచయం పాత పడనీదు. |
| Her infinite variety. | ఆమె అనంత వైవిధ్యం. |

అసలు ఆమె తన సన్నిధిలో కూర్చొని మాట్లాడడం ఒక సుందర స్వప్నం. జ్ఞాన సంపదను, సౌందర్య సంపదను, సత్య సంపదను, దయా సంపదను, కరుణా సంపదను కలిపి మూసపోస్తే పూర్ణిమ అవుతుందనిపిస్తుంది. అది నెలవంక కాదు. నిండు పున్నమి. అది కాంతి ముద్ద. అది పరిపూర్ణత్వం.

అభిలాష్ మర్యాదస్తుడు కాదు. ఎంతకైనా తెగిస్తాడు. ఎవడైనా తన పెళ్ళాన్ని లేపుకొనిపోతే, చేతులు ముడుచుకొని కూర్చుంటాడా? కాలేజీ గంట కొట్టి చాలా సేపయ్యిందని బయట చీకటి పడిందని, లైబ్రరీలో ఉండడం వల్ల తెలియలేదని

ఫ్యాన్ వచ్చి హెచ్చరిచ్చేంతవరకు ఆలోచనలు ఆగలేదు. తన ఆలోచనలకు తానే బాధపడి గబగబా ఇంటి ముఖం పట్టాడు నవీన్.

* * * * *

పూర్ణిమకు అమ్మను చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఇల్లు. ఇప్పుడు చీకటి గుహలా తయారైంది. వాళ్ళ నాన్న కోటయ్య ఉన్నప్పుడు వచ్చి పోయేవాళ్ళతో ఎంతో సందడిగా ఉండేది. ఇప్పుడు భూమిని మక్తాకు ఇచ్చేసారు. పశువులు లేవు. పాలేర్లు లేరు. తలమనిషి లేడు. ఇంటిపనికి పైపనికి ఇద్దరే పనివాళ్ళున్నారు. అమ్మ అంత దిగులుగా ఉండడాన్ని చూసి భరించడం రోజు రోజుకు భారమైపోతున్నది పూర్ణిమకు. అప్పటికీ తన బాధ తెలియకుండా ఉండేందుకు ఆమెకు దగ్గరగా మసలుతూ, ఆమే చేసే పనుల్లో భాగం పంచుకుంటూ ఏదోవొకటి కల్పించుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నది.  నా అన్నవాళ్ళు లేరు. మనసులో బాధను చెప్పుకొని స్వాంతన పొందడానికి అవకాశం లేకుండాపోయింది.

సూర్యచంద్రులు పోటీపడి పరుగెత్తుతున్నారు. రోజులు మారిపోతున్నాయి. వయస్సు మినహాయించి పూర్ణిమ జీవితంలో ఎలాంటి మార్పులేదు. పూర్ణిమకు ఆలోచించే శక్తి కూడా సన్నగిల్లుతున్నది. తన జీవిత ప్రయాణానికి మార్గం మూసుకుపోతున్నది. ఇంతపెద్ద ప్రపంచంలో, కోటానుకోట్లమంది జీవిస్తుంటే తమ ఇద్దరికిమాత్రమే స్థానంలేనట్టు అనిపిస్తున్నది. గతంలో ఎంతో ప్రేమతో ఉన్న వాళ్లందరూ, ప్రస్తుతం వాళ్ళిద్దర్నీ వెలివేసినట్టు ఉన్నది. వాళ్ళిద్దరూ ప్రస్తుతం ఏకాకులుగా మిగిలిపోయారు. మిగతావాళ్ళతో వీళ్ళకు ఎలాంటి సంబంధం లేదు. పెద్దమ్మ ఉంటే కొంచెం ధైర్యం చెప్పేది. పెద్దమ్మకూడా తోడులేకుండా పోవడం అమ్మను చాలా క్రుంగదీసింది. మూడు నెలల క్రిందట పక్షవాతం వచ్చిన పెద్దమ్మను కొడుకు వచ్చి వైజాగ్‌లో హాస్పిటల్లో చూపించి కొంచెం బాగయిన తర్వాత అక్కడ తెలిసిన వారి ద్వారా తాను, తనచెల్లెలు ఆలోచించుకుని ఒక వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆమె ఆశ్రమంలో ఒకనెల వుండి ఎవరికీ చెప్పకుండా, ఎక్కడికో వెళ్ళింది. ఆచూకీ కోసం పోలీసు కంప్లైంట్ కూడా ఇచ్చారు. బహుశా ఏ గోదావరిలోనో కలిసిపోయి ఉంటుందనిపిస్తుంది. గతంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు సహజంగా మాట్లాడే మాట అంత ఇబ్బందిగా ఉంటే గోదాట్లోనో, గంగలోనో దూకు అనేవాళ్ళు. అందువల్ల

ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. తన విషయంలో అభిలాష్‌తో పెళ్ళి వద్దని చెప్పింది పెద్దమ్మ. దీనిని కర్మ అనాలో, చేజేతులా చేసుకున్నది అనుకోవాలో తెలియడం లేదు. సరే! ఏదో ఒకటి ప్రస్తుతం ఒక మార్గం వెతుక్కోవాల్సిన అగత్యం ఏర్పడింది.

ఒకరోజు పూర్ణిమకు చెప్పలేనంత ఆవేదన కలిగింది. తన పరిస్థితి ఎట్లా ఉన్నా, తనకు భరించగల ధైరం ఉన్నది. కాని అమ్మ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ఆరోగ్యం బాగాలేదు. తిండి సరిగా తినడం లేదు. బతుకు మీద పూర్తి నిరాశ ఏర్పడింది. అందుచేత దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని అనిపించింది. అందుచేత అమ్మతో తాను ఒకసారి అత్తగారింటికి వెళ్లివస్తానని చెప్పింది. అమ్మ అవునని కాదని చెప్పేంత ఆలోచన చేయగలిగిన స్థితిలో లేదు. పూర్ణిమ కారు పిలిపించి ప్రయాణ మయ్యింది. మధ్యాహ్నం రెండు గంటలకు అత్తగారింటికి చేరింది. అభిలాష్ ఇంట్లోనే ఉన్నాడు.

"ఏం చెప్పా చెయ్యకుండా వచ్చేశావు" అన్నాడు. తన దగ్గర జవాబులేదు. అయినా "ఎప్పుడైనా రావాల్సిందే కదా!" అన్నది. దానికి తిరుగు జవాబులేదు. పూర్ణిమ అత్తయ్యను మామయ్యను పలుకరించి, ఆరోగ్యం గురించి విచారించి వంటింట్లోకి వెళ్ళి కొంచెం పెరుగన్నం తిని తన రూములోకి వెళ్ళిపోయింది. ఎవరి రూములో వాళ్ళు కూర్చొని ఉన్నారు. 4 గంటల ప్రాంతంలో హాల్లో ఫోన్ మోగుతున్నది. ఎవరూ తీసుకోలేదు. ఎవరో ఒకరు తీసుకుంటారని ఎవరూ ఆ ప్రయత్నానికి పోలేదు. రెండోసారి, మూడోసారి, నాల్గోసారి మోగుతున్నది. పనిమనిషి తీసింది. పెద్దగా పూర్ణిమ 'అమ్మా!' అని అరిచింది."ఫోన్ మీకే, మీ అమ్మగారికి.... ఏదో చెబుతున్నారు" గబగబా వచ్చి ఫోన్ అందుకుంది. అవతల నుండి పనిమనిషి ఏడుస్తూ, "అమ్మ చనిపోయింది" అన్నది. పూర్ణిమకు తలమీద సమ్మెటతో బాదినట్టయింది.

"ఏంది ఎలా" అని అనగలిగింది. అవతల్నుంచి "బావిదగ్గర నుండి వస్తుంటే జారిపడి తల బావి అంచుకు తగిలి స్పృహ తప్పిపోయింది. డాక్టర్ వచ్చి చనిపోయిందని చెప్పాడు" అన్నది. పూర్ణిమ అభిలాష్‌కు కేకవేసి విషయం చెప్పింది. అభిలాష్ ఫోన్‌చేసి ఎవరితోనో మాట్లాడాడు. జరిగింది నిజమే. గబగబా అందరూ ప్రయాణం అయ్యారు. పూర్ణిమ పరిస్థితి భయంకరంగా ఉంది. చీకటి ఆకాశంలో గాలికి కొట్టుకు పోతున్నట్టుంది. ఉరుములూ మెరుపులతో ఎక్కడికో వెళ్ళిపోతున్నది. దేన్నైనా పట్టుకుందామంటే ఏది దొరకడంలేదు. అంతా అయోమయం. ఊపిరాడ్డంలేదు.

అయిదు నెలల వరకు అమ్మ దగ్గిరే ఉండి చివరి క్షణాన అమ్మను వదలి వచ్చి చివరి మాటకు, చూపుకు కూడా నోచుకోలేక పోయింది.

కారు పూర్ణిమ ఇంటిముంది ఆగింది. ఇల్లంతా జనంతో నిండిఉంది. అమ్మను వరండాలో పడుకోబెట్టి దీపం పెట్టివున్నారు. పూర్ణిమ గొల్లుమన్నది. అంతా గందరగోళం. వచ్చేవాళ్ళు వస్తుంటే, పోయేవాళ్ళు పోతున్నారు.

మరుసటి రోజు జరగాల్సినవన్నీ జరిగిపోయాయి. పదిరోజులు కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. అత్తయ్య, మామయ్య, పూర్ణిమ మాత్రమే ఉన్నారు. అభిలాష్ మాత్రం నాలుగుసార్లు వచ్చి ఆరోజు కార్యక్రమాలు చూసుకొని వెళ్ళిపోయాడు. నవీన్ కూడా వచ్చి పలుకరించిపోయినాడు. జరగాల్సిన కార్యక్రమాలన్నీ జరిగిపోయిన తర్వాత అత్తయ్య పూర్ణిమను వూరికి తీసుకెళ్ళాలని ప్రయత్నించింది. కాని పూర్ణిమ వారం రోజుల్లో కొన్ని వ్యవహారాలను పూర్తిచేసుకొని ఇంట్లో ఎవరినైనా కాపురం పెట్టించి వస్తానని వాళ్ళను ప్రయాణం కట్టించింది.

పదిరోజుల్లో ఇల్లు భూమితాలూకు మక్తాలు వసూళ్ళ కార్యక్రమాలను నిర్వర్తించేందుకు, వాళ్ళ నాన్నకు మంచి స్నేహితుడైన కృష్ణమూర్తికి అప్పజెప్పి పూర్ణిమ అత్తగారింటికి ప్రయాణమయ్యింది. రెండురోజులు గడిచాయి. కాని అభిలాష్ పూర్ణిమ ఇంట్లో ఉన్న స్పృహ లేనట్లుగా ప్రవర్తిస్తున్నాడు. మాటా పలుకు లేదు. నవీన్‌తో పరిచయం నత్తలా నిదానంగా నడుస్తున్నది. కాని పూర్ణిమకు అభిలాష్ మీద అయిష్టత ఈగలాగా పరుగెత్తుతున్నది. ధైర్యంచేసి ఒకరోజు 9 గంటలకు డ్రస్ చేసుకొని అభిలాష్ రూమ్‌లోకి వెళ్ళింది. ఏం అన్నట్టు చూశాడు.

పూర్ణిమ మొదలుపెట్టింది. "నేను ఎక్కువగా విసిగించదలచుకోలేదు అభిలాష్! నేను ఏమి తప్పుచేస్తే నన్ను ఇలా వెలివేస్తున్నట్లు చూస్తున్నావు. నేను నిన్ను పెళ్ళి చేసుకున్నది, నీతో కాపురం చేయడానికి కాని, ఘర్షణ కొరకు కాదు కదా?" అని ముగించకముందే "ఇది ఘర్షణ కాదా? ఏదో తప్పు చేసిన వాడిలా నన్ను నిలదీస్తున్నావు" అన్నాడు అభిలాష్.

"నాతో మాట్లాడకుండా, పలుకరించకుండా నేను స్త్రీనని నీ భార్యనని నేను ఇదే ఇంట్లో ఉన్నానని నీతో కలిసి కాపురం చేయడానికి ఇక్కడికి వచ్చానని, ఎన్నడైనా

నీవు ఆలోచించావా? ప్రవర్తించావా? అసలు నేను ఏం తప్పు చేశాను. నాకు జవాబు చెప్పవలసిన బాధ్యత నీకు లేదా?" అని అన్నది.

దానికి కనీసం జవాబు చెప్పాలన్న ఆలోచన, ఇష్టంలేని అభిలాష్ తలుపు దగ్గరికి పోబోతున్నప్పుడు, పూర్ణిమ అడ్డంగా పోయి "నేనడిగిందానికి జవాబుచెప్పు. నేను నీకు ఇష్టం వచ్చినట్టు నడుచుకునేందుకు సిద్ధంగా ఉన్నాను." జవాబు లేదు. బలవంతంగా పక్కకు నెట్టి తలుపు పూర్తిగా తెరచుకొని బయటికి వెళ్ళాలని ప్రయత్నం చేసే అభిలాష్‌ను పూర్ణిమ అడ్డంగా చేతులుపెట్టి మొండిపట్టుతో "నాకు జవాబు చెప్పి వెళ్ళండి. మీరు జవాబు చెప్పకపోతే పోనీను". "ఏందీ నువ్వు పోనిచ్చేది", అని చెంపమీద చెళ్ళుమనిపించి పక్కకు తోసేసి, "నీకిష్టమైతే ఉండు. లేకపోతే నీ చావు నీవు చావు" అని విసవిసా వెళ్లిపోయాడు.

* * * * *

# 4. తెగిన సంకెళ్ళు

పూర్ణిమకు దిక్కుతోచలేదు. తన పరిస్థితి పూర్తిగా అర్థమైపోయింది. తాను ఎక్కడికైనా వెళ్ళడానికి పాస్‌పోర్ట్ ఇచ్చేసాడు అభిలాష్. తనని ఇంకా భర్త అని అనుకోవడం మూర్ఖత్వం అని అనిపించింది. తన గదిలోకిపోయి కొంచెంసేపు ఆలోచించింది. సాధారణంగా ఆ పరిస్థితిలో కన్నీళ్ళు రావల్సింది రాలేదు, ఇంకిపోయాయి. ఇప్పుడు మిగలింది బాధ, కసి, కోపం, భయం మాత్రమే. మనస్సు కొంచెం కుదుట పడుతున్నది. అయినా ద్వేషం వైపు, పగవైపు పరుగెత్తడం ఆగలేదు. ఈ ప్రపంచమంతా అందకారమైనట్లుగా ఉంది. తనకెవ్వరూ లేరు. తనకు ఎవ్వరూ ఏమీ కారు. తనవాళ్ళు తనను వదిలిపెట్టి ఎప్పుడో వెళ్ళారు. అంతా శూన్యం. ఈ శూన్యాన్ని నింపేందుకు మార్గం కనపడ్డం లేదు. బయటి శూన్యాన్ని నింపేందుకు, ఏదో ఒక పదార్థం ఉంటుంది కాని, మనసులోని శూన్యాన్ని నింపడానికి ఏదీ ఉపయోగపడదు. మనసులోని శూన్యాన్ని నింపగలిగింది ప్రేమ ఒక్కటే. ప్రస్తుతం అదికూడా శూన్యంతో నిండిఉన్నది. మనసులోని శూన్యాన్ని నింపడానికి ప్రేమ దారులన్నీ మూసుకుపోయి ఉన్నాయి. తనలోని కోపం, పగ, ద్వేషం తనకు ఎలాంటి ఉపకారము చేయలేవు. అయితే ప్రస్తుతం శూన్యాన్ని నింపడానికి మూడుదార్లున్నాయి. ఒకటి నవీన్ ప్రేమను ఆసరాగా చేసుకోవడం. లేదా మరణం ద్వారా శూన్యంలో కలిసిపోవడం. లేకపోతే అక్కడనుండి వెళ్ళిపోయి తనవూరిలో తనకు నచ్చిన విధంగా ఒంటరిగా బ్రతకడం. ఎందుకో తనకు, పూర్తిగా అదృశ్యం కావడం ఇష్టంలేదు. ప్రస్తుత పరిస్థితుల నుండి సమస్యల నుండి పోరాటం చేసి, తనను తానుగా

నిరూపించుకోవాలి. అలాంటి సన్మార్గం ద్వారా తనకు అన్యాయం చేసిన వారిమీద పగతీర్చుకోవాలని ఉంది. ఆలోచనల మీద ఆలోచనలు వస్తున్నాయి పూర్ణిమకు .

అంతులేని ఆలోచనలు ఆలోచించేకొద్దీ ఒకవైపు మనస్సు జడం అవుతున్నది, మరొకవైపు చైతన్యం అవుతున్నది. మొండిగా ధైర్యంతో ఎలాగైనా తనలోని లోపాలను అధిగమించి ఇతరులకు తన ఉనికిని ఋజువు చేసుకోవాలని ఉంది. అలాగే మనస్సు చైతన్యంతో 360 డిగ్రీలను దాటి ప్రయాణం చేస్తున్నది. ఒకటి కదుల్తున్నది. మరొకటి కదలడం లేదు. ఒకటి కదలినప్పుడు రెండోది కదలకుండా ఉన్నచోటే ఉన్నది. ఏ వ్యక్తి అయినా ఉన్నచోట ఉండడం చాలా సులభం. కాని కలిమి నుండే లేమికి సుఖంనుండి కష్టానికి అలవాటుపడడం చాలా కష్టతరమైన పని.

తాను చేసిన పొరబాటు ఏమిటో అర్థంకావడం లేదు. అన్నీవుండి ఏమి లేకుండా పోవడానికి కారణం తెలియడం లేదు. జవాబు కనపడడం లేదు. కాదంటే, తిలాపాపం తలా పిడికెడు, అన్నట్టు అందరు కలిసికట్టుగా వాళ్ళచేతనైనంత నష్టాన్ని నైవేద్యంగా పెట్టారు తనకు. దీనికి ఎవర్నీ నిందించడానికి వీలులేదు. మానవ సంబంధాలు, ప్రేమ ఎంత విషాన్ని కక్కుతుందో ఇప్పుడు అర్థమౌతున్నది. తల్లిదండ్రులుంటే ఒక ఆదరణ ఉండేది. వాళ్ళు అమృతం కోసం చిలికి హాలాహలం నాకిచ్చినట్టయింది. ప్రేమ దయ కరుణల పర్యవశానం నాజీవితాన్ని బలికొంటుందని ఎవ్వరూ ఊహించలేదు.

అభిలాష్ తనదగ్గరకు రాకపోయినా, తనను భార్యగా గౌరవించకపోయినా, తాను తన చదువుతో, జ్ఞానంతో తన గొప్పతనాన్ని ఉనికిని చాటిచూపించేది. వేరే ఏదో కారణం చూపించి తనని క్షమించమని అడిగివుంటే దాన్ని పట్టించుకునేది కాదు. కాని తనను తృణీకరించి, తలనుండి విడివడి రాలిన వెంట్రుకలా, విరిగిపోయిన కాలిగోరులా, కుప్పతొట్టిలో విసిరిపారేయడం ఆయనగారి అహంకారానికి నిదర్శనం. దాంతో తన అహంమీద దెబ్బకొట్టాడు. ఏ విషయంలో కూడా తనతో పోటీబడగల సత్తా అభిలాష్‌కు లేదు. అందంలో, విద్యలో, జ్ఞానంలో మంచితనంలో అభిలాష్, తనకు వేలకిలోమీటర్ల వెనుక ఉంటాడు. ఏమి చూచుకొని తనను అస్యహించు కుంటున్నాడు. తన అంతు చూద్దాం అని అనిపించింది. తక్షణ కర్తవ్యం తన చైతన్యాన్ని జడంగా అంటే గట్టిగా ఉక్కులా చెయ్యాలి. లేచి నిలబడి ఫోన్ దగ్గరకు వెళ్ళి నవీన్‌కు ఫోన్ చేసి కలవాలని చెప్పింది. అవతల నుండి రెండు గంటలకు వస్తానని చెప్పాడు.

పూర్ణిమ ఇంటి నుండి వెళ్ళిపోవడానికి తీర్మానించుకుంది. ఇంతకు ముందు భయం ఉండేది. ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్న వాళ్ళనుండి భయం పారిపోతుంది. హత్య చేయడానికి నిర్ణయించుకున్న వాళ్ళకు భయం కలుగుతుంది. ప్రాణం కంటే విలువైనది ఈ ప్రపంచంలో ఏమిలేదు. అటువంటి ప్రాణంమీద, ప్రేమ లేకపోగా, తనమీద తనకే అసహ్యం, ద్వేషం కలుగుతున్నప్పుడు దేనికి భయపడాలి. విసుగు, విరక్తి భయానికి విరుగుడు. తనకు కావలసిన ముఖ్యమైన విలువైన వస్తువులు, రెండు సూట్‌కేసులలో సర్దుకుంది. నవీన్ రెండు గంటలకు వచ్చాడు. జరిగింది చెప్పింది. తనను ఎక్కడికైనా తీసుకొని పొమ్మన్నది. కనీసం 200 – 300 వందల కిలోమీటర్ల దూరంలో ఒక టౌన్‌ను చూడమన్నది. గతంలో ఈ పరిస్థితికి సుముఖంగా లేకపోయినా, భాజాపురం పెద్ద సిటీ, స్టేట్ హెడ్‌క్వార్టర్స్. మంచి సంస్కృతి ఉన్న ఊరు. ఆ ఊరులో దూరపు చుట్టం ఒకతను ఉన్నాడు. వాడితో చూచాయిగా గతంలో మాట్లాడి ఉన్నాడు కూడా. ఇంత అర్జంటుగా అంటే ఆ వూరికి పోవాల్సిందే.

అయితే నవీన్‌కు అనుమానం ఉంది. పూర్ణిమ భర్త మంచివాడు కాదు. ఏదైనా అవసరం వస్తే పోలీసులను, రౌడీలను ఉసికొల్పి, ఎంత క్రౌర్యానికైనా సంసిద్ధపడ గలడు. అసలు ఆరోజు సాయంత్రం వాళ్ళ నాన్న తనని ఊరికి రమ్మన్నాడు. తనకు తెలిసినంత వరకు పెళ్ళి వ్యవహారం మాట్లాడానికి అని తనకు తెలుసు. నవీన్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలాగున్నది. అందుచేత పూర్ణిమతో వాళ్ళ తండ్రికి బాగాలేదని అర్జంటుగా రమ్మన్నాడు అని ఫోన్ వచ్చిందని, ప్రస్తుతం తన చుట్టం భూషణంకు ఫోన్‌చేసి, తనని రిసీవ్ చేసుకునేట్టు చేస్తానని చెప్పాడు. రెండురోజుల్లో తాను వచ్చి కలుసుకుంటానని ఆ తర్వాత అక్కడ ఏంచేయాలో తీర్మానం చేసుకుందామని లేదా రెండు రోజులు ఆగితే ఇద్దరం కలసి వెళ్ళవచ్చునని నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కాని పూర్ణిమ రెండు రోజులు అక్కడ గడిపేందుకు సుముఖంగా లేదు. అందుచేత తాను మొదట చెప్పిన విధంగానే తననురైలు ఎక్కిస్తే తాను భాజాపురం వెళ్ళిపోతానని చెప్పింది.

దానికొరకు ఆయన ఫోన్ నెంబరు, ఇంటి అడ్రస్సు తీసుకుంది. కాకూరు పెద్ద జంక్షన్. వీళ్ళ ఊరినుండి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. కాబట్టి నవీన్‌ను ఏదైనా టాక్సీ మాట్లాడి స్టేషన్ పోవడానికి ప్రయత్నాలు చేయమని తాను, రెడీగా

ఉన్నానని అర్థించింది. నవీన్‌కు ఏదో ఒక విధంగా ప్రస్తుత గండం గడుస్తున్నదని తనకు తెలిసిన ఒక వ్యక్తికి ఫోన్‌చేసి టాక్సీ పంపాలని పురమాయించాడు. పదిహేను నిమిషాల్లో టాక్సీ వచ్చింది. మధ్యాహ్నం 3 గంటల సమయం. పూర్ణిమ అత్తమామలు విశ్రాంతి తీసుకుంటున్నారు. పనివాళ్ళు ఎక్కడో దొడ్లో ఉన్నారు. ఈ అదను చూసుకుని పూర్ణిమ తన సామానును టాక్సీలో పెట్టించుకొని, హ్యాండ్‌బ్యాగ్ తగిలించుకుని ఎవరికీ చెప్పకుండా టాక్సీలో కూర్చున్నది.

నవీన్ రెండవ డోర్ తీసుకుని టాక్సీలో కూర్చున్నాడు. వెంటనే టాక్సీ కదిలింది. అయినా నవీన్ బహు జాగ్రత్తగా మసలుకుంటున్నాడు. ఎవరైనా చూస్తే ఏమౌతుందో నన్న భయంతో డ్రైవర్‌వైపుకు చూస్తూ వెనుకకు చూస్తు వీలైనంత వరకు తనను ఎవరు చూడకుండా ఉండేట్టు జాగ్రత్తపడుతున్నాడు. టాక్సీ స్టేషన్‌కు చేరింది. సామాన్లు దించుకున్నారు. పూర్ణిమను స్టేషన్లో సామాన్లతో కూడా కూర్చోబెట్టాడు. నవీన్ స్టేషన్‌లో తనకు పరిచయం ఉన్న వ్యక్తిని పట్టుకుని 6 గంటలకు భాజాపురం వైపు వెళ్లే ఒక ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఒక బెర్త్ సంపాదించగలిగాడు. 6 గంటలకు ట్రైన్ రానే వచ్చింది. పూర్ణిమ నవీన్‌కు, ఆ వూరికి గుడ్‌బై చెప్పి ట్రైన్ ఎక్కింది. ట్రైన్ కదిలింది. ఎలాగైతేనేం మధ్యాహ్నం నుండి పడ్డ తపన ఆవేదన కొంత తగ్గింది. సామాను సర్దుకొని సీట్లో కూర్చొంది. ట్రైన్‌లో పెద్దగా జనం లేరు. తన సీటు దగ్గర కూడా ఎవరూ లేరు.

పూర్ణిమ మనస్సు చుట్టూ అనేక ఆలోచనలు ముసురుతున్నాయి. నవీన్ నిజంగా వస్తాడా? ఒకవేళ రాకున్నా, తనకు ఇంతకాలం బిగించిన సంకెళ్ళను తెంచుకున్నందుకు, స్వతంత్రంగా బతుకుతున్నందుకు కొంత సంతోషంగా ఉన్నది. ఎవరు దగ్గిరకు తీసినా తీయకపోయినా, ఒంటరిగా తన శక్తియుక్తులతో తన సత్తా చూపించాలి, అని అనిపిస్తున్నది. ఇలా ఎవ్వరికీ చెప్పకుండా వచ్చినందుకు అత్తమామలు ఏమను కుంటారో, అభిలాష్ ఏం ఆలోచిస్తాడో, తదుపరి కార్యక్రమాన్ని ఎలా చిత్రీకరిస్తాడో అర్థంకాలేదు. అయినా ఫరావాలేదు. తనకు ఏమి జరిగినా, ఎలా జీవించినా ఫరవాలేదు. తాను మంచిగా గొప్పగా బ్రతకలేని పరిస్థితి వస్తే తన విరక్తి తనను కాల్చే స్థితికి చేరితే, ఏమి ఫరవాలేదు. ఆ వూరిలో ఎవరో ఒకరు ఆశ్రయం ఇవ్వకుండా పోరు. ఎవరో ఒకరు తనను దగ్గర తీయకుండా ఉండరు. తను ఎలాగూ జీవితంలో ఆనందానికి దూరమవుతున్నది. ఆ స్థితిలో కనీసం ఇతరులకైనా తాను ఏదో ఒకవిధంగా పనికిరావాలి. తాను ఎంత చెడిపోయినా ఫరవాలేదు. తాను ఎంత నాశనం అయిపోతే ఈ సమాజం పై తాను అంత పగతీర్చుకున్న దానిని అవుతానని అనిపిస్తున్నది.

తనకు కావల్సిన వారు ఎవరూ లేని ఏకాకి ఏమైతేనేం! హరిశ్చంద్రుడు కాటికాపరిగా ఒక మాట అంటాడు. 'ఈ నిర్భాగ్యపు హరిశ్చంద్రుండు గతించిన వెనుక, ఈ కష్టములకు తావెక్కడనో కదా?' అని కష్టములమీద జాలిచూపిస్తాడు. ఆవిధంగా తాను ఎంత కష్టాన్నైనా ఓర్చుకొని ఇతరులకు ఉపయోగపడాలి. ఇతరులకు ఆనందం ఇయ్యాలి.

ఇలాంటి ఆలోచనలతో సెగలు గక్కుతుంటే, ఆవైపు బిస్కెట్లు, సమోసాలు అమ్ముతూ పోతున్న వ్యక్తిని చూసినప్పుడు పూర్ణిమకు ఆకలి గుర్తుకు వచ్చింది. అతన్ని పిలిచి ఒక బిస్కెట్ ప్యాకెట్, నాలుగు సమోసాలు తీసుకుంది. ఇంతలో ఒక యాభై సంవత్సరాల వయస్సు భారీ శరీరమున్న ఒకామె వచ్చి ఎదురు సీట్లో కూర్చుంది. చూడడానికి ఆ వయసుకు తగిన అందంతో చిరునవ్వు నవ్వుతూ ఉన్నది. తాను కిటికీలో నుండి చూస్తుంటే పూర్ణిమ ఆమెను పలకరించి, రెండు సమోసాలు తినమని కాగితంలో పెట్టి ఇచ్చింది. ఆమె "నాకు ఆకలిగా లేదు. మీరు తినండి. మిమ్మల్ని చూస్తుంటే మధ్యాహ్నం కూడా భోజనం చేసినట్టు లేదు" అని అన్నది. తాను అలసిపోయిన విషయం ఆమెకు కూడా అర్థమైంది. ఈమెకు ఏమైనా సిక్త్ సెన్స్ పనిచేస్తున్నదా? మధ్యాహ్నం నేను భోజనం చేయని విషయం ఈమెకు ఎలా తెలుసు అనుకుంది. అయినా పూర్ణిమ బలవంతంతో ఆమె తానిచ్చినది తీసుకున్నది. పూర్ణిమ రెండు సమోసాలు బిస్కెట్లు తిని నీళ్ళు తాగింది. ఈలోగా కాఫీ అమ్మే కుర్రాడు వస్తే రెండు కాఫీలు ఆర్డర్ చేసి బలవంతంగా ఆమెచేత కూడా తాగించింది.

ఎదురుగా కూర్చున్న పెద్దావిడకు పూర్ణిమ ఏదో ఇంటి కష్టాల్లో ఉన్నట్లు, చెప్పాచెయ్యకుండా ప్రయాణం చేస్తున్నట్టు, లేదా ఏదో అర్జంటు పనిమీద ఎక్కడికో వెళుతున్నట్టు, అనుమానం వస్తున్నది. మొత్తం మీద తాను ఏదో బాధతో ఉన్నది అన్నది నిజమనిపిస్తున్నది. వయస్సు అనుభవం మనిషికి జ్ఞానాన్ని ఇస్తాయి గదా! పూర్ణిమ తన బ్యాగులో ఉన్న భూషణం చీటిని చూచి మరలా అడ్రస్ చదువుకుంది. ఒక నరకం నుండి బయటపడ్డ తనకు మరొకరి సహాయం తప్పక కావల్సివస్తుంది. అయినా ఒకవేళ భూషణం రాకపోతే ఏంచేయాలో ఆలోచిస్తున్నది. పూర్ణిమకు తల్లిదండ్రులు మరలా గుర్తుకొచ్చారు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ళుంటే తనకు ఈ పరిస్థితి వచ్చివుండేదా! అనుకుంటూ కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

పెద్దావిడ పూర్ణిమ ముఖం పాలిపోవడం కళ్లలో నీళ్ళు తిరగడం లాంటి పరిస్థితులను గమనిస్తూనే ఉన్నది. ఎదురుగా ఒక స్త్రీ ఆ పరిస్థితిల్లో ఉంటే ఎవరికైనా ముఖ్యంగా స్త్రీలకు బాధవేస్తుంది. అప్పటికి ఆ పెద్దావిడకు పూర్ణిమ ఏదో ఒక సమస్యలో

ఉన్నది అని రూఢి అయ్యింది. అయినా అసలు విషయం తెలియకుండా చేయగలిగింది ఏమి ఉంటుంది. మాటా పలుకు లేకుండా కూర్చున్నది. అయినా మనసు ఒప్పడం లేదు. తనని మాటల్లో దించి అసలు విషయం కనుక్కోవాలి అని మనసు తహతహలాడు తున్నది.

ఇంతలో పూర్ణిమ జిప్ బ్యాగ్‌లో నుంచి గొలుసును తీసుకుని సూట్‌కేసుకు తాళం వేసింది. హ్యాండ్‌బ్యాగ్‌లో నుండి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన "గీతాంజలి" పుస్తకాన్ని చేతులోకి తీసుకుంది. అప్పటిదాకా చదివిన దగ్గర నుండి మిగతా చదవడానికి ప్రయత్నిస్తున్నది. కాని కళ్ళు అక్షరాలను చూస్తున్నాయి, మనస్సు మాత్రం ఆలోచనలతో నిండిపోయి ఉన్నది. నాలుగు వాక్యాలు చదివి ముందుకు సాగక పుస్తకం మూసేసింది. కాలాన్ని గడిపేందుకు చేస్తున్న ప్రయత్నమే అది. మరలా కిటికీలోంచి బయటికి చూస్తున్నది.

తన పరిస్థితికి తనకు ఏవోవే గుర్తుకువస్తున్నాయి. దేనికైనా ఈ ప్రపంచంలో ఒక ఆధారం ఉంటుంది. ఒక ఆధారం నుండి వచ్చినది, మరొక ఆధారంలోకి వెళు తుంది. ఇప్పుడు తన కంట్లో కారిన నీరుకు కారణం శరీరం కాదు. ఒక జ్ఞాపకం. తన తల్లిదండ్రుల మీద జ్ఞాపకం. అది ఒక పదార్థం కాదు. అదొక అంతర్లీనమైన చైతన్యం. ఇలాంటి జ్ఞాపకాలు కోటానుకోట్లు ప్రతిమనిషి సబ్‌కాన్షస్‌లో నిలబడి ఉంటాయి. ఇన్నింటిని ఈ మనస్సు ఎలా మోస్తుందో ఎవరికి అర్థంకాదు. అయితే స్పృహలో ఉన్న మనస్సు విచిత్రంగా ఉంటుంది. ఉదాహరణకు చేతికి దెబ్బతగిలితే నొప్పి పుడుతుంది. ఆ నొప్పిని భరించలేని కళ్ళు నీళ్ళను కారుస్తాయి. అయితే ఆ కంటినీటిని తుడిచేందుకు ఇంకొక చేయి ప్రయత్నం చేస్తుంది. అదొక అనుభవం. అయితే దానికొక జ్ఞాపకం ఉంటుంది. ఇలా జ్ఞాపకాలు అంతరాంతరాల్లోకి నిరంతరం ప్రయాణంచేస్తూ ఒక ప్రపంచాన్ని ఏర్పాటుచేసుకుంటాయి. ఆలోచనలంత బరువు ఈ ప్రపంచంలో ఏదీ ఉండదు. ఒక కొండ బరువా లేక ఆలోచన బరువా అంటే ఆలోచనల సమాహారమే బరువు అని చెప్పాలి.

పెద్ద పర్వతం నిశ్చలంగా కదలకుండా మెదలకుండా అలానే కూర్చొని వుంటుంది. దాని బరువు దానికి భారం అనిపించదు. మన శరీరం బరువు కూడా మనకు బరువనిపించదు. కాని చైతన్యం అలాకాదు. భావాలను, ఆలోచనలను, జ్ఞాపకాలను మోస్తూనే ఉంటుంది. నిజానికి శరీరాన్నంతా మోసేది ఆ చైతన్యమే. ఇలా ఆలోచిస్తూ

ఆ బరువును ఇంక మోయలేనన్నట్టు పూర్ణిమ పుస్తకం మూసేసింది. గంట ఏడవుతున్నది. రైలు అక్కడక్కడా ఆగడం, జనం ఎక్కడం దిగడం గడచిపోతున్నది. ఇంతలో రాత్రి భోజనానికి సప్లైయర్ బుక్‌చేసుకోవడానికి అటూ ఇటూ తిరుగు తున్నాడు. మధ్యాహ్నం కూడా తినలేదు కాబట్టి, ఒక భోజనం ఆర్డరిచ్చి ఎదురుగా ఉన్న పెద్దామెకు కూడా భోజనం చెబుతానని ఆమెను అడిగింది. ఆమె జవాబు చెప్పేలోగా రెండు భోజనాలకు ఆర్డర్ ఇచ్చేసింది.

పూర్ణిమ "మీరు ఎక్కడ దిగుతారు" అని అడిగింది. ఆమె తాను భాజాపురం పోతున్నాని చెప్పింది. పూర్ణిమకు తెలియని ఉత్సాహం కలిగింది. తానుకూడా భాజాపురానికి పోవాలని ఆమెతో అన్నది. "మీకు భాజాపురంలో లాల్‌పేట తెలుసా" అని అడిగింది. అందుకు ఆమె "అక్కడే పుట్టి అక్కడ బతుకుతున్నదాన్ని. నాకు బాగా తెలుసు. స్టేషన్‌కు కూడా దగ్గరే" అని అన్నది. పూర్ణిమ ఎవరింటికి పోవాలని విచారించింది పెద్దావిడ.

పూర్ణిమ "నాకు కూడా తెలీదు. వేరే తెలిసినవాళ్ళు అడ్రస్సు ఇచ్చారు, మీరెవరో తెలుసుకోవచ్చా అని అడిగింది". అందుకు "నన్ను సత్యభామ" అని అంటారు. "ఏం పనిమీద భాజాపురం వస్తున్నారు?" అని అడిగింది. పూర్ణిమకు ముసుగులో గుద్దులాట లెందుకని, పైగా ఆమెది ఆ వూరే, సౌమ్యంగా మాట్లాడుతున్నది అనుకొని "నేను కొన్ని విచిత్ర పరిస్థితుల్లో ఈవిధంగా రావలసి వచ్చింది" అని అన్నది .

"నన్ను రైలు ఎక్కించిన నా స్నేహితుడు నాకు తోడుంటానని, ఏదో అర్జంట్ పనిమీద వెళుతూ, రెండ్రోజుల్లో వచ్చి కలుస్తానని వాళ్ళచుట్టం ఎవరో ఉన్నారని ఆయనకు ఫోన్‌చేసి స్టేషన్‌కు వచ్చి తీసుకొనిపోయేట్టు అరేంజ్‌మెంట్ చేశాడు" అని అన్నది.

సత్యభామకు అర్థమయ్యింది. "అతను రాడు, ఇతను రాడు. నాకుతెలుసు. నేను ఎన్నో చూశాను. నీలాంటి వ్యక్తిని వంటరిగా పంపించిన వ్యక్తి మరలా వస్తాడంటే నమ్మదగినది కాదు. ఆడదానివి. పైగా అందమైనదానివి. నిన్ను ఒంటరిగా పంపించే ధైర్యం ఎవరికీ ఉండదు. నిన్ను వదిలించుకోవాలనే వారికి తప్ప". మరలా ఆమె "స్త్రీకి అందం కంటే శత్రువు మరేది వుండదు. ధనం లేమి కంటే దరిద్రమైంది అందం. అతను నిన్ను భరించే శక్తి లేక ఏదో ఒకసాకుతో నీనుంచి బయటపడ్డాడు. ఇంక అతన్నుండి నీకు ఉలుకూ పలుకూ ఉండదు. నేను ఇలాంటివి రాసివ్వగలను.

నేను ఇలా మాట్లాడుతున్నానని వేరేవిధంగా అనుకోవద్దు. నేను జీవితం తెలిసినదాన్ని. జీవితాన్ని ఒకరకంగా కాచివడబోసివున్నాను. ఒకవేళ అలాకాకుండా మంచిగా జరిగితే నాకు కలిగే ఆనందం ఇంతని చెప్పలేను" అని అన్నది.

పూర్ణిమ మనస్సు గుభేలన్నది. ఒకవేళ అట్లా జరిగితే తన గతి ఏమిటి? తను ఎక్కడికి వెళ్ళాలి. పిచ్చిపట్టినట్టవుతున్నది. ఇంతలో సత్యభామ మరలా అందుకొన్నది. "ఆయన మీకు బాగా పరిచయమున్న వ్యక్తా?" అంటే ఆయనతో ఉన్న సంబంధం శారీరకమా కాదా అని తెలుసుకోవడం సత్యభామ ఆలోచన.

పూర్ణిమ మొహంపై నున్న చిరుచెమటలు, కంగారు గమనించిన సత్యభామ, పూర్ణిమ చేతిపై చేయివేసి లాలనగా "ఏమ్మా! ఎందుకు కంగారు పడుతున్నావు? ఏం జరిగింది. నీ బాధ ఏమిటో చెప్తే నా వల్ల అయ్యేది చేస్తాను. నాపై నీకు నమ్మకం వుంటేనే చెప్పు అంది". పూర్ణిమ కళ్ళు ఎత్తి సత్యభామ వైపు చూచింది. ఆమె కళ్ళలోని నిజాయితీని గుర్తించి ఆ ఆర్ద్రతకు కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా తన కథను సూటిగా చెప్పాలనుకుంది.

మనస్సు విచిత్రమైనది. తనలోని రహస్యాలను ఆలోచనలను బలహీనతలను తెలిసినవాళ్ళకు, చుట్టాలకు, పరిచయస్తులకు చెప్పడానికి ఇష్టపడదు. ఎవరో ముక్కూ మొహం తెలియని వాళ్ళకు సులభంగా చెప్పేస్తుంది. ఎందుకంటే వాళ్ళను మరలా కలుసుకునే అవకాశం ఉండదు. కాబట్టి, పైగా వాళ్ళు మనవాళ్ళకు ఎవరికీ తెలిసిన వాళ్ళు కాదు కాబట్టి రహస్యం ఎప్పటికీ రహస్యంగా ఉండిపోతుంది. పైపెచ్చు మనకు తెలిసిన వాళ్ళకు మన బలహీనతలు గురించి చెప్తే మనలను దెప్పి పొడుస్తారు. మేము ఉన్నాం కదా? మాకు చెప్పకూడదా? ఇంతదూరం ఎందుకు తెచ్చుకున్నావు? ఇంత తెలివిగలదానివి ఇలా ఎలాచేశావు? అయినా ఆత్మవిశ్వాసం ఎక్కువైన వాళ్ళు ఇలానే ప్రవర్తిస్తారు, అని వెక్కిరించడం తప్ప వారివద్ద నుండి మనం కోరుకునే సానుభూతి రాదు. అందుచేత అపరిచితులకు ఎంత రహస్యాన్నైనా చెప్పేస్తాము. పూర్ణిమ విషయంలో ఇప్పుడు అదే జరగబోతున్నది. పూర్ణిమ తన కథను ప్రారంభించి, నవీన్‌ను తనతో జీవించమని చెప్పిన విషయం ఆమెకు తెలియజెప్పింది.

"భగవంతుడు మనతో ఎందుకు ఆడుకుంటాడో తెలీదు. నీ అందం నీకు శాపం అయిపోయింది" అని అన్నది సత్యభామ. ఇద్దరి మధ్య కొంచెంసేపు నిశ్శబ్దం

చోటుచేసుకుంది. మరలా సత్యభామ అందుకొని ఒకవేళ పూర్ణిమను తీసుకుపోవడానికి ఆ చుట్టం స్టేషన్‌కు రాకపోతే తాను తనింటికి తీసుకపోగలనని భరోసాఇచ్చింది.

"అయినా మీలాంటి వాళ్ళు ఉండగలిగిన ప్రదేశం కాదు. ఇల్లు బాగానే ఉంటుందనుకో. మా ఆయన మంచాన పడి ఉన్నాడు. అడపా దడపా ఎవరో ఒకరు వచ్చిపోతుంటారు. చూద్దాం. నీలాంటి కూతుర్ని కన్న తల్లి ఎంతటి అదృష్టవంతు రాలో. నా నొసట ఆమాత్రం రాతరాయలేదు. దేవుడు" అని ఆవేదనతో ఆవేశంతో మాట్లాడుకుంటూ పోతున్నది. ఈలోగా భోజనాల ప్లేట్లు వచ్చాయి. ఇద్దరూ ఏదో తిన్నామనిపించారు. పూర్ణిమ అతనికి డబ్బిచ్చింది. తన జీవితం, తాను పడ్డ కష్టాలు, సమాజం తీరు, మగవాళ్ళ ఆలోచనలు, చేష్టలు, తన అనుభవసారాన్ని కుమ్మరించింది సత్యభామ. తరువాత ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుతున్నది. రాత్రంతా ఏదో మగత నిద్ర. పీడకలలు. 5 గంటలకు లేచి కూర్చుంది పూర్ణిమ. రైలు 6 గంటల సమయంలో భాజాపురం స్టేషను చేరింది. సామాన్లు తీసుకొని ఫ్లాట్‌ఫారం మీద నిలబడ్డారు ఇద్దరు. 5 నిమిషాల్లో రైలు ముందుకు సాగిపోయింది. దిగిన కొద్దిమంది ప్రయాణీకులు ఎవరిదారిన వాళ్లు వెళ్ళిపోయారు. కూలీ ఒక అతను వచ్చి సామాన్లు మోస్తానని చెప్పాడు. మరొక 5 నిమిషాలు గడిచాయి. ఎవరూ తనకొరకు ఆ బోగివద్దకు రాలేదు.

పూర్ణిమకు దిగులుతో కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయి అని ఊహించింది సత్యభామ. పూర్ణిమ "మీకు అభ్యంతరం లేకపోతే మీతో నేనూ వస్తాను. ఎలాగున్నా ఫరవాలేదు. నేను సర్దుకుంటాను. ఒకటి రెండు రోజుల్లో ఏదైనా హాస్టల్ లాంటిది వెతుక్కొని వెళ్లిపోతాను. ఈ సహాయం చేయగలిగితే మీకు ఎంతో ఋణపడి ఉంటాను" అని అడిగింది. సత్యభామ అలాగే అన్నట్లు తలూపి, కూలిని పిలిచి పూర్ణిమ సామాన్లు స్టేషన్ వెలుపలకు తీసుకొచ్చి, ఒక ఆటోను మాట్లాడుకొని సత్యభామ ఇంటికి చేరారు.

ఇల్లు చాలాకాలంనాటిది. ఇంట్లోకి చేరడానికి వెడల్పాటి మెట్లు అయిదారు ఉన్నాయి. సింహద్వారం దాటిన తర్వాత ఒక వరండా, పెద్ద హాలు, పాతరోజుల్లో కొయ్యదూలాలతో కట్టిన ఇల్లు. చుట్టూ నాలుగు రూములు ఉన్నాయి. పూర్ణిమకు ఒక రూము చూపించింది సత్యభామ. పూర్ణిమ స్నానంచేసి డ్రస్ మార్చుకొని హాల్లోకి వచ్చింది.

హాలుకు ఒకవైపు ఉన్న చిన్నరూములో సత్యభామ భర్త పక్షవాతంతో మంచాన ఉన్నాడు. వయస్సుతో కూడా వచ్చే వ్యాధులన్ని ఆయనకున్నాయి. ఎవరిదైనా సపోర్టు లేకుండా నడవలేడు. హాలు తర్వాత వంటగది, దానికానుకొని డైనింగ్‌టేబుల్ ఉన్నాయి. ఇంట్లో పనులు చేయడానికి పనిపిల్ల ఉంది. టిఫెన్ తయారైంది. సత్యభామ పూర్ణిమకు దగ్గరగా కూర్చుని టిఫిన్ తినిపించింది. ఎవరైనా కొత్తవాళ్ళు ఇంటికి వస్తే వరండాల్లో మాట్లాడి పంపించడం పూర్ణిమను తన రూమ్‌లోకి పొమ్మని చెప్పడం జరుగుతుంది. పూర్ణిమ టిఫిన్ తిన్నతర్వాత కొంచెంసేపు హాల్లో కూర్చుని తన రూములోకి పోయి మంచంమీద తలవాల్చింది. రాత్రంతా అలసిపోయిన మనసు, సరైన నిద్రలోకపోవడం వలన తనకు తెలికుండా నిద్రపట్టింది. రెండు గంటలు నిద్రపోయి మెలకువ వచ్చిన తర్వాత వరాండాలోకి వచ్చి కూర్చుంది.

సత్యభామ "భాజాపురం చాలా పెద్ద సిటీ. అందువల్ల పెద్దరోడ్లు, ఆఫీసులు వాటికొరకు చుట్టూ గ్రామాల్లో నుండి వచ్చే జనంతో సందడిగా ఉంటుంది". పూర్ణిమ బయటకు వెళ్ళి ఫోన్ బూత్ నుండి భూషణానికి, నవీన్‌కు ఫోన్ చేయాలని అనిపించింది. కాని పరిస్థితి తనకు అర్థమౌతున్నది. అందుకని మరలా మనసు మార్చుకొని తన ప్రయత్నం తాను చేయాలనుకుంది. పూర్ణిమ వరండాలో నుండి రూములోకి వెళ్ళి తన బ్యాగ్‌లోనుండి ఐదువేల రూపాయలు తీసుకొని వచ్చి సత్యభామ చేతులో పెట్టింది. ఆమె తీసుకోవడానికి ఇష్టపడలేదు. "ఎందుకమ్మా ఇంతడబ్బు. నీవు నెలరోజులున్నా అంత ఖర్చుకాదు అని అన్నది. పూర్ణిమ "మీరుంచుకోండి. మీ ఇబ్బందులు ఎన్నో. పైగా నాకు మీరు చేసిన సహాయానికి విలువకట్టేందుకు వీలుకాదు" అని అంటుండ గానే ఎవరో లోపలికి వచ్చారు. బాగా చదువుకొన్న వ్యక్తి ఉద్యోగస్తుడు అని తెలుస్తున్నది. "ఏమి ఈ మధ్య కనబడడం లేదు". పూర్ణిమ వైపు తిరిగి రూములోకి పొమ్మని కంటితో సైగ చేసింది సత్యభామ.

పూర్ణిమకు అర్థమైనా కూడా తనకు పోవాలని పించలేదు. మనిషి విరక్తి రకరకాల ఆలోచనలను కల్పిస్తుంది. సత్యభామ సరే కూర్చోనీలే అనుకొని "ఎక్కడ, నీ ప్రియురాలు కూడా రావడం లేదు. ఏమైనా ఇద్దరూ తెగతెంపులు చేసుకున్నారా". రమేష్ ఆమెతో "అలాంటిదేమి లేదు, వాళ్ళ కుటుంబానికి ఎక్కడికో ట్రాన్స్‌ఫర్ అయ్యింది. నాకు కూడా కనబడ్డం లేదు. ఎవరు ఈ మేడం" అని అన్నాడు. సత్యభామ "ఆమె మా చుట్టాలమ్మాయి. నీకు ఆ విషయాలు అవసరంలేదులే. ఇంకేదైనా ఉంటే మాట్లాడు" అని అన్నది.

ఈ ప్రపంచంలో, ధనం, ధాన్యం, సంతానం, అధికారం, విజయం, జ్ఞానం, వాక్కులే కాక, సౌందర్యంకూడా సంపదే. కాని మిగతా సంపదలను వినియోగించు కున్నట్లు విచ్చలవిడిగా సౌందర్య సంపదను వాడలేము. దానికి నీతి, ధర్మం, సమాజం అడ్డు వస్తుంది. ఎందుకో తనకు తనమీద జాలి, అసహ్యం, కోపం లాంటివన్నీ, మూకుమ్మడిగా దాడిచేస్తున్నాయి. తాను ఎందుకు బతుకుతున్నట్టు? అట్లాగని చనిపోవాలని లేదు. ఒకవేళ పోతే వీరనారిలా తనతో కూడా చాలామందిని తీసుకొని పోవాలని ఉంది. తనకేమీ అక్కర్లేదు. తాను ఈ ప్రపంచంలో వీలైనంత ఎక్కువ మందిని నిస్వార్థంగా సంతోషపెడితే చాలు. తనవాళ్ళు అనుకున్న వ్యక్తులు తనని మోసంచేశారు. తనని భరించలేక పోయారు. చివరకు తనమీద తనకు కసి  కోపం అసహ్యం మిగిలింది. తనను తాను హింసించుకుంటే తప్ప శాంతి ఉండదు. తానిప్పుడు స్టాయిక్ ఫిలాసఫీని అనుసరించాలని ఉంది. అంటే తనను తాను వీలైనంత అట్టడుగు స్థితిలో హింసించుకోవాలి. ఒకవైపు సుఖం కోసం వెంపర్లాడే వాళ్ళను చూస్తే అసహ్యం వేస్తున్నది. బాధపడాలి, బాధ అనే మత్తులో మునిగిపోవాలి. రకరకాలుగా మనసు ఆలోచిస్తున్నది.

బహుశా, త్రిశంకు స్వర్గం అంటే ఇలానే ఉంటుందేమో! సత్యభామ కుర్చీ పూర్ణిమకు దగ్గరగా లాక్కుని పక్కనే కూర్చుంది. అప్పుడే వెళ్ళిన వ్యక్తిని గురించి అటువంటి వాళ్ళను గురించి ఏదేదో చెప్పసాగింది. తాను ఎలా ఈ రొంపిలోకి వచ్చింది. వాళ్ళ ఆయన పాత్ర వైనం చెప్పసాగింది. అంటే తనను, ఇతరులకు సుఖాన్నిచ్చే మరబొమ్మలాగా ఎలా తయారుచేశాడో చెప్పసాగింది. ఒక్కొక్కరి జీవితం ఒక్కోరకంగా సాగాలని దేవుడు రాసిపెట్టి ఉంటాడు. “నాకు బిడ్డల్లేరు. ఆయన ఎగిరిపడినంత కాలం ఎగిరిపడ్డాడు. అడ్డు ఆపులేదు. అన్ని అవలక్షణాల వల్ల ఇప్పుడు కాలు చెయ్యి పడిపోయి మంచంలో పడివున్నాడు. అప్పుడు చేసిన పాపానికి ఇప్పుడు దుఃఖిస్తే ఏమి ఉపయోగం ఉంటుంది. మీరు చూచారుగా. ఇక నా గతి ఎట్లా ఉంటుందో. ఆయన ఎప్పుడు పోతాడా అని కాచుక్కూర్చున్నాను. బ్రతుకులు ఎలాఉంటాయో చూడండి” అంటుంటే పనిపిల్ల పిలిచింది. సత్యభామ వంట్లింట్లోకి వెళ్ళింది.

పూర్ణిమకు కసి పెరిగిపోతున్నది. ఎంతగా బాధపడుతున్నదంటే, కత్తి ఇచ్చి, మూలుగుతూ పడిఉన్న ఆ ఇంటాయనను చంపి పుణ్యం కట్టుకోమంటే, సరేనని అనాలనిపిస్తున్నది. ఏదైనా ఒక ప్రళయం వచ్చి భూమిలోకి  కృంగిపోతే ఏర్పడే

ప్రశాంతను కోరుకొంటున్నది. వీళ్ళందర్నీ చూస్తుంటే ఎంతమంది ఎన్నిరకాలుగా బాధపడుతున్నారో అర్థమవుతుంది. జీవితాలు కూడా పండ్లు, కూరగాయలు, శవాలు లాగా కుళ్ళి కంపుకొడుతున్నాయి. కుళ్ళిపోతున్న వాటిని పారేసేందుకు ఆలస్యమెందుకు ఎంత తొందరగా కుళ్ళిపోతే, కనీసం మిగతావాళ్ళు కొంతకు కొంత బాగుంటారు. అప్పుడు ఎవరు ఎవరికీ భారం కారు. ఇలా సాగిపోతున్నది పూర్ణిమ ఆలోచనలు. మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది. సత్యభామతో కూర్చుని పూర్ణిమ కూడా భోజనం చేసింది. భోజనం తర్వాత మరలా కొంచెంసేపు నిద్ర. సత్యభామకు నిద్రపోయే పరిస్థితిలేదు. ఎవరో ఒకరు డిస్టర్బ్ చేస్తున్నారు.

ప్రక్కరోజు ఉదయాన్నే 5 గంటలకు యథావిధిగా మెలకువ వచ్చింది. లేచి ముఖం కడుకుంది. పనిపిల్ల పెద్దావిడ ఇంకా నిద్రపోతున్నారు. పూర్ణిమ బాత్‌రూం నుండి బకెట్‌తో నీళ్ళు తెచ్చి మెయిన్‌గేటు మెట్లమీద, కింద చీపురతో చిమ్మి నీళ్లు చల్లి ముగ్గుపెట్టింది. ఈలోగా సత్యభామ పనిపిల్ల లేచారు. బయట చక్కగా కళ్ళాపు చల్లి ముగ్గుపెట్టిన దానిని చూచి పనిపిల్లవైపు తిరిగి "చూడు పెద్ద చదువులు చదివిన అమ్మాయి, ఎలా ముగ్గుపెట్టిందో?" అని అన్నది సత్యభామ.

ఆరోజు పదిగంటల సమయంలో ఒకాయన లోపలికి వచ్చాడు. వ్యక్తి బాగా తాగిఉన్నా, స్పృహలో ఉండి ఎలాంటి తొట్రుపాటు లేకుండా ఉన్నాడు. వచ్చి కుర్చీలో కూర్చుని "ఎవరీ రంభ, ఎక్కడనుంచి పట్టుకొచ్చావు, నాకిచ్చేయ్ నేను తీసుకపోతాను. నా ఆస్తిలో సగం రాసిస్తాను. ఇంత అందాల రాశిని ఈ మధ్యకాలంలో చూడలేదు". సత్యభామ కలుగచేసుకొని "రాజా నోర్మూసుకో. ఆమె ఆ రకం కాదు. చాలా తప్పు. ఎవర్ని బడితే వాళ్ళను అలా మాట్లాడకూడదు. నీవు మళ్ళీ రా. ఇప్పుడు నాకు వేరే పని ఉంది" అన్నది. నేను వేరేవాళ్ళను రమ్మన్నాను" అన్నాడు. "ఇప్పుడు వీలుకాదు నీవు వెళ్లిరా" అంటూ చేయి పట్టుకొని వాకిలిదాకా లాక్కొనిపోయి మెట్ల మీద వదిలేసింది.

సాయంత్రం 7 గంటలైంది. ఒక కుర్రాడు ఇంకొక అబ్బాయిని వెంటబెట్టుకొని వచ్చాడు. వచ్చిందే తడవుగా "అక్కా! వీడు చిన్నప్పటినుండి నా క్లాసుమేట్ అక్కా. వీళ్ళమ్మ కష్టపడి పాచిపనిచేసి చదివించింది. ఎం.ఏ. ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. వీడిని చూచి చాలారోజులయ్యింది. నాలుగు రోడ్ల సెంటర్ దగ్గర కనపడ్డాడు. నన్ను చూచి ఒకటే ఏడుపు. అన్నం కూడా తినలేదు. ఎందుకంటే వాళ్ళమ్మను నెలరోజుల

క్రిందట హాస్పిటల్లో చేర్చారు. వీడివద్ద మందులు కొనేదానికి కూడా డబ్బులు లేవు. అక్కా వీడొక్కడే కొడుకు. నేను నిన్ను చూసుకుంటాలే అని చెప్పాను అక్కా. ఎం.ఏ. చదివాడు అక్కా. యూనివర్శిటిలో మంచిపేరుంది. నేనొకరోజు వీడితో ఒక సంవత్సరం కిందట వీళ్ళ హాస్టల్లో పడుకొన్నాము. ఇప్పుడు వీళ్ళమ్మ చనిపోయింది. వీడికి దిక్కెవరు అక్కా!" అని తాగిన మైకంలో చెప్పిందే చెప్తుతున్నాడు. మరలా "వీడికి కాఫీ టిఫెన్లు ఇప్పించి తీసుకొని వచ్చా. వీడి దుఃఖాన్ని చూస్తే నాకు బాధ వేస్తున్నది. వీడి పేరు శశిధర్. తనకు ఎవరూ లేరు. అమ్మకు మందు ఇప్పించేందుకు డబ్బుల్లేక అమ్మను చంపేసుకున్నాడు. వీడికి బుద్ధుంటే నాదగ్గరికి రావచ్చు కదా? వీడు నాలాగా కాదు. వీడు చాలా మంచివాడు. మొహమాటస్థుడు అక్కా. ఇటుపోతూ నిన్ను చూచిపోదామని వచ్చా. చాలారోజులైంది నిన్ను చూసి. "ఒరే శశి అన్నం తింటావట్రా" అని అడిగాడు. అంతకుముందే టిఫెన్ పెట్టించిన సంగతి మర్చిపోయాడు. రఘు మరలా మొదలు పెట్టాడు. "వీడి నాయన పదేండ్ల వయసులోనే చనిపోయాడు. వీడికి అమ్మే అన్నీ చూసుకుంటూ వచ్చింది. చదువంతా స్కాలర్‌షిప్‌లతోనే గడిపేశాడు. మంచి తెలివి గలవాడు అంటూ రారా పోదాం!" అని పూర్ణిమ వైపు తిరిగి "ఈ అక్క ఎవరక్కా!" అని అన్నాడు. సత్యభామ జవాబు చెప్పలేదు.

కుర్చీలోంచి లేచి శశి చేయిపట్టుకొని వస్తానని అంటూ వెళ్ళి పోయాడు. ఇంతసేపు శశి తలకూడా పైకెత్తలేదు. మధ్య మధ్యలో కళ్ళు తుడుచుకుంటూ కుర్చీలో కూర్చొని ఉన్నాడు. చదువుకున్నాడు, చూడ్డానికి బాగానే ఉన్నాడు, ఆస్తిపాస్తులు లేకపోయినందున అతను ఎందుకు కొరగానివాడయ్యాడు. తాను అన్నీ ఉన్నా ఎందుకు పనికిరాకుండా పోయాను అని అనుకుంది పూర్ణిమ.

పూర్ణిమ దాదాపు సంవత్సరంగా కన్నీళ్ళతో దాహం తీర్చుకుంటున్నది. బాధలను మింగి, ఆకలిని చంపుకొంటున్నది. సత్యభామ చెప్పసాగింది. "వీడు రఘు. మంచివాడు. కాదంటే డబ్బులు బాగా ఉన్నవాడు. వాళ్ళ నాయన కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. వీడి అన్న అమెరికాలో ఉన్నాడు. వీడు కూడా కాలేజీలో చదివాడు. స్నేహితులంటే మహా ఇష్టం. ఆ రెండో అబ్బాయిని నేను ఎన్నడూ చూడలేదు. పాపం తల్లిని పోగొట్టు కొన్నాడు. జీవితంలో ఉన్న ఒకే ఒక వ్యక్తిని పోగొట్టుకుంటే ఎంతకష్టంగా ఉంటుందో చూడు. అది అనుభవించేవాళ్ళకే తెలుస్తుంది" అన్నది సత్యభామ.

ఆమె చెప్పే ప్రతిమాట తనకు కూడా నూటికినూరు శాతం వర్తిస్తుంది అన్న విషయం, సత్యభామకు పూర్తిగా తెలియదు. తనకు అమ్మా నాన్న, పెద్దమ్మ, మావయ్య, ఇంకా తెలిసినవాళ్ళు, స్నేహితురాండ్రు ఎంతోమంది ఉండేవాళ్ళు. ఇప్పుడు తనకెవ్వరూ లేరు. ఎవర్నీ తను కలుసుకునేదానికి కూడా మనసు ఒప్పుకోదు. వీళ్లందరూ కాలగర్భంలో కలిసిపోయారు. తోడున్న వాళ్ళందరూ వెళ్లిపోతే, తోడుకోసం వెతుక్కునే స్థితికి చేరాను అని అనుకొంటున్నది. పూర్ణిమకు రఘుతో వచ్చిన శశికి కొంచెం ధనసహాయం చేస్తే తన పనులను చేసిపెడతాడేమో అని అనిపించింది. అందువలన ఇద్దరికీ ఉపయోగ ముంటుంది. ఈ ఆలోచనలతో సత్యభామను చూస్తూ "ఈ రఘు అనే అబ్బాయి మీకు బాగా తెలుసా! మరలా వచ్చే అవకాశం ఉందా" అని అడిగింది. అందుకు సత్యభామ "ఏం కావాలి నీకు. అబ్బాయి మనకు తెలిసిన అబ్బాయే. పైగా నాకు దూరపు చుట్టం అయినా ఆ సంగతి ఎప్పుడూ ఎత్తను. నేను వాళ్ళింటికిపోయి కూడా చాలా ఏళ్ళయ్యింది. ఇంతకూ ఆ అబ్బాయి నీకు ఎలా ఉపయోగముంటుందని అనుకుంటున్నావు" అని అన్నది.

అందుకు పూర్ణిమ "ఆ అబ్బాయి కాదు, తనతో వచ్చిన అబ్బాయి యూనివర్శిటీలో చదివాడు కాబట్టి నేను ఎం.ఏ. చదవడానికి సహాయం చేస్తాడేమో" అని అనుకొంటున్నాను. పైగా నాకు ఏదో ఒక ఉమెన్స్ హాస్టల్‌ను చూచిపెట్టి చిన్న చిన్న విషయాలకు తోడుగా ఉంటాడని ఆలోచిస్తున్నాను. నేను ఎవరో ఒకరిమీద ఆధారపడాల్సిన అవసరం ఉంది కదా" అని అన్నది. దానికి సత్యభామ "అదెంత భాగ్యము, ఏదోరకంగా నేను పిలిపించే ఏర్పాటు చేస్తానులే. అది పెద్దవిషయం కాదు. అయినా వీడు చెడ్డవాడు కాదు. కాదంటే ఎప్పుడైనా స్నేహితులతో వచ్చి కొంచెం సేపు గడిపిపోతుంటాడు. అప్పుడప్పుడు నాకు కూడా డబ్బులు అవసరమైతే ఇస్తుంటాడు" అని అన్నది.

పూర్ణిమకు నవీన్ ఆ విధంగా ఎందుకు చేశాడో అర్థంకాలేదు. ఏ కారణం వల్లనైనా తనకు ఇష్టంలేకపోతే నేరుగా ఒకమాట చెప్పేస్తే సరిపోయుండేది కదా! అని అనిపించింది. అయితే పూర్ణిమ కూడా గతంలో మాటల తాలూకు వాసనలను బట్టి నవీన్ అభిలాష్ అంటే భయపడి ఉంటాడు అని అనుకొన్నది. నవీన్ ధైర్యసాహసాలు అర్థంచేసుకోకుండా తొందరపడ్డం తాను చేసిన తప్పే. తనని చూసి ఆనందిస్తున్నాడని దాన్ని ప్రేమ అనుకొని అందుకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతాడని అనుకోవడం తానుచేసిన పొరపాటు. ఆ పరిస్థితిల్లో తనకున్న దారులన్నీ

మూసుకు పోయినప్పుడు ఉన్నదొకే మార్గం నవీన్ అయినప్పుడు అది శాశ్వతం అనుకోవడం మనస్సు చేసే వంచెన. ఆనాడు అంతకు మించి వేరే గత్యంతరం లేదు అని ఆలోచిస్తూ తలపట్టుకొని కూర్చుని ఉన్నది పూర్ణిమ.

రఘు తలుపుతోసుకొని లోపలికి వచ్చాడు. రాగానే పూర్ణిమను చూచి రెండడుగులు జంకుతో వెనక్కు వేసి, "అక్కా! అక్కా!" అని రెండు సార్లు కొంచెం గట్టిగా పిల్చాడు. జవాబులేకపోయేటప్పటికి జంకుతూనే పూర్ణిమతో "అక్క ఇంట్లో లేదా?" అని అడిగాడు.

పూర్ణిమ ""బాత్‌రూంలో ఉన్నదేమో నేను గమనించలేదు" అని అన్నది పూర్ణిమ. ఈలోగా సత్యభామ లోపలి నుండి "రారా రఘు! నిన్ను గురించి ఆలోచిస్తున్నాను. నీతో కొంచెం పనిపడ్డది. ఈలోగా నీవే వచ్చావు" అన్నది. వాడు జవాబు చెప్పకుండా "ఈమె ఎవరక్కా ఇంతకుముందు ఎన్నడూ చూడలేదే" అన్నాడు. "రాత్రి ఇక్కడికి వచ్చింది గుర్తుందా?" అని అన్నది సత్యభామ. దానికి రఘు గుర్తులేకేం, "ఏమైనా పొరపాటు చేశానేమోనని క్షమాపణ చెప్పిపోదామని వచ్చాను. లేకపోతే మరలా లోపలికి అడుగుపెట్టనీయవని వచ్చాను. అయినా రాత్రి చూచిన గుర్తులేదు. సరే నాతో పనేందో చెప్పు."

సత్యభామ "రాత్రి నీతో వచ్చిన అబ్బాయి"

"శశిధర్" అన్నాడు రఘు.

"శశిధర్‌తో ఈ అమ్మాయికి పని ఉంది. యూనివర్శిటీలో ఏదో చదువుకు సంబంధించిన విషయాలు. అందుచేత ఆ అబ్బాయిని తీసుకొని వస్తే ఆ అమ్మాయి మాట్లాడుకుంటుంది".

"అదెంత పని రేపే తీసుకొని వస్తాను. మీరు ఏమి చదువుకొన్నారు?" అని పూర్ణిమను అడిగాడు రఘు.

"నీకెందుకురా ఆ విషయాలు వాళ్ళు మాట్లాడుకుంటారు" అన్నది సత్యభామ. "అట్లాగేలే" అంటూ మెట్లు దిగిపోయాడు. పూర్ణిమ ఆలోచనల్లో పడ్డది. తాను ఏదైనా ఉమెన్స్ హాస్టల్ చూసుకొని చేరిపోతే మిగతా వ్యవహారాలు నిదానంగా చూసుకోవచ్చు. లేకపోతే ఈ వాతావరణంలో చాలాకాలం ఇమడడం కష్టం. జీవితంలో ఇలాంటివి ఉన్నాయని ఎన్నో విన్నాం. ఇదొక చీకటి కూపం. నరక కూపం అనడం ఇష్టంలేదు. ఎందుకని అంటే నవీన్, ఆయన మిత్రుడు చేసిన పనికి తన గతి ఎలా ఉండేదో

ఊహించింది. నాలాంటి వారికి ఈ ఇల్లే స్వర్గధామం అయ్యింది. నవీన్ స్నేహితుడు తనని కలసి ఉంటే ఏరోజైనా మరలా నవీన్ జాడ తెలుస్తుందని, వాళ్ళ స్నేహితుడిని కూడా తననుండి తప్పించాడనిపిస్తుంది.

మరుసటిరోజు టంచెన్‌గా రఘు శశి ఇద్దరూ వచ్చారు.

“అక్కా నీ ఆజ్ఞను శిరసావహించాను చూడు” అన్నాడు.

“అందుకే కదా నీకు పని అప్పచెప్పింది. రండి కూర్చొని మాట్లాడుకోండి” అన్నది సత్యభామ పూర్ణిమను చూచి.

పద్ధతిగా రెండు చేతులెత్తి మర్యాదపూర్వకంగా నమస్కారం చెప్పాడు శశి. అతని గొంతులోని మార్ధవం, శరీర భంగిమలు చాలా పద్ధతిగా ఉన్నాయి. పూర్ణిమకు చాలారోజుల తర్వాత ఒక సౌమ్యుడైన వ్యక్తిని చూచాననిపించింది. తనని కూర్చోమన్నా తటపటాయించాడు. రెండుసార్లు కూర్చోమని బలవంతపెడితే ఫరవాలేదులే అని, అక్కడ కుర్చీ ఒకటి ఖాళీగా ఉన్నా, దగ్గర్లో ఉన్న ఒక స్టూల్ లాక్కొని కూర్చొన్నాడు. పూర్ణిమ వైపు తిరిగి “చెప్పండి. మీకు నేను చేయగలిగిన సహాయం, కాదు కాదు, పని ఏదైనా ఉంటే తప్పక చేస్తాను” అని అంటూ వుంటే సత్యభామ రఘు ఇద్దరూ లోపలికి వెళ్ళారు. పనిమనిషికి టీ పెట్టమని పురమాయించింది సత్యభామ.

పూర్ణిమ తన చదువు విషయం మొదలుపెట్టి, తను బి.ఏ. పాసుకావడం, ఎం.ఏ. ప్రైవేటుగా కట్టడం, కొన్ని కారణాల వలన వూరి వదలి రావడం, తనకు ఎం.ఏ. పూర్తిచేయాలని ఉందని, తోటే ఐఏఎస్ కు కూడా కోచింగ్ తీసుకోవాలని ఉందని, దానికి తన సహాయ సహకారాలు కావాలని చెప్పింది. శశిధర్ కూడా వాళ్ళ బీదరికం, తల్లి చేసిన త్యాగం, తాను ఎం.ఏ. పొలికటల్ సైన్స్ యూనివర్శిటీ సెకండ్ ర్యాంకుతో పాసవ్వడం, ఏదైనా గ్రూప్-1, ఐఏఎస్ కోచింగ్ తీసుకోవాలని కలలు కనడం, ఈలోగా తల్లి చనిపోవడం, తాను ఏకాకై పోవడం వివరించాడు. కలలు కలలుగానే మిగిలిపోవడం వలన అర్జంటుగా చిన్న ప్రైవేటు ఉద్యోగమన్నా వెతుక్కోవాలని చెప్పాడు.

అంతేగాక తనకు యూనివర్శిటీలో పి.హెచ్‌డి చేయడానికి అవకాశం వస్తుంది. అయితే యూనివర్శిటీలో కులం, మతం, రాజకీయం, ధనిక పేద వర్గ పోరాటాలు, తనకు అంతగా నచ్చవని చెప్పాడు. వాటిలో ఇమిడిపోయి సర్దుబాటు చేసుకుంటే

ఇబ్బంది ఉండదు. అంతేగాని వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచించేవాళ్ళకు అది చచ్చి బతకడం లాంటిది. అలా బతకడం ఇష్టంలేక ఏమి చేయాలో తెలియక ఆలోచిస్తున్నానని, "అసలు ఇలాంటి బ్రతుకులు బతికేదానికంటే శాశ్వతంగా కళ్ళుమూసుకుంటే, ఒక దీర్ఘ నిద్ర పోవచ్చునిపిస్తుందని" చెప్పాడు.

తనతల్లి, తండ్రిలేనిలోటు తీర్చి తనకోసం అంత కష్టపడ్డందుకు ఎలాగైనా తాను వృద్ధిలోకివచ్చి తన తల్లిరుణం తీర్చుకోవాలని, తాను ఏదో ఘనకార్యం సాధించాలని తద్వారా జీవితం ఆనందమయం చేసుకోవాలని ఎన్నో ఆలోచించాను. నిజానికి నాలాంటి దౌర్భాగ్యుడిని పుట్టించి వాళ్ళపని వాళ్ళు చూసుకొని వెళ్ళిపోయారు. ప్రస్తుతం నేను ఒంటరివాడిని. నాకు భయం బాధ దుఃఖం లేవు. ఎందుకనంటే ఎంత చిన్నకోరికైనా తీరుతుందన్న నమ్మకం లేదు. అయినా కూడా మనసులో ఎక్కడో ఏదో ఒకటి సాధించాలన్న తపన ఆశ, అలా గొప్పగా ఉన్న వాళ్ళను చూచినపుడు అసూయ ఉన్నది. అప్పుడప్పుడు ఏం బ్రతుకు బ్రతుకుతున్నామా అనిపిస్తుంది. శ్రీశ్రీ అన్నట్టు, "మనదీ ఒక బ్రతుకేనా... కుక్కలలా నక్కలలా పందుల లాంటి బ్రతుకు, నాకు పూర్తిగా రాదనుకోండి, బతుకుతున్నాను". పూర్ణిమ అందుకొని "ఉన్నాను అని అనవద్దు, ఉన్నాము" అని అంటే బాగుంటుంది. "ఎందుకంటే నేను కూడా అదే పడవలో ప్రయాణం చేస్తున్నాను. ఈ ప్రయాణం నన్ను ఎక్కడికి తీసుక పోతుందో నాకు అర్థంకావడం లేదు". పూర్ణిమకు శశితో మనసు విప్పి మాట్లాడాలని ఉంది. ఇంతలో సత్యభామ కొరకు ఎవరో వచ్చారు.

పూర్ణిమ "దగ్గరలో ఎక్కడైనా ఒక పార్కు లాంటిది ఉన్నదా? కూర్చొని తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అని అడిగింది. అందుకు శశి "దగ్గరలో పార్కు ఉందని నడచి పోవచ్చని చెప్పి సత్యభామతో ఒకమాట చెప్పి ఇద్దరూ బయటికి కదిలారు. పార్కులో ఒక చెట్టుకింద ఉన్న రాతిబండమీద ఇద్దరూ చెరోవైపు కూర్చొని మాట్లాడడం మొదలుపెట్టారు. పూర్ణిమ శశితో తనకు అర్జంటుగా ఒక ఉమెన్స్ హాస్టల్‌లో వసతి కావాలని, తనను విచారించమని అడిగింది. కుదిరితే పక్కరోజే తన మకాం మార్చివేయాలన్న తన అభిమతాన్ని వెలిబుచ్చింది.

వెంటనే శశి అందుకొని, "దానికి రేపటి దాకా కాచుకోవడం ఎందుకు? నడిబజార్లో ఒకచోట నాకు తెలిసిన పెద్ద హాస్టల్ ఒకటి కొద్దిదూరంలో ఉంది. ప్రయత్నించి చూద్దాం. అక్కడ చిక్కితే బజారుకు దగ్గిర, నాకు దగ్గిర అన్నివిధాలా

బాగుంటుంది. రండి! ఇప్పుడే ఆటోలో వెళ్ళి చూద్దాం" అని అన్నాడు శశి. శుభస్య శీఘ్రం అని ఇద్దరూ పార్కునుండి బయటికొచ్చి ఆటోలో హాస్టల్ దగ్గర చేరారు.

బయటనుండి చూస్తే హాస్టల్ చాలాబాగుంది. లోపలికి వెళ్ళారు. లోపల ఒక మేడమ్ కుర్చీలో కూర్చుని టేబుల్ మీద ఏదో కాగితాలు తిరగేస్తున్నది. పూర్ణిమ ఆ మేడమ్‌కు నమస్కారం చెప్పి, తనను గురించి క్లుప్తంగా చెప్పి, తనకొక రూమ్ ప్రత్యేకంగా గాని లేదా ఎవరితోనైనా షేరింగ్‌గా కాని కావాలని అడిగింది. తాను ఎం.ఏ., ఐఏఎస్ రెండింటికి కోచింగ్‌కు వచ్చాను అని అందుచేత తను కొంతకాలం ఎక్కడైనా ఉండాలని చెప్పింది. ఆ తర్వాత వాళ్ళ అమ్మను తీసుకొని వచ్చి ఎక్కడైనా ఒక ఇల్లు తీసుకొని కాపురం పెట్టాలని ఉందని చెప్పింది. పూర్ణిమను చూచిన ఆ మేడమ్ విస్తుపోయి, తనకు రూము ఇవ్వలేను అని చెప్పలేని స్థితికి వచ్చి,

"ఎప్పుడు చేరుతారు" అని అడిగింది.

దానికి మంచిరోజు ఏదైనా తెలిస్తే చెప్పమని పూర్ణిమ ఆ మేడమ్‌ను అడిగింది.

"ఈరోజు బుధవారం రేపు గురువారం బాగానే ఉంది. మీ ఇష్టం వచ్చినప్పుడు చేరండి. మీతో కూడా మరొక ఆమె చిన్న ఉద్యోగం చేస్తున్నది. ఆమెతోకూడా మీరు కలిసి ఉండాల్సి వస్తుంది. మీకు ప్రత్యేకంగా రూము కావాలంటే ఒక పదిహేను రోజుల్లో ఖాళీ అయ్యే అవకాశాలున్నాయి" కాబట్టి తనకు రూము మారుస్తానని చెప్పడం జరిగింది. దాంతోకూడా రూము బాడుగ భోజన ఖర్చులు అక్కడున్న రూల్సు రెగ్యులేషన్స్ చెప్పింది.

అన్నిటికీ సరేనన్న పూర్ణిమ తన బ్యాగులోనుండి డబ్బులు తీసి అడ్వాన్స్ కట్టేసి రశీదు తీసుకొంది. తాను వీలైతే సాయంత్రం 5 గంటల లోపల వచ్చి చేరుతాను అని, లేకపోతే మరునాడు 10 గంటలకు వస్తానని చెప్పి నమస్కారం పెట్టి సెలవు తీసుకొంది. పూర్ణిమకు చాలా సంతోషం వేసింది. అనుకున్నపని ఒక గంటలోపల ఇంత సులువుగా జరుగుతుందని ఊహించలేక పోయింది. మరలా ఆటో తీసుకొని ఇద్దరూ సత్యభామ ఇంటికి చేరారు. పూర్ణిమ ఇంటికి చేరేసరికి సత్యభామ కుర్చీలో కూర్చొని ఉంది.

పూర్ణిమ సత్యభామను కౌగిలించుకొని, తనకు ఉమెన్స్ హాస్టల్లో రూము చిక్కిందని తనను గత 5 రోజుల్లో తన బిడ్డను చూసినట్టు చూసినందుకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదని ఆనందంతో చెప్పింది. దానికి సత్యభామ

కూడా మంచిపని చేశావని పూర్ణిమను అభినందించి తనకు ఎప్పుడు ఏమి కావాలన్నా తానున్నానని తనను బిడ్డగా చూచుకుంటానని హామీ ఇచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. పూర్ణిమకు ఎలాగైనా ఆరోజు సాయంత్రం రూముకు వెళ్ళిపోవాలని ఉంది. ఆమాటనే సత్యభామతో చెప్పి ఆమెను ఒప్పించింది.

భోజనాలయ్యాయి. శశికూడా అక్కడే భోంచేశాడు. 3.30 గంటల ప్రాంతంలో ఒక ఆటో తీసుకొని వచ్చాడు శశి. తన సూట్‌కేస్ సామాన్లు పెట్టుకొని సత్యభామ దగ్గర సెలవు తీసుకొని పనిపిల్ల చేతిలో ఒక ఐదువందల రూపాయలు పెట్టి ఆటో ఎక్కి హాస్టల్ దగ్గరికి చేరారు. మేడమ్ సామాన్లు రూములో పెట్టించింది. కొంచెం షాపింగ్ చేసివస్తానని ఆమెతో చెప్పి, శశితో బయటకు వచ్చింది. ఇద్దరూ ఒక హెూటల్‌కు వెళ్ళి కాఫీ ఆర్డర్ ఇచ్చి అనేక విషయాలు జరగాల్సినవి ముచ్చటించుకొన్నారు. పూర్ణిమ బ్యాగులో నుండి రెండువేల రూపాయలు శశిధర్ చేతిలో పెట్టి "ఏదైనా ఖర్చులుంటాయి ఉంచుకో" అని అన్నది. శశి ససేమిరా అంగీకరించలేదు. పూర్ణిమ శశి చేతిని బలవంతంగా తనచేతిలోకి తీసుకొని డబ్బు చేతిలో పెట్టింది. "నాలుగు రోజుల క్రిందట ఈ డబ్బు నాదగ్గర ఉంటే మా అమ్మను బతికించుకునే వాడిని కదా?" అని పెద్దగా ఏడుస్తున్న శశిని ఎలా ఓదార్చాలో తెలియలేదు.

సాయంత్రం హాస్టల్‌కు చేరేసరికి తన రూము పార్టనర్ మంజులను పరిచయం చేసుకుంది. ఇద్దరూ కొంచెం సేపు ముచ్చట్లాడుకొని 8 గంటలకు భోజనాలు పూర్తిచేసి మరలా కొంచెం సేపు మాట్లాడుకొని ఎవరి నిద్రను వాళ్ళు కావలించుకున్నారు. చాలారోజుల తర్వాత పూర్ణిమ హాయిగా నిద్రపోయింది. ఉదయం 7 గంటల దాకా మెలకువ రాలేదు.

నాలుగురోజులు గడిచాయి. ప్రతిరోజు 10 గంటలకు పూర్ణిమ హాస్టల్ నుండి పార్కు దగ్గరికి వస్తే శశికూడా అదే టైంకు అక్కడకు చేరడం, భవిష్యత్తు కార్యాచరణను గురించి రకరకాల ఆలోచనలు చేయడం ఆనవాయితీ అయ్యింది. ఖాళీసమయంలో శశిధర్ ఉద్యోగాలకు, మిగతా ఆలోచనలను ఆచరణలో పెట్టేదానికి నలుగుర్ని కలవడం లాంటి పనులు చేయసాగాడు. పూర్ణిమకు మనసు కొంచెం కుదుటపడ్డది. ప్రస్తుతం తాను ఏదైనా చేయగలనన్న ధైర్యం వచ్చింది.

శశిని గత పది రోజులుగా జాగ్రత్తగా పరిశీలిస్తుంటే అతనిలోని మంచితనం, త్యాగం జీవితానికి ఒక అర్థాన్ని కల్పించుకోవాలనే ఆశ ఆశయం, కనపడుతున్నాయి.

తాను ఉన్న పరిస్థితుల్లో ఎవరితో మెలిగినా తనను అలుసుగా తీసుకుంటారు తప్ప అర్థంచేసుకొని ఆదరించేవారు దొరకడం చాలా కష్టం. నెలరోజులుగా ప్రతిరోజు ఇద్దరూ కలుసుకొని ట్యూషన్లు చెప్పాలని, ఎక్కడైనా షాపుల్లో, ఆఫీసుల్లో ఉద్యోగం చేయాలనీ ఆలోచనలు ప్రయత్నాలు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు, ఏమాత్రం ముందుకు పోవడంలేదు. చివరకు ఏదైనా వ్యాపారం పెట్టాలని కూడా ఆలోచించారు. కాని దానికి పెట్టుబడి అనుభవం కావాలి. ఒకవేళ వ్యాపారంలో నష్టమొస్తే భరించే శక్తిగావాలి. శశితో చెప్పకపోయినా పూర్ణిమ తనవద్ద ఉన్న 2 లక్షల రూపాయలను తన రూము మేటు మంజల సహాయంతో బ్యాంకులో వేసుకున్నది. సంవత్సరం రోజులైనా తన బ్రతుకు తాను గడుపుకోగలదు. ఏదైనా అవసరమొస్తే తన ఊరి ఆసామి దగ్గర నుంచి డబ్బులు తెప్పించుకోవచ్చు. అయినా తాను ఎక్కడుండేది, ఏంచేస్తున్నది ప్రస్తుతం ఎవరికీ తెలియకూడదు.

ఏది ఏమైనా పూర్ణిమకు జీవితంపై ఒక నమ్మకం కుదురుతున్నది.గత బాధల నుంచి చీకటినుండి, ఒంటరితనంనుండి, బయటపడుతున్నట్టు, తెల్లవారుతున్నట్టు అనిపిస్తుంది. నమ్మకం ఒక పక్షి లాంటిది. దానికి సూర్యుడు ఉదయించే రెండు గంటల ముందే వెలుగు వస్తుందని అర్థమౌతుంది. అందుకని పక్షులు తెల్లవారుజామున 4 గంటల నుండి కిచకిచమని అరుస్తుంటాయి. తనకిప్పుడు, తనలాంటి మరొక అనాధ తోడైనాడు. కాబట్టి రెండు నెగటివ్‌లు ఒక పాజిటివ్ అవుతాయి అనే నమ్మకం ఏర్పడుతున్నది. శశిధర్ పరిస్థితి తెలుసుకాబట్టి పూర్ణిమ అతని ఖర్చులకు కావల్సిన పైకం సర్దుతూ అతని ఇబ్బందులను అర్థంచేసుకొన్నందుకు శశి తన మనసులోనే ఎంత కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడో ఎవరికీ తెలియదు. ఇద్దరి పరిచయాలు, పేరు వెనుక గారు లాంటి మర్యాదలను త్రోసిపుచ్చి కేవలం శశి పూర్ణిమ అని పిలుచుకునే స్థితికి ఎదిగాయి.

ఎన్నో ఆలోచనల తర్వాత శశి ఒక ఆలోచన చెప్పాడు. గతంలో అతని అమ్మ వాళ్ళఇళ్ళ దగ్గర టిఫిన్ సెంటర్ ఉంటే, దాంట్లో పనిచేస్తుండేది. తనతో కూడా ఇంకొక ఆమె కూడా ఉండేది. ఈమధ్య ఆమెను తన ఇంటిదగ్గర పోతుంటే చూచి మాట్లాడ్డం జరిగింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఎలా అయినా బ్రతిమలాడి ఆమెను తీసుకొనివచ్చి, తాను ఏ పనైనా చేయగలడు కాబట్టి తాను బయటపని చూస్తుంటే, పూర్ణిమ వచ్చిన వాళ్ళను పలుకరించి టేబుల్ దగ్గర కూర్చుని డబ్బులు తీసుకుంటుంటే,

తిన్నగా దాన్ని పెంచి పెద్ద హోటల్‌గా చేసే అవకాశం రావచ్చునని అన్నాడు. ముందు వాళ్ళమ్మ స్నేహితురాలైన మునెమ్మతో మాట్లాడితే ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చి ఆచరణలో పెట్టడానికి వీలవుతుంది. అక్కడక్కడ తిరిగి వారం రోజుల్లో ఏదైనా ఒక షెడ్‌లాంటిది బాడుగకు తీసుకొని మిగతా కార్యక్రమాలు ప్రారంభించవచ్చు. కాని దానిక్కూడా పెట్టుబడి కావాలి కాబట్టి ఎక్కడైనా మూసివేసిన టిఫిన్ సెంటర్ ఏదైనా దొరికితే పని సులభమవుతుంది.

చివరకు పూర్ణిమకు ఈ ఆలోచనను ఆచరణలో పెడితే బాగుంటుంది అనిపించింది. దానిమీద ఒక ఇరవై నుండి 40 వేల వరకు పెట్టుబడి పెట్టినంత మాత్రంతో తాను పెద్దగా ఇబ్బంది పడబోయేది ఏమీ ఉండదు. పెట్టుబడికి ఆలోచించాల్సిన పనిలేదని, తాను సర్దుతాను అని పూర్ణిమ శశిధర్‌తో చెప్పింది. ఇద్దరూ కలిసి మునెమ్మతో అన్ని విషయాలు తమ పరిస్థితులు చెప్పి ఆమె సహాయం కోరడంతో ఆమె తనకున్న అనుభవంతో అది మంచి ఆలోచన అని, నష్టంవచ్చే సమస్య లేదని, కొంచెం పెట్టుబడి ఉంటే నడిపించవచ్చని చెప్పింది. పైపెచ్చు అన్ని రకాలు కాకుండా ఒక్క దోశ, కాఫీ మాత్రమే పెడితే ఇబ్బంది ఉండదు. పైపెచ్చు దోశ విషయంలో చాలా ఏండ్లు వాళ్ళు రిసర్చ్‌చేసిన ఫార్ములా ఉన్నదని, దాంతో తయారయిన దోశతిన్న వ్యక్తి మరలా మరలా వెతుక్కుంటూ వస్తారని చెప్పింది.

గతంలో వాళ్ళ ఓనర్ ఎంత సంపాదించింది అన్నవిషయాలు ఏకరువుపెట్టింది. ఆమె అనుకోకుండా కాలమైనందున దాన్ని మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ కారణంగా తాను శశిఅమ్మ వేరే పనులు చేసుకోవడం మొదలుపెట్టారని చెప్పింది. పైగా ఒక సెంటర్లో షెడ్ ఖాళీగా ఉందని కూడా ఆమె సమాచారం ఇచ్చింది. అంతే శశి మునెమ్మ సహాయంతో షెడ్‌ను బాడుగకు తీసుకొని, శుభ్రంచేసి సున్నం కొట్టించి, నాలుగు కుర్చీలు రెండు బల్లలు వేసి దానికి టిఫెన్ సెంటర్ రూపం తెచ్చారు. అంతా కలిపి 25 వేల రూపాయల పెట్టుబడితో సెంటర్ రెడీ అయ్యింది. ఒక పనిపిల్లను పెట్టుకున్నారు. సెంటర్‌ను ప్రారంభించారు. మూడు రోజుల వరకు పెద్దగా వ్యాపారం జరక్కపోయినా పోను పోను బాగా పుంజుకుంది. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకే హోటల్ కార్యక్రమం. మిగతా అంతా ఖాళీ. గతంలో ఆగిపోయిన చదువుకు ఉపయోగించుకోవచ్చని ఆలోచించారు. అయినా సెంటర్ కొంచెం స్థిరపడితే ఆ తర్వాత మిగతా ఆలోచనలను ఆచరణలోకి తేవచ్చని తీర్మానం చేసుకున్నారు.

షెడ్ చాలా పెద్దదైనందున మధ్యలో ఒక కర్టెన్ వేసి అక్కడే శశిధర్ ఉండేందుకు వసతులు కల్పించుకున్నాడు. శశి ఒకరకంగా తనకు యూనివర్శిటిలో యూనియన్ లీడర్‌గా ఉన్న అనుభవాలతో, పైపెచ్చు చావు బతుకుల సమస్యను ఎదుర్కొనేందుకు తన శక్తియుక్తులను ఉపయోగించి, టిఫిన్ సెంటర్‌ను బాగా అభివృద్ధిలోకి తెచ్చే ప్రయత్నాలు చేసుకుంటున్నాడు. ఈలోగా ఒక సైకిల్ తీసుకొని అవసరం వచ్చినప్పుడు కస్టమర్ల ఇంటికి కూడా సప్లై చేయడం ప్రారంభమయ్యింది. మొత్తంమీద శశి రాత్రింబవళ్ళు చేస్తున్న శ్రమ వృధాకాలేదు. టిఫిన్ సెంటరు లాభాల బాటలో నడవడం ప్రారంభమయ్యింది. దాంతో ఇద్దరికీ జీవితం మీద చెప్పలేనంత నమ్మకం, తమ కాళ్ళమీద తాము నిలబడగలమనే ధైర్యం వచ్చింది. వచ్చిన ప్రతివారికి రుచి, పరిసరాల పరిశుభ్రత ఆనందాన్ని కలిగిస్తున్నది. పూర్ణిమ మధ్యాహ్నం 1 గంట దాకా ఉండి హాస్టలకు వెళ్ళి భోంచేసి, మరలా 3 గంటలకు రావడం, మరుసటి దినం కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకొనడం రాత్రి 8 గంటలకు తను రూముకు వెళ్ళిపోవడం జరుగుతున్నది. రెండు నెలలు అయ్యింది. రోజురోజుకు కస్టమర్ల సంఖ్య పెరుగుతూ ఉన్నందున ఇంకొక పనిమనిషిని కూడా నియమించుకొని అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పూర్ణిమ కూడా పొయ్యివద్ద దోసెలు పోసేందుకు వెనుకాడ్డం లేదు. తాము పెట్టిన పెట్టుబడి రెండునెలల్లో రెండింతలైంది. కొంత డబ్బు వెచ్చించి మంచి టేబుళ్ళు, కుర్చీలు, ఫ్యాన్లు లాంటి వసతులను కల్పించుకొన్నారు. ప్రజల కోరిక మీద సాయంత్రం పూట కూడా స్నాక్స్ బోండాలు బజ్జీలు వేయడం వేరేవాళ్ళకు అప్పజెప్పేశారు. పూర్ణిమకు కొంచెం వెసులుబాటు చిక్కినందున కొంత సమయాన్ని తన రూములో పుస్తకాలు చదువుకోవడానికి ఉపయోగించుకోవచ్చనే ధైర్యం వచ్చింది. ఈ విషయాలను సత్యభామకు పూర్ణిమ చేరవేయడంతో తాను అప్పుడప్పుడు వచ్చిపోతున్నది. వచ్చిన ప్రతిసారి ఆమెను ఊరకే పంపకుండా ఖర్చులకు ఏదైనా ఇచ్చి పంపుతుండేది. ఈ హొటల్ వ్యాపారం నిలదొక్కుకున్న తర్వాత హొటల్ నిర్వహణ శశికి అప్పజెప్పి తాను, తన లక్ష్యానికి పునాదులు వేయాలని ఆలోచన చేస్తున్నది పూర్ణిమ.

* * * * *

# 5. పరుగు పందెం

రోజులు గడిచేకొద్దీ ఆలోచనలూ స్థిరపడుతున్నాయి. పూర్ణిమ శశిధర్ల జీవితాలు, సమాజంతో పరుగు పందెం ఆరంభించాయి. ధైర్యం పుంజుకొంటున్నది. చేతినిండా డబ్బులున్నాయి. డ్రాఫ్టలను ఐదారు బ్యాంకుల్లో అకౌంట్లలో వేశారు. అనేక ఆలోచనలు కొత్త కొత్త పరిచయాలు కలుగుతున్నాయి. ఏదైనా ఒక వ్యాపారం చేయాలి. కాని మరలా ఏదైనా రివర్స్ జరిగితే, ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేట్టు ఆలోచనలు చేస్తున్నారు. కాని ఆలోచనలన్నింటికి మంగళాశాసనం పలికేట్టు రావుగారు అన్ని వసతులు ఏర్పాటుచేశారు. కాదంటే దానికి కృతజ్ఞత తెలుపుకోవడానికి ఈ జన్మకు సాధ్యంకాదు. గతంలో చదువు, ఉద్యోగం, ఆలోచన వలన ఒకవ్యక్తిగా రాణించి ఉండవచ్చు. కాని ఇప్పటిలా ఒక వ్యవస్థను నడిపే అర్హతను పొందడం వీలై ఉండేది కాదు.

హోటల్ పని తెలిసిన ఒక ఆమెను పనికి కుదుర్చుకున్నారు. చిల్లరపనులకు కూడా ఒక వ్యక్తిని ఏర్పాటుచేసుకున్నారు. హోటల్‌ను గతంలో కంటే చక్కగా అలంకరించి మంచి క్వాలిటీతో కేవలం టిఫెన్ సెంటర్ కాక, మధ్యాహ్నం భోజనం కూడా ప్రారంభించారు. గతంలో ఒక రావుగారికి మాత్రమే చపాతీలు చేసేవాళ్ళు. ఇప్పుడు భారీ ఎత్తున చాలా రుచిగా తయారుచేయడంతో మంచి పేరు రావడం జరుగుతున్నది. నెలరోజులు దాటింది. నెలలో ఇద్దరూ రకరకాలుగా పథకాలు ప్రారంభించారు. నిదానంగా బ్యాంకుల్లో లావాదేవీలు జరుపుకుంటూ, ఒక బ్యాంక్ నుంచి మరొక బ్యాంకుకు మార్చుకుంటున్నారు. ఇప్పుడు ఇద్దరి పేర్లమీద చెరి పదిహేను

లక్షల రూపాయలు వేసియున్నారు. గతంలో పూర్ణిమ తనతో తెచ్చుకున్న రెండులక్షల రూపాయలు కూడా అంతకు ముందు వేసిన బ్యాంకులోనే ఉంచేసింది. హొటల్ మీద మంచి ఆదాయం రాసాగింది. రిజిష్టరు వీలునామాతో ఇల్లు సొంతం అయ్యింది. రోజూ హోటల్‌కు వెళ్ళి శ్రద్ధగా కస్టమర్లను పలుకరించుకుంటూ మంచిపేరు తెచ్చుకొని అందరిమనసుల్లో స్థానం సంపాదించుకున్నారు.

ప్రస్తుతం ప్రతివాళ్ళు మంచితనం అంటే ఇలా ఉండాలి అనేవాళ్ళు తప్ప, చెడ్డగా ఈర్ష్య తో దెప్పిపొడిచేవారు ఎవరూ కనబడడం లేదు. నాలుగు నెలలు సాఫీగా గడిచాయి. నూతన వ్యక్తులతో పరిచయాల ద్వారా, ఎన్నో నూతన విషయాలు తెలుసు కోవడం జరుగుతున్నది. ఇద్దరూ బాగా ఆలోచించి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, తమ జీవితాన్ని సాఫల్యం చేసుకునేందుకు అన్నట్టు, తోడు నీడలేని వృద్ధులకు ఆశ్రయాన్ని కల్పించే ఒక వసతి గృహమును నడపాలని తీర్మానించు కున్నారు. ఎలాగూ ఇద్దరికీ తమ తల్లిదండ్రులకు సేవచేసే అవకాశం లేకుండా పోయింది. దానిని మరొక రూపంలో తీర్చుకుందామని, వాళ్ళకు కూడా తెలీకుండా అంతరాంతరాల్లో మెదులుతున్నది. అంతేగాక, దీనికి మరో బలమైన కారణం, రావుగారు సహృదయంతో ఇచ్చిన సంపదను ఏదైనా మంచికార్యాలకు, వ్యాపారాలకు ఉ పయోగించమని వెలిబుచ్చిన అభిప్రాయంకూడా ఇద్దరి మనసుల్లో బలంగా పనిచేస్తున్నది.

ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు, వీళ్ళున్న ఇంటికి దూరంగా ఒక పెద్ద ఇల్లును బాడుగకు తీసుకొని పని ప్రారంభించారు. పెద్ద హంగామా లేకుండా పది మందితో ప్రారంభమైన ఆశ్రమం, పది నెలల్లో 300 మందికి ఎదిగింది. జాషువా అన్నట్టు 'కాలము కాని నాడు మొనగాడును మోమటు చూపజాలడు. మరి ఆ కాలము తోడ్పడన్ తనకు కానిది లేదు' అన్న చందాన, ఆశ్రమవాసుల డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. అప్పటికే 200 మంది వెయిటింగ్ లిస్ట్ తయారైంది.

తాము తమ దగ్గర ఉన్న ధనంతో ప్రారంభం చేసిన ఆశ్రమాలు తమ అవసరం లేకుండా ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి ఒక్క వృద్ధులకే కాక కుంటి, గ్రుడ్డి, మూగ, బధిర, వితంతువులు లాంటి ఆశ్రమాలను స్థాపించడానికి వలసిన స్థలాన్ని, ఇళ్ళను ఇస్తున్నారు. ఆ కారణంగా అనేక సెంటర్లలో కొత్త కొత్త ఆశ్రమాలు ప్రారంభం అవుతున్నాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే వీళ్ళ ఓర్పు, నేర్పు ప్రతివాళ్ళ మనసుల్లో నాటుకు పోతున్నాయి. పూర్ణిమ శశిధర్ ప్రతిరోజు విసుగు విరామం లేకుడా ప్రతి

ఆశ్రమానికి వెళ్ళి వాళ్ళను పలుకరించి వాళ్ళ కష్టసుఖాలను కనుక్కొని దానికి తగిన పరిష్కార మార్గాలను కనుగొనడంలో నిమగ్నమై పోయారు. ప్రతి ఆశ్రమంలో కొంచెం ఆరోగ్యంగా ఉండి తెలివితేటలు కలిగిన ఉన్న వ్యక్తులను, తోటి వ్యక్తులకు సహాయం చేసేటట్టు ఒక గొలుసుకట్టును తయారుచేసి, వాళ్ళందరితో రకరకాల కమిటీలను నియమించి ఒక చక్కని వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో వీళ్ళు కృతకృత్యు లయ్యారు. ఆశ్రమాల్లో ఉన్న వ్యక్తులు జీవితంలో పోగొట్టుకున్న ఆనందాన్ని ఆశ్రమంలో పొందగలుగుతున్నారు అనిపిస్తుంది. ప్రతివాళ్ళ పుట్టినరోజులు, అన్నిరకాల పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు లాంటి వాటితో అందరూ సంతోషంగా కాలాన్ని గడుపు తున్నారు. ఈ పరిస్థితుల్లో వీళ్ళ పనితీరును చూచి ప్రభుత్వం వీళ్ళను వెతుక్కుంటూ వచ్చి కావల్సిన సహాయాన్ని చేయడానికి పూనుకొంటున్నది. పైపెచ్చు, ఆశ్రమాలకు కావల్సిన ధాన్యాలు, పాలు, కూరగాయలు ఇచ్చేదానికి చాలామంది దాతలు ముందుకు రావడం జరుగుతున్నది.

ప్రతి సంస్థకు పునాదిరాళ్ళు ఎక్కడినుంచి వస్తున్నాయో, వీరిద్దరి జీవిత చరిత్ర ఏమిటో, ఎవరు వీటన్నిటికి దశా దిశా నిర్దేశం చేస్తున్నారో, ఎవరికీ తెలియదు. వీరిని ప్రశ్నించేవాళ్ళు ఎవరూ లేరు. ఏదైనా సందర్భం వస్తే, ఎవరైనా ప్రశ్నిస్తే జవాబు ఒక్కటే. ఇదంతా సహృదయుల ధాతృత్వం తప్ప, మా గొప్పతనం ఏమీలేదు. మేము కేవలం నిమిత్తమాత్రులం అనడం ఆనవాయితీ అయిపోయింది. రెండు సంవత్సరాలు గడిచాయి. ఈలోగా అనుకోని విధంగా ఆశ్రమంలో ఉంటున్న వాళ్ళు, బయటివాళ్ళు అనేక మంది ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించేటప్పటికి ఈ సంస్థల సంఖ్య పెరుగుతున్నది.

## పూర్ణిమ శోభ

నగరం మొత్తంలో ప్రస్తుతం పూర్ణిమ పేరు నానుతున్నది. అనేక విషయాల్లో చాలామందికి సహాయ సహకారాలు, సలహాలు సంప్రదింపులు అందుతున్నాయి. తాను చేయలేని పనులు వీలుకానివి ఏవైనా ఉంటే, పూర్ణిమ శశిధర్ చాలా నిక్కచ్చిగా అది వీలుగాదు అని చెప్పడం, వీలైతే చేయడం అందరికీ నచ్చిన విషయం.

ఎవరు ఏ సహాయానికి వచ్చినా చూస్తామని, ప్రయత్నిస్తామని ఇతరులను తమచుట్టూ తిప్పుకోవడం ఎన్నడూ జరగడం లేదు. పైపెచ్చు ఎవరైనా ఎలాంటి కష్టంతోనైనా వచ్చి పూర్ణిమను ఆశ్రయిస్తే చాలా సీరియస్‌గా పట్టుదలతో వాళ్ళ సమస్యను తీర్చడంతో చాలా గొప్పపేరును సంపాదిస్తున్నది. ఎలాగుందంటే, ఇతరుల

కష్టాలకు పూర్ణిమ సమాధానం, పరిష్కార మార్గం అయ్యింది. దీనికితోడు, టౌన్‌లోని కవులు రచయితలు గాయకులు రాజకీయ నాయకుల రాకపోకలకు పొగడ్తలకు కొదువలేదు. వీళ్ళ వద్ద బ్యాంకులో నున్న డబ్బు, హోటల్ నుండి వస్తున్న ఆదాయం అంతా కలిపి పెద్ద మొత్తంలో ధనం చేకూరింది. ఆ కారణంగా ఆరో సంవత్సరంలో అనుకోకుండా ఒక మంచి అవకాశం వచ్చింది. ఒకేసారి ఊరికి 9 కి.మీ. దూరంలో ఒక పదెకరాల మామిడి తోటతో కలిపి, 150 ఎకరాలు కొనడానికి అవకాశం రావడం దానిని తీసికోవడం జరిగింది. అది అంతటితో ఆగలేదు. పూర్ణిమ పాపులారిటీ మంచితనం వలన మిగతా భూములు కూడా అమ్ముతామని, కొంత డబ్బు ఇచ్చి, మిగతా తర్వాత ఇచ్చినా ఫరవాలేదని, ఎన్నో అవకాశాలు ఎంతోమంది నుండి రావడంతో 150 ఎకరాలను 350 ఎకరాలుగా చేయడం జరిగింది. ఆ భూమిలో ఒక 50 ఎకరాలు గుంటగా ఉన్న ప్రదేశంలో ఒక చెరువులా తవ్వి నీటి వసతిని కల్పించుకుని అనేక రకాల పండ్లచెట్లు, పూలచెట్లు, అరటి చెట్లు, వరిపంట, గోశాల లాంటి కార్యక్రమాలతో మొత్తం భూమి పచ్చగా తయారయ్యింది.

దాంతో ఆదాయానికి ఆదాయం, ఆశ్రమాలకి కావల్సిన పాలు, కూరగాయలు లాంటివి సప్లై చేయడానికి సులభమైంది. తద్వారా ఒకవైపు ఆశ్రమాలు పెరుగు తున్నాయి. ఇంకొకవైపు భూసంపదతో ధనంకూడా పెరిగింది. ఈలోగా రోడ్డుకు దగ్గరగా ఉన్న స్థలంలో ఒక గెస్ట్‌హౌస్, ఒక మీటింగు హాలు, కల్యాణ మండపం ఏర్పాటయినాయి. అన్నివసతులతో ఉన్న ఆడిటోరియంలో తరచు అనేక ప్రసంగాలు, కవి సమ్మేళనాలు, సంగీత సభలు జరిపించడం నిత్యకృత్యం అయ్యింది. అక్కడే ఒక రెసిడెన్షియల్ స్కూల్ 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉచితంగా విద్యను అందించేందుకు ఏర్పాటుచేయబడింది. ఏ విద్యార్థి అయినా శ్రద్ధగా చదవడంలేదంటే వాళ్ళకు అక్కడ స్థానం వుండదు. బాగా చదువుకునేవాళ్ళకు మాత్రమే ఫ్రీ ఎడ్యుకేషన్ ఇచ్చేందుకు తీర్మానం అయ్యింది.

## సంపూర్ణ వ్యక్తిత్వం

సాయంత్రం మూడు గంటలకు ఏదో పుస్తకాన్ని చేతబట్టి పూర్ణిమ చదువుతున్నది. దానిలోని ఒక సందర్భం, అనేక యోచనలకు దారితీసింది. ఏ వ్యక్తి అయినా తనను తాను, అనగా తన అంతఃకరణను అర్థంచేసుకోలేనివాడు, పూర్ణ వ్యక్తిత్వం కలిగినవాడు అని చెప్పలేము. అలాంటి వ్యక్తులు ఎక్కువయ్యే కొద్దీ సమాజం కూడా పూర్ణత్వం పోగొట్టుకొని, చైతన్యం వైపు నుండి జడం వైపుకు సాగుతుంది. ఒక వ్యక్తి ఇంజనీరు

కావచ్చు, డాక్టరు కావచ్చు, టీచరు కావచ్చు, రాజకీయ నాయకుడు కావచ్చు, ఎంతో చదువు చదివివుండవచ్చు కానీ ఒక వ్యక్తి మానవత్వాన్ని అలవర్చుకోకుండా ఉంటే శూన్యమైన జీవితం గడపిన వానికింద జమ వేయవలసివస్తుంది. ఏ వ్యక్తైనా మనిషిని మనిషిగా గుర్తించి, ఆదరించకపోతే అది జీవితం కాదు. దానికి పరిపూర్ణత్వం కలుగదు.

పుట్టడం, తినడం, నిద్ర, సంసారం, డబ్బు, పదవి, చివరకు మరణం అందరూ చేసే పనులే. మానవుడు అనేక అడ్డదారులు డబ్బు కొరకు తొక్కుతూ ఎన్నో సిద్ధాంతాలు, కూటములు, విభాగాలు చేస్తూ, తాము వేరేవాళ్ళకోసమే జీవిస్తున్నాము అన్నట్టుగా, వాళ్ళు చేయవలసిన పనులను ఇతరులను చేయమని, అదే మానవధర్మం అని ఏకరువు పెడతాడు. విచిత్రం ఏమిటంటే ధనవంతుడు కోరికల వలన కలిగే నష్టాలు, దురాశ వలన కలిగే ఇబ్బందులు, డబ్బు కూడితే ఎదుర్కొనే కష్టాలు వల్లెవేస్తాడు. రాజకీయనాయకులు, సద్గుణాలమీద ,అవినీతివలన కలిగే నష్టాల మీద ప్రవచనాలు ఇస్తారు. స్వామిజీలు ధర్మాన్ని, దయను, జీవిత లక్ష్యాన్ని, మోక్షాన్ని భగవంతుడి లీలలను ఏకరువు పెడుతూ వాటన్నింటికి వీళ్ళే పెత్తందార్లు అయినట్లు నటిస్తారు. అంతా నటన. ప్రతివాడు తన శక్తికి మించి మంచిని గురించి మాట్లాడడం, వంచనకు ప్రణాళికలు సిద్దం చేసుకోవడం ప్రపంచ తత్త్వం.

నిజానికి మానవ సంబంధాలు, వాటి మాధుర్యం, వీళ్ళు అసలు అనుభవించి ఉండరు, అర్థంచేసుకొని ఉండరు. తల్లిదండ్రులు, బిడ్డలు, స్నేహితులు, చివరకు అపరిచితులు, అతిథులు లాంటి వారితో ఎలా ప్రవర్తించాలి. వీళ్ళందరూ ఒక క్రమశిక్షణతో ప్రవర్తించగలిగితే ఇది ఒక పరిపూర్ణ సమాజం అవుతుంది. అలాంటి సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరికి అనగా తమకు ఇతర్లతో ఉన్న సంబంధ బాంధవ్యాల ద్వారానే, సాధ్యమౌతుంది అన్న స్పృహలేకుండా బాగా ధనమూ, అందమూ, ఐశ్వర్యమూ, అధికారం ఉన్నవాడుకూడా, ఏదో ఒక చిన్నసాకుతో దుఃఖపడుతుంటాడు. నిజానికి ఇవి లేనివాడికంటే ఉన్నవాడు ఎక్కువ బాధపడతాడు.

బాధలేని మనస్సును భగవంతుడు ఇంకా తయారుచేయలేదు. ఎవరో మహానుభావులు, జ్ఞానోదయం అయినవారు, బ్రహ్మజ్ఞానం పొందినవారు తప్ప, మిగతా జీవులంతా బాధకు లోనవుతున్నవారే. పరిణామక్రమంలో బాధ అనేది ఒక ఉపాధి అవుతుందేమో. బాధలేకుండా మనిషి బ్రతకలేడు. బాధను తప్పించుకోవడానికి చేసే ప్రయత్నమే అభివృద్ధి అవుతుందేమో.

శరీరానికి ఆహారం ఎలాంటిదో, బాధ మనస్సుకు అలాంటదనిపిస్తుంది. ఆహారం బాధ లేకుండా జీవుడు తన ప్రయాణాన్ని చివరి వరకు సాగించలేడేమో! అందుకే బాధను మాయని అన్నారు. అందరికీ బాధ ఉంటే, భగవంతుడి అంశలు అయిన మానవులందరి బాధ భగవంతుని బాధ కాదా! అంటే భగవంతుడు కూడా నిరంతరం బాధపడుతున్నాడు అని అనుకోవాలి. ఉండేది పోయేది, బాధ ఒక్కటే. ఆనందం అసలు లేదనిపిస్తుంది. బాధలేకుండా పోతే తప్ప ఆనందం రాదు. బాధనే కుప్ప ఉంటే దాన్ని తొలగించుకుంటే ఆనందం వస్తుంది. లేదా బాధ అనే గోతిని త్రవ్వి మరల దాన్ని పూడ్చినప్పుడే ఆనందం కలుగుతుంది. ఇదొక కాలచక్రం. సూర్యోదయం, సూర్యాస్తమయం, వస్తూ పోతూ, పోతూ వస్తూ ఉంటుంది. ఇలా పూర్ణిమ ఆలోచనలు సాగిపోతున్నాయి.

* * * * *

## సరాగం

ఆరోజు ఆదివారం 3 గంటలు అయ్యింది. శశి, పూర్ణిమ పిచ్చాపాటి మాట్లాడు కుంటూ టీ తాగారు. శశిధర్ సాధారణంగా ఎక్కువగా మాట్లాడడు. కానీ ఆరోజు సరదాపడి పూర్ణిమతో "నీ జీవితంలో, నీకునచ్చిన ఆనందకరమైన, నచ్చని బాధాకరమైన, సంఘటనలన్నింటిని క్రోడీకరించి ఒక ఇండెక్స్ తయారు చేస్తే, నీకు పాజిటివ్ మార్కులు, నెగటివ్ మార్కులు దేనికి ఎన్ని వస్తాయి? నీ అనుభవం మొత్తాన్ని బేరీజువేసి చెప్పగలవా? నిన్ను బాధపరచిన సంఘటనలు, సంతోషపరచిన సంఘటనలు మొత్తం ఏమిటి?" అన్నాడు.

పూర్ణిమ అందుకు "ఏమి, ఈ మధ్య ప్రెస్ ఇంటర్వ్యూలు చేయడం నేర్చుకుంటు న్నావా? ఎప్పుడూ అడగని ప్రశ్న, ఇప్పుడు ఎందుకు అడగాలనిపించింది. పోనీలే నీసరదాకు నేను చెప్తాను విను అంటూ నాజీవితం అంతా ఎక్కువభాగం నెగటివ్‌గా గడచిపోయింది. కాని నా జీవితం నాకు నెగటివ్ అయినా, ఇతరులకు పాజిటివ్ అవుతున్నది. అయితే నాకు ఒకే ఒక్క పాజిటివ్, 'నీవు' మాత్రమే. నీవు నాకు ఉండడం అన్ని నెగటివ్‌లను తుడిచివేసింది. నన్ను ప్రేమించే వ్యక్తి, మా అమ్మ నాన్నల తర్వాత 'నీవు' అన్న ఆలోచన ఒక్కటే నన్ను నిరంతరం సంతోష పెడుతుంటుంది. ఎందుకంటే, నా ఆలోచనలు, కలలు, నేను చదివిన సాహిత్యంలోని మధురానుభూతులు, వాటి జ్ఞాపకాలు, నా మనః ఫలకంమీద చిత్రీకరించబడ్డాయి. ఒకవైపు కొండలు మరోవైపు సెలయేళ్ళు, పండ్లు పూలతో నిండిన తోటలు, మరొకవైపు ఆకాశం, నక్షత్రాలు,

చంద్రుడు, సౌందర్యాన్ని అందించగల ప్రకృతి, ఆనందం అంతా నా స్వంతం కావాలని నేను కలలుగన్నాను. నేనే కాదు అందరూ అలాంటి కలలే కంటారు.

నాకు ఊహ తెలియనప్పుడు సంతోషంతో పొంగిపోయాను. ఆ అనుభవాన్ని ఈనాడు నేను వెనుకకు తీసుకొచ్చి ఆనందించే పరిస్థితులో లేను. ఊహ తెలిసిన తర్వాత, అమృతం బదులు హాలాహలం, వెన్నెల బదులు చీకట్లో జీవితాన్ని గడిపేయాల్సి వచ్చింది. ఇంతకాలానికి ఇప్పుడు నా మనస్సు నిలకడతో, నిశ్చింతతో నిండిఉన్నది. నా యెడల నీ ప్రేమ ఒక్కటే, నన్ను సంతోషంగా ఉండనిస్తున్నది. నేను కూడా నిన్ను దాదాపు అదే మోతాదులో ప్రేమిస్తున్నానన్నది నిజం. మనిద్దరి మధ్యప్రేమ అంటే, అది వేరే అర్థంవస్తుంది. మనిద్దరి మధ్య ఉన్న ప్రేమకు వేరే పదం లేక, అభిమానం, మమత, అనురాగం లాంటి పదాలను, రంగరించితే వచ్చినది మన ప్రేమ. కాని మనిద్దరం ఒకరికొకరు ఏమౌతాము? ప్రేయసీ ప్రియులమా, అన్నా చెల్లెళ్ళమా, స్నేహితులమా, తల్లీ బిడ్డలమా, భార్యాభర్తలమా? ఇవన్నీ కలిపిన ప్రేమ మనది. ప్రపంచంలో ఎన్ని రకాల ప్రేమలున్నాయో అన్నీ కలిపిన పంచామృతం లాంటిది మన ప్రేమ.

నిజానికి నీ మనసు పండలేదు. దోరగానే నిలబడిపోయింది. కాని నువ్వు నన్ను పండించినంతగా, నేను నిన్ను పండించలేకపోయాను అనిపిస్తుంది. కాబట్టి నామీద నీప్రేమ, నాప్రేమ, కంటే ఒక మెట్టు ఎక్కువే అన్న స్పృహ నాకుంది. పుష్పాలతో, పండ్లతో కళకళలాడే పచ్చనిచెట్టును ఆశ్రయించకుండా, నాలాంటి మోడుపోయి, ఎండిపోయిన చెట్టుకింద, నీడను, వెతుక్కుంటున్న నిన్ను అర్థంచేసుకోలేనా? ఇప్పటికైనా మించిపోయింది ఏమీలేదు. పురుషుడు, స్త్రీ సంగమం లేకుండా తృప్తి చెందలేడు. స్త్రీకి అట్లాకాదు. పురుషుడిని చూస్తే, తాకితే, తృప్తి చెందగలదు. అందుచేత, నా తన్మయత్వం తృప్తి, నాకుంది. నీకు అలాంటి తృప్తిని లేకుండ చేసిన నా పాపానికి ప్రాయశ్చిత్తం ఎలాచేసుకోవాలో తెలియదు. నీకు ఎంత మానసిక ఆనందాన్ని నేను కలుగచేసినా, శారీరక సుఖాన్ని కలుగచేయలేకపోయానన్న వ్యథ నన్ను బాగా కృంగదీస్తున్నది. నేను ఎంగిలి పడ్డాను కాబట్టి, నాకిష్టంలేదు. నేను చాలాసార్లు నా మనస్సు విప్పి నీ ముందర పరిచాను. నా ఇష్టాఇష్టాలతో సంబంధం లేదు. నీకు నేను కావాలంటే అభ్యంతరాలుండవు. అంతా నీ యిష్టం. ఇలా ఎందుకంటున్నానంటే అది నామీద నీ ప్రేమ, నీమీద నా ప్రేమ వలననే.

నాకు పునర్జన్మ లేదు. నాకు సంతతి లేనప్పుడు నా వంశము, నా గోత్రము నాతో అంతరించి పోతాయి. నాలోని పదార్థం, చైతన్యం ఇంకొక శరీర ఉత్పత్తికి ఆధారభూతం కాకుండా సమసిపోతుంది. మరలా వేరొక జీవిలోకి జొరబడి జన్మనిచ్చే అవకాశాల్లేవు. నాదొక సన్యాసం. నీదొక సన్యాసం. మనదొక అంతం. అంటే అనంతం. నేను ఉంటాను. నేను ఉండను. నాకు అసంతృప్తిలేదు. నాకు నీతో పరిపూర్ణ సంతృప్తి ఉంది. నీకు ప్రేమ ఉంది, తృప్తి లేదు. నామాట విను. నీకు మంచి వ్యక్తిని చూచి, తోడు నీడ ఏర్పాటుచేస్తాను. మీ ఇద్దరిని కంటికి రెప్పలా కాచుకొని కూర్చుంటాను. నేను కూడా ఒక మంచిపనిచేశానని, ఎంతో ఆనందం, తృప్తి పొందుతాను. నాలో ఇప్పుడు ఒక వెలితి ఉంది. అప్పుడు అట్లాంటి దానికి స్థానం ఉండదు" అని చెబుతూ శశిధర్ వంక చూచింది.

తలవంచుకుని కూర్చున్నాడు. కళ్ళలో నీళ్ళు సుడులుతిరిగి ధారగా కారు తున్నాయి. పూర్ణిమ గబగబా లేచి దగ్గరకుపోయి కౌగిలించుకుని, శశి బుగ్గల మీద ముద్దులవర్షం కురిపించింది. నా బంగారు మనసు నొప్పించాను కదూ! నీ తల్లి, ప్రియురాలు ఇక్కడ ఉండగా నీకెందుకయ్యా దిగులు! నేనుమాట్లాడినవన్నీ నీ మనసులోనుండి చెరిపేసెయ్. ఆలోచన నుండి తుడిచేసేయ్. నేనేమీ చెప్పలేదు. నీవు ఏమీ వినలేదు. రా! అట్లా గాలికి తిరుగొద్దాం" శశి కళ్ళు తుడుచుకొని పూర్ణిమను గట్టిగా కౌగిలించుకున్నాడు. ఊపిరాడనంతగా కౌగిలించుకున్నాడు. చిన్నప్పుడు తన తల్లి తనను కౌగిలించుకొన్నట్టు ఉంది. అదే అనుభూతి. అవే జ్ఞాపకాలు. "ఈ జన్మకు ఇది చాలు. నీ చూపు చాలు. నీ స్పర్శ చాలు. నీ మాటలు చాలు. ఈ జన్మకి ఇంకేం అక్కర్లేదు. నీ సంతోషం కావాలి. నిన్ను ఎప్పుడూ ఆనందంగా చూడాలి. నీవు ఎప్పుడూ హాయిగా కనిపించాలి. నాకింకేమీ అక్కర్లేదు. నేను ఒకసారి కాదు, కోటిసార్లు చెప్తున్నాను. నాకింకేమీ అకర్లేదు. నేను ఇంకెప్పుడూ ఇలా మాట్లాడను" అంటూ కౌగిలిలో నుండి బయటపడి పూర్ణిమ కళ్లలోకి చూశాడు.

పూర్ణిమ కళ్ళుమూసుకొని తన్మయత్వంలో ఉంది. నెమ్మదిగా కళ్ళు తెరిచింది. ఇద్దరూ ఒకరిని చూచి ఒకరు ఏడుస్తున్నారు. ఆ ఏడుపు నవ్వుగా మారేటంత వరకు వెక్కి వెక్కి ఏడ్చారు. చివరకు ఇద్దరూ అలసిపోయారు.

* * * * *

పూర్ణిమ శశి, "మనిద్దరి మధ్య వుండే ప్రేమ ఎంతమంది అనుభవించి వుంటారు. మనిద్దరి మధ్యవుండే ప్రేమ విచిత్రమైన ప్రేమ. ఆశలు లేని ప్రేమ. పరిపూర్ణమైన ప్రేమ. అందులో శూన్యం లేదు. బయట వుండేది లోపల ఉండేది ప్రేమే. శ్రీకృష్ణుడు ప్రేమకు సంకేతం. ప్రేమకు మారుపేరు. అందుకని శ్రీకృష్ణుడిది పరిపూర్ణ అవతారం అయ్యింది. కృష్ణుడి సందేశం ప్రేమ నుండి ఆనందం పొంగి పొరలుతుందని, దుఃఖానికి తావు లేదని. జీసస్ కూడ ప్రేమను గురించి మాట్లాడాడు. జీసస్ "నీ పొరుగువాడిని ప్రేమించు, నిన్ను నీవు ప్రేమించుకునే విధంగా". ప్రేమ దుఃఖాన్ని బందీగా చేయాల్సింది పోయి, దుఃఖం ప్రేమను బందీగా చేస్తున్నది. ఇదంతా ప్రేమ మహిమ. ప్రేమ భగవంతుని సామ్రాజ్యం (కింగ్‌డమ్ ఆఫ్ ది గాడ్). మానవునికి రామునిలా భార్యను తల్లిని, తండ్రిని, స్నేహితులను, అన్నదమ్ములను, బంధువులను, ప్రజలను అందరిని ఒక త్రాటిమీద సమానంగా ప్రేమించటం తెలీదు. కృష్ణునిలా తారతమ్యం లేని ప్రేమ, చివరకు శత్రువులను కూడా ప్రేమించే తత్వం మిగతా ఎక్కడా కనబడదు. మానవుల ప్రేమ, క్రోధం, పగ, అసూయ, మోహం, గర్వం, దంభం, దుఃఖం లాంటి కోరికల నుండి పుట్టిన వ్యామోహాన్ని, దురాశను ప్రేమ అని భ్రమపడే తత్త్వం. అందుచేత అలాంటి వ్యక్తులు ఎంత సంపాదించినా, విజయపరంపరలు చవిచూచినా, లేమితనంతో కుళ్ళిపోతూ, శూన్యంలో బ్రతుకు సాగిస్తుంటారు.

"ప్రేమ అనేది ఒక బడబాగ్ని. అది సముద్రంఅడుగున ఉంటుంది. నిప్పు నీరు ఒకేచోట ఉన్న సముద్రం లాంటి మనసులో ఉన్నదే ప్రేమ. అందుచేత నీటికి నిప్పుకు తేడా లేనిచోట మనగలిగేది ప్రేమ. అది మోహం, వ్యామోహం. అది నీళ్ళలో కరిగిపోతుంది. నిప్పులో కాలిపోతుంది. కాని ఈ ప్రేమ ఎప్పుడూ నిలబడుతుంది. నీళ్ళలో కరిగిపోకుండా, నిప్పులో దహించ కుండా నిలబడిపోతుంది.

ప్రేమవృక్షం, మొదలు కాండము కొమ్మలు ఆకులు చిగుళ్లు పూలు పండ్లుగా విస్తరించిన మొత్తాన్ని, తన విత్తనంలో ఇమిడ్చుకొని ఉంటుంది. ప్రేమకు ఉన్న కోణాలను అర్థంచేసుకోవడానికి వృత్తంలోని 360 డిగ్రీలు చాలవు. అసలు వృత్తంలో ఉండేవి 360 డిగ్రీలు కాదు. అవి అనంతం. ప్రేమ సర్వాంతర్యామి. సకలం. సర్వం, అవధులు లేనిది. అది సృష్టిస్తుంది, శాసిస్తుంది, ఖండిస్తుంది, అది పూర్ణ స్వరూపాన్ని సంతరించుకోగలదు. శూన్యమై పోగలదు. అది అనంత హిమవత్‌పర్వతాల శిఖరాలకు తీసుకుపోగలదు, లేదా అగాధంలోకి తొక్కివేయ గలదు. కాని ప్రస్తుత సమాజం పగతో

దుఃఖంతో, ప్రేమను కలుపు మొక్కలు అనుకుని, దుఃఖం పైరు అనుకుని తొక్కేస్తున్నారు. అందువలన పగ దుఃఖం, కలుపులా పెరిగి పోతున్నది.

ఈ ప్రపంచంలో అన్నీ నశించేవే. నశించనది ప్రేమ ఒక్కటే. అది తల్లి వేరు. ప్రేమ ఒక శక్తి. అన్నిశక్తులకు ప్రేమ మూలశక్తి. చివరకు ప్రేమ వ్యక్తులకు మాత్రమే పరిమితం కాకుండా, అంతటా విశ్వవ్యాప్తమై ఉంటుంది. అది ఉప్పులాంటిది. ఆహారంలో ఉప్పులేక రుచిపుట్టనట్టు, జీవితానికి ప్రేమ అవసరం. ఎంతమంది జీవితాలు ప్రేమతో మొలకెత్తి పుష్పించి ఫలించాయో, అయినా ఖండించేదానికి ఎన్నో సాధనాలు. అనగా, కత్తులు, రంపాలు, గొడ్డళ్ళు లాంటి ఆలోచనల చర్యల ద్వారా పనిచేస్తుంటాయి. స్త్రీ పురుషుల మధ్య శృంగార కాలం ఇరవై–డబ్బై మధ్య. ఆకర్షణ వికర్షణ, అశాంతి ఆవేశం, ఆనందం తృష్ణతో నిరంతరం యుద్ధాలు జరుగుతుంటాయి. ఒకసారి ఒకటి, ఇంకొకసారి మరొకటి గెలిచినట్టు భ్రమింపచేస్తుంది.

ఆహారంలో రుచి, ప్రేమలో అనుభవం, ఆనందం తెలీని వ్యక్తి, జీవితంలో వ్యర్థం అని నా అభిప్రాయం. ప్రేమించడం తెలియని మనస్సుకు చైతన్యం ఉండదు. ప్రేమ ఒక స్పందన, ఒక అనుభూతి. ప్రేమ చెట్టును, చేపను, జంతువును, సకల చరాచర ప్రపంచాన్ని నడిపిస్తుంటుంది. ఒక రాతిని మరొక రాతితో కొట్టితే వచ్చే నిప్పే స్పందన, అలాంటి స్పందనను జీవులలో అయితే ప్రేమ అని అంటాము. ప్రేమ నిరంతరం ఒక భయంకరమైన సంఘర్షణతో ముడివడి ఉంటుంది. ఎవరి ప్రేమ, పూర్ణమూ కాదు, శూన్యము కాదు. ఒకసారి పూర్ణంగా, మరొకసారి శూన్యంగా మాయలోకి తోసి మరలా జ్ఞానోదయానికి తలుపులు తెరుస్తూ ఉంటుంది. ఇది మనస్సు చేసే గారడి అని సామాన్యులు, మేధావులు, వేదాంతులు కూడా ఏకీభవిస్తారు.

అయితే ఈ మనస్సు ఎక్కడుంటుంది, ఎలా ఉంటుంది, దాని స్వరూపమేమిటి, ఇన్ని కోణాల్నుండి అనేక రకాలుగా ఎలా పనిచేయగలుగుతున్నది, ఎలా పనిచేస్తుంది, దాని స్వరూపం ఏమిటి, దానికి అంత శక్తి దేని నుండి కలుగుతుంది, అన్ని పనులను ఎలా నేర్చుకో గలుగుతుంది, ఎలా అభ్యాసం చేయగలుగుతుంది, అన్ని లక్షణాలను ఎలా తనలో ఇముడ్చుకుంటుంది? ఒక క్షణంలో ఒక డిగ్రీ నుండి మరో డీగ్రీకి ఎలా మారుతుంది, అంత తెలివి ఉన్న మనసు అంతే అమాయకత్వంతో ఎలా పొరపాట్లు చేస్తుంది, ఎవర్ని ఎప్పుడు ఎందుకు ఇష్టపడుతుంది? అలాగే ఎందుకు అయిష్ట పడుతుంది, ద్వేషిస్తుంది, అలాంటి మనస్సు ప్రేమను, స్వార్థాన్ని, త్యాగాన్ని, క్రోధాన్ని , అసూయను, పక్కపక్కనే పెట్టుకొని ఎలా మనగలుగుతుంది? నిప్పు నీరు ఒకే కుంపటిలో

ఉన్నట్లు, అనేక స్వరూపాలను, గుణాలను ఎలా ఇముడ్చుకుంటుంది? శరీరం జడమైనప్పుడు అది ఎక్కడికిపోతుంది?

కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు పనిచేయకపోతే కూడా మనస్సు ఎలా పనిచేస్తుంది? మనస్సును చూడ్డం ఎవరికైనా వీలవుతుందా? దాని రూపాన్ని, రంగును, రుచిని తెలిసిన వాళ్ళు గొప్ప తాపసికులై ఉండాలి. మనస్సును గురించి మనస్సుకు తప్ప ఇంకెవరికి తెలియదు. కాని అదెక్కడుందో తెలియదు. నా కళ్ళను నేను చూచుకోలేనట్టే, నా మనస్సును గురించి నాకు కూడా తెలియదు. నా కళ్ళతో వేరే ప్రపంచాన్ని చూస్తాను. అలాగే నా మనస్సుతో ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. అంతర్లీనంగా జరుగుతున్న మానసిక ప్రక్రియను అర్థం చేసుకోవడం నా మనస్సుకు కూడా అందదు. అసలు మనస్సు ఒకచోట ఉండదు. శరీరంలోని ప్రతి అణువులో ఉంటుంది. అలాగే మనసు ఒక తరంగంలా ఈ ప్రపంచమంతా నిండి వుంటుంది. రెండు తరంగాలు ఒకదానితో ఒకటి కలుస్తుంటాయి. అప్పుడు ఆలోచనల స్పందనలు పుడుతుంటాయి.

అసలు ఏ మనస్సు కూడా ఒక్కటి కాదు. అది అనేకం అనంతం. ఎన్నో ముక్కల కలయిక. ముక్కలు అంటే భౌతికం మాత్రమే కాదు. అది పదార్థం, చైతన్యం కలిసిన తరంగాల సమాహారం. పరిణామం చెందుతూ, ప్రయాణం చేస్తూ ఒక మనసు నుండి ఇంకో మనసుకు చేరే ప్రక్రియలు జరుగుతాయి. అసలు మనస్సు శరీరం లోపల ఉందనుకుంటారు. అది నిజంకాదు. మనస్సు శరీరానికి బయట వెలుపల కూడా ఉంటుంది. ఉదా॥ బయట వెలుగు, భూమి, శబ్దం, లాంటి పంచభూతాల్లేవు అనుకోండి. నీ మనస్సును తెలుసుకోవడానికి అవకాశం ఎక్కడుంది.

అంటే మనస్సు శరీరంలోపల ఉంటే దాన్ని ఛాయ బయటవుంటుంది. మనస్సు బయట వుంటే దాని ఛాయ లోపల ఉంటుంది. ఈ రెండు కలిసినప్పుడు, ఆలోచనలు, ఉద్రేకాలు, ఆవేశాలు అన్నీ – జాగృత, స్వప్న సుషుప్త, తురీయ – రూపంలో అన్నీ ఒకదానితో మరొకటి, కలుసుకోవడం విడిపోవడం, వలన జరిగినట్టనిపిస్తుంది. దాన్నీ సంపూర్ణంగా అర్థంచేసుకోవాలంటే. రకరకాల జ్ఞానులను, మునులను, రుషులను శాస్త్రజ్ఞులను, న్యూటన్, ఐన్‌స్టీన్‌లాంటి వారిని, గురించి ఆలోచిస్తే ఒక సత్యం బయట పడుతుంది. పరిపక్వత చెందిన మనస్సు తన అంతర్బహిర్ తరంగాలను ఒకదానికొకటి జోడించినప్పుడు కొత్త ఆలోచనలు సిద్ధాంతాలు ఆవిష్కరింపబడుతాయి. అలాంటి సిద్ధాంతాలు రాబోయే తరాల వారికి మార్గదర్శక మౌతాయి. ఉదాహరణకు న్యూటన్

లేకపోతే ఐన్‌స్టీన్ సాపేక్షసిద్ధాంతం వెలుగు చూసేందుకు అవకాశం వచ్చేది కాదు. వేదాలు లేక పోతే పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాల్లాంటి సాహిత్య ప్రక్రియలకు అవకాశం ఉండేది కాదు కదా!" ఇలా పూర్ణిమ ముచ్చట్లు శశితో సాగాయి.

* * * * *

## శూన్యభావం

టైము 7 గంటలవుతున్నది. శశిధర్ కారు వచ్చి ఆగిన శబ్దమైంది. కారుదిగి లోపలికి వచ్చాడు. సోఫాలో కూర్చుని ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్న పూర్ణిమ రేపు మాట్లాడతాం అని ఫోన్ కట్‌జేసి "ఏం శశి అప్పుడే వచ్చావు?" అని అంటూ అప్పటివరకు చూస్తున్న ఫైలును కూడా మూసేసి పక్కన పెట్టింది. పనిమనిషి సరళ ట్రేలో నీళ్ళ గ్లాసుతో వచ్చింది. కొంచెం నీళ్ళు తాగి ట్రేలో గ్లాసు పెట్టాడు శశిధర్. సరళ లోపలికి వెళ్ళింది.

సాధారణంగా 9 గంటలకు వచ్చే శశి 7 గంటలకు రావడం అరుదు. "త్వరగా ఫ్రెష్ అయి వచ్చేయ్ మాట్లాడుకుందాం" అన్నది పూర్ణిమ. పదిహేను నిమిషాల్లో శశిధర్ వచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఏమీ మాట్లాడలేదు. ఆరోజు విశేషాలు చెప్పలేదు. సాధారణంగా రోజూ రాగానే ఆరోజు జరిగిన వాటిలో ఒకటి రెండు ముఖ్యమైన విషయాలు ముచ్చటించేవాడు. ఈరోజు అదోరకంగా మౌనంగా కూర్చోవడం, ఎందుకనో అర్థంకాలేదు పూర్ణిమకు. ఆమె వేరే సోఫాలో నుండి లేచి శశిధర్ ప్రక్కనే వచ్చి కూర్చుని "ఏం వంట్లో బాగాలేదా! తలనొప్పిగా ఉందా?" అంటూ నుదురు మీద చేతిని పెట్టి, "ఒళ్ళు చల్లగానే ఉందే! ఆకలిగా ఉందా, భోంచేద్దామా?" అని అడిగింది. జవాబు లేదు. శశిధర్ చేతిని తనచేతిలోకి తీసుకొని "ఏమైంది, ఎందుకలా ఉన్నావు?"

శశి మనసు బాగాలేదని అర్థంచేసుకుంది పూర్ణిమ. చేతిని పట్టుకుని, తానులేచి నిలబడి "రా మేడపైకి పోదాం" అంటూ కదిలింది. క్రింద కూర్చుని మాట్లాడాలనుకుంటే, సెక్రటరీ, పనివాళ్ళు ఉంటారు. ఏ.సి. రూము అయినా ఏదో ఇరుక్కున్నట్టు ఉంటుంది. మేడపైన విశాలంగా ఉంటుంది కూర్చోవడానికి, డాబామీద. నూరు మందితో మీటింగు జరుపుకునే అవకాశం, తగిన ఫర్నీచర్, ఏ.సి. రూములు ఉన్నాయి. ఇద్దరూ చెరోకుర్చీలో ఎదురు ఎదురుగా కూర్చున్నారు. బహుశా ఆరోజు త్రయోదశి, చతుర్దశి మధ్య ఉండవచ్చు. ఒకసారి ఆకాశం వైపు చూచారు ఇద్దరూ.

ఆకాశంలో చంద్రుడు దాదాపు నిండుగా కనబడ్డాడు. చంద్రుని కాంతి మిద్దెమీద లైట్ల కాంతిలో సరిగా కనబడ్డం లేదు.

"ఎందుకలా మూడీగా ఉన్నావు" అని అడిగింది.

"ఎందుకో తెలీదు కానీ, ఏవేవో ఆలోచనలు మనసును కలతపరుస్తున్నాయి. కారణం తెలియడంలేదు, ఏదో వెలితి. ఏదో పోగొట్టుకున్నామన్న ఆలోచనలు, ఇంతేనా మన జీవితం. మనవి కూడా గానుగెద్దుల్లాంటి జీవితాలేనా. చేసిందే చేయడం. ఇన్ని ఆస్తులు, ఇంతమంది వ్యక్తుల పరిచయం, ఎక్కడికిపోయినా మర్యాద, రెడ్‌కార్పెట్ వెల్‌కం. దీంట్లో మనక్కావలసింది ఏదీ లేదు. మనం ఇతరులకోసం బ్రతుకుతున్నాము. ఎంతకష్టపడ్డా ఇతరుల కొరకే. నాకు, వేలసంవత్సరాలనుండి అలాగే బ్రతుకు తున్నామనిపిస్తున్నది. ఇన్ని రోజులలో ఈనాడు అనుభవించిన కలతను తట్టుకోలేక పోయాను. ఏంచేయాలనో తెలియలేదు. అయినా వీటితో నాకేంపని? అయినా నా సర్వశ్వం నీవే కదా! అని ఇంటికి వచ్చేశాను" అన్నాడు.

పూర్ణిమ శశిధర్ మాటలు విన్నది. కానీ ఏం మాట్లాడాలో తెలియలేదు. శశి మాట్లాడినదాంట్లో కొంచెం కూడా అసత్యం లేదు. గతంలో నాలుగైదు సార్లు అతను ఇలానే ముచ్చటించిన సందర్భాలున్నాయి. కాని ఇంత బాధతో ఆవేదనతో మాట్లాడలేదు.

పూర్ణిమ అందుకుంది "నీవు చెప్పింది అక్షర సత్యం శశి. అయినా ఒక్కసారి చంద్రుడిని చూడు. పెరుగుతూ తరుగుతూ ఉంటుంది. అదే నక్షత్రాలను చూడు. వాటికి ఎదుగూ బొదుగూ ఉండదు. నిరంతరం మిణుకుమిణుకు మంటుంటాయి. మానవ జీవితంలోకూడా కొందరు చంద్రునిలా సంతోషంతో పెరిగిపోయి ఆనందించడం, మరలా తరిగిపోయి దుఃఖించడం తప్పదు. మనిద్దరం చంద్రుని లాంటివాళ్ళము. మనం ఎక్కడినుండి ఎక్కడికి వచ్చాము? అలాగే ఇక్కడి నుండి ఎక్కడికిపోతామో? అట్లా జరక్కపోయివుంటే నక్షత్రాల్లాగా మిణుకు మిణుకు మంటూ ఉండేవాళ్ళము కదా! మన ఆరంభం కృష్ణ పక్షంలో చంద్రుడిలా క్షీణించిన స్థితి నుండి మరలా శుక్ల పక్షంలోకి ప్రయాణించాము. ఇప్పుడు అష్టమిలా ఉన్నాము. రెండూ పక్షాల్లో అష్టమినాడు మాత్రమే చంద్రుడు సమానంగా ఉంటాడు. అందుకని అష్టమిని కూడా నిండు చంద్రుని క్రింద లెక్కవేస్తారు. మనిద్దరం ఒకళ్ళు కృష్ణపక్ష అష్టమి అయితే, మరొకరు శుక్లపక్ష అష్టమి అనుకోవాలి. మనకు ఉన్నదంటే ఉన్నది. లేదు అంటే లేదు. సగం ఉన్నది. సగం లేదు. ఈరెండూ కలిపితే పూర్ణం అవుతుంది, నిండుగా ఉంటుంది. ఇది మన పరిస్థితి.

కాబట్టి నీవు లేని నాకు, నేను లేని నీకు విలువలేదు. నీకు నేను ఉన్నాను. నాకు నీవు ఉన్నావు. కానీ మనిద్దరమూ ఒకరికొకరు ఏమీ కాని వాళ్ళం. అయినా ఇవి రెండు సగాలు. ఒకవేళ ఇలా జరగకుండా, ఇంకోలా జరిగివుంటే అది ఏదైనా కాని, ఈ జీవితాలు రెండూ, ఎండాకాలం సూర్యుడి తాపంతో మాడిమసైపోయి వుండేవి. ఒకనాడు బ్రతకలేక చచ్చిపోదామని అనుకున్నాం. ఇప్పుడు ఏంచేయాలనో తెలియక బ్రతుకుతున్నాం. నీ బాధ నాకు తెలుసు. గతంలో అనేకసార్లు సహృదయంతో మాట్లాడుకున్నాం. స్త్రీగా నీకు సౌఖ్యాన్ని ఇవ్వలేక పోయాను. గతంలో నేను పచ్చిగా ఓడిపోయాను. నన్ను నేను నాశనం చేసుకోవాలని, హింసించుకోవాలని, సమాజంలో అంతకంటే దిగజారుడుతనం ఉండదన్న విధంగా చేసుకోదలచుకున్నాను. చివరకు నేను ఈ సమాజానికి దేన్ని ఆశించకుండా ఒక సమిధను కావాలనుకున్నాను. నన్ను ఈ సమాజం ఎలా ఉపయోగించుకున్నా అభ్యంతరం పెట్టకుండా ఉండాలను కున్నాను...”

“కానీ, నీవు జీవితంలో కోరికలతో, ఆశలతో, ఆశయాలతో ఎదగాలని అనుకున్నావు. అయినా, అవకాశం లేనితనం, నిన్ను నిరాశపరిచింది. చివరకు మన రెండు నిరాశలు ఒకటయ్యాయి. జీవితంలో తిరగబడ్డాం. యుద్ధం చేశాం. యుద్ధంలో గెలిచాం. మనతో సమానంగా గెలిచినవాళ్ళు మనకు తెలిసిన జాబితాలో లేరు...”

“సంసారంలో విఫలమైన ప్రేమ, నన్ను యుద్ధం చేయమని పురమాయించింది. యుద్ధంలో నీకంటే నేనే ఎక్కువగా గెలిచాను. కాని నిన్ను ఎంతో కష్టపెట్టాను. నేను ఈ జీవితంలో మరలా ఓడిపోవడం నీకిష్టమైతే నీవు కోరినవిధంగా ప్రవర్తించేందుకు నాకభ్యతరం లేదు. నీకంటే నాకు ఎవరూ గొప్ప కాదు. ఉన్నాడో లేడో తెలియని భగవంతునికంటే నిన్నే ఎక్కువగా ఆరాధిస్తున్నాను. ఒకవేళ నీ మధ్య, భగవంతుని మధ్య పోటీ వస్తే నాకు నష్టమైనా కష్టమైనా నేను నిన్నే గెలిపిస్తాను...”

“నీ బాధను చూచి నేను ఎంత చిత్రవధను అనుభవిస్తున్నానో నీకు తెలుసునని నాకు తెలుసు. నన్ను వదిలేయ్. నీకు క్లియోపాత్రా లాంటి అమ్మాయిని తెచ్చి పెళ్ళిచేస్తాను. అలా నీకు కొంత మనశ్శాంతి ఏర్పడితే, నీ సంతోషం చూచి నీవు పొందే ఆనందం వేయి జన్మల దుఃఖాన్ని తుడిచిపెట్టేస్తుంది నాకు...”

“అందువలన నిర్ణయం నీది. నేను నీ కోసం ఓడిపోవడానికి సంసిద్ధంగా ఉన్నాను. అలాంటి ఓటమి నన్ను బాధపెట్టదని నమ్మకంగా చెప్తున్నాను. కాబట్టి దీన్ని

త్యాగమను, కర్తవ్యమను. నీకోసం దేనినైనా చేయడానికి నేను సంసిద్ధంగా ఉన్నాను". పూర్ణిమ మాట్లాడ్డం ఆపి కొంచెం గ్యాప్ ఇచ్చింది.

శశిధర్ "వెన్నెలలో నీచేత్తో అన్నం కలిపి పెట్టి చాలారోజులైంది".

మాట పూర్తికాక మునుపే స్విచ్‌బోర్డ్ దగ్గరికిపోయి బెల్‌నొక్కి, సరళ రావడంతో భోజనం పైనఏర్పాటుచేయమని చెప్పింది. పదినిమిషాల్లో అన్ని ఏర్పాట్లు చేసి, వడ్డించమంటారా అని గరిట చేతిలో పెట్టుకొని నిలబడింది. ఇంతలో పూర్ణిమ "అక్కర్లేదు. అవసరమైతే పిలుస్తాలే". పూర్ణిమ కంచంలో అన్నము, కూరలు వడ్డించు కొని, శశి చేతిలో ముద్దలు పెట్టి తాను కూడా శశి బలవంతంతో తిన్నది. వెన్నెలలో కూర్చుని హాయిగా పూర్ణిమ చేత ముద్దలు కల్పించుకొని, కొసరి కొసరి తినిపిస్తే తృప్తిగా తిన్న శశి మనస్సు ఊరట చెందింది.

శశిధర్ "ఈరోజు ఇద్దరు వ్యక్తులు రాజోలు నుండి వచ్చి వాళ్ళ పిల్లలు జర్మనీలో పనిచేస్తున్నారట, పెద్ద మొత్తాల్లో డొనేషన్ ఇవ్వాలని, దానిని అంగవైకల్యంతో బాధపడే అనాధ పిల్లలకు ఉపయోగించుకోవాలని చెప్పారు. నీతో కలిసి మాట్లాడేందుకు అపాయింట్‌మెంట్ అడిగారు. జర్మనీ నుండి మాట్లాడతామని, వీలైతే ఫోన్ నెంబర్, టైము చెబితే నీ ప్రకారం చేస్తాం అంటున్నారు. "రోజు రోజుకు డోనార్స్ ఒత్తిడి ఎక్కువవుతున్నది. ఇంకా ఎన్నిసంస్థలను పెట్టి నిర్వహించగలము? ఎవరిని నమ్మాలో, నమ్మకూడదో తెలియడం లేదు" అని ముగించాడు. "పూర్ణిమ ముక్తసరిగా చూద్దాం. వీలైతే చేద్దాం. లేకపోతే ఉన్నవాటిని జాగ్రత్తగా నడిపే మార్గాలను వెదుకుదాం" అని అన్నది.

* * * * *

## దేశభక్తి

ఆరోజు ఆదివారం. పదిగంటల ప్రాంతంలో రంగారావు ఆరడుగుల ఆజాను బాహుడు, పూర్ణిమ ఇంటికి వచ్చాడు. భుజానికి సంచి, పొడుగాటి గడ్డం, నుదుటిమీద తిలకం ఆయన రూపం. లోపలికి అడుగు పెట్టీపెట్టకముందే ఒక్కక్షణంకూడా కాలాన్ని వృధా చేయకూడదని భుజానికి తగిలించిన సంచిలోంచి చిన్నపుస్తకాలను తీసి అక్కడున్న నలుగురైదుగురికి పంచి, దాన్లో ఉన్న సారాంశాన్ని క్లుప్తంగా చెప్పి భరతమాత, దేశభక్తిపై నేటి ప్రస్తుత రాజకీయాల్లో దేశానికి జరుగుతున్న నష్టాన్ని ఏకరువుపెట్టాడు. తాను వచ్చిన పని అయిపోనట్టు పైకి లేచి వెళ్ళిపోబోతుంటే పూర్ణిమ "ఒక్కక్షణం

ఆగండి" అంటూ పనివాళ్ళకు ఆర్డర్ ఇవ్వడంతో తినుబండారాలు, నీళ్ళు, మజ్జిగ, టెంకాయ నీళ్ళు అన్నీ వచ్చాయి. ఎవరికి కావల్సినవి వాళ్ళు తీసుకున్నారు.

పూర్ణిమ రంగారావు వైపుకు తిరిగి "మాస్టారు! మనందరం ఒక విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించాల్సిన సందర్భం ఏర్పడింది. దేశభక్తి చివరిమెట్టు. దాన్ని ఎక్కడానికి విక్రమార్కుడి సింహాసనంలాగా చాలా సోపానాలు ఉన్నాయి. వ్యక్తి సమాజంలో ఒక భాగం. వ్యక్తికి వ్యక్తిత్వం, త్యాగం లేనినాడు సమాజం మొత్తం కుళ్ళిపోతుంది. ఎందుకనంటే ఆ వ్యక్తి తననుతాను భ్రష్టుపట్టించుకోవడమే కాక కుటుంబాన్ని, రాజకీయాన్ని, మతాన్ని, దేశాన్ని సతమతం చేస్తాడు.

ఇది ఎట్లాంటిది అంటే ఒక రాజుగారు లక్ష క్షీరఘృతాభిషేకం చేయాలనుకుంటే, ప్రతివాడు అవతలవాడు పాలుపోస్తాడు కదా అని నీళ్ళు పోసినట్టు ఉంటుంది. ఇన్నివేల సంవత్సరాల్లో మానవుడు క్రమశిక్షణను, ప్రేమ త్యాగం స్వార్థానికి తప్ప, పరార్థానికి వాడుకోవడం అరుదు. ఏ కొద్దిమంది మహానుభావులో ఉన్నారు. వాళ్ళ వల్ల ఇంకా ఈ సమాజం నడుస్తున్నదనిపిస్తుంది. ఈ ధోరణులను మార్చడానికి, అనేకమంది సామాజిక, ఆధ్యాత్మికవాదులు, ఎన్నో ప్రయత్నాలు, మార్పులు, చేర్పులు చెయ్యడానికి పూనుకున్నారు. కాని వాళ్ళ ఆలోచనలకు చర్యలకు గండికొట్టేదానికి అనేకమంది రెడీగా కాచుక్కూర్చున్నారు. అందువల్ల వ్యక్తిని నిస్వార్థం త్యాగం ధర్మం న్యాయంలాంటి ఆలోచనతో ఆచరణలతో సంస్కరించకపోతే, ఎలాంటి మార్పు సమాజంలో వస్తుందని నమ్మలేము.

ప్రేమతో చేసే ఆలోచన, హృదయంతో చేసే పని, మహత్తరమైన ఫలితాలిస్తాయని, చివరకు రాళ్ళు, చెట్లు కూడా ప్రేమకు స్పందిస్తాయని, చాలా సంఘటనలను విని ఉన్నాం. పూర్వకాలంలో ఒక శిల్పి చాలా ప్రయత్నంతో ఒక రాతి గుండును ఎంచుకొని దాని దగ్గరే కూర్చుని, అక్కడే భోంచేస్తూ, అక్కడే నిద్రపోతూ ఆ రాతితో మాట్లాడుతూ తాను తనను చెక్కి ఒక అందమైన శిల్పంగా తయారుచెయ్యాలని ప్రతిరోజూ అడుగుతూ దాని అనుమతి కోసం వేచి ఉండేవాడు. చాలారోజుల తర్వాత ఆ బండనుండి తనకొక అంగీకారం, సిగ్నల్ రావడం అతనికే అర్థమవుతుంది. వచ్చిన వెంటనే ఆ బండను చెక్కి ఒక గొప్ప శిల్పాన్ని తయారుచేస్తాడు. మనకు అది బండ. కాని అతనికి దాంట్లో అందమైన శిల్పం కనపడుతుంది.

అలాగే రాజుగారు తనకొక బీరువా కావాలని ఒక కొయ్యపనివానికి ఆదేశిస్తే, అతను అడవిలో చాలారోజులు తిరిగి బాగాఉన్నదనుకొన్న ప్రతి చెట్టుదగ్గరికిపోయి

రాజుగారి మహల్‌లో బీరువా కావడానికి సమ్మతికొరకు అర్థిస్తే చివరకు ఎన్నో రోజుల తర్వాత ఒకచెట్టు అంగీకరిస్తే, తాను దాన్ని కోసి రాజుగారికి బీరువా ఇచ్చాడని విన్నాం.

పెద్ద పెద్ద దేవాలయాలను చూస్తే అంతపెద్ద బండలను శిల్పులు ఎలా మోయగలిగారు అన్నదానికి అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. పైపెచ్చు దానికి శిల్పశాస్త్రం ఉంది. కాబట్టి హృదయంతో చేసే ప్రతిపనిలో ఒక పూర్ణత్వం ఏర్పడుతుంది. పైపెచ్చు ఇష్టంగా మనస్ఫూర్తిగా చేసే ఏ మంచిపనైనా, మనలోని విసుగును, అసూయను, ఆవేశాన్ని, నిరాశను తరిమివేస్తుంది.

మానవజాతి, లక్షల సంవత్సరాలుగా పరిణామ క్రమంలో మేధస్సును పదును పెట్టుకొని, జీవితాలను ఆనందమయం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తే, కొద్దిమంది స్వార్థపరుల కారణంగా దేశానికి సరిహద్దులు ఏర్పాటుచేసి, అధికార కాంక్షతో, రాజ్యకాంక్షతో, మతమౌఢ్యంతో, యుద్ధాలను పురిగొల్పి నాగరికతను, సంస్కృతిని నాశనం చేస్తూ మారణకాండకు కంకణం కట్టుకొన్నవారు ఎందరో. అసలు ఒకటిగా ఉన్న ఈ భూమండలం ఇన్ని ఖండాలుగా, దేశాలుగా, రాజ్యాలుగా సరిహద్దులు నిర్ణయించుకోవ డానికి అమాయకులను 'దోపిడి' అనే నినాదంతో సరిహద్దులు నిర్ణయిస్తూ వచ్చారు. నిర్ణయిస్తూనే ఉన్నారు. ఇంకా నిర్ణయిస్తూనే ఉంటారు.

ఎన్నిసార్లు ఈ సరిహద్దులు మార్చారో ఆ యుద్ధాల చరిత్ర పుటలను తిరగేస్తే అర్థమవుతుంది. దానికి దేశభక్తి, జన్మభూమి, కన్నతల్లి అనే పేర్లు పెట్టారు. ఏ కన్నతల్లో, ఏ జన్మభూమో ఎవరికీ తెలియదు. వీళ్ళు మానవులుగా, మానవత్వం ఉన్నవారిక్రింద చలామణిఅవుతున్నారు.

ఈనాడు ఇది నాదేశం అని చెప్పుకునేది, ఎన్ని సార్లు ఎన్ని సరిహద్దులతో, ఎంతమంది చేతులు మారిందో ఊహకందని విషయం. ప్రస్తుత దేశాలు 50 సంవత్సరాల క్రిందటివా? లేక నూరు, వెయ్యి, లక్ష, కోట్ల సంవత్సరాల క్రిందటివా? ఎప్పుడు ఏం జరిగింది, ఎవరైనా చెప్పగలరా? కాని మానవులకు మాత్రం ఆకారం, రంగు తేడాలు మినహా యిస్తే, కాళ్ళు, చేతులు, కళ్ళు మాత్రం మారలేదు. జీవితాన్ని నిలిపే ప్రతిమనిషి లోని రక్తం లక్షణం మారలేదు. మిగతావన్నీ మారిపోయినాయి.

ఇది చాలదన్నట్టు ప్రతిజాతికి, మతానికి, కులానికి అనేక దేవుళ్ళు తయారయినారు. దేవుడు ఒక్కడే. కాని అనేక రూపాలలో ప్రదర్శింపబడుతున్నాడు. మానవజాతి ఒక్కటే. కాని మనిషి మనిషిని హింసించి తద్వారా లబ్ధిపొందడం మానవ నైజం అయిపోయింది. సత్యాన్ని చెప్పాలంటే మానవులు తమ శక్తి సామర్థ్యాలను,

మేథస్సును నూటికి 50కి పైన 90 శాతం లోపల యుద్ధాలకు, మోసాలకు, దోపిడీకి, దౌర్జన్యానికి, హింసకు, వెచ్చించారనడంలో  సందేహపడాల్సిన అవసరంలేదు.

నిజానికి ఈ ప్రపంచం ఒక అనంతమైన యుద్ధభూమి. నిరంతరం భావనల మధ్య, పదార్థాలమధ్య, సంఘటనలమధ్య ఘర్షణ జరుగుతుంటుంది. మిగత యుద్ధాల్లాగా దీంట్లో గెలుపు ఓటములు ఉండవు. దీనిని గమనించగలిగిన వారు మేధావుల జాబితాలో చేరుతారు. అటువంటివాళ్ళు ద్రష్టలు, భవిష్యత్తును చూడగలిగిన వారు. జరగబోయే మార్పులు చేర్పులను దర్శించగలిగిన వారు. అందుకే వారిని దార్శనికులు అంటారు. దీనికి జ్ఞానం, తపస్సు, ధ్యానం, యోగం, లాంటి వాటిని అభ్యాసం చేసిన వారికి ఇలాంటివి చాలా సులభమౌతాయి. ఇదంతా ఈ సృష్టి క్రియ. దీనిని మాయ అని, ఇంద్రియాతీతమైన జ్ఞానమని, జ్ఞానోదయమని అంటుంటారు. అలాంటి ఇంద్రియాతీత స్థితి ఏ కొద్దిమందినో వరిస్తుంది. కాలక్రమేణా అవి సిద్ధాంతాల క్రింద ప్రచారంలోకి వచ్చి ఒక శాస్త్రజ్ఞానంగా పరిగణింప బడుతుంది. మనం చేయాల్సిందల్లా, దేశమంటే మట్టి, గాలి, నీరు, నిప్పూ కాదు, మానవత్వంతో నిండిన మానవులు అని తెలియజెప్పాలి. వాళ్ళు ప్రేమతో, త్యాగంతో, పవిత్రంగా ఉంటే, ప్రతిదేశం, అనగా ప్రపంచమంతా ఒకటిగా, శాంతియుతంగా ఉంటుంది.

అయితే, మహనీయుడు జంధ్యాలపాపయ్యశాస్త్రి, ఇంకా కొన్నిమెట్లు పైకి ఎక్కి ఈ మానవాళికి, మానవేతర జీవులలో, వస్తుసముదాయంలో, కరుణ, దయ, ప్రేమ, ఆర్ద్రత లాంటి  గుణాల రూపురేఖల గుబాళింపును అందించినందుకు ఆయనకు ఈ మానవజాతి, ముఖ్యంగా తెలుగుజాతి ఋణపడి ఉంది. తాను పుష్పవిలాపం, విశ్వప్రేమ, పాకీపిల్ల లాంటి అనేక విషయాలపై చూపించిన కరుణ అమోఘం. ఉదాహరణకు –

"నేనొక పూలమొక్కకడ నిల్చి... నా ప్రాణము తీతువా అనుచు  బావురుమన్నవి..." "ఊలుదారాలతో గొంతు కురి బిగించి... మైలపడిపోయనోయి నీ మనుజ జన్మ... నరజాతికి నీతి యున్నదా?"

"నీ ఓపిక చూచి మెచ్చి... జగత్పతికన్నుగొల్కులన్, తేపకు తేపకున్ బయలు దేరునవే, నునువెచ్చభాష్పముల్". ఇలాంటి వాటిని మనం ఎలా మరచిపోగలము అంటూ ముగించింది పూర్ణిమ.

* * * * *

# 6. వృద్ధాప్య పరితాపం

పూర్ణిమ సోఫాలో కూర్చునివుంది. ఒంటెల రాజన్న పూర్ణిమ ఇంటికి వచ్చాడు. “రండి! రండి! కూర్చోండి”, అని ఎదురుగా ఉన్న సోఫాను  చూపించింది. ఎప్పుడూ వృద్ధాశ్రమాల్లో మీటింగుల్లో విద్యాసంస్థల్లో అనేక కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా, శ్రోతగా కనపడే రాజన్న ఆమె ఇంటికి రావడం పూర్ణిమకు ఆశ్చర్యం వేసింది. పూర్ణిమ నీళ్ళు మజ్జిగ తెప్పించి యోగక్షేమాలు విచారించి, పిచ్చాపాటి మాటలు, గతం నుండి సమాజంలోని ముఖ్యసంఘటనలు లేవదీసింది. కాని రాజన్న ముక్తసరిగా ఒకటి రెండు మాటలకంటే ఎక్కువ మాట్లాడలేదు. కవిగా, గాయకుడుగా మంచిపేరున్న సినిమా, స్టేజీ నటుడు, అసలు వేరేవాళ్ళను మాట్లాడించే తత్త్వం లేని రాజన్న, ముక్తసరిగా ఉండడానికి కారణం తెలియలేదు పూర్ణిమకు. దాదాపు ఒంటిగంట అవుతున్నది. ఏం మాట్లాడాలనో తెలియక రాజన్న స్తబ్దతను దారి మళ్ళిద్దామని భోజనానికి లేవమని అడిగింది. రాజన్న “భోజనం చేస్తానమ్మా, మీ ఇంట్లో తప్పక భోజనం చేస్తా. చివరి భోజనం మీ దగ్గర చేయడంవలన ఒకవేళ నరకంలో కొన్ని బాధలనుండి విముక్తుడ నౌతానేమో. అందుకని తింటాను” అని అన్నాడు రాజన్న.

బాధతో నిండిన మనస్సు ఇతరులతో పంచుకోవడానికి ఎంత తపన పడుతుందో అర్థంకాదు. అలా పంచుకోవడం వలన ఎంతో బరువు తగ్గినట్టనిపిస్తుంది. అదొక విచిత్రం. పూర్ణిమకు వెంటనే గతంలో నగేష్ అనే వ్యక్తికూడా వచ్చి తన బాధలను చెప్పుకొని, ఇంటికి వెళ్ళి పురుగుల మందు తాగి చనిపోవడం గుర్తుకు వచ్చింది. “ఏమిటి రాజన్న గారు అలా మాట్లాడుతున్నారు. ఏదైనా ఇబ్బంది కలిగిందా? డబ్బు

సమస్యా? ఏమైంది? మీలో ఒక కొత్త వ్యక్తిని చూస్తున్నాను. అసలు విషయానికి రండి", అని అన్నది పూర్ణిమ.

"మీ ఊహ నూటికినూరుపాళ్ళు సత్యం తల్లీ! జీవితం మీద విసుగు విరక్తి అంటే మనభాషలో బోరుకొట్టడం. మనవాళ్ళకు, మనం అవసరం లేదని తెలిస్తే ఇంకెవరికోసం మనం బ్రతకాలి? ఈ ప్రపంచంలో ఎవరినుండి ఏమీ ఆశించకుండా, ఇతరుల ఆనందం కోసం సేవచేసే వ్యక్తి నాజీవితంలో తారసపడ్డది మీరొక్కరే. నేను చివరి మెట్టుమీద ఉన్నాను. ఒకవేళ ఏదైనా జరిగితే వింతలేదు. అలా జరిగే ధైర్యాన్ని ఈయమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. పైగా నేను ఉండి చేయగలిగినది ఏదీ లేదనిపిస్తున్నది. అప్పుడప్పుడు నాలుగు చిన్నివేషాలు వేసి నాలుగు రూపాయలు సంపాదించడం తప్ప. దానికి చాలామంది ఉన్నారు. ఇంకా భూమికి భారంగా ఉండడం అనవసరం అనిపిస్తున్నది" అని ఆగాడు.

"మొహమాటం లేకుండా చెప్పాలంటే, ఇంత ప్రపంచాన్ని చూచి, ఎంతోమందికి ఎన్నో మంచివాక్యాలు చెప్పి, కవిగా, గాయకునిగా, నటునిగా, ఆనందాన్ని కల్పించే మీలాంటి వారి అవసరం సమాజానికి చాలా ఉంది. అటువంటప్పుడు ఇలా పలాయనం చిత్తగించడం, మిమ్ములను మీరు మోసం చేసుకోవడం అని అనిపిస్తున్నది" అన్నది పూర్ణిమ.

రాజన్న పూర్ణిమ చెప్పినదంతా విన్నా కూడా తలపైకెత్తలేదు. ఏం చెప్పాలో తెలియడం లేదు. ఒక విషయాన్ని అనేక కోణాల్లో స్పృశించగల మేధావులు కూడా సమస్య తమదాకా వచ్చేసరికి నోరుమెదపలేరు. అక్కడ మంచి, చెడ్డ అని రెండు ఉండవు. బాధ అన్నింటిని మింగేస్తుంది.

పూర్ణిమ మరలా అందుకున్నది. "సమస్యకు మంచి పరిష్కారాన్ని వెతికి, పదిమందికి యోగ్యంగా ఉండేటట్టు ఆలోచించవలసిన మీలాంటివారు ఇలా కుంగిపోవడం సబబుగాదనిపిస్తుంది. నేను ఎక్కువ చనువు తీసుకుంటున్నాననుకున్నా, నేను బాధపడను. నేను మీలాంటి ఉత్తములు బాధపడితే తట్టుకోలేను. బాధపడేవాళ్ళ కన్నీళ్ళు తుడిచే అవకాశం నాకు రాకూడదని నేను భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అంటే నాకు తెలిసినవాళ్ళు బాధలు లేకుండా హాయిగా బతకాలి. బాధపడితే మాత్రం వాళ్ళబాధను పంచుకోవడం, దానికి పరిష్కారమార్గం వెతికి ఆచరణలో పెట్టడానికి ఎంత కష్టాన్నైనా నేను భరిస్తాను. మీ విషయంలో వేరేకోణంలో ఆలోచిస్తే, మనం

ఎవరికీ పనికిరామనుకోవడం కంటే మనం అందరికీ అవసరమని, మన అవసరం చాలామందికి ఉందని, మనం ఆలోచిస్తే బాగుంటుంది కదా! మనకెవ్వరూ పని ఇవ్వకపోతే, మనమే ఒక పనిని సృష్టించుకుందాం" అన్నది పూర్ణిమ.

ఇంతలో శశిధర్ కారు దిగి లోపలికి వచ్చాడు. రాజారాం గారి వైపు తిరిగి నమస్కారం చెప్పి "ఏం! గురువుగారు బహుకాలానికి విచ్చేశారు. ఏదో విశేషం ఉండిఉంటుంది" అని అన్నాడు . రాజన్న ప్రతినమస్కారం పెట్టి, ఏంజవాబు చెప్పాలో అర్థంకానట్టు పూర్ణిమవైపుకు తిరిగాడు. పూర్ణిమ అందుకొని "మీకోసం కాచుక్కూర్చున్నారు మాస్టారు. త్వరగా రండి భోజనం చేద్దాం" అన్నది పూర్ణిమ.

శశిధర్ అయిదు నిమిషాల్లో తయారైవచ్చి డైనింగ్‌టేబుల్ వద్ద కూర్చున్నాడు. పూర్ణిమ రాజన్న గారిని వెంటబెట్టుకొని టేబుల్ దగ్గరకు వచ్చింది. పనివాళ్ళు అన్నీ సర్దిపెట్టినా అతిథికి వడ్డన చేయడం పూర్ణిమకు ఇష్టమైన పని. ఎప్పుడో మధ్యలో అవసరమైనప్పుడు పనివాళ్ళు అందుకుంటుంటారు. భోజనాల కార్యక్రమం పూర్తయింది. భోజనం అయిన వెంటనే శశిధర్ అర్జెంటుగా వెళ్ళాల్సిన పని ఉందని రాజన్న వద్ద సెలవు తీసుకొని బయలుదేరాడు.

పూర్ణిమ రాజన్నతో మరలా చర్చ ప్రారంభించింది."మాస్టారు! నేను ఒక మంచి సామాజిక స్పృహతో కూడిన కార్యక్రమం చెబుతాను. దానికి మీరు శ్రీకారం చుట్టండి. అలాంటిది మీలాంటి పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులకు ఒక దిక్సూచి అవుతుంది. అలాంటి వాళ్ళకు మీరు ఒక ఆదర్శవ్యక్తిగా (రోల్‌మోడల్‌గా) తయారౌతారు. మిమ్ములను ఇలాంటి బాధకు గురిచేసిన వ్యక్తులకు ఇది ఒక మంచి గుణపాఠం అవుతుంది. మీరు ఎప్పుడు ఎక్కడ ఇబ్బంది ఎదుర్కోవలసి వచ్చినా నేను మీ వెనుకనే ఉన్నానన్న విషయం మరచిపోవద్దు. నేరుగా నాదగ్గరకు వచ్చేయండి ."

రాజన్న తక్షణం చేయవలసిన కార్యక్రమవివరాలను చాలాసేపు విపులంగా వివరించింది పూర్ణిమ. రాజన్న భవిష్యత్తులో ఎదుర్కొనవలసిన ఇబ్బందులను, వాటికి పరిష్కారాలను సూచించింది. పూర్ణిమ మాటలకు రాజన్న మనస్సులో, ఒక కొత్త ఉత్సాహం, తెగింపు, కసి, వచ్చింది. ఆమె చెప్పింది విన్నాక తన జీవితం ఇప్పుడున్న స్థితికంటే బాగాలేకుండా పోదు అన్న నమ్మకం కలిగింది రాజన్నకు. అంతటితో రాజన్న ఆమెదగ్గర సెలవుతీసుకొని బయలుదేరాడు. రాజన్న వెళుతున్నప్పుడు

డబ్బులేమైనా అవసరం ఉందా అని అడిగింది పూర్ణిమ. లేదు కావల్సినంత ఉందని చెప్పి అక్కడ నుండి నిష్క్రమించాడు.

* * * * *

## రాజన్న ప్రయాణం

ఏప్రిల్ నెల మధ్యాహ్నం 3 గంటలు కావస్తున్నది. అసలే ఎండలు. ప్రయాణం చేయడానికి ఎంతో ఇబ్బందికరంగా ఉన్నది. బస్సు మెట్టూరు రచ్చబండ దగ్గర ఆగింది. అక్కడ రాజన్న దిగి రచ్చబండ దగ్గరకు వెళ్ళి, తన భుజాన తగిలించుకొన్న సంచిని, చేతులో ఉన్న సూట్‌కేస్‌ను గట్టుమీద ఉంచాడు. చేతిసంచిలో నుండి నీళ్ళ బాటిల్ తీసుకొని, నాలుగు గుక్కలు నీళ్ళు త్రాగి మూత బిగించి మరలా సంచిలో ఉంచాడు. తలలోని వెంట్రుకలన్ని ఆలోచనలు రాజన్నను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

నిన్న పూర్ణిమ మేడమ్ దగ్గరకు పోకపోతే, ఆమె ఆలోచనను వినకపోతే ఇక్కడకు వచ్చే పని ఉండేదికాదు. ఇప్పటికే బహుశా వేరేలోకానికి ప్రయాణం కట్టిఉండేవాడు. పూర్ణిమ ఇచ్చిన సందేశం తన జీవితానికి ఒక దశను దిశను చూపిస్తాయని అనిపిస్తున్నది. ఆ నమ్మకంతోనే ఎక్కడ దిగినా ఒకటే కాబట్టి ఇక్కడ దిగేశాడు. పూర్ణిమ కాకుండా ఇంకెవరైనా ఇలాంటి సలహా ఇచ్చివుంటే హృదయానికి హత్తుకునేది కాదు. ఆమె మాటలలో, చేతలలో పత్యేకత ఉంది. ఆమె త్యాగం, వ్యక్తిత్వం, పత్యేకమైనవి. తన జీవితంలో తాను డ్రామాల్లో, సినిమాల్లో ఎన్నో వేషాలు వేశాడు. ఎంతోమంది అందగత్తెలను చూశాడు. కాని అవన్నీ త్రాసులో ఒకవైపు పెట్టి పూర్ణిమను మరొక వైపు పెడితే వాళ్ళందరూ దూదిపింజలైపోతారు. ఇటువంటి ఆమెను సృష్టించడం బ్రహ్మదేవుని రచనా చమత్కృతి అనుకోవాలి. లేకపోతే తాను లెక్కలేనన్ని వృద్ధాశ్రమాలు, విద్యాలయాలు, కళాసంస్థలను స్వార్థంలేకుండా నడుపుతున్న దంటే తనకు భగవంతుడు ఇచ్చిన వరమా లేదా తన సంకల్ప బలమా అర్థంకాదు అని ఆలోచిస్తున్నాడు

తనను సినిమాలో హీరోయిన్ పాత్రలు వేయడానికి, ఎలాగైనా ఒప్పించాలని ప్రయత్నం చేసిన సినిమా సంస్థలు లెక్కలేనన్ని. అలాగే రాజకీయాల్లోకిలాగాలని ప్రయత్నం చేసిన పార్టీలు కోకొల్లలు. ఎంతోమంది ప్రొడ్యూసర్లు ఎంత ప్రయత్నించినా సున్నితంగా తన తిరస్కారాన్ని తెలిపి వాళ్ళకు బహుమానాలిచ్చి పంపిస్తుంటుంది. ఎంతమంది ఎన్నిరకాలుగా ఈ ప్రాపంచిక ముగ్గులోకి లాగాలని ప్రయత్నించినా

చాకచక్యంగా అవునంటూనే తిరస్కరించడంలో తనకు తానే సాటి. దీన్నే సాధారణంగా ది ఆర్ట్ ఆఫ్ సేయింగ్ 'నో' అని అంటారు.

ఒక గంట గడచిపోయింది. అది నాలుగు వీధుల కూడలి అయినందున, వ్యక్తుల రాకపోకలు బాగానే ఉన్నాయి. వస్తూ పోయేవాళ్ళు తాను కొత్తవ్యక్తినని ఎవరూ పలకరించే సాహసం చేయలేదు. సాయంత్రం 5 గంటలైంది. ముగ్గురు వ్యక్తులు రచ్చబండ దగ్గరకు వచ్చి వాళ్ళ దినచర్య ప్రకారం బండమీద కూర్చొన్నారు. కొత్త వ్యక్తిని పలకరిద్దామని వాళ్ళ మనసులో ఉన్నా, బాగుంటుందా అని సందేహపడ సాగారు. కొన్ని నిమిషాలు గడిచాయి. కొత్త వ్యక్తి ఎవరో తెలియకుండా రోజు, మాట్లాడుకునే పిచ్చాపాటికి ఆస్కారం లేకుండా పోయిందన్న ఆలోచనతో సతమౌతున్నారు. ఆలోచనలతో మరో లోకంలో ఉన్న రాజన్నను ఎవరో పలకరించినట్లు అనిపించింది.

పక్కకు తిరిగిచూస్తే అక్కడ కూర్చొన్న పెద్ద మనుషులలోని ఒక వ్యక్తి "నా పేరు నాగరాజు, ఈయన భావనారాయణ, అవతలి వ్యక్తిని చూపిస్తూ, వీరు రామచంద్రయ్య మావూరి పంచాయతి ప్రెసిడెంట్, పైగా ఊరి పెద్ద. గతంలో మేము ఎన్నడూ మిమ్ములను చూసిన ఆనవాళ్ళు లేవు. మీరెవరో తెలుసుకోవచ్చా?" అని అన్నాడు.

అందుకు ప్రతిగా రాజన్న, "నా పేరు ఒంటెల రాజన్న అంటారు. నేను గతంలో సినిమాల్లో వేషాలు వేస్తుండేవాడిని" అని కొన్ని సినిమా పేర్లు చెప్పబోతుంటే వాళ్ళు అందుకొని "మాకెందుకు తెలియదు. గడ్డం పెంచుకొనివుంటే మేము గుర్తుపట్టలేక పోయాము. అయినా మీలాంటి మహానటులు ఈ ఊరికి రావల్సిన అవసరం ఏం వచ్చింది? మీరు ఇక్కడ ఏం పనిమీద వచ్చారో చెబితే మేము క్షణాల్లో సంతోషంగా మీ పనిని చేసిపెట్టగలము" అని ముగించారు.

"మీ సహృదయతకు, నన్ను గుర్తించినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నాకంటూ ప్రత్యేకమైన పని ఇక్కడ ఏమీ లేదు. ఒక చిత్రమైన ఆలోచనతో ఏదో ఒక పల్లెటూర్లో నా శేషజీవితాన్ని గడపాలని, ఇతరులకు నేను చేయగలిగిన సహాయం ఏదైనా చేయాలనే సంకల్పంతో బయలుదేరాను. అందుచేత ఇక్కడ దిగడం జరిగింది. ఈ ఊరికి పెద్దలైన మిమ్ములను కలుసుకోవడం చాలా సంతోషాన్ని కల్గించింది. నేను మిమ్ములను ఒక సహాయం కోరాలనుకుంటున్నాను. ఒక చిన్ని ఇల్లు నేను

ఉండడానికి బాడుగకు ఇప్పిస్తే ఉంటాను. ఎవరైనా ఇంటిపని, వంటపని చేసేవాళ్ళు దొరికితే జీతం ఇచ్చుకుంటాను. ఈ సహాయ చేయగలిగితే మీకు నా కృతజ్ఞతలు” అని ముగించాడు.

ఇంతలో రామచంద్రయ్య అందుకొని “మీరు భలేవారే, ఇంత గొప్ప వ్యక్తి మావూరికి వచ్చి కాపురం ఉంటానంటే ఊరి జనమంతా మీముందు వాలరా? అదేం భాగ్యం, మీకు కావాలంటే ఒక ఇల్లేమిటి నాలుగిళ్ళు ఇవ్వమా!” అని అత్యుత్సాహంతో మాట్లాడసాగారు. అక్కడున్న అందరికీ ఊహించని పరిచయం, గొప్ప అనుభూతిని కలిగించింది.

ఇంతలో రామచంద్రయ్య మరలా అందుకొన్నారు. “అసలు మా మిద్దె ఖాళీగా ఉంది. మీరు ఉండటానికి, భోజనానికి ఎక్కడో వెతుక్కోవలసిన అవసరం లేదు. మా యింటికి అడపాదడపా చుట్టాలొస్తుంటారు. మా ఆవిడకు ఎంతమంది అతిథులు వస్తే అంత సంతోషం. అసలు మీలాంటివారిని చూస్తే ఎగిరి గంతేస్తుంది. ఇంట్లో నలుగురు పనివాళ్ళున్నారు. అందువలన మాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. మీకెలాంటి లోటు రాకుండా చూసేబాధ్యత మాది”.

మరలా రాజన్న అందుకొన్నాడు. “నేను ఊహించనంత ఆదరాభిమానాలు చూపించే మీ సంసిద్ధత నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నది. నేను ఉండదలచుకుంటే సినిమా వేషాలు వేసుకుంటూ సన్మానాలు పారితోషికాలు పొందుతూ ఏ పట్టణంలో అయినా గడిపేయగలను. కాదంటే ఇంతకాలం నాకోసం, నా కోరికలు తీర్చుకోవడానికి, నాభార్య ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు, బిడ్డల బాగోగులు చూసుకోవడానికి జీవితం ఖర్చు చేస్తూ ఉండిపోయాను. 6 సంవత్సరాలుగా నా భార్య మంచాన ఉండిన కారణంతో ఎక్కడికీ కదలకుండా ఆమెకు సేవచేస్తూ గడిపాను. అందువల్ల దేన్నీ ఆశించకుండా, పదిమందికి నా పరిధిలో ఏదో ఒక సేవచేయాలని ఆశించి పట్టణం కంటే పల్లెటూరు బాగుంటుందని ఇక్కడకు వచ్చాను. గతంలో చేసిన పనినే ఇంకా సాగించేందుకు మనసు ఒప్పుకోవడం లేదు. ఎలాంటి ప్రాథమిక ప్రణాళిక లేకుండా 24 గంటల్లోగా మీ ఊరికి వచ్చి చేరాను. నా ఆలోచన కార్యరూపం దాలుస్తుందన్న నమ్మకం మీలాంటి సహృదయులను చూస్తుంటే బలమౌతున్నది. ముక్తసరిగా నా ఆలోచన చెబుతాను వినండి.”

అని అంటుంటే రామచంద్రయ్య అందుకుని “మీరు ఎప్పుడు ప్రయాణ మయ్యారో, ఏమి తిన్నారో, ముందు మా ఇంటికెళ్ళి కాఫీ ఫలహారాలు తీసుకుందాము కదలండి” అని ఒక్కొక్కరు ఒక్కొక్క మాట జతచేస్తూ ఆహ్వానించారు”. దానికి రాజన్న మరలా అందుకొని “దానికేం భాగ్యం తప్పక వస్తాను. నా ఆలోచన మూడుముక్కల్లో చెప్పిన వెంటనే కదులుదాం. నేను ఒక చిన్న ఇంట్లో ఉంటే కొంచెం ధ్యానం, కవిత్వం రాయడం, స్వతంత్రంగా ఉండడం, ఇతరులకు నేను చేయగలిగిన సహాయం చేయడం, సలహాలు, సంప్రదింపులు ద్వారా ఇతరలకు ఉపయోగపడాలని ఉంది. నాకు నేనుగా ఇతరులకోసం బ్రతకాలని ఉంది. ప్రస్తుతానికి నేను చెప్పకలిగినది ఇంతే”.

రాజన్న మాటలు పూర్తయ్యాక, రచ్చబండ నుండి అందరూ రామచంద్రయ్య ఇంటివైపు నడిచారు. రాజన్న ఒక సంచిని చంకకు తగిలించుకొని సూట్‌కేస్‌ను ఒకచేతితో ఎత్తుకుంటుంటే రామచంద్రయ్య ఆ దారిన పోయే ఒకవ్యక్తిని పిలిచి రాజన్న సూట్‌కేసును తీసుకురమ్మని పురమాయించాడు. అందరూ 5 నిమిషాల్లో రామచంద్రయ్య ఇంటివద్దకు చేరారు. వాకిట్లోకి రాగానే బయటవున్న తొట్లో నుండి ఒక వ్యక్తి నీళ్ళు అందించడం, కాళ్ళు చేతులు కడుక్కోవడం జరిగిపోయింది. అందరూ వరండాలో కూర్చున్నారు. పెద్ద కాంపౌండ్‌తో రెండంతస్థుల మేడ. చుట్టూ రకరకాల చెట్లతో చూడ ముచ్చటగా ఉంది.

రామచంద్రయ్య వచ్చిందే తడవుగా భార్యతో రాజన్న గతాన్ని గుక్క తిప్పుకోకుండా మొత్తం ఏకరువు పెట్టాడు. ఆమె మధ్యలో అందుకొని రాజన్న వేసిన పాత్రలను గురించి, ఆయన నటనా కౌశలాన్ని గురించి చాలా ఆనందంతో మాట్లాడుతూ, తాను ఇంత దగ్గరనుండి ఆయనను చూడగలనని ఎన్నడూ ఊహించ లేదని, అందుకు ఎంతో ఆనందంగా ఉన్నదని అన్నది.

మరలా “అయ్యో నా మతిమండి పోను, మిమ్ములను చూచిన ఆనందంలో అన్నీ మర్చిపోయాను. ఏమి తీసుకుంటారు” అని అందరివైపు తిరిగింది. రామచంద్రయ్య “వారు ఎప్పుడు తిన్నారో ఏదైనా ఫలాహారం పంపించి, మాకు టీ” అన్నాడు. కొద్దిసేపట్లో అరిసెలు, కజ్జికాయలు, మురుకులు లాంటివి పెద్దప్లేట్లలో టీపాయ్‌మీద అమర్చబడ్డాయి.

నిజానికి రాజన్న ఉదయం 10 గంటలకు టిఫిన్ చేసి బస్సెక్కినందున బాగా ఆకలిగా ఉంది. ప్లేట్ చేతికి తీసుకొని “అమ్మా! మీరు మీ అలవాటు ప్రకారం మీ హృదయం పెద్దది కాబట్టి ఇన్ని తినుబండారాలు పెట్టారు. అయినా నాకు ఆహారం

పారవేయడం ఇష్టం లేదు. దీంట్లో కొన్ని తీస్తే నాకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. నాకు ఆహారానికి ఆహార్యానికి తేడాలేదు. అందుకే సినిమాల్లో ఏ వేషమైనా వేశాను. పాతరోజుల్లో హీరో వేషాన్నుండి, అడుక్కోతినేవాడి వేషం వరకు ఇష్టంగా వేశాను". అంటూ మధ్యమధ్యలో అనేక విషయాలు చర్చిస్తూ, ఫలహార కార్యక్రమం పూర్తిచేయడం జరిగింది. చీకటి పడింది. గంట 7 దాటింది. రామచంద్రయ్య రాజన్న వైపుకు తిరిగి "మీరు దయవుంచి మేము చెప్పేది వినండి. మీరు చెప్పినదంతా నాకెరుకయ్యింది. మీ అభిప్రాయం ప్రకారమే రెండుమూడు రోజుల్లో ఖాళీగా ఉన్న ఇల్లు చూచి మాకు దగ్గరగా ఉండేట్టు మీకు సరిపోయేట్టు వెతికి పెడతాము. ఈలోగా మీరు మా మిద్దె మీద రెండు బెడ్‌రూములున్నాయి. అన్ని వసతులున్నాయి. మీరు ప్రస్తుతానికి ఇక్కడ ఉంటే తర్వాత ఆలోచించి మీకు నచ్చిన విధంగా చేద్దాం" అన్నారు.

బస్సు దిగిన రెండు గంటల్లో అనుకోని విధంగా అన్ని వసతులతో ఇల్లు దొరకడం, భోజన సదుపాయం ఉండడం రాజన్నకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. రాజన్న అంగీకారానికి ఎదురు చూడకుండా రామచంద్రయ్య పనిమనిషి సూరన్నను పిలిచి "సూరీ! సార్ సామాను పెద్దబెడ్‌రూమ్‌లో పెట్టి అమ్మనడిగి మంచి దుప్పట్లు వేసి సార్‌ను తీసికొని పోయి ఏమి కావలెనో తెలుసుకొని సమకూర్చు" అని ఆజ్ఞాపించాడు. సూరన్నకు కూడా రాజన్న ఒకనాటి సినిమా నటుడని, గొప్ప వ్యక్తని అర్థమయ్యింది. "అలాగే అయ్యగారు"అంటూ ఇంట్లోకి వెళ్లి అమ్మ ఇచ్చిన దుప్పట్లు, టవళ్ళు, మంచినీళ్ళు బాటిళ్ళు అన్నీ గబగబా పైకి చేర్చాడు. ఈలోగా మిగతా ఇద్దరూ అందరి దగ్గర సెలవుతీసుకొని వాళ్ళ ఇళ్లకు బయలుదేరారు. అన్ని అమర్చిన తరువాత సూరన్న రాజన్నను మిద్దెపైకి తీసుకునివెళ్ళాడు.

ఇద్దరూ రూములోకి వెళ్ళారు. సూరన్న సూట్‌కేస్‌ను, సంచిని టేబుల్‌పై ఉంచి "తమరు ఏమి కావాలన్నా సూరీగా అని కేక వేయండి, నేను వెంటనే మీవద్ద వాలుతాను" రాజన్న సరే అని తలూపి, 'ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో అనుకొన్న నాకు ఈ ఊరిలో రాజభోగాలతో జీవితం ప్రారంభం అయ్యిందని' అనుకొన్నాడు. "మా ఇంటికి ఎవరు వచ్చిన మర్యాదలకు లోపం ఉండదు. మా అమ్మ దేవత. ఇతరులకు దానం చేయడంలో ఆమె పేరు ముందు చెప్పుకోవాలి" "నా పదో సంవత్సరం నుండి పనిచేస్తున్నాను. నాకిప్పుడు 50 సంవత్సరాలు. నాకు ఇద్దరు కొడుకులు. ఒకడు ఇక్కడే ఉన్నాడు. వాడికి చదువు సరిగా రాలేదు. రెండవ వాడు మిలటరీలో

పనిచేస్తున్నాడు. ఇద్దరికీ ఇంకా పెళ్ళికాలేదు. అన్నివిషయాలు మా అమ్మ అయ్య చూసుకుంటారు" అని అన్నాడు.

రాజన్న చొక్కా విప్పి స్టాండ్‌కు తగిలించి స్నానాది కార్యక్రమాలు పూర్తిచేసుకొని సోఫాలో కూర్చుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. చాలారోజుల తర్వాత మనసు చాలా స్థిమితంగా, హాయిగా ఉన్నట్టు అనిపించింది. ఆత్మహత్యాప్రయత్నానికి ముందు పడ్డ మరణవేదనను తలచుకుంటే, ప్రస్తుత పరిస్థితి తుఫాను తర్వాత ఏర్పడే ప్రశాంతత అని అనిపిస్తున్నది. ఇప్పుడు జీవితం మీద ఆశ, విశ్వాసం ఏర్పడుతున్నది. ఒక చిన్న ప్రయత్నం జీవితంలో ఎంతమార్పును తెస్తుంది అని వినడం, చదవడం, తెలుసుకాని అనుభవానికి వస్తేకాని, దాని వైశాల్యం లోతు అర్థంకావు. అని ఆలోచిస్తున్నప్పుడు సూరన్న వచ్చి "బాబుగారు! భోజనం" అనేలోగా, రాజన్న జవాబు చెప్పకుండా సూరన్నను అనుసరించాడు. బయట వరండా దాటి లోపలికి పోతే పెద్ద హాలు, దాంట్లో సోఫాలు కుర్చీలు టీ.వి., చుట్టూ గోడలకు రకరకాల దేవుడి పటాలు, పూర్వీకుల చిత్రపటాలు వేలాడుతున్నాయి. దాని తర్వాత కారిడార్ రెండువైపుల బెడ్‌రూములు. ఆ తర్వాత ఒకవైపు కిచన్, రెండవ వైపు డైనింగ్‌రూము దాంటో పెద్ద టేబుల ఎనిమిది కుర్చీలతో అమర్చబడింది

"రండి, కూర్చోండి!" అమ్మ గారి తియ్యటి పిలుపు. రామచంద్రయ్య కుర్చీ ఎదురు కుర్చీ చూపించి కూర్చోమని ఆహ్వానం పలికింది. ఇద్దరూ చెరోవైపు కూర్చొన్నారు. కొన్ని పదార్థాలు అమ్మగారు వడ్డిస్తే మధ్యలో మరికొన్ని పదార్థాలు ఒక నడివయస్కురాలు వంటమనిషి వడ్డించడంతో భోజన కార్యక్రమం పూర్తయింది. మధ్య మధ్యలో ఇది బాగుందని ఇంకొంచెం వేసుకోమన్న అభ్యర్థనతో, రాజన్నకు తృప్తిగా భోజనం చేసే అవకాశాన్ని కలుగజేశారు. రాజన్న, వడ్డించిన పదార్థాల రుచిని, గతంలో తన అనుభవాలతో జోడించి మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. మరలా వరండాలోకి వచ్చి కూర్చొని నాలుగు నిమిషాలు పిచ్చాపాటి మాట్లాడుకొన్నారు.

ఇంతలో రామచంద్రయ్య గారు కలుగజేసుకని "మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. ఉదయం నుండి బాగా అలసిపోయి ఉంటారు" అని చెప్పడం రాజన్నకు కూడా అదే ఆలోచన ఉండడంతో మెట్లవైపు దారితీస్తుంటే, సూరన్న రాజన్నను అనుసరించి, "అయ్యగారు! టేబుల్ మీద బాటిల్స్ ఉన్నాయి. ఏ.సి. స్విచ్ వేసి ఉంచాను. కావాలంటే ఉంచుకోండి. లేకపోతే తీసివేసుకోండి. ఉదయం మీరు లేచినప్పుడు కూత వేసారంటే, నేను కాఫీ తెస్తాను" అని చెప్పి తలుపు దగ్గరకు వేసి వెళ్ళిపోయాడు. రాజన్న ఏ.సి.

ఆపివేసి కిటికీ తలుపులు తెరుచుకుని మంచంమీద కూర్చొని, రెండు వైపులా దిండ్లు వేసుకొని వెనక్కు ఆనుకొని కూర్చొని పదినిమిషాలు కళ్ళుమూసుకొని ఆలోచనలు పక్కన పెట్టి, ఆలోచనా రహిత స్థితిలోకి వెళ్ళాడు.

* * * * *

రెండ్రోజులు గడిచిపోయాయి. రాజన్నకు తాను అపరిచితుడు అన్న భావన పూర్తిగా పోయింది. రామచంద్రయ్య కుటుంబం వ్యక్తులు అన్నదమ్ముల్లా, స్నేహితుల్లా, కలసిపోయినారు. సినిమా యాక్టర్ రాజన్న రామచంద్రయ్య ఇంటికి వచ్చాడన్న వార్త గుప్పుమనడంతో ఆ ఇల్లు అనేక రకాల వ్యక్తులతో నిండిపోయింది. అన్ని వయస్సుల వాళ్ళు వచ్చి, ధైర్యం ఉన్నవాళ్ళు దగ్గరగా వచ్చి మాట్లాడితే, లేనివాళ్ళు దూరం నుండి నమస్కారాలతో సరిపెట్టుకొంటున్నారు. వచ్చినవాళ్ళు ఎన్నో ప్రశ్నలు వేయసాగారు.

ఇక్కడే ఉండిపోతారా!

ఎన్నిరోజులు ఉంటారు? ఏం చేస్తారు!

సినిమాలో వేషాలు వేయాలంటే ఏంచేయాలి?

మా ఇంటిలో ఉండండి, బాడుగ కూడా ఇవ్వనక్కరలేదు,

ఈవిధంగా ఆత్రుతతో అనేకవిషయాలు తెలుసుకోవాలని దగ్గరగా మాట్లాడాలని, కలసిపోవాలని, అనేక సంభాషణలు ప్రశ్నలతో ఉదయం నుండి రాత్రి వరకు తీరికలేదు. ప్రతిరోజు సాయంత్రం రాజన్న, రామచంద్రయ్య రచ్చబండ దగ్గర మిత్రులను కలవడం, అక్కడ కూడా జనం పోగవుతుండడం, అనేక ప్రశ్నలు వేయడం జవాబులు చెప్పడం పరిపాటైపోయింది. రచ్చబండ దగ్గర 7 గంటల దాకా గడచిపోయేది. కొంతమంది రాజన్నతో ఏకాంతంగా తమ సమస్యలను చర్చించాలని, కొంత సమయం కేటాయించాలని అభ్యర్ధనలు, అర్జీలు ప్రారంభమైనాయి. రాజన్న అందుకు అంగీకారం తెలపడం వాళ్ళు ఎంతో సంతోషించడం లాంటి అనుభవాలు అనేకం. ఒకమాటలో చెప్పాలంటే రాజన్న కొంచెం కవిత్వం రాసినవాడు, కొద్దిగా పాటలు కూడా పాడగలిగిన వాడు, ప్రపంచం చూచినవాడు, మూడు నాలుగు భాషలు మాట్లాడగలిగినవాడు అయినందున, ఆ వూరివాళ్ళకు వింతగా ఉంది. ఒక మంచి వ్యక్తిని, వక్తను చూచి మాట్లాడినందుకు ప్రతివాళ్ళు మురిసిపోతున్నారు.

రాజన్న అనేకసార్లు, సందర్భాన్ని బట్టి రామచంద్రయ్యకు, ఆయన మిత్రులకు తన  కృతజ్ఞతలను చెప్పడం వలన రాజన్న వ్యక్తిత్వంలో ఔన్నత్యం కనపడసాగింది.

ఐదవరోజున ఒక ఇల్లును రాజన్నకు నివాసంగా ఏర్పాటుచేయడం జరిగింది. ఆ ఇంటి ఓనరు పిల్లల చదువుకొరకై పట్నంలో కాపురం పెట్టాలని వెళుతున్న కారణంగా దాన్ని బాడిగకు ఇచ్చేందుకు సంతోషంగా అంగీకరించారు. ఊరిలో వాళ్ళు దేవుడి తిరనాళ్ళకు సహాయ సహకారాలు అందించిన విధంగా, అందరూ పాలుపంచు కున్నారు. రామచంద్రయ్య ఆయన భార్య మొదటి అడుగుపెట్టినవెంట రాజన్న కూడా ఇంట్లోకి ప్రవేశించి, అనసూయమ్మచేత పాలు పొంగించడం జరిగింది.

ఈ జీవితం వ్యర్థమని తాను భూమికి భారమని, తాను తన బిడ్డలకు కూడా అవసరంలేదని, ఈ జీవితానికి ముగింపు పలకాలని ప్రణాళికను తయారు చేసుకొని కాకతాళీయంగా పూర్ణిమను కలవడం ఒక కొత్తజీవితాన్ని గడిపేందుకు ఆమె సలహా ఇవ్వడం, అంతా విచిత్రంగా జరిగిపోయింది. ఇప్పుడు తాను చాలామందికి అవసరమని అనిపిస్తున్నది.

రాజన్న గారు జీవితాన్ని అన్నిరకాలుగా కాచి వడబోసినవారని, అలాంటి వ్యక్తి ప్రస్తుతం తనకు తాను పనికిరాకుండా, ఇతరులకు పనికిరాకుండా ఉండడం అసహజంగా ఉందని పూర్ణిమ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. సినిమా భాషలో మూడు గంటలసేపు డబ్బులిచ్చి సినిమా చూడడం, కథలో ఎలాంటి క్లైమాక్స్ ఉంటుంది అన్న దానికోసమే. ఆతృత ఉండేవాళ్ళు మూడు గంటలు తట్టుకోలేక పక్కనున్న వాళ్ళను చివరకి ఏమి జరుగుతుంది అని అడుగుతారు. అందుచేత క్లైమాక్స్ తెలుసుకోవాలని అందరూ తాపత్రయ పడతారు.

పూర్ణిమ "అసలు జీవితం ప్రారంభించేది వయస్సు ఉడిగిన తర్వాతనే. ఎందుకంటే దానిలో క్లైమాక్స్ ఉంటుంది". అటువంటిది రాజన్న ఆ క్లైమాక్స్‌ను వదిలేస్తున్నాడని పూర్ణిమ, "రాజన్నగారు! మీ విజ్ఞానం ముందర నేను చాలా చిన్నదానిని, ఇప్పటి వరకు మీరు మీకోసం, కీర్తికోసం, మీ సంపాదనకోసం, సుఖం కోసం, పిల్లల కోసం, భార్యకోసం, స్నేహితులకోసం బ్రతికారు. ఇప్పుడు మీకోసం మీరు బతకండి. మిమ్ములను ఇష్టపడేవాళ్ళకోసం, లేదా ఇప్పటివరకు మీతో ఎలాంటి సంబంధం లేనివాళ్ళకోసం, మీలాగనే ఆలోచించేవాళ్ళకోసం, అనాధలకోసం, బాధాతప్తులకోసం బ్రతకండి. ఆ క్లైమాక్స్‌ను అనుభవించండి. దానికొరకు శ్రమపడండి. మీ జ్ఞానం, అనుభవం, ఆలోచన, ఆనందం, సంపద ఇతరులతో పంచుకోండి. ఆ ఆనందపుటంచులను ఒకసారి తరచి చూడండి. మీకు ధన సహాయం కావాలంటే

నేనున్నాను. మిమ్మలను గురించి ఆలోచించే తీరిక, ఓపిక లేని మీ కొడుకు, కూతురును గురించి ఆలోచించి, వాళ్ళ ప్రేమను పొందేందుకు చేసే విఫల ప్రయత్నాలు, ఎండమావులవెంట పరిగెత్తడం అవుతుంది. వాళ్ళకు కావల్సింది వాళ్ళదగ్గర ఉందని అనుకుంటున్నారు. పైపెచ్చు మీ అవసరం వాళ్ళకు లేదనుకుంటున్నారు. మిమ్మలను కావాలనుకునే వాళ్ళు లక్షలమంది ఉంటారు. అయితే సమస్యంతా వాళ్ళకు మీరు తయారుగా ఉన్నారని తెలియదు. వాళ్ళు ఎక్కడున్నారో మీకు తెలియదు. వెతకాలి. అంతే. వెతకడం మన పని. అదే ఆనందమైన జీవితం. అంటే మీ ముసుగు తీసేసి, ఆ ముసుగును వేసుకొని, ఎక్కడా నా అన్నవాళ్ళు లేనిచోట, నావాళ్ళుగాచేసుకొని చూచుకుంటే పరమానందం కలుగుతుంది". ఆనాడు పూర్ణిమ అన్న మాటలు, ప్రస్తుతం నిజం కాబోతుందన్నది." రాజన్న కథను, గతాన్ని వినేసరికి ఆ దంపతులకు ఏం మాట్లాడాలనో పాలుపోలేదు. అయినా ఎలాగో మాట పెగల్చుకొని, "మీరు ఈ ఊరు రావడం మా ఊరు వాళ్ళు చేసుకొన్న అదృష్టం".

* * * * *

రాజన్నకు కొత్త జీవితం ప్రారంభం అయింది. అనసూయమ్మ పుణ్యమా అని, ఇంటికి కావాల్సిన సామాన్లు ఏర్పాటు చేసింది. ఆ ఇంటి ఓనరు వదలిపెట్టిన సామాను కూడా చాలా ఉంది. అందువలన ఏ ఇబ్బంది లేకుండా రాజన్న జీవితం కొత్తమలుపు తిరిగింది. రాజన్న వ్యవహారాలు, వంట వార్పులు, చూచేందుకు సరోజమ్మ అనే ఆమెను నియమించింది అనసూయమ్మ.

సరోజమ్మకు ఇద్దరు కుమారులు. భర్త కరెంటు ఆఫీసులో పనిచేస్తూ ఉండేవాడు. అయితే నిరంతరం తాగుడు అలవాటుతో జీవితం గడిపేవాడు. ఒకరోజు పొరపాటున కరంటు షాకు తగిలి చనిపోయాడు. ఇద్దరు కొడుకులకు పెళ్ళైపోయింది. పిల్లలు కూడా, తనకు భర్త తాలూకు తొమ్మిది వేలు పింఛను కూడా వస్తుంది. అయితే మొదటి తేది వచ్చి, చెరి నాలుగు వేలు తీసుకొని, ఒక వెయ్యిరూపాయిలు తనకు మిగులుస్తారు. ఒకరోజు చిన్నకోడలు వచ్చి అత్తచేతికి ఉండే రెండు బంగారు గాజులు తన కొడుకుకు కాన్వెంట్‌కు ఫీజు కట్టాలని, పై నెల తాను వేసివున్న చీటీని పాడి పదిరోజుల్లో మరలా గాజులు తనఖా నుంచి తెచ్చి ఇస్తానని చెప్పింది. కాని అత్త ససేమిరా ఒప్పుకోలేదు. అయినా కోడలు పట్టువదలని విక్రమార్కునిలా మూడురోజులు అక్కడే ఉండి, అమ్మ మీద, దేవుని మీద ప్రమాణం చేసి గాజులు తీసుకుపోయింది. ఇది జరిగి రెండు సంవత్సరాలు అవుతున్నది. చేతికి గాజులు లేవన్న విషయం

గమనించిన పెద్దకోడలు అత్తతో తగువు పెట్టుకుంది. చివరకి మొత్తం హరికథ అందరికి తెలిసి పోయింది. దాంతో పెద్దకోడలు, చిన్నకోడలు సిగపట్లు పట్టుకొన్నారు. అందుకు పర్యావసానంగా అన్నదమ్ములు కొట్టుకున్నారు. ఇప్పుడు మొత్తం కథ సుఖాంతం అయింది. ఎందుకంటే ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. అయినా నెల నెలా పింఛను మాత్రం వెయ్యిరూపాయలు పోను మిగతా చెరిసగం ఇద్దరు కోడళ్ళు పంచుకుంటారు.

సరోజమ్మకు ఒకవైపు భయం, రెండో వైపు ఆనందంతో తికమక పడుతున్నది. గొప్ప సినిమా యాక్టర్‌కు సేవచేసే భాగ్యం ఎంతమందికి వస్తుంది? అయినా తాను చేసే వంట ఆయనకు నచ్చుతాయా! లేదా! అనే సందేహం, ఎలాగైతేనేం వంట చేయడం, వడ్డించడం, రాజన్న భోంచేయండం, బాగుందని మెచ్చుకోవడం అన్నీ జరిగిపోయినాయి. ఒకవేళ సాదకాలు బాగా లేకపోయినా పరిష్కార మార్గంగా అనేక పొడులు, పచ్చళ్ళు, ఊరగాయలు, గడ్డపెరుగు అనసూయమ్మ పంపిస్తుంటుంది.

మొదటిరోజు భోజనం అయిన కొద్దిసేపటికి, సరోజమ్మను పిలిచి తాను భోంచేసినది లేనిది విచారించి, తనకు వడ్డించిన అన్నీ వడ్డించుకొని కడుపునిండా తినమని చెప్పాడు రాజన్న. రాత్రికి ఏదైనా టిఫిన్ ఉంటే సరిపోతుందని, అర్థమయ్యే భాషలో చెప్పాడు. ఏదైనా కొరవ బడితే తనను అడగమన్నాడు.

సరోజమ్మ భర్త, పెళ్ళినాటినుండి చనిపోయేంత వరకు కనీసం తాగి వచ్చినప్పుడైనా నీవు అన్నం తిన్నావా? అని అడిగిన రోజు లేదు. పెద్దాయన పని మనిషి భోజనం చేసిందా లేదా అని అడిగి, కడుపునిండా భోజనం చేయమని మనస్ఫూర్తిగా అన్నమాటలకు సరోజమ్మ భోరున ఏడ్చేసింది. ఎంత ఆపుకోవాలన్నా ఆపుకోలేక పోయింది. రాజన్న తత్తరపోయి "ఏంజరిగింది, నేను ఏమన్నా పొరపాటు చేశానా, పొరబాటుగా మాట్లాడనా! ఏదైనా పొరబాటుంటే క్షమించు" అని వేడుకోలుగా అన్నాడు. సరోజమ్మ వంగి రాజన్న కాళ్ళకు దణ్ణం పెడుతూ, "మీరు తప్పుచేశారని నేను అంటే నాకు పుట్టగతులుండవు. 25 సంవత్సరాల మా సంసారంలో నా భర్త ఈ విధంగా ఒక్కరోజు కూడా అడగలేదు. అది గుర్తుకు వచ్చి ఏడుపు వచ్చింది. నా చివరిదశలో నా పూర్వ జన్మలో చేసుకొన్న పుణ్యం వలన మీలాంటి గొప్పవాళ్ళకు నా చేత్తో అన్నం పెట్టే భాగ్యం కలిగింది. ఇది భగవంతుని దయ" అన్నది. అప్పటికి రాజన్న మనసు కుదుటపడి, ఒకమాట ఎంత ఆనందం, సంతోషం కలిగిస్తుందో అని ఆలోచించసాగాడు.

* * * * *

మెట్టూరు పెద్ద పంచాయతి. ఐదువేల జనాభా ఉన్న గ్రామం. పెద్ద పెద్ద రైతులు, సారవంతమైన భూములతో పెద్ద మేడలతో ఉన్న ఊరు. ఆ ఊరిలో గ్రామ దేవతల గుడులే కాకుండా, కోదండరామస్వామి దేవాలయం, దానిలోనే ఆంజనేయస్వామితో కలిసి అనేక దేవతల ఆలయాలు, శివాలయంతో సహా ఉన్నాయి. ఆలయాల్లో చక్కగా నిత్యదీపారాధన జరుగుతుంటుంది. ఏదైనా శుభకార్యాలు జరుపుకునే కుటుంబాలు దేవాలయాలకు పోయి పూజలు చేయించుకోవడం, శ్రీరామనవమి, హనుమజ్జయంతి, శివరాత్రి లాంటి రోజుల్లో పెద్ద ఎత్తున పూజలు జరుపుకోవడం ఆనవాయితి.

రాజన్న కీర్తి రోజుకు రోజుకు పెరుగుతున్నది. అప్పుడప్పుడూ పక్క గ్రామాల్లో ఉండే చిన్నపాటి రచయితలు, కళాభిమానులు, కళాకారులు, సంగీత సాహిత్యాలమీద మోజు ఉండేవాళ్ళు రావడం, ముచ్చటించడం, సలహాలు సంప్రదింపులు జరపడం లాంటి హంగామా ఎక్కువవుతున్నది. రామచంద్రయ్యగారింటికి వెళ్ళి పలుకరించేందుకు కూడా రాజన్నకు తీరికలేనంతగా అతిథులు రావడం జరుగుతున్నది. రామచంద్రయ్య రాజన్న పరిస్థితిని గమనించి ఇంటికి ఒక ఫోన్ కనెక్షన్ ఇప్పించడం జరిగిపోయింది. రాజన్న వద్ద ఒక సెల్‌ఫోన్ ఉన్నా దానిని వాడడం పూర్తిగా నిలిపివేశాడు. ఇప్పుడు దానిని మరలా వాడవలసిన పరిస్థితి వచ్చింది.

సరోజమ్మకు క్షణం తీరికలేకుండా వచ్చేపోయివాళ్ళకు, కాఫీలు, టీలు అడపా దడపా భోజనాలు లాంటివి జరిగిపోతున్నాయి. ఆమెకు పని ఎక్కువైపోయినందున ఒక అసిస్టెంటును పెట్టుక్కోవలసిన అవసరం వచ్చింది. వచ్చి పోయేవాళ్ళు వెళ్లేటప్పుడు రాజన్నతో కూడా ఆమెకు కూడా ధన్యవాదాలు చెప్పడం, ఏదైనా పైకం చేతిలో పెట్టడం, తనకు ఒక కొత్త అనుభవం, ఆనందం కలిగించసాగాయి. దాంతో ఒక నూతన జీవితం ప్రారంభించినట్టుగా ఆనంద పారవశ్యంతో శ్రమ అనేది తెలియకుండా పోతున్నది. తాను కూడా ఏదో ఒక యజ్ఞంలో సమిధనైనట్లు, రాత్రి పగలు అనేవి తెలియకుండా వీలైనంత వరకు రాజన్న అవసరాలను కనిపెట్టుకొని, వేళతప్పకుండా స్నానం, భోజనం గుర్తుచేసి ఆయన బాగోగులు చూడసాగింది.

తనమీద ఇంత శ్రద్ధతీసుకొనే పనిమనిషి దొరికి, తనకిబ్బంది లేకుండా జరిగిపోతుందని, కలలో కూడా ఊహించని రాజన్నకు శ్రీశ్రీ చెప్పినట్టు ఆనందం ఆర్ణవమయింది. బహుశా తన జీవితం ఇలా గడిచిపోవాలని తన అంతరాంతాల్లో దాగి ఉండాలి. తన ప్రమేయం లేకుండా, కాలం తనను అలా తోసుకొని, తనకు నచ్చిన జీవితాన్ని కలిగించడం, రాజన్నకు ఎనలేని తృప్తిని కలిగిస్తున్నది. పూర్ణిమ

లేకుంటే ఈ ఆనందాన్ని ఆస్వాదించకుండానే తన ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయేది.

రాజన్నను కలిసిన ప్రతివ్యక్తి, తన సమస్యలకు సమాధానాలు, ఏళ్ళతరబడి దొరకనివి దొరికినట్టుగా సంతోషిస్తున్నారు. బాధతో వచ్చినవాడు దాన్ని తొలగించుకొని, ఇబ్బందితో వచ్చినవాడు దాన్ని తుడిచివేసుకొని, కష్టంతో వచ్చినవాడు, దాన్ని సుఖంగా మార్చుకొని, లేనివాడు ఉన్నవాడుగా మారినట్టు, అనుభూతి పొంది, తాను గతంలో వేసుకొన్న ముసుగును ఆలోచనను లేదా దృక్పథాన్ని, దృష్టిని, నెగటివ్ నుండి పాజిటివ్‌గా మార్చుకొని పోవడం సహజమైపోయింది. అసలు రహస్యం ఎక్కడున్నదంటే రాజన్న సలహా వాళ్ళలో చాలామందికి తెలియక కాదు. కాదంటే దానికి ముద్ర, అంగీకారం దొరికినప్పుడు, నమ్మకం విశ్వాసం ఏర్పడి ఆచరణకు మనసు సిద్ధమౌతుంది. చాలామంది తమ తమ బాధలకు పరిష్కారాలను రాజన్న, అనుభవంతో ఉదాహరణలతో చెప్పి, కొత్తకోణాన్ని స్పృశించడం చాలా సంతోషాన్ని కలిగిస్తున్నది. ఆ కారణంగా రాజన్న మీద ఆరాధన అభిమానం పెంచుకోవడమే కాక అది పదిమందిలోకి చొచ్చుకోపోతున్నది. ఏది ఏమైనా ఎంతమంది వచ్చినా టైం చాలకపోయినా ఐదునిమిషాలన్నా తీరికచేసుకొని, రామచంద్రయ్యను, అనసూయమ్మను పలుకరించి తనకు కుప్పలు తెప్పలుగా తెచ్చి యిచ్చే పండ్లు, తినుబండారాలను, మచ్చుకకు కొన్ని తాను స్వయంగా తీసుకెళ్ళి అక్కడ చేర్చే అలవాటు వదల్లేదు. అదికాక ఆమెచేతి కాఫీ తాగడం రాజన్న దినచర్యగా మారింది.

రాజన్న పేరు వలన రామచంద్రయ్య పేరు గతంలో తెలియని వారందరికీ తెలిసిపోయింది. ప్రజలు వాళ్ళిద్దరి మధ్య అనేక కథలను ప్రచారంలోకి తెచ్చారు. రామచంద్రయ్య రాజన్న చిన్ననాటి స్నేహితులని, దగ్గర చుట్టాలని, రాజన్న బీదరికంతో బాధపడుతుంటే రామచంద్రయ్య సహాయం చేసాడని, రాజన్నకు పెళ్ళికాలేదని, సినిమాల్లో సంపాదించినదంతా అప్పులపాలయిందని, ఊరు విడిచి పారిపోయి వచ్చాడని, ఇలా ఎన్నెన్నో కథలు ప్రచారంలోకి రాసాగాయి.

* * * * *

రాజన్న యథాప్రకారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రామచంద్రయ్య ఇంటికివెళ్ళాడు. భార్యభర్తలు పక్కపక్కనే కూర్చొని ఉన్నారు. రాజన్న వచ్చిన విషయం

వెనుకకు తిరిగి చూడనందున గమనించలేదు. ఏదో సీరియస్‌గా మాట్లాడుకొంటున్నారు ఇద్దరూ. ఒక నిమిషం ఆగి తాను వచ్చినట్టు తెలిసేందుకు, ఒక దగ్గు దగ్గి శబ్దం చేయడంతో ఇద్దరూ రాజన్నను చూచి, "రండి" అని ముక్తసరిగా అన్నారు. రాజన్నకు భార్యాభర్తలలో ఏదో మార్పు ఉందని గమనించాడు. అయినా తనకు ఉన్న చనువుతో వెళ్ళి మరొక కుర్చీలో కూర్చొన్నాడు. ఇంతలో అనసూయమ్మ సోఫాలో నుండి లేచి లోపలికి వెళ్ళింది. కొద్ది సేపట్లో పనిమనిషి కాఫీ తెచ్చి ఇచ్చింది. సాధారణంగా ఆ పని అనసూయమ్మ చేస్తుంటుంది. రామచంద్రయ్య కల్పించుకొని "అంతా సవ్యంగా ఉందా!" అని ఏదో ఒకటి అడగాలి అన్నట్టు అడిగాడు. రాజన్నకు మార్పు అర్థమయ్యింది. ఏదో ఒక సమస్య ఆ కుటుంబంలో ఉన్నదని అనుమానం వచ్చింది. ఉండబట్టలేక, "చెల్లెమ్మా" అని రాజన్న పిలవడంతో హాల్లో ఉన్న అనసూయమ్మ వరండాలోకి వచ్చి కూర్చుంది. రాజన్న ఇద్దరివైపు చూచి కావాలని "ఏమి అనుకోనంటే మీలో మార్పు కొట్టొచ్చినట్టు కనపడుతున్నది, దానికి నేను కారణం కాదు కదా! నేను ఏ తప్పుచేయలేదు కదా! ఏదైనా ఉంటే క్షమించగలరని అభ్యర్థిస్తున్నాను" అని త్వరత్వరగా ముగించాడు.

దానికి నొచ్చుకున్నట్టుగా అనసూయమ్మ "మీరు అనవసరంగా ఆలోచించారు. అలాంటిదేమిలేదు. ఒక కుటుంబ సమస్య మమ్ములను బాధిస్తున్నది. దానిని గురించి మాట్లాడుకొంటున్నాము. మనిషి తెలిసి తప్పుచేయకపోయినా, ఎందుకు కష్టాలను ఎదుర్కోవలసి వస్తుందో తెలియదు" అని ముగించింది. రామచంద్రయ్య "దేవుడు సుఖాలతో కష్టాలను కూడా కలిగిస్తే తప్ప సంతృప్తి పొందడేమో" అన్నాడు. కొంచెం సేపు నిశ్శబ్దం తాండవం చేసింది.

రామచంద్రయ్య మరలా ప్రారంభించాడు. "అసలు మా విషయం చాలారోజుల నుండి మీతో చర్చించి, మీ సలహా తీసుకోవాలని ఒకటి రెండుసార్లు అనుకోవడం కూడా జరిగింది. అయినా ఏం చేయాలో అర్థంకాక మీ మనసును కష్టపెట్టడం ఇష్టంలేక ఊరకే ఉండిపోయినాం. అయినా మీరు ఏ సంబంధం లేకుండా ఏమి చేయగలరు అని కూడా ఆలోచించాం. అసలు మిమ్ములను గురించి వేరేవిధంగా ఆలోచించే అవకాశం లేనేలేదు".

రాజన్న "నాకు మీ ముఖాలలో ఎన్నడూ చూడని దిగులు కనపడింది. అందుచేత నేను అలా అన్నాను. ఆ పరిస్థితిలో ఏమి పాలుపోక అలా మాట్లాడాను. మీలాంటి ఉత్తములు బాధగా ఉంటే నా మనస్సుకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది", అని

అంటూ మరలా "అసలు విషయం, నాకు చెప్పవచ్చు అనుకుంటే చెప్పండి. అది ఆర్థిక ఇబ్బంది కాదని నాకు రూఢిగా తెలుసు. ఒకవేళ ఏదైనా ఉంటే మీ పిల్లల విషయంలో ఉండి ఉండాలి" అని అన్నాడు రాజన్న.

వెంటనే రామచంద్రయ్య అందుకొని "మీరు కరెక్టుగా ఊహించారు. అసలు విషయం చెప్తాను వినండి, మా పెద్దబ్బాయి ఢిల్లీలో మెరైన్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కోడలు కంప్యూటర్లో పనిచేస్తున్నది. వాళ్ళకు పిల్లలు లేరు. ఆ అమ్మాయికి పిల్లలు పుట్టడం ఇష్టం లేదు. మా వాడికి బిడ్డలంటే ప్రాణం. మాకు కూడా మనుమలు, మనుమరాళ్ళను చూచుకోవాలని ఎంతో ఆరాటం ఉంది. కాని ఎవరికీ చెప్పుకోలేక మాలో మేమే కుళ్ళిపోతున్నాము. ఏం చేయాలో తెలియడం లేదు. కోడలు ఎవరినైనా దత్తత తీసుకుందామంటుంది. లేకపోతే మావాడిని రెండోపెళ్ళి చేసుకోమంటుంది. తనకేమి అభ్యంతరం లేదంటుంది.

ఎనిమిది సంవత్సరాల్నుంచి ఈ తతంగం జరుగుతున్నది. ఏమిచేయాలో తెలియక అప్పుడప్పుడు మాలో మేమే కుమిలిపోతుంటాం. మేము, వాళ్ళ అమ్మానాన్నలు చెప్పి చూచాము. అటు ఇటూ ఊగిసలాడుతూ ఈ విషయం ఇప్పుడు విడాకుల వరకు వచ్చింది. కోడలు లాయర్‌ను కూడా సంప్రదించి నోటీసు ఇచ్చే ప్రయత్నంలో ఉంది. మా కుమారుడు కొంచెం మెతక మనిషి. వాడికి మనశ్శాంతిలేకుండా బ్రతుకుతున్నాడు. అందరూ ఇంకా పిల్లలు పుట్టలేదే మీ కొడుకు కోడలికి. మీరు ఎప్పుడు అవ్వా తాత అయ్యేది అని అడుగుతున్నారు. ఏమి జవాబు చెప్పాలో అర్థం కావడంలేదు. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? ఇది ఒక గడ్డు సమస్యగా తయారైంది. మేము ఎంతోమందికి సహాయం చేశాము. తెలిసి ఎవరికీ అపకారం చేసినవాళ్ళము కాము. మాకు ఇలాంటి గ్రహచారం ఎందుకు చుట్టుకుందో తెలిసి రావడంలేదు" అని ఇద్దరు గద్గద స్వరంతో కళ్ళ నీళ్ళను ఆపుకొంటున్నారు. రాజన్నకు కూడా మనసు చలించింది. అయినా వాళ్ళకు ధైర్యం చెప్పాలి గాని, తానుకూడా వాళ్ళతో శృతి కలిపితే ఉపయోగం ఏముంటుంది?

"ఓస్! ఇంతేనా? ఎలాగూ వాళ్ళు పదిహేనురోజుల్లో వస్తారు కదా! నన్ను ఎలాగు పరిచయంచేస్తారు. ఒక సంవత్సరంలోగా, ఒక నెలా అటూ ఇటూగా మీరు మనుమడినో, మనుమరాలినో ఎత్తుకునేట్టు చేస్తాను. నేను ఎంతోమంది మనస్సును మార్చగలిగాను. నాకు నమ్మకం ఉంది. నిశ్చింతగా మీరు సమస్యను నాకు వదిలేయండి. వాళ్ళు వచ్చేసరికి శ్రీరామనవమి కూడా వస్తుంది. ఈ సంవత్సరం మీరు నామాట

విని అన్నసంతర్పణ జరపండి. వచ్చిన ప్రతివాడు చెయ్యి కడగకుండా పోకూడదు. తర్వాత విషయం నాకు వదలిపెట్టండి. అమ్మాయితో నేను మాట్లాడుతాను. సామ దాన భేద ఉపాయాలు చాలా ఉన్నాయి. చూద్దాం. ఈ రాముడికి ఆ శ్రీరామచంద్రుడు పరిపూర్ణ కటాక్షం చూపుతాడు. ప్రార్థనకున్న బలం మరిదేని కుంటుంది? పని అయిపోయింది. మీరు దిగులును తీసివేయండి. ఆనందం మొలకెత్తుతుంది" అని ముగించాడు.

"ఏ తండ్రి నోటివాక్కు ఎలా వుంటుందో, ఏ దేవుడు ఎప్పుడు తథాస్తు అంటాడో. మీ మాటలు వింటుంటే గుండెమీద బరువునంతా దించేసినట్టు అయ్యింది" అని అన్నది అనసూయమ్మ."అమ్మా! బుర్ర వేడెక్కిపోయింది. మరో మంచి కాఫీ కావాలి తల్లీ! ఎలాగు ఐదు గంటలయ్యింది. మా దినచర్య రచ్చబండ దగ్గర కచ్చేరి ఎలాగూ వుందికదా! ఇటునుండి ఇటే పోతాం" అన్నాడు రాజన్న రామచంద్రయ్యతో. అలాగే అనట్టు తలూపాడు రామచంద్రయ్య. కాఫీ తాగి ఇద్దరూ రచ్చబండ దగ్గరకు కదిలారు.

బండచుట్టూ కూర్చొన్న పదిమందిలో ఒకరు చెప్పండి పెద్దాయనా! మంచి మాటలు చెప్పండి" అనడంతో, రాజన్న "ఈ భూమ్మీద చైతన్యం ఉన్న చెట్లు, నీటిలో, ఆకాశంలో ఉన్న 84 లక్షల జీవరాశుల్లో, మానవుడు చాలా గొప్పవాడని, ప్రకృతికి తాను కలికితురాయని, నాగరికత చిహ్నమని అంటారు. ఇది నిజమా!" అన్న రాజన్న మాటలకు, "నిజమే కదా! మిగతా జీవులకు ఇన్ని తెలివితేటలు ఉండవు కదా!" అన్నాడు ఒకాయన.

రాజన్న మరలా "నిజమే మానవునికి పంచేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, త్రిగుణాలు, మనసు, బుద్ధి, అహంకారం, లాంటి అనేక తత్త్వాల వలన వైవిధ్యం ఎక్కువ. ఒక్క క్షణంలో ఉన్నది మరొక క్షణంలో ఉండదు. కొంతమంది మహాత్ములు క్రమశిక్షణతో, ఇంద్రియ నిగ్రహంతో జీవితాలను, నడుపుకుంటారు. సాధారణ మానవుని జీవితం ఒక క్రమంలో నడవదు. అనగా చెట్టు పుట్టా, జంతువులు, పక్షులు, జలచరములకు ఉన్న క్రమశిక్షణ మానవునికి ఉండదు. మానవుడు ఎంత తెలివి గలవాడో! అంతే తెలివి తక్కువవాడు. కాదంటే ఒకచోట తెలివి మరొకచోట మూర్ఖత్వం" అని, అందరి అంగీకారంతో బయలుదేరాడు.

* * * * *

# 7. ఉషోదయం

రామచంద్రయ్య కుమారుడు రాకేష్, కోడలు ఉష, ఢిల్లీ నుండి వచ్చారు. రామచంద్రయ్య భార్య రోజులు లెక్కపెట్టుకుంటూ, వచ్చిన తర్వాత జరగవలసిన చర్చకు కావలిసిన విషయ సరంజామాను అప్పుడప్పుడు ఆ దంపతులు రాజన్నతో చర్చించడం ఆనవాయితీగా జరుగుతున్నది.

ప్రతిరోజులాగే పదుకొండు గంటల ప్రాంతంలో రాజన్న రామచంద్రయ్య ఇంటికి వచ్చాడు. రాజన్నను కుమారునికి కోడలుకు పరిచయం చేశారు. రాకేష్ ఉషలకు కూడా సినిమాల ద్వారా, రాజన్న సుపరిచితుడైనందున, పైగా ఫోన్లో మాట్లాడినప్పుడు రామచంద్రయ్య వాళ్ళు ఇక్కడ జరుగుతున్న విషయాలు చెప్పడం వలన, రాజన్నను గురించి అనేక విషయాలు తెలిసిఉన్నాయి. ఆ కారణంగా రాజన్న రాకేష్ ఉషలతో బాగా పరిచయం ఉన్న వ్యక్తిలా మాట్లాడడం, అనేక విషయాలు చర్చించడం జరుగుతున్నది. సినిమా జీవితంలో వాళ్ళకు తెలియని అనేక విషయాలు సందేహాలు, చర్చనీయాంశాలయ్యాయి. అంతేకాక సినిమా జీవితం, నటుల స్వభావం, ప్రవర్తన, అక్కడ జరిగే వింతలూ, విడ్డూరాలు రాజన్న చెప్తుంటే వాళ్ళకు ఒక సినిమా చూచినట్టుగా ఉంది.

ఎలాగైతేనేం ఉషకు రాజన్న మాటలు చాలా ఆనందాన్ని కలిగించాయి. రాజన్న చమత్కారంగా మాట్లాడ్డం ఆమెకు బాగా నచ్చింది. భోజన సమయం అయింది

కాబట్టి రాజన్న ఇంటికి బయరుదేరడానికి చేసిన ప్రయత్నాన్ని మిగతావాళ్ళకంటే ఉష అడ్డుపడ్డది. తమతో భోజనం చేయమని రాజన్నను బలవంతం పెట్టింది. రాజన్న "నేనిక్కడే ఉంటాను కదా తల్లీ! పైపెచ్చు మీ ఇంట్లో ఎన్నిసార్లు భోజనం చేశానో లెక్కలేదు. మరొక రోజు అందరం కలుద్దాంలే అని అన్నాడు".

కానీ ఉష అంతకు ముందు ఆయన ఏదో సందర్భంలో అన్నమాటను గుర్తుచేస్తూ "మనం చేయాల్సిన మంచి పనిని రేపటికి వాయిదా వేయడం మంచిది కాదని మీరే అన్నారు కదా? అందువలన మీతో భోంచేసే అదృష్టాన్ని ఈరోజే కలిగించాలని నా మనస్సు చెప్తున్నది" అని అన్నది. రాజన్న "మీలో కూడా తర్కం ఛాయలు బాగానే ఉన్నాయి" అని అన్నాడు.

డైనింగ్ టేబుల్ వద్ద భోజన కార్యక్రమంలో అనేక విషయాలను రాజన్న ముచ్చటించడంతో అందరూ సంతోషంగా కార్యక్రమాన్ని పూర్తిచేశారు. రాజన్నకు ఎలాగైనా ఉష మనస్సు జీవిత దృక్పథం తెలుసుకోవాలనే ఆలోచన ఉంది కాబట్టి తన ఇష్టప్రకారం నడుచుకొని తనకిష్టమైన విషయాలను మాట్లాడాలని పథకం వేసుకొన్నాడు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోజుల్లో పాతవిషయాలమీద శ్రద్ధ చూపించేవాళ్ళు చాలామంది ఉండడం లేదని, ఉషలో అలాంటి ప్రత్యేక వ్యక్తిత్వం ఉందని, ఇలాంటి వ్యక్తులతో మాట్లాడ్డం రాజన్నకు చాలా సంతోషంగా ఉందని, ఉష మనస్సును రంజింపజేసి తనవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేయసాగాడు.

రోజులు గడుస్తున్నాయి. రాజన్న రామచంద్రయ్య ఇంటికి వచ్చి ముచ్చట్లు చేయడం లేదా ఉష రాకేష్‌తో కలిసి లేదా ఒంటరిగానైనా రాజన్న ఇంటికి వెళ్ళి అనేక విషయాలు చర్చించసాగింది. పైపెచ్చు రాజన్న ఇంట్లోకి అనేకమంది సందేహాలతో సమస్యలతో రాజన్న దర్శనానికి వచ్చి మాట్లాడిపోవడం, రాజన్న అవకాశాన్ని సృష్టించుకొని వాళ్ళకిచ్చే సలహాల్లో, పరోక్షంగా ఉష మనస్సుకు కూడా పనికివచ్చే విధంగా మాట్లాడ్డం జరుగుతున్నది. వీలైనంత వరకు ఎవరు వచ్చినా వాళ్ళకు అవకాశం ఇవ్వకుండా ఎక్కువసేపు ఉషతో మాట్లాడ్డం తనను మాట్లాడేటట్టు చేయడం, తన ఉద్యోగం, జీవితం, ఢిల్లీలాంటి పట్టణాల్లో ఉన్న వాతావరణం, గతం ప్రస్తుతం భవిష్యత్తు మార్పులు, చేర్పులూ అనేక విషయాలు ఉషచేత మాట్లాడించి తాను విని ఆనందిస్తూ కొన్నింటికి తన అభిప్రాయాలను తెలుపుతూ తాను ఉషలో మార్పు తేవడానికి చేస్తున్న ప్రయత్నానికి దగ్గరగా ఉండేట్టు చర్చ నడుస్తున్నది.

ఈ మధ్యలో గుడిగోపురాలకు కుటుంబసమేతంగా వెళ్ళి దర్శనం చేసుకొని రావడం జరుగుతున్నది. ఆ సందర్భంలో దేవుడు ఉన్నాడా, పూజల అవసరమేముంది, ఉత్సవాల ప్రాశస్త్యం, భక్తులలో రకాలు ఇలా అనేక విషయాలు, సందేహాలు చర్చించడంలో మునిగిపోతూ కాలం గడుపుతున్నారు. ఎలాగైతేనేం రోజులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆనందంగా ఉన్నట్టు అందరూ ఫీలవుతున్నారు. రాకేష్ ఉష ఢిల్లీకి తిరిగి వెళ్ళవలసిన టైం దగ్గరకు వచ్చింది. కానీ ఎందుకో ఇంకొంతకాలం ఇక్కడే గడపాలని అందరి మనసుల్లో ఉన్నందున ఏదో ఒక కారణంతో ఇద్దరూ ప్రయాణాన్ని పదిరోజులు వెనుకకునెట్టారు. నిజానికి ప్రయాణం వాయిదా వేయడంలో ఉష పాత్ర బలంగా ఉంది.

ఒక రోజు సాయంత్రం "రేపు పది గంటలకు నేను మీతో ఏకాంతంగా మాట్లాడాలి. ఇంకెవరికీ అపాయింట్ మెంట్ ఇవ్వనంటే నేను మీ ఇంటికి వస్తాను" అని అన్నది ఉష రాజన్నతో. దాన్ని పెద్ద సీరియస్‌గా తీసుకోకుండా, "అలాగే తల్లీ నీవు రావడానికి ప్రణాళిక ఎందుకు. రేపు ఎవరినీ ఎంటర్‌టైన్ చేయను" అని అన్నాడు.

గత 20 రోజులుగా అనేక నిజ జీవిత కథలు, సినిమా సంఘటనలు, స్వార్థం, త్యాగం లాంటివి ఎలాంటి ప్రభావం చూపిస్తాయి అన్న విషయాలను, తన మనసులో సంతానం వద్దనుకున్న ఆలోచన మీద దెబ్బకొట్టేట్టు మాట్లాడ్డం కారణంగా ఉష మనస్సులో తన ఆలోచనను రాజన్నతో చర్చించాలనే ఆలోచన వచ్చింది. రాజన్న అనుభవం, పాండిత్యం, సహృదయత, స్నేహభావం, వ్యక్తిత్వం ఉష మనస్సు మీద ముద్రవేశాయి అనడంలో సందేహం లేదు. రాజన్న మాట మీద ఉషకు ఒక ప్రత్యేక గౌరవం ఏర్పడింది.

అనుకున్న విధంగానే పది గంటలకు ఉష వచ్చింది. ఎర్రని చీరలో మేకప్ చేసుకొని మల్లెపూలు పెట్టుకొని చక్కగా ముస్తాబై వచ్చింది. వాకిట్లో రాజన్న ఎదురయ్యి "స్వాగతం, సుస్వాగతం తెలుగింటి ఆడపడుచుకు స్వాగతం. నీ ఎర్రని చీర, తెల్లని మల్లెలు, వాటికున్న గుబాళింపు చూస్తుంటే, ఆచంట జానకిరాం అని ఒక కవి తాను రాసిన 'నా స్మృతిపథంలో' అన్న పుస్తకానికి అంకితం రాస్తూ, "ఇవిగో ఇంకా నిద్రలేవని మంచు తడి ఆరని పారిజాతాలు. ఈ ధవళిమ నా భావాల స్వచ్ఛత, ఈ ఎరుపు నా అనురాగ రక్తిమ..." అలా చీర ఎరుపు, పూల తెలుపు, వాటి గుబాళింపు

చూడముచ్చటగా ఉంది. కవిని గాబట్టి నాకు తెలియకుండానే ఆ పైత్యం బయటికొచ్చింది”.

ఆయన మాటలకు ఉష హృదయం ద్రవించి, మనస్సు ఆనందంతో నిండి గట్టిగా చప్పట్లు కొడ్తూ , సాహిత్యం మీద అభిరుచి లేకపోవడం, అలాంటి వ్యక్తులతో మాట్లాడి ఆనందించే అవకాశం లేకపోవడం వలన, జీవితంలో చాలా పోగొట్టుకున్నాను అని మీతో పరిచయం అయిన తర్వాత మీ కవి హృదయంతో తెలిసింది. జీవితానికి ఒక రంగును, రంగుకు రుచిని, శబ్దానికి శ్రావ్యాన్ని, మాటలకు అర్థాన్ని, మొత్తంమీద సౌందర్యాన్ని కల్పించగలిగిన మీ నైపుణ్యానికి, అనుభవానికి నా జోహార్లు” అన్నది ఉష.

“అయితే మీకు కూడా కవిత్వం వస్తున్నది” అని అంటుంటే ఉష ఖండించి “నన్ను నువ్వు అనాలి మీరు అనకూడదు. మీరు అంటే బాధగా ఉంటుంది. మీరు పెద్దవారు, జ్ఞానులు, సహృదయులు ఈ ప్రపంచమంతా ఆనందంగా ఉండాలని ఆలోచించే వ్యక్తిత్వం ఉన్నవారు, పైపెచ్చు నాకు గురువులు, నాకు తెలియని విషయాలు ఎన్నో చెప్పారు. వయస్సులో అనుభవంలో మీ ముందర నేనొక అణువును మాత్రమే.”

రాజన్న అడ్డు తగిలి, అయితే అణువు అంటే ఆటం అంటాం కదా. ఒక పరమాణువుకు ఈ విశ్వాన్ని నాశనం చేయగలిగిన శక్తి, 'An atom can destroy the whole universe' ఉన్నది అని సి.వి.రామన్ లాంటి మహానుభావులు ఎన్నో దశాబ్దాల క్రితం చెప్పారు కదా! అంతేగాక మన వేదాల్లో అణువుకు విశ్వానికి తేడా లేదని, విశ్వంలో ఉండేది అణువులో, అణువులో ఉండేది విశ్వంలో ఉన్నదని, అవి రెండూ ఒకదానికొకటి కలుస్తూ విడిపోతూ ఉంటాయని చెప్పబడి ఉన్నదట. అయినా ఇదేమిటి, జీవితంలో నుండి ఫిజిక్స్‌లోకి వెళ్ళిపోయాం. నిజమే! జీవితం అంటే ఫిజిక్స్, కెమిస్ట్రీయే. ఎందుకనంటే వాటికి, గ్రామర్ సిద్ధాంతాలు ఉన్నాయి. సాహిత్యానికి జీవితానికి కూడా గ్రామర్ సిద్ధాంతాలు ఉన్నాయి. ఇదంతా చూస్తే మరలా వేదాంతంవైపు వెళ్ళిపోతాం. అందుకే ఆదిశంకరుడు రెండు లేవు ఉండేది ఒక్కటే, అదే బ్రహ్మం, అదే సత్యం, అదే జ్ఞానం, అదే అనంతం అని అన్నారు. సారీ, ఒక్కోసారి మాట్లాడ్డం మొదలుపెడితే పూనకం వస్తుంది.

నిజానికి అసలు ప్రాణం ఉన్నది, లేనివి రెండు లేవు. ప్రతిదానిలో ప్రాణం ఉన్నది. రాతిలో, కొయ్యలో, సకల పదార్థాల్లో, నీలో, నాలో అంతటా శక్తి ఉంది. అంటే ఈ

విశ్వం శక్తిమయం. ఇది ప్రోటాన్లు, న్యూట్రాన్లు లాంటి అనేక పరమాణువులతో కూడికలు, తేసివేతలు వేసుకుంటూ మన కళ్ళముందర ఒక దృశ్యాన్ని అంటే మనభాషలో సినిమాను చూపిస్తుంటుంది. దీన్నే కాస్మిక్ డాన్స్, నటరాజు నాట్యం అంటారు. కాదంటే ఇదంతా ఒక శక్తి, దానిలో భాగాలు, విభాగాలు, నిక్షిప్తమై, శక్తితో శక్తిని బయటకుతీసి మరలా శక్తిని లోనికి పంపి ఆ శక్తే, కర్త కర్మ క్రియగా భాసిల్లుతున్న మాయ.

అయినా నా పిచ్చిగాని ఫిజిక్స్, కెమిస్ట్రీలు అన్నీ ఒకటే. సత్యం కూడా ఒక్కటే. అది రెండవుతుంది. లేదా అనేకం అవుతుంది. ఆ అనేకం మరలా ఒకటవుతుంది. ఒకటిగా ఉన్నప్పుడు దాన్ని అర్థంచేసుకోలేం. అదే రెండైనప్పుడు దాన్ని అనుభవిస్తాం. ఉదాహరణకు ఆడ మగా, వేడి చల్లన, రాత్రి పగలు, భూమి ఆకాశం, మంచి చెడ్డ, చీకటి వెలుగు, భార్య భర్త, తల్లీ బిడ్డ, దేవుడు దెయ్యంలా ఉంటాయి. ఈ రెండూ నిరంతరం ఒకదానిమీద మరొకటి పట్టు సాధించాలని ప్రయత్నం చేస్తుంటాయి. అదే జీవితం. మరొక ఉదాహరణ జీవకణాలు రెండుగా విభజించబడుతుంటాయి. అంటే కొన్ని చచ్చిపోతే మరికొన్ని పుడుతుంటాయి.

తల్లి గర్భంలో నుండి బిడ్డ బయటకు రావడం పుట్టుక. కాని అది పుట్టుక కాదు. ఒక రకమైన చావు. అప్పటివరకు తల్లిగర్భంలో వెచ్చగా ఉండి తల్లి ఊపిరి పీలిస్తే, తింటే తాను బతికి చివరకు తనకర్మకు తనను వదిలేసిన అమ్మ నుండి వేరుబడి బయటకు తోసుకుని వస్తుంది. తల్లి కూడా తనకక్కరలేదని ఆ నొప్పులతో బిడ్డను బయటికి నెట్టేస్తుంది. ఇద్దరూ విడిపోవాలను కున్నారు. ఇద్దరూ కష్టపడ్డారు.

అన్ని నెలలు ఒకరికోసం ఒకరు బతికి, కాదనుకొని విడిపోవడం వింతగా ఉంటుంది. పోనీ విడిపోయిన తర్వాత ఏ సంబంధం లేకుండా ఉంటారా? లేదు. ఒకళ్ళకు మరొకరు కావాలి. ఒకరులేక మరొకరు బతకలేరు. తల్లి తనబిడ్డ కోసం ఎంత త్యాగానికైనా సంసిద్ధం అవుతుంది. ప్రతిక్షణం చిన్ని కదలిక కూడా తల్లిని గాఢ నిద్రనుండి లేపుతుంది. అది ప్రేమ. అందువలన అంతటి స్పృహను కల్పిస్తుంది. అదొక శక్తి. ఆ శక్తి ఇద్దర్నీ కట్టిపడేస్తుంది. అంటే అవి రెండు శక్తులు. ఆ రెండు శక్తుల మధ్య, ఒక విడదీయలేని సంబంధం ఉంటుంది. ఇది కేవలం మానవ జీవితం లోనే కాదు ప్రతిజీవిలో ఇది సహజం.

ఉదాహరణకు ఆకాశంలో పోయే గ్రద్ద కిందకు దిగి కోడిపిల్లను తీసుకుపోవాలని ప్రయత్నం చేస్తుంటే, తన శక్తి చాలదని తెలిసినా కోడి ఆ బిడ్డలను తన రెక్కల్లో ఇముడ్చుకుంటుంది, లేదా ఎగిరెగిరి దాన్ని ఎదుర్కొంటుంది. ఇదొక సృష్టి ప్రవాహం. దీన్ని ఎవరూ మార్చలేరు. మార్పులు చేర్పులు కూడా, శక్తి ప్రవాహంలో భాగాలే. కాదంటే దానికి కార్యకారణాలను చూపించగలం. నిజానికి ఒక కార్యం కారణం కాదు. వంద కారణాలు వందకార్యాలను సృష్టించగలవు. ఇదొక విచిత్రమైన ప్రకృతి. ఇది అర్థంగాని విషయం. ప్రతి విషయంలో ఒక అర్థం, అంతరార్థం రెండూ ఉంటాయి. ఒక్కొక్కసారి ఒక్కొక్కదాన్ని చూచి మనం చేసే తీర్మానాలు, ఒకసారి మంచిని చేస్తే మరొకసారి చెడును కలిగిస్తాయి" అని ముగించాడు రాజన్న.

ఇంతలో సరోజమ్మను కేకవేసి అతిథి మర్యాదలు జరగలేదని అంటుంటే, ఆమె "అయ్యగారూ అదేపనిలో ఉన్నాను" అంటూ రకరకాల తినుబండారాలు నీళ్ళ గ్లాసులతో టీపాయ్ మీద పెట్టింది.

రాజన్న మాటల ప్రవాహంతో, ఉష మనసంతా ఆలోచనలతో, ఆవేశంతో, ఉత్సాహంతో, సందిగ్ధంతో, ఆనందంతో నిండిపోయింది. రెండు ఆపిల్ ముక్కలు తిని, టీ తాగి, టీ బాగుందని చెప్పింది ఉష. ఆ మాటలకు రాజన్న "మొదట్లో సరోజమ్మకు టీ పెట్టడం అలవాటులేదు. మీ అత్తగారి దగ్గర నేర్చుకుని వచ్చింది. అప్పటి నుండి చాలా చక్కగా టీ తయారు చేస్తున్నది" అని అన్నాడు.

కొంచెంసేపు నిశ్శబ్దం ఇద్దరి మధ్య చోటుచేసుకొంది. ఉష మనస్సు తన ధర్మసందేహం తీర్చుకోవాలని తొందరపెడుతున్నది. రాజన్న, ఉష ఎప్పుడు ప్రారంభిస్తుందా అని ఎదురుచూస్తున్నాడు. మొత్తంమీద ఇద్దరూ ఒకే లక్ష్యంవైపు పరుగులు తీస్తున్నారు. అనుభవజ్ఞుడు అయిన రాజన్న ఎలాగైనా తనే ప్రారంభించాలను కొన్నాడు. శరీరంలోని ఏదో ఒక భాగంలో గాయమై మానడం మొదలుపెడ్తున్నప్పుడు దానిచుట్టూ కొంచెం నవగా, నొప్పిగా ఉంటుంది. కాని దాన్ని స్పృశిస్తూ ఉంటే, ఆ స్పర్శ చాలా హాయిగా ఉంటుంది. ఆ విధంగా ఇద్దరి మనసులలో ఒక సమస్య గాయంలా స్పర్శకోసం తపిస్తున్నది. ఇప్పుడు ఉష మనస్సులో ఈ సంతానమనే గాయానికి ఒక స్పర్శకావాలి. లేదా ఒక ఆపరేషన్ కావాలి. దానికి ఒక డాక్టరు కావాలి. దానికి రాజన్న రెడీగా ఉన్నాడు.

రాజన్న ఉష కళ్ళలోకి చూస్తూ "నీవు ఏమీ అనుకోనంటే ఒక మాట అడగాలనుంది. నీవు ఈ వయసులో నీకున్న స్థితిగతుల్లో, ఉండవలసినంత ఆనందంగా ఉండడం లేదని, ఏదో వెలితి నీలో చోటుచేసుకొని ఉన్నదని నాకనిపిస్తున్నది. నేను ఏ విషయాన్నీ దాచిపెట్టి మాట్లాడే తత్త్వం కలిగినవాడిని కాదు. నీకు నా మీద ఉన్న గౌరవం, నీతో నాకు మాట్లాడాలనిపించేట్లు చేస్తున్నది. పైపెచ్చు నీవు నన్ను అపార్థం చేసుకోవనే నమ్మకం నాకు గాఢంగా వుంది. అందుకని అడుగుతున్నాను,"

రాజన్న ముగించకముందే , "మీరేం అడిగినా నాకు అభ్యంతరం లేదు. పైపెచ్చు నా సమస్యలకు మీకంటే మంచి పరిష్కారం చూపించగలిగిన వ్యక్తి దొరకరు". రాజన్న మధ్యలో అడ్డం వచ్చి "బహుశా నీ ఆలోచన అంతా నీ సంతాన విషయంలో ఉంటుందని అనిపిస్తున్నది, ఈ ప్రశ్న అడిగేందుకు కారణం కూడా ఉంది. నా తల్లి నాకు ఎన్నో నేర్పింది. అందుచేత నిన్నడిగిన తర్వాత, సందేహం తీరిన తర్వాత భవిష్యత్తు కార్యక్రమం, నిర్ధారించుకుందామనుకున్నాను. ఇంతకూ మీరు కావాలని సంతాన విషయంలో జాప్యం చేస్తున్నారా? లేక మరేదైనా ఆరోగ్య సంబంధమైన ఇబ్బంది అయితే మా తల్లిగారు చెప్పిన ఒక వైద్యం నా దగ్గర ఉన్నది. నూటికి 99 పాళ్ళు గ్యారంటీ ఇయ్యగలను. అందుచేత అడుగు తున్నాను" అని ముగించాడు.

ఉషకు ఏం మాట్లాడాలనో తెలియలేదు. అయినా తప్పదు కాబట్టి తానే మాట్లాడడం మొదలుపెట్టింది. "నాకు ఎందుకో సంతానం మీద ఇష్టం లేదు. అది నాకు కూడా తెలియదు. అందుకు నేను తగిన జాగ్రత్తలు చేసుకున్నాను. మావారికి బిడ్డలంటే మహా ఇష్టం. అనేకసార్లు ఘర్షణ పడడం జరుగుతున్నది. చివరకు నేను విడాకులు తీసుకుందామన్న తీర్మానానికి వచ్చాను. ఆయన విడాకులకు ఇష్టపడడం లేదు. అప్పటికీ రాకేష్‌ను మరొక పెళ్ళి చేసుకోమని నచ్చచెప్పే ప్రయత్నం కూడా చేశాను. కాని ఉపయోగం లేకుండా పోయింది. ఈ సమస్యకు పరిషార్కం తెలియక మీతో మాట్లాడాలను కున్నాను. ఈ విషయం ఇప్పటి వరకు మరెవరితోను చర్చించలేదు.

ఎందుకో మీతో మాట్లాడిన తర్వాత, నాకు సరైన పరిష్కారం దొరుకుతుంది అనే నమ్మకం కుదిరింది. అందుకని నా సమస్యను మీముందు ఉంచుతున్నాను. తప్పు నాది అని నాకు తెలుసు. అయినా ఏం చేయాలో తెలియడం లేదు. ఈ

విషయంలో ప్రతివాళ్ళు నన్నే నిందిస్తారు. గర్భం ధరిస్తే వికారంగా ఉంటుంది. పిల్లలకు పాలివ్వడం, మిగతా పనులు చేయడం ఎందుకో ఇష్టంలేదు. ఏంచేయాలో తెలియక రాత్రింబవళ్ళు ఆలోచిస్తుంటాను. పైగా ఇంతమందిని బాధపెడ్తున్నాను అని బాధగా ఉంది". ఇంకేం మాట్లాడాలో తెలియక రాజన్న కళ్ళలోకి చూడ్డానికి ఇష్టపడక తలవంచుకుని కూర్చొన్నది. సరోజమ్మ రాజన్న కొరకు నలుగురు వ్యక్తులు వచ్చారని చెప్పింది. దానికి వాళ్ళ ఫోన్ నెంబరు ఇచ్చిపొమ్మని, రాత్రికి నేను ఫోన్ చేస్తానని చెప్పి, టీ తెమ్మన్నాడు.

"నాకు విషయం వింతగా అనిపించినా, ప్రతి కార్యానికి అనేక కారణాలు ఉంటాయి. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. కాదు కాదు. ప్రతి సమస్యకు అనేక పరిష్కారాలుంటాయి. ఏ పరిష్కారం మనకు నచ్చుతుంది, వీలవుతుంది అన్నది, మన తీర్మానం మీద ఆధారపడివుంటుంది. నీ సమస్యకు కారణాలు చూపించాలని ప్రయత్నించావు. అవన్నీ "కాదు", "లేదు" కు సంబంధించినవి. అలాగే "ఔను" "సరే" అనేదానికి కూడా అనేక పరిష్కారాలుంటాయి".

"అసలు సమస్య జీవితంలో", అనే లోగా ఫోన్ మోగింది. రామచంద్రయ్య దగ్గర నుండి భోజనానికి రమ్మని ఆహ్వానం. మరలా "ప్రతిమనిషిని మనసు ఆటాడిస్తుంది. మనసు మంచి సేవకుడు. కాని బహుచెడ్డ యజమాని. మనసుకు పెత్తనమిస్తే, పేనులా తలంతా కొరికేస్తుంది. మనసు ఒప్పుకుంటే సమస్య అనేది లేదు. లేకపోతే సమస్య రోజుకు రోజుకు జటిలమౌతుంది. నీకు ఒక రహస్యం చెబుతాను విను. అన్ని బంధాలలో తల్లి బిడ్డ బంధం పవిత్రమైంది. విలక్షణమైంది. అదొక విచిత్రమైన స్థితి. అది మానవులలోనే కాదు, జంతువులలో కూడా బిడ్డల కోసం ఏనుగు, పులి, కుక్క, పంది, ఏదైనా సరే ప్రాణత్యాగం చేయడానికి వెనుకాడవు. ఒక పక్షిని చూడు. అది గుడ్లు పెట్టే ముందర సన్న పుల్లలు మెత్తటి గడ్డిలాంటిది తెచ్చి గూడుకట్టి, దాంట్లో గుడ్లు పొదిగి ఆహారం తెచ్చి ముక్కుతో నోట్లో పెట్టి, రెక్కలు వచ్చేంతవరకు రక్షణ కల్పిస్తుంది. ఇది ప్రకృతి ధర్మం.

ఇప్పుడు నీ పరిస్థితి ఎలా వుందంటే నువ్వు ముందుకే చూస్తున్నావు. అవి ఎండమావులు. ఇంకొంతకాలం తర్వాత వెనుకకు చూడాల్సి వస్తుంది. అప్పుడు నువ్వు పశ్చాత్తాప పడతావు. దానికి పరిష్కారం ఉండదు. అది చాలా భయంకరంగా

ఉంటుంది. నీవు తెలుసుకోవాల్సింది ఇప్పుడు అనుభవించే బాధ ఎక్కువా, లేక అప్పుడు పశ్చాత్తాపం తాలూకు బాధ ఎక్కువా అన్నది ఒకసారి ప్రశాంతంగా ఆలోచిస్తే నీకు తప్పక ఒక మార్గం  కనబడుతుంది. బిడ్డలకు తల్లిదండ్రులు అవసరం లేకపోవచ్చు. నీరు ఎప్పుడూ పల్లానికే పారుతుంది. ప్రేమ తల్లిదండ్రుల నుంచి బిడ్డలకు అంటే పైనుండి కిందకు వస్తుంది. కాని కింద నుండి పైకి రాదు.

నా జీవితంలో జరిగిన అనుభవాన్ని చెప్తాను విను. నేను నా భార్య అనారోగ్యంతో బాధపడుతుంటే సేవచేశాను. పనిమనుషులను పెట్టుకున్నాను. నాకొక కూతురు, కొడుకు ఉన్నారు. బిడ్డలకంటే డబ్బుకోసం, పనిమనుషులే మేలుగా సేవచేస్తారు. అదే ఊళ్ళో ఉన్నా కొడుకు కూతురికి నెలకొకసారి కూడా అమ్మను చూడ్డానికి తీరిక చిక్కదు. వాళ్ళకు కూడా అనేక సమస్యలు. వాళ్ళ పిల్లలు, పరీక్షలు, డాక్టర్లు, అనారోగ్యము, పుట్టిన దినాలు, పిక్‌నిక్‌లు, భర్త తరపు, భార్య తరపు చుట్టాలు మరెన్నో. సమస్యలతో ఎలా సతమతమౌతున్నారో చెప్పిపోయేవారు.

వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్ళి ఆమెచేతిని తన చేతిలోనికి తీసుకొని, ఎలా ఉన్నావని ప్రేమతో ఒకటి రెండు మాటలు మాట్లాడితే వేలకోట్లు ఇచ్చినంత సంబరపడేది కదా? మనుమలను, మనుమరాళ్ళను కౌగలించుకొని ఆనందించాలని ఆమెకు తాపత్రయం ఉంటుంది కదా! వాళ్ళను ఆమె దగ్గరికి పోనీరు.

ఆమెకు నేను చేసిన సేవ అద్వైతం. నేను ఆమె వేరు కాదు. ఆమెకు స్నానంచేయించి, భోజనం కలిపి పెట్టి కాలకృత్యాలు తీర్చుకునేందుకు సపోర్టు ఇచ్చి, చిన్న పిల్లలకు తల్లి చేసే పనులన్నీ చేశాను. తాను జబ్బుతో పడుకున్న బాధను నా సహచర్యంలో మరిచిపోయి నేను చేసే సేవకు మురిసిపోయి, అలాంటి భర్త లభించినందుకు తన కళ్ళల్లో ఆనందభాష్పాలు, భర్తను ఈ విధంగా కష్టపెడుతున్నందుకు కన్నీరు కారుస్తున్నప్పుడు నా పరిస్థితిని ఒకసారి ఊహించుకో తల్లి.

నా భార్య చనిపోతూ ఏమి చెప్పిందో తెలుసా? “తనకున్న నగలు, కూతురికి కూతురుంది కాబట్టి 70 శాతం ఇచ్చి, కొడుకుకు ఇద్దరు కొడుకులు కాబట్టి, కోడలుకు 30 శాతం ఇవ్వమన్నది. తన మంగళ సూత్రం గొలుసును ఎవరికీ ఇవ్వవద్దని నన్ను మెడలో వేసుకోమని చెప్పింది. తానెప్పుడూ నా మెడలోనే ఉండాలని తన అభిప్రాయం” అంటూ రాజన్న మెడలో గొలుసును చూపించాడు.

తల్లికి బిడ్డమీద ప్రేమ ఎలా వుటుందో, అందరికీ తెలిసిన కథ అయినా చెబుతాను నీకు. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించాడు. కాని అమ్మాయి ఒప్పుకోలేదు. అయితే అబ్బాయి ఎలాగైనా తనను పెళ్ళిచేసుకోవాలని, ప్రేమించేట్టు చేసుకోవాలని ప్రతిరోజు ఒక పువ్వుని తీసుకొనిపోవడం, దాన్ని అందించి తన కోరికను వెలిబుచ్చడం దినచర్యగా మారింది. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు దాటిపోతున్నాయి. అయినా ఆ అబ్బాయి తన తత్త్వం మార్చుకోలేదు. అమ్మాయి కూడా తన మొండితనాన్ని వదలిపెట్టలేదు. అతని వల్ల ఏ ఇబ్బంది లేదు కాబట్టి అన్నిరోజులు భరించిన అమ్మాయికి, ఎలాగైనా అబ్బాయి నుండి తప్పించు కోవాలని ఒక ఆలోచన చేసింది.

ఒకరోజు అబ్బాయిని తనను నిజంగా ప్రేమిస్తున్నాదా అని అడిగింది. దానికి ఖచ్చితమైన సమాధానం ఇచ్చిన అబ్బాయితో, తాను ఏమి చెప్పినా ఆలోచించకుండా చేస్తావా అని ప్రామిస్ చేయుంచుకుంది.

"మీ అమ్మ గుండె కాయను కోసి తీసుకొని రమ్మన్నది". తాను అంగీకారం తెలిపిందన్న ఆవేశంతో, ఆనందం పట్టలేక, తల్లి గుండెను కోసి ఒక పళ్లెంలో పెట్టుకొని పరుగెత్తుతూ ఉంటే తట్టుకొని పడడం, గుండె మాంసం చెల్లాచెదరవడం జరిగింది. గబగబా మాంసపు ముక్కలను ఏరుతుంటే దానిలో నుండి సన్నగా ఒక శబ్దం వినపడింది.

"నాన్నా కింద పడ్డప్పుడు మోకాలికి చేతికి దెబ్బ తగిలిందేమో చూసుకో, నిదానంగా పో నాన్నా. జాగ్రత్త! లేకపోతే తను మరలా కోపగించుకుంటుందేమో!" అంతే ఆ అబ్బాయి అక్కడే కూలబడ్డాడు.

రెండు రోజులు గడచిపోయాయి. ప్రతిరోజు రోజా పుష్పంతో దర్శనం ఇచ్చిపోయే వ్యక్తి రాకుండా ఉండేసరికి, తన గొప్పతనం అంతా పోయినట్టు తనలో వెలితి ఏర్పడింది. ఎక్కడలేని కోపం వచ్చింది. అంతే నేరుగా అబ్బాయి ఇంటిదగ్గరికి పోయి "ఇదేనా నీ ప్రేమ. రెండు సంవత్సరాలు ఎన్ని అబద్దాలు వల్లెవేశావు? నాకు నీ సంగతి ముందే తెలుసు. అందుకనే నిన్ను పట్టించుకోలేదు" అన్నది. అబ్బాయి నెమ్మదిగా "క్షమించాలి! నాకు నీ దగ్గరకు వచ్చినంత కాలం ప్రేమ అంటే ఏమిటో తెలియదు. మా అమ్మ గుండె చప్పుడు ప్రేమ అంటే తెలియచెప్పింది. ఈ జన్మకు అది

చాలు. నిన్ను ఇబ్బంది పెట్టినందుకు నేను చాలాబాధపడుతున్నాను. అయినా అమ్మను ఇక చూడలేను కదా!" అని ఇంటి లోపలికి గబగబా వెళ్ళాడు. నిజం తెలుసుకొన్న అమ్మాయి తన పొరపాటును తెలుసుకొంది. కాని ఉపయోగం లేకుండా పోయింది.

"మరొక కథ చెప్తాను. ఒక మాతృమూర్తి ప్రతిదినం ఈశ్వరుని గుడికి టెంకాయ, పూలు, అగరొత్తులు తీసుకొని వచ్చి, అర్చకుని చేతికిచ్చి, తన కుమారుని గోత్ర నామాలు చెప్పి, పూజ చేయించుకొని అందరికి వినపడే క్రమంలో "స్వామీ! నన్ను త్వరగా నరకానికి తీసుకొనిపో" అని ఒకటికి రెండు సార్లు ప్రార్థిస్తూ ఉండేది. ప్రతిదినం ఈ వ్యవహారం గమనిస్తున్న అర్చకుడు, దేవాలయ ధర్మకర్త, ఆమెను పక్కకు పిలిచి "అమ్మా! ఎవరైనా భగవంతుడిని ప్రార్థించేది స్వర్గానికి తీసుకొని పొమ్మని తప్ప, నరకానికి తీసుకొని పొమ్మని ఎవరూ ప్రార్థన చేయరు. మీకు స్వర్గ నరకాలకు తేడా తెలుసో తెలియదో మాకర్థం కావడంలేదు. మీరు ఈ విధంగా ప్రార్థిస్తుంటే చూడలేక మేము కలుగజేసుకొంటున్నాం. తప్పుంటే క్షమించండి" అని చెప్పారు. అందుకు ఆమె "అయ్యలారా! నామీద ఇంత అభిమానంతో మీరిచ్చిన సలహాకు మీకు వెయ్యి దణ్ణాలు పెడుతున్నాను. నాకు స్వర్గనరకాలకు తేడా తెలుసు. అయినా నాకు ఒకే ఒక్క కుమారుడు. చెప్పకూడదు కాని వాడి జీవితంలో చెడ్డ తప్పితే మంచిని నేను చూడలేకపోతున్నాను. చాలా దుర్మార్గమైన కార్యాలలో తలదూరుస్తుంటాడు. వాడు చేసే పనులకు పర్యవసానంగా వాడు ఎక్కువ కాలం బ్రతకడు. వాడు తప్పక నరకానికి పోతాడు. అయితే వాడికంటే ముందుగా నేను అక్కడకు చేరకపోతే వాణ్ణి ఎవరు చూస్తారు అన్న ఆలోచనతో నేను భగవంతుణ్ణి ఈవిధంగా ప్రార్థించవలసి వచ్చింది. తల్లిగా, ఇంతకంటే వేరే మార్గం నాకు తోచడం లేదు. వాడిమీద ప్రేమను నేను చంపుకోలేకుండా ఉన్నాను" అని ముగించింది. ఈ విషయం విన్న వాళ్ళిద్దరూ అవాక్కయినారు.

ఈ కథలు విన్న ఉషకు తల తిరిగినంత పనైంది. ఇంతలో మరలా "నీకొక విశేషం చెబుతాను. ఏ స్త్రీ అయినా, ఒకవేళ భర్త, కుమారుడు ఒకే రకమైన తప్పు సహించలేనిది చేశారనుకుందాం. భార్యగా ఆమె భర్తను నిందించి నిలదీస్తుంది. అదే కుమారుడి దగ్గరకు వచ్చేసరికి, "వాడు పసివాడు వయస్సులో తెలియక ఏదో తప్పు చేసి ఉండొచ్చు. ఆ వయసులో తప్పులు జరుగుతుంటాయి" అని సమర్థిస్తుంది, అని అన్నాడు.

"మరలా ఇంకొక విచిత్రమైన విషయం చెబుతాను విను. ఒక స్త్రీని ఒక గూండా, దుర్మార్గుడు, తనకంటే అన్ని విధాలా తక్కువ స్థాయివాడు బలాత్కారం చేసాడనుకుందాం. కర్మకొద్దీ తాను గర్భం దాలుస్తుంది అనుకొందాం. అంతటి దుర్మార్గుడి వలన దాల్చిన గర్భాన్ని ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఏదో ఒక విధంగా ఛిద్రం చేసుకోవాలి. కాని అలా చేసుకోదు. ఎందుకని? తన కడుపులో ఉన్నది తన బిడ్డడు. తన సంతానం. తన గర్భం. తన ఇంద్రియాల ద్వారా తయారైన తన బిడ్డ. అది తన చూపు, తన మాట, తన మనసు, తన గుండెచప్పుడు. దాన్ని తీసివేసుకోలేదు. ఇప్పుడు తాను తాను కాదు. తాను తన బిడ్డ. తన బిడ్డే తాను. అది అక్కడ ఇద్దరు లేరు. ఉండేది ఒకరే! అది తల్లి హృదయం. ఇదంతా ఏమిటంటే ఒక బంధం అనుబంధం, రాగం అనురాగం. అది లేని జీవితాలంటే ఉదయాన్నే లేవడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, భుజించడం, ఎవరికో సేవచేసి పదిరూకలు సంపాదించు కోవడం, బ్యాంకులో డబ్బు దాచుకోవడం, ఇల్లు కట్టుకోవడం, నగలు ధరించడం, భార్య ఒకచోట భర్త ఒకచోట ఉండడం.

ఈ భౌతిక కార్యక్రమాల్లో వచ్చేది ఆనందం కాదు. అది సుఖం. సుఖాన్ని ఆనందం అనుకోవడం ఒక భ్రమ. ఆ భ్రమతో కాలచక్రం కదిలిపోతుంది. అయితే ఆ అనుబంధంలోని ఆనందం విలువ ఎండమావులను దాటిన తర్వాత పశ్చాత్తాపం చిగురించడం మొదలుపెట్టిన తర్వాత అర్థమౌతుంది. అప్పుడు చింతన ప్రారంభ మౌతుంది. బ్రతుకులోని తియ్యదనం అర్థమౌతుంది. అయినా అనుభవించేందుకు కాలం సహకరించదు. భౌతిక సుఖాలు తోడు రావు.

ఇంతలో రామచంద్రయ్య గారి నుంచి మరొక ఫోను. అంతే ఇద్దరూ గబగబా లేచి ఇంటికి బయలుదేరారు. రాజన్నగారు "రామచంద్రయ్య గారు ముచ్చటలను భుజించి ఆకలిని మాపుకున్నారా? అందరూ మీకొరకు కాచుకొని ఉన్నారు" అని అన్నారు. రాజన్న బలవంతంతో, ఆయన చెల్లెమ్మ అనసూయమ్మతో సహా అందరు, భోజనం పూర్తి చేశారు.

ఉషకు జీవితాన్ని అనేక కోణాల్లో దర్శించే అవకాశం ఇంత కాలం లేనందున రాజన్న మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. రాజన్నగారితో ఇంకా మాట్లాడాలని పించింది. ఈ ఆందోళనకు ఒక ముగింపు పలకాలని ఉంది. అయినా గంటలకొద్దీ ఆయనతో మాట్లాడ్డం బాగోదేమో అనుకుంది. పక్కరోజు పదిగంటలకు పిలిచినట్టుగా

రాజన్న వచ్చాడు. అందరూ “రండి, రండి!” అంటూ “టిఫిన్ చేశారా” అని అడిగింది అనసూయమ్మ. అందుకే వచ్చినట్టు నేరుగా డైనింగ్ టేబుల్ దగ్గరకు పోయి కూర్చుని “ఏముంటే అదే పెట్టు తల్లి. ఈరోజు ఉప్మా చేస్తానన్న సరోజమ్మ ఒక పిండికి బదులు మరో పెండి పోసి ఒకటి చేయబోయి మరొకటి చేసింది. సాధారణంగా పొరబాటు చేయదు. సరేలే ధర్మసత్రం ఉంది కదా అని వచ్చేశాను” అని ముగించాడు.

ఉష చొరవ తీసుకొని రెండు ఇడ్లీలు, ఒక దోశ నెయ్యి వడ్డించి ఎదురుగా కూర్చుంది. ఉష చొరవకు అందరికీ ఆశ్చర్యం కలిగినా సంతోషించారు. ఇంతలో “మన చర్చ ఇంకా కొలిక్కి రాలేదు గురువుగారు. మేడ మీద కచ్చేరి ప్రారంభిద్దామా అని ఉత్సాహంగా” అన్నది. మరలా “పైగా మేము ఇక రెండురోజుల్లో హైదరాబాద్ వెళ్ళి ఒకరోజు ఉండి అక్కడ నుండి ఢిల్లీ వెళ్లిపోతాం” అన్నది. రాజన్న అందుకొని “అలానే చేద్దాం తల్లి” అన్నాడు. ఉపాహారం పూర్తయిన వెంటనే, అందర్నీ ఉద్దేశించి నట్టుగా “మీకు అభ్యంత్తరం లేకపోతే మేము కొంచెంసేపు ముచ్చటించుకుంటాం” అన్నాడు రాజన్న.

అందుకు రామచంద్రయ్య “ఇక్కడ ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేదు. కాకుంటే మా అందరికీ అసూయగా ఉంది. మీ జ్ఞానాన్ని మాకందించడం లేదే అన్న వెలితి మాత్రం ఉంది. నేను తమాషాగా అంటున్నాను. అయినా ముందువచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన చెవులు, కొమ్ములు పాత మాట కూసు కదా! మీరు ఏ సందిగ్ధం లేకుండా కావలసినంత సేపు చర్చించుకోండి. రెండు రోజుల తర్వాత మనకు కావలసినంత సమయం ఉంది కదా” అని అన్నాడు.

ఉష, రాజన్న మేడమీదికి చేరారు. “మొదలు పెట్టండి గురువుగారు” అన్నది ఉష. “ఈ ప్రపంచంలో పెద్ద సమస్య ఇదే. ప్రతివాడికి ప్రతి క్షణం వచ్చే ప్రశ్నలు ఏమిటి? ఎలా? ఎందుకు? ఎప్పుడు? ఎక్కడ?ఎవరు? వాటికి జవాబు దొరికితే తెల్సుకోవాల్సింది ఏమీ ఉండదు. దీన్ని ఆర్. క్లిప్పింగ్ అనే రచయిత రాశాడు. ఇంతకూ మనం ఎక్కడ ఉన్నాం?” అని అన్నాడు. అందుకు ఉష “అనురాగం, అనుబంధం నుండి వచ్చే ఆనందం, ఎంత సంపద ఉన్నా, ఎంతపెద్ద పదవిలో ఉన్నా రాదు అని నాకు అర్థమైంది”.

రాజన్న అందుకొన్నారు. "నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంత బాగా అంతరార్థాన్ని గ్రహించడం చాలా కొద్దిమందికే వీలవుతుంది. ఎవరో అన్నట్లు అసలు పుట్టకుండా ఉండడం ఉత్తమం. పుట్టి వీలైనంత త్వరగా నా భార్యలాగా చనిపోవడం మధ్యమం. పాములాగా నిరంతరం నిద్రపోతూ వెయ్యి సంవత్సరాల వరకు ఉండడం అధమం. ఈ ప్రపంచంలో ఉన్న సుఖాలకు, సంపదలకూ, కీర్తికాంక్షలకు తపన పడడం అవి లేవని మధనపడడం అదమాధమం". జ్ఞానానికి ఆరాటపడడం పరమోత్కృష్టం.

"అయితే మానవ జన్మ ఎత్తినప్పుడు తనకు తాను ఉపయోగపడడం ఇతరులకు ఉపయోగపడి ఆనందించలేని జీవితం వ్యర్థం. ఏదైనా సరే, ఇతరులను సంతోషపెట్టి నప్పుడు వచ్చే ఆనందం మరెప్పుడూ రాదు. నేను సినిమా వాణ్ని కాబట్టి సినిమా పాట చెబుతాను. 'ఇచ్చుటలో ఉన్న హాయి మరి యెచ్చటనూ లేనేలేదని ఇపుడె నాకు తెలిసింది' అని ఎంతో గొప్పగా చెప్పబడింది. నాకు ఇంకా కావాలని కోరుకోవడం స్వార్థం. దానికి ఆది ఉంటుంది కాని అంతం ఉండదు. దానిలో ఎక్కడా ఆనందం ఉండదు. అది కేవలం ఆరాటం మాత్రమే. కాని ఇతరులకు ఇచ్చే అలవాటు చేసుకుంటే ఆ త్యాగంలో ఉన్న ఆనందం అద్వితీయం". ఒక తల్లి తప్ప ఆ పని చేయలేరు. ఆ స్థాయిని ఇంకెవరూ అందుకోలేరు.

కొన్ని విచిత్రాలుంటాయి. ఎక్కడో ఒకరిద్దరు తమ బిడ్డలను చంపుకోవడం చూస్తాం. ఆ పరిస్థితి ఏమిటో అలా ఎందుకు చేశారో అది వాళ్ళకే తెలియాలి. కాని ప్రతి తల్లి తాను పస్తులుండి అయినా తన బిడ్డలకు ఆహారం పెడుతుంది. తన సర్వస్వం బిడ్డలకోసం ధారపోస్తుంది. ఒకసారి మీ అమ్మను గుర్తుచేసుకో. వేరేవాళ్ళ అమ్మలను కూడా గమనించు. దాంట్లో తేడా ఉండదు.

ఇంకోటి చెప్తాను ఒక స్త్రీ రెండు నెలల గర్భంతో ఉన్నప్పుడు కూడా, అబార్షన్ చేయించుకునేందుకు ససేమిరా అంటుంది. ఆమె మీద ఎంత ఒత్తిడి తెచ్చినా, కొన్ని సందర్భాల్లో ఆడబిడ్డ అని తెలిసినా, మగబిడ్డ మీద మోజు ఉన్నా ఆమె ఒప్పుకోదు. ఎందుకో తెలుసా ఆ హార్మోన్లు అలా పనిచేస్తాయి. ఆ కెమిస్ట్రీ అలాంటిది. నేను చెప్పేది అబద్ధం అనుకుంటే నా చివరి సలహాగా ఊరికి వెళ్ళి నీవు కూడా ఒక ప్రయోగం లేదా ప్రయత్నం చేసి చూడు. నీకే అర్థమవుతుంది".

ఇందుకు మరొక కోణంలో, నిజంగా జరిగిన ఉదాహరణ చెబుతాను. నేను సినిమాల్లో నటిస్తున్న రోజుల్లో ఒక అమ్మాయి రజని, అబ్బాయి నగేష్ కీర్తి కాంక్షతో, ఆవేశంతో, జీవనోపాధికి సినిమా యాక్టర్లు కావాలని ప్రొడ్యూసర్స్ చుట్టూ, డైరక్టర్ల చుట్టూ ప్రదక్షణాలు చేసి ఎలాగో చిన్న చిన్న వేషాలకు ఛాన్సులు సంపాదించారు. ఆ అమ్మాయికి హీరోయిన్ కావాలని కోరిక. కానీ వీలు కాలేదు. చిన్నవేషాలు వేసేందుకు ఇష్టంలేదు. కాని వేరేదారి లేక అలాగే కాలం గడుపుతూ వచ్చింది. పిల్లలను కంటే తన అందం సన్నగిల్లుతుందని దానిని వాయిదా వేస్తూ వచ్చింది. అతను రెండు మూడు వాయిద్యాలు కూడా వాయించేవాడు. సంగీతం కూడా పాడేవాడు. అతనికి కూడా కొన్ని ఛాన్స్‌లు వస్తుండేవి. దాంతో ఒక ఆర్కెస్ట్రాను తయారుచేసుకొని బయట ప్రోగ్రాంలను ఇచ్చేవాడు. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటూ, జీవిత లక్ష్యాన్ని సాధించాలని 15 సంవత్సరాలు గడిపేశారు. రజని హీరోయిన్ కావడానికి శరీరాన్ని అన్నివిధాలా క్రమశిక్షణతో పోషించుకుంటుండేది. నిజానికి వారు సినీఫీల్డ్‌లో నాకంటే ముందుగానే స్థిరపడ్డారు. అయినా కోరికలు పుష్పించి, కాయలు అయినాయి కాని, పండు పండలేదు. కాలానికి ఆశను కల్పించడమే కాదు, నిరాశను రుచి చూపించడం కూడా తెలుసు. కాలం నేర్పించిన పాఠాలతో మానవ జీవితం హైబ్రీడ్ చెట్లలాంటిది కాదని అర్థంచేసు కొన్నారు. అప్పుడు మనస్సు, భవిష్యత్తుమీదకు మళ్ళింది.

ఆ కారణంగా వాళ్ళు వారి ఆలోచనలను దారి మళ్ళించి, మంచిసంతానం కని, వాళ్ళను చైల్డ్ ఆర్టిస్ట్‌లుగా ప్రవేశపెట్టి తద్వారా వాళ్ళ కోరికలను తీర్చుకోవాలని, వాళ్ళ కలలను సాకారం చేసుకోవాలని, సంతానం కనేందుకు శ్రీకారం చుట్టారు. కాని ఎంత ప్రయత్నించినా సంతానం కలగలేదు. మందులాగా ఎక్స్‌పైరీ డేటు అయిపోయింది. అంతే జీవితం మీద విరక్తి, విసుగు ఏర్పడింది. డబ్బులు బాగానే ఉన్నాయి. ఒక సినిమా తీయడం ఆమె హీరోయిన్ కావడం, పార్టనర్స్ మోసం చేయడం సినిమా పెద్దగా ఆడకపోవడం చకచకా జరిగిపోయాయి. జీవితంలో కలలు కల్లలు కాగా ఇద్దరూ కలసి పురుగుల మందు త్రాగి చనిపోయినారు. మిగిలిన ఆస్తిని అనాథ బిడ్డల ఆశ్రమానికి వీలునామా వ్రాశారు.

"మనస్సు మనలను మోసం చేస్తుంది. దాని మాయ నుండి బయటపడ గలవారు కొద్దిమందే ఉంటారు". దానికి లొంగనివారు శంకరుడు, రమణమహర్షి, రామకృష్ణపరమహంస లాంటివారు ఉంటారు. నేను ఇంకొక విషయం చెబుతాను.

మనస్సు ఎప్పుడు కాదంటుందో, అవునంటుందో, ఏ సంఘటన అనుభవం, ఎలాంటి మార్పును తీసుకు వస్తుందో, ఎలా తోలుబొమ్మలాట ఆడిస్తుందో చెప్పడానికి వీలుకాదు. అసలు మనం చేసే ఆలోచనలను భగవంతుని మీదకు రుద్దుతాం తప్ప, ఆయనకు ఎలాంటి సంబంధం ఉండదు. మన ఆలోచనకు కేవలం అంగీకారం తెలపడమే ఆయన పని. ఆయన నామమాత్రంగా ప్రేక్షక పాత్ర వహిస్తాడు.

మనస్సు ఒక క్షణంలో మారుతుంటుంది. ఈరోజు శత్రువు, రేపు మిత్రుడు. ఈ క్షణం ప్రేమ మరో క్షణంలో పగ. ఒకప్పుడు స్వార్థం, మరొక్కప్పుడు త్యాగం. ఇదంతా ఒక పెద్ద ప్రవాహం. నేను మరలా చెబుతున్నాను ముందు కనపడేది ఎండమావులు. వెనుక కటిక చీకటి. కొండ దగ్గరికి వెళ్ళి పైకి తలెత్తితే శిఖరాగ్రం కనబడుతుంది. క్రిందికి చూస్తే అగాధం కనపడుతుంది. కాని ఆ శిఖరాగ్రం, ఆ లోయలోని ఖాళీ నుండి ఏర్పడ్డది అని అర్థంకాదు. లోయ ఏర్పడడానికి శిఖరాగ్రం కారణం, అని తెలియదు. లోయ లేకుండా శిఖరం, శిఖరం లేకుండా లోయ ఉండదు. కాకుంటే ఒకసారి శిఖరం అధిరోహించినట్టు భావిస్తాము. మరొక్క క్షణం లోయలోకి జారి పోయినట్టు భయపడతాము. ఈరోజు నువ్వు వద్దనుకుంటే రేపు రాదు. ఈరోజును వదిలేస్తే రేపు చేతికి చిక్కదు.

తైత్తరీయోపనిషత్తులో మాతృదేవోభవ!, పితృదేవోభవ! ఆచార్య దేవోభవ! అతిథిదేవోభవ! అన్నారు. అంతేగాని పోయే ప్రాణాన్ని నిలబెట్టే డాక్టరును, కేసు గెలిపించే లాయరును, సుఖాన్నిచ్చే భర్తను, సంసారాన్ని నడిపే భార్యను చివరికి స్నేహితుడిని కూడా చేర్చలేదు. ఎందుచేతనంటే పై నలుగిరి వలననే, ప్రేమ త్యాగం సిద్ధిస్తాయి కాబట్టి. దాంట్లో స్వార్థం ఉండదు.

నా విషయాన్ని తీసుకోండి. నా బిడ్డలమీద ప్రేమ ఉన్నా, నా అరవై సంవత్సరాల్లో పొందలేని ప్రేమను, అతిథిగా ఈ వూరికి వచ్చి సముద్రమంత విశాలము, పర్వత మంత బరువు కలిగిన ప్రేమను పొందాను. ఈ ప్రజలు నాకు ఆ ప్రేమను పంచుతుంటే మోసే శక్తిని ఇవ్వమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నేను ఇతరులకు ఉపయోగ పడగలనని కలలో కూడా ఊహించలేదు. ఇంత జ్ఞానం ఉన్న నాకు కేవలం 35 సంవత్సరాలు వయస్సు గలిగిన పూర్ణిమ దేవత ఇచ్చిన సలహాతో నేను ఈ స్థితికి వచ్చాను. వయస్సులో నాకంటే చాలా చిన్నది అయినా ప్రతిరోజు నేను మనస్సులోనే తన పాదాలకు ప్రణమిల్లుతున్నాను.

ఎందుకంటే, జీవితానికి ఒక అర్థాన్ని, పరమార్థాన్ని నాకు తెలిసేట్టు చెప్పి, నన్ను ఒప్పించి నాచేత మంచిపనులు చేయించేదానికి తాను కారణభూతురాలైంది. అంత శారీరక, మానసిక సౌందర్యం ఉన్నవాళ్ళను నీ జీవితంలో నీవు చూడలేవు. నేను దాదాపు నలభై సంవత్సరాల్లో సినిమా సముద్రం ఈదినవాణ్ణి. నేను కూడా చూడలేదు. తన దానగుణం ఎవరి వల్ల కాదు. కర్ణుడు, శిబి కథలు చదువుకొని ఉంటాం. కాని నేను అలాంటి మరొక వ్యక్తిని చూడలేదని చెప్పగలను. తను ఇరవై వృద్ధాశ్రమాలు, మరో పదిహేను తక్కువకు గాని వికలాంగుల ఆశ్రమాలను, అదే మోతాదులో అనాథ శిశువులకు రక్షణ కల్పించడం, హాస్పిటలు, ఆడిటోరియం ఇలా ఎన్నో కార్యక్రమాలను నిస్వార్థంగా చేసే వ్యక్తులను చూచి ఉండలేదు. తాను ఎంతో సాదాసీదాగా ఉంటుంది. ఆమె నాకు అమ్మలాంటిది. ఆరోజు నేను ఆమె దగ్గరికి వెళ్ళకుంటే, ఇప్పటికే కట్టెల్లో కాలి బూడిదైపోయేవాడిని. నాకు ఇలా జీవించమని ఆమే చెప్పింది".

ఉషకు తల బరువెక్కింది. ఒక వ్యక్తి దగ్గర ఇంత పెద్ద ప్రపంచం ఉన్నదంటే సామాన్యమైన విషయం కాదు. నిజానికి తాను ఒక అయోమయ పరిస్థితిలోకి జారిపోయిందనిపించింది. ఆవగింజంత తన మెదడు హిమాలయమంత విషయాన్ని ఇముడ్చుకోలేదనిపించింది.

ఉష "మీతో కొన్ని నెలలు సంవత్సరాలు మాట్లాడితే తప్ప ఈ చిన్ని బుర్రకు కొంతైనా అర్థంకాదు. నాకు అర్థమైనంత అర్థమయ్యింది. మీరు చెప్పింది మనస్ఫూర్తిగా నేను అంగీకరిస్తున్నాను. ఇప్పుడు నాకర్థమయ్యేట్టు ఒకటి రెండు వాక్యాల్లో నా భవిష్యత్తు కార్యాచరణను చెప్పగలరని అర్థిస్తున్నాను" అన్నది.

రాజన్న అందుకొని "నేను చెప్పను చెప్పలేను, అయితే ఒకటి చెప్పగలను. నీ అంతరాత్మను ఒక ప్రశ్న వేసుకొని దానికి, సందేహం లేకుండా ఏ జవాబువస్తే దాన్ని అనుసరించు. నిన్ను నీవు ప్రశ్నించుకో. నేను ఎవరు? నేను ఈ పంచేంద్రియాల సమాహారం. నా ప్రమేయం లేకుండా ఈ భూమ్మీద పడ్డాను. నా తల్లిదండ్రులు నా అభివృద్ధికి దోహదపడ్డారు. తద్వారా నాకు తృప్తి, సంతోషం కలుగుతున్నాయి. అలాగే నావల్ల ఎవరికైనా ఏమైనా ఒరిగిందా. ఎవరి కొరకైనా కష్టపడ్డానా, సహాయపడ్డానా? నా వయస్సు, మనస్సు, ఇంద్రియ జ్ఞానం, నా సంపదను ఉపయోగించి ఎవరికైనా

సహాయసహకారాలు అందించానా? తద్వారా ఆనందాన్ని చవిచూశానా. నేను ఈ ప్రకృతికి ఒక ఆస్తినా (అసెట్) లేక అప్పునా (లయబిలిటి)? ఈ విధంగా ఆలోచించుకో. ఒకళ్ళు చెప్తే చేసేది నమ్మకం, తనకు తాను చేసేది విశ్వాసం. నేను చెప్పాననే నమ్మకంతో చెయ్యవద్దు. విశ్వాసంతో చేయి. అప్పుడు నీకన్ని విధాలా సంతోషం, తృప్తి, ఆనందం కావల్సినంత దొరుకుతుంది. అలా జరగాలని నిన్ను ఆశీర్వదిస్తున్నాను. అలా జరిపించమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

పై పెచ్చు ప్రతి మానవజీవి ప్రకృతి ధర్మాన్ని పాటించాలి. ఒక ఉదాహరణ చెప్తాను. ఆడవాళ్ళకు గడ్డాలు పెరుగుతాయా? పురుషులకు బిడ్డలు కలుగుతారా? అది ప్రకృతి ధర్మం. దాన్ని అనుసరించలేని వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒక్కచోట ఆ రుణాన్ని ఏదో ఒక విధంగా తీర్చుకోవాలి. బహుశా అది చాలా కష్టంగా భయంకరంగా ఉండవచ్చు. కాబట్టి ప్రకృతి మనకంటే గొప్పది. ప్రకృతిలో మనం ఒక చిన్న భాగం. అందుచేత ప్రకృతికి ఎలా బ్యాలెన్స్ చేయాలో, మన మంచికి ఎలాంటి పురస్కారాన్ని ఇయ్యాలో, మన తప్పులకు ఎలాంటి శిక్ష వేయాలో, తెలుసు. అందుచేత తన పని తాను చేసుకొని పోతుంది. ఇంతకు మించి నేను చెప్పగలిగినది ఏమీ లేదు". ఇంతలో భోజనాలకు పిలుపు. భోజనాలు ముగించిన వెంటనే రాజన్న ఇంటికి బయలుదేరాడు. ఉష వచ్చి "గురువుగారు ఈ సెల్‌ఫోన్ మీ దగ్గర ఉంచుకోండి. దీనికి నెల నెలా బిల్ కట్టనవసరం లేదు". రాజన్న ఆ పెట్టెను చేతులో తీసుకుంటూ, "అయినా ఇవన్నీ నాకెందుకు తల్లీ! సరేలే! నీ సంతోషాన్ని నేను కాదనలేను. నీకు తీరికైనప్పుడు ఫోన్ చేస్తుండు. నీ యోగక్షేమాలు తెలుస్తుంటాయి" అంటూ రాజన్న వాకిలి దాటాడు.

ఏడు గంటలయ్యింది. రచ్చబండ ముచ్చట్లు పూర్తయ్యాయి. రామచంద్రయ్య, రాజన్న ఇద్దరూ ఇంటివైపు ప్రయాణం చేస్తున్నప్పుడు రాజన్న "ఈరోజు నాకు సంతోషంగా ఉంది. ఉషలో కొట్టొచ్చిన మార్పు వచ్చింది. ఈ పది రోజుల్లో తన ఆలోచనా విధానంలో చాలా తేడా కనపడుతున్నది. రేపు ఒకసారి ఉషకు తెలియకుండా రాకేష్‌ను నా దగ్గరకు పంపాలి మీరు. ఉదయం ఆరు గంటలకు వాకింగుకు వచ్చినట్టు మా ఇంటికి రమ్మనండి. ఒక అరగంటలో మరలా వెళ్లిపోవచ్చు" అని పూర్తి చేశాడు. రామచంద్రయ్య తన అంగీకారాన్ని తెలియజేశాడు.

పక్కరోజు ఉదయం రామచంద్రయ్య దగ్గరకు రాకేష్ వచ్చాడు. రాకేష్ తల్లిదండ్రులు తనకు, వాళ్ళ మధ్య జరుగుతున్న సందిగ్ధం గురించి చెప్పియున్నారని, దానికి తగిన విధంగా తాను ఉషతో సందర్భం వచ్చినప్పుడల్లా కొన్ని సంఘటనలను గురించి మాట్లాడానని, చివరకు ఉష తనంతట తానే సమస్యను తనతో చర్చించే స్థితికి వచ్చిందని, దానిమీద సుదీర్ఘ చర్చ జరిగిందని, ఆ కారణంగా తనలో ఒక కొత్త ఆలోచనకు బీజం పడిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించి చెప్పాడు రాజన్న. ఉషకు ఎలాంటి పరిస్థితుల్లో రాజన్న రాకేష్ చర్చించుకున్నట్టు తెలియకూడదని చెప్పాడు. ఈ ప్రోగ్రాములో రాకేష్ పాత్రను గురించి ఢిల్లీలో లేడీ డాక్టర్‌తో ఏం మాట్లాడాలో, ఏం చేయాలో గుట్టు రట్టు కాకుండా జరిపించే వ్యూహం గురించి చెప్పాడు. రాకేష్ తనకున్న అనుమానాలను నివృత్తి చేసుకొని రాజన్న ఆశీర్వాదాలు తీసుకొని వీడ్కోలు చెప్పాడు.

## రాజన్న కృతజ్ఞత

రోజులు గడుస్తున్న కొద్దీ, రాజన్నకు జనం తాకిడి ఎక్కువవుతున్నది. తిరున్నాళ్ళకు, జాతర్లకు, శుభకార్యాలకు, దైవకార్యాలకు, సలహాలకు, సంప్రదింపులకు, మధ్యస్థాలకు, ముఖ్య అతిథిగా పెద్ద మనిషిగా న్యాయంగా మాట్లాడతాడని సంప్రదింపులకు అర్హుడని ఆ వూర్లోనే కాక చుట్టుపక్కల గ్రామల్లో కూడా పేరు ప్రతిష్ఠలు పెరగసాగాయి. తన జీవితాన్ని ఇబ్బందిలేకుండా గడపకలిగిన ఆర్థిక పరిస్థితి ఏర్పడింది. తాను ఆ వూరు వచ్చినప్పటికీ, నేటికీ పెద్ద తేడా కనబడుతున్నది. ఇప్పుడు తనకు ఖర్చులేదు. బాడుగ, పాలు, కూరలు, బియ్యం అన్నీ ఎవరో ఒకరు పంపిస్తారు.

తనకు మర్యాద పూర్వకంగా ఇచ్చిన వస్త్రాలు, బీదవాళ్ళకు ఇస్తున్నా కూడా రెండు బీరువాల నిండా సరిపడే వస్త్రాలు, బహుమతులు, బంగారు గొలుసులు, వెండి వస్తువులు ఇలా ఎన్నో వచ్చిపడ్తున్నాయి. నలుగురు బీదపిల్లలను చదివించడానికి దత్తత తీసుకున్నాడు. ఎవరికైనా కష్టంలో ఉన్నారంటే అడగకుండానే సహాయం చేస్తున్నాడు. రాజన్న ఆ ఊరికి వచ్చి 9 నెలలు దాటుతున్నది. కనీసం వారానికి ఒకటి రెండు సార్లు పూర్ణిమకు ఫోన్ చేసి జరుగుతున్న పరిణామాలు, తన ఆనందం, పూర్ణిమకు తన ఋణం, ఆ వూర్లో వచ్చిన అనేక మార్పులు చెప్పడం జరుగుతున్నది. అయినా తాను నేరుగా ఒకసారి వెళ్ళి కలవాలంటే, ప్రతిరోజు కాదనలేని పని తగుల్తున్నది.

సరోజమ్మకు పది అంకణాల స్థలం తీసిచ్చి ఇల్లుకట్టించాడు. నెలకు ఒప్పుకొన్న జీతం కంటే రెండు రెట్లు జీతం కొడుకులకు, కోడళ్ళకు తెలియకుండా ఇస్తున్నాడు. రాజన్న బ్యాంక్ బ్యాలెన్స్ కూడా రోజు రోజుకు పెరుగుతున్నది. చిన్నకారు వాళ్ళ ఇబ్బందులను ఆదుకుంటూ, ధర్మాతుడని పేరు తెచ్చుకుంటున్నాడు. తన ప్రేరణ వల్ల ఊరిలో పూడిపోయిన చెరువు పది అడుగుల లోతుతో కొత్తగా తయారయ్యింది. పైపుల ద్వారా, ఊరిలోని గృహ అవసరాలకు, పశువులకు నీళ్ళు తెప్పించిన మంచిపని చేసేందుకు ప్రేరకుడయ్యాడు.

మూడువేల కుటుంబాలున్న ఊరిలో భార్యాభర్తల మధ్య, అత్తా కోడళ్ళ మధ్య, అన్నదమ్ముల మధ్య, తెగిన సంబంధాలు మరల అతుక్కునేందుకు రాజన్న మాటలు, చేతలు చాలా ఉపయోగపడుతున్నాయి. ఒకరిని చూచి మరొకరు మార్పుకు కొత్త తివాచీలు పరచి స్వాగతం చెబుతున్నారు. ఊరిలో చాలామంది తాగుడుకు స్వస్తి చెప్తున్నారు. మరి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. నిజానికి ఊరి ప్రజలలో పెనుమార్పు వచ్చింది. అన్నివిధాలా ఉన్న వాళ్ళు లేనివాళ్ళకు సహాయం చేయడానికి సంసిద్ధత చూపిస్తున్నారు.

ఇదంతా పూర్ణిమకు చెప్పినప్పుడు తన ముఖంలో కనబడె ఆనంద సౌరభాన్ని, ఆస్వాదించాలని రాజన్న కోరిక. ఒక్క రామచంద్రయ్యకు, సరోజమ్మకు తప్ప మరెవ్వరికీ తెలియకుండా, తెల్లవారి ఐదు గంటలకు వెళ్ళే బస్సులో ఎక్కాడు. బస్సులో ఉన్న పది మంది ప్రయాణీకులు లేచి స్వాగతం పలికి ఆయన కూర్చున్న తర్వాత కూర్చున్నారు.

* * * * *

మధ్యాహ్నం 1 గంట సమయం. ఇంటి కాంపౌండ్ గేటు దాటి లోపలికి వెళ్ళి సోఫాలో కూర్చొన్నాడు రాజన్న. ఈలోగా పూర్ణిమ కారు వచ్చి ఆగింది. పూర్ణిమ లోపలికి వచ్చి, "ఆశ్చరంగా ఉంది! మీరు వస్తున్నట్టు ఒక మాట కూడా అనలేదే?" ఎలా ఉన్నారు" అడిగింది పూర్ణిమ.

చేతి సంచిలో ఉన్న రోజామాలను బయటికి తీసి, ఆమె చేతుల్లో ఉంచి, "చిన్న దానవు కాబట్టి కాళ్ళకు దణ్ణం పెట్టడం లేదు. ఈ నీ చేతులు కాళ్ళనుకో!" అంటూ, గద్గదస్వరంతో కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యి, మాటా పలుకు లేక కళ్ళు తుడుచుకుంటూ నిలబడలేని స్థితిలో మరలా కూర్చొన్నాడు.

పూర్ణిమ ఆర్ద్రతతో "ఏంటి మాస్టారూ! మీరు తండ్రిలాంటి వారు. ఏమైంది? ఎందుకు?" అంటూ విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నించింది. "పది నిమిషాల్లో శశిధర్ కూడా వస్తున్నాడు అందరం కలిసి భోజనం చేద్దాం" అని అన్నది.

"అలాగే చేద్దాం తల్లీ! మిమ్ములను చూచిన తర్వాత ఆకలి ఆవిరైపోయింది. నేను వచ్చింది మీతో నా అనుభవాలను పంచుకోవాలని. నాకు పునర్జన్మను ప్రసాదించిన దేవతవు నీవు. నా ఆలోచనను మార్చి, క్రొత్త జీవితానికి శ్రీకారం చుట్టి అది కూడా నాకిష్టమైన దాన్ని నాకు ప్రసాదించావు" అని అక్కడ జరిగిన ప్రయోగాలు, మంచిపనులను గురించి చెప్పి "ఈ జన్మలో నేను ఇంత ఎత్తుకు ఎదగగలనని ఇన్ని పనులు చేయగలనని నాకు తెలియదు. 60 పదుల్లో ఉన్న వ్యక్తికి దేవుడు ఇంత గొప్ప అవకాశాన్ని, ఆలోచనలను మీద్వారా ఇచ్చాడు. నేను ఈ రోజు ఎంతమందికో ఆదర్శ జీవినయ్యాను. కాని దాని వెనుక ఒక ఆపన్న హస్తం ఉందని ఎవరికీ తెలియదు. మిమ్ములను నేరుగా చూచే భాగ్యం వాళ్ళకు కలిగితే ఎంత బాగుంటుంది. అందరూ మిమ్ములను ఒకసారి చూడాలని కోరుకొంటున్నారు" అని అంటూ జరిగిన కొన్ని సంఘటనలూ, విచిత్రాలు, అనుభవాలు చెప్పసాగాడు.

ఈలోగా రాజన్న ఫోన్ మోగింది. ఎవరా అని చూస్తే ఉష ఫోన్ చేసింది. హలో అన్న రాజన్న గొంతు విని "గురువుగారికి పాదాభివందనం. నేను ఉషను మాట్లాడుతున్నాను. కావాలని ఇన్ని రోజులు ఫోన్ చేయలేదు. ఫలితం సాధించిన తర్వాతనే ఫోన్ చేద్దామని చూస్తున్నాను. నేను ఇప్పుడు హాస్పిటల్ నుండి మొట్టమొదటి కాల్ మీకే చేస్తున్నాను. నేను మీ సందేశాన్ని మనస్ఫూర్తిగా పాటించాను. నాకు మూడో నెల పెట్టిందట. డాక్టరు గారు పరీక్షచేసి నిర్ధారించారు" అన్న ఉష మాటలు వింటుంటే తన ప్రయత్నానికి కలిగిన ఫలితానికి ముచ్చటపడిపోయాడు.

రాజన్న "చాలా సంతోషం తల్లీ! మంచివార్త చెప్పావు. శుభం. మీ తల్లి దండ్రులకు, అత్తమామలకు అందరికీ చెప్పు. విచిత్రమేమిటంటే నేను ఇప్పుడు నా జీవితానికి పూలదారి చూపించిన పూర్ణిమ దేవత దగ్గరకు వచ్చి ఉన్నాను. నువ్వు ఒక్కసారి ఆమె ఆశీర్వాదం పొందు అని పూర్ణిమవైపు తిరిగి ఒక్కసారి ఆ అమ్మాయికి మీ ఆశీర్వాదం ఇయ్యండి" అని అభ్యర్థిస్తూ ఫోన్ పూర్ణిమ చేతికిచ్చాడు.

పూర్ణిమ ఉషతో పదినిమిషాలు మాట్లాడి మళ్ళీ రాజన్న చేతికి ఇస్తూ "మనిషిని దేవతగా మార్చేశారా? ఆ అమ్మాయి మాటలు వింటుంటే, చాలా ఆనందంగా ఉంది. మంచికి ఎన్నడూ మసి పట్టదు. దాని మెరుగు తగ్గదు" అని అన్నది పూర్ణిమ.

రాజన్న "నేను మళ్ళీ మాట్లాడతాను, అని ఫోన్ ఆపేశాడు". పూర్ణిమవైపుకు తిరిగి "మూడు నెలలుగా రాని ఫోన్ మీ ఇంటికి వచ్చినప్పుడే రావడం, ఇక్కడవున్న శక్తి. అది చాలా మందిని నడిపిస్తున్నది".

రాజన్న పూర్ణిమతో, "మా సినీ రంగంలో ఎంతోమంది అలనాటి హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లు గంధపుచెక్కల్లా అరిగి సుగంధాన్ని పంచినవారు వేలమంది ఉన్నారు. ఈ రోజు కొందరికి ఒకపూట భోజనం, సరైన వసతి, కట్టుకోవడానికి గుడ్డల్లేకుండా కుచేలవతారాలతో వున్నారు. వాళ్ళకు మీరు చూపిన దిక్సూచి ఆధారంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలని ఉంది. నాకు మీ అంగీకారం, ఆశీర్వాదం కావాలి. మీ దయవలన నా దగ్గర బాగానే ధనం చేకూరి ఉన్నది. దాన్ని ఖర్చుపెట్టి ఈ పనిచేయాలనుకుంటున్నాను" అన్నాడు.

దానికి పూర్ణిమ "చాలా గొప్ప ఆలోచన. నాకు ఇలాంటి ఆలోచన ఎప్పుడు రాలేదు. తప్పక చేయండి. బ్రతికి చెడ్డవాళ్ళ బాధ వర్ణనాతీతం. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. శుభస్య శీఘ్రం" అన్నది. రాజన్న భోజనం అయిన వెంటనే పూర్ణిమ దగ్గర సెలవు తీసుకొని ప్రయాణమయ్యాడు. రాజన్న వారం రోజుల్లో తన ఆలోచనకు శ్రీకారం చుట్టడం జరిగింది.

* * * * *

# 8. శిఖరాగ్రం

## ఆశ్రయ నిలయాలు

రోజురోజుకు వృద్ధుల నిలయాలు, వికలాంగుల ఆశ్రమాలు, ఆసరా లేని స్త్రీ నిలయాలు, అంధుల ఆశ్రమాలు, మూగబధిర నిలయాలు పెరిగి పోతున్నాయి. వాటిలో వ్యక్తుల సంఖ్య కూడా నానాటికి పెరుగుతున్నది. నిర్వహణ చాలా కష్టమౌతున్నది. అనేకమంది దాతలు గుప్తదానం చేయడానికి ముందుకు వచ్చి సమర్పించుకుంటున్నారు. ఆశ్రమాల్లో చనిపోతున్న వారు, వారిని బిడ్డల కంటే మిన్నగా ప్రేమతో పోషించినందుకు, కృతజ్ఞతా పూర్వకంగా వాళ్ళ ఆస్తులను ధనాన్ని నిలయాలకు అప్పజెప్పుతున్నారు. వాళ్ళు ఇచ్చిన సంపదతో చాలా పకడ్బందీగా వ్యవస్థను పటిష్టంచేసి అది దుర్వినియోగం కాకుండా పూర్ణిమ శశిధర్ ఏ ఆశ్రమానికి ఆ ఆశ్రమం ఒక ట్రస్ట్‌గా ఏర్పాటుచేసి ఎలాంటి వ్యర్థ ఖర్చులకు తావివ్వకుండా ఉండేట్టు చూస్తున్నారు. ఎవరిచ్చినా ఇవ్వకపోయినా అందర్నీ సమానంగా చూస్తూ వాళ్ళ సంతోషమే ధ్యేయం అన్న ఉద్దేశ్యంతో ఉచితంగా సేవచేయడం ఆనవాయితీ అయ్యింది. దాదాపు రోజు లేదా వారంలో రెండురోజులు పూర్ణిమ ఆశ్రమాలను ఒక టైంటేబుల్ ప్రకారం సందర్శించి వాళ్ళ మంచి చెడ్డలను విచారించి వాళ్ళలో వాళ్ళను బృందాలుగా కమిటలుగా ఏర్పరచి, ఒక ప్రణాళికాబద్ధంగా వ్యవస్థను నడిపిస్తున్నది. ఎలాగైతేనేం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి అనారోగ్యంగా ఉన్న వ్యక్తికి సహాయంచేస్తూ, ధనమున్న వ్యక్తి ధనంలేని వ్యక్తికి సహాయం చేస్తూ, బాధలో ఉన్న వ్యక్తికి వూరట కలిగించే మనసున్న వ్యక్తిని ఆసరాగా ఉండేటట్టు చేసి, ఒకరికొకరు తోడునీడగా

ఒక కుటుంబంలో కూడా వీలుగాని ప్రేమానురాగాలను పంచుకుంటూ ఉండేటట్టుగా పూర్ణిమ శ్రమతో, ఆలోచనలతో తీర్చిదిద్దబడుతున్నాయి ఆశ్రమాలు.

పైగా ప్రతి ఆశ్రమం ఒక ప్రత్యేక ట్రస్ట్ అయి పర్యవేక్షణ, నిర్వహణ కమిటీలతో నడుస్తుంటాయి. అన్నింటికి స్థూలంగా, గైడ్‌లైన్స్ ఉంటాయి. మొత్తం 19 ట్రస్ట్‌లు ఉన్నాయి. వాటిలో మొదటి ఒకటి రెండు ట్రస్టులు పూర్ణిమ పేరుతో శశిధర్ పేరుతో ఉండేవి. అనగా పూర్ణిమ శశిధర్ వృద్ధులనిలయం, అన్న విధంగా ఉండేవి. తర్వాత ట్రస్ట్‌లు పెరిగే కొద్దీ ఆ మొదటి ట్రస్ట్‌లకు కూడా ఎక్కడా పూర్ణిమ పేరుగాని, శశిధర్ పేరుగాని లేకుండా ఉండేట్టు చేశారు. కొన్ని ట్రస్ట్‌లకు నెంబర్లు ఇచ్చారు. కాదంటే పేరుకు రికార్డ్స్‌లో పూర్ణిమ శశిధర్, చైర్మెన్ సెక్రటరీలుగా ఉంటారు. మిగతావన్నీ మేనేజ్‌మెంట్ కమిటీలు చూసుకుంటాయి. ప్రతికార్యక్రమానికి ఒక కమిటి, వాటి పర్యవేక్షణకు ఒక మెయిన్ కమిటీతో వ్యవస్థను నడుపుతున్నారు.

పూర్ణిమ శశిధర్ ట్రస్ట్‌లనుండి తమ సేవలకు పారితోషికం తీసుకొని, మరలా దానిని అవసరమున్న ట్రస్ట్‌లకు ఇచ్చేస్తున్నారు. వాళ్ళు హోటల్ ఆదాయంతో జీవితం గడుపుకొంటున్నారు. ఏదైనా ట్రస్ట్‌కు ఆర్థికసమస్య వచ్చినప్పుడు వాళ్ళ స్వంత ధనాన్ని వినియోగించి, మరలా వెనుకకు తీసుకుంటారు. పూర్ణిమ శశిధర్ అకౌంట్లు జాయింట్‌గా ఉన్నాయి. డైరీ ఫామ్, హాస్పిటల్, స్కూల్సు, ఆశ్రమాలు కూడా ఒకదాని కొకటి సంబంధంలేకుండా, దేనికి దానికే అన్నట్టు జరుపుతున్నారు. అందుచేత ఎవరు ధైర్యంచేసి ట్రస్ట్‌లో అవినీతి కార్యక్రమాలను చేయడానికి సాహసించరు. ఎక్కడైనా ఏదైనా పొరబాటు జరిగితే ఆయా కమిటీలు జనరల్ గైడ్‌లైన్స్ ఆధారంగా చర్యలు తీసుకుంటాయి. ఆశ్రమాలలో జరగవలసిన కార్యక్రమాల నిర్వహణ బాధ్యత అంతా శశిధర్ చూసుకుంటాడు. ఏదైనా సమస్య వస్తే వాళ్ళ స్థాయికి మించినదైతే ఆడిటర్లను, సంస్థల అడ్వకేట్‌లను అందర్ని పిలిచి మీటింగు పెట్టి సలహాలు తీసుకుంటారు.

* * * * *

## ఆర్ద్రత

పూర్ణిమ మొదట తనకు ఆశ్రయాన్ని కల్పించిన సత్యభామకు, ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తన స్వంత వనరులనుండి డబ్బు తీసి ఇచ్చేది. భర్త చనిపోయిన తర్వాత ఆమెను ఏదో ఒక ఆశ్రమంలో లేదా తన ఇంటిదగ్గర ఉండమని కోరింది. ఆమె కృతజ్ఞతతో "నాకు అవసరం వచ్చినప్పుడు మీవద్దకు వస్తాను" అని తన కష్టాన్ని

చెప్పుకోవడానికి ఉన్న ఒకే ఒక స్నేహితురాలని పూర్ణిమ వద్దకు తీసుకొని వచ్చింది. ఆమె, తన భర్త గవర్నమెంటు ఉద్యోగ విరమణ చేసి ప్రశాంతంగా కాలం గడుపుతుంటే, వాళ్ళ కుమారుడు తమ ఇంటి వాతావరణం గిట్టక, కోడలు ప్రోద్బలంతో వేరే కుంపటి పెట్టుకున్నారు. పెళ్ళికి ముందర కొడుకు కలకత్తాలో ఒక పెద్ద కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. పెళ్ళైన తర్వాత 3 నెలలకు ఉద్యోగం ముగించుకొని వచ్చేశాడు. ఇప్పుడు తనకున్న భూమిని అమ్మి, దాంతోకూడా తన భర్త రిటైర్‌మెంట్ తాలూకు వచ్చిన డబ్బు ఇస్తే, తానేదో కంపెనీ పెడతానని ప్రతిరోజు రచ్చకు దిగుతున్నాడు.

దీనికంతటికీ ప్రేరణ భార్య, వాళ్ళ తల్లిదండ్రుల ఇతర స్నేహితుల నుండి వస్తున్నది. దాని ఫలితం గత 6 నెలలుగా ఇంట్లో ఘర్షణ. అయితే ఆమె భర్త దీనికి ససేమిరా అంటున్నాడు. నెలరోజుల క్రిందట కోడలు ఊరికి వెళ్ళింది. ఆయన నాలుగుసార్లు బాత్‌రూముకు వెళ్ళవలసిన కారణంగా, ఇతరులకు నిద్రాభంగం అని వేరే రూములో పడుకుంటున్నాడు. పదిరోజుల క్రిందట ఏమైందో పరమాత్మకు తెలియాలి. పొద్దున్నే లేచే వ్యక్తి లెయ్యలేదని చూస్తే మంచంమీద నుంచి కింద పడి ఉన్నాడు. ఆమెకు అప్పుడు అర్థంకాకపోయినా, ఆ తర్వాత ఆ దౌర్భాగ్యుడు ఏదో చేశాడు అని అనిపించింది. ఈ రోజుల్లో కొంతమందికి బిడ్డలే శత్రువులుగా మారుతున్నారు.

అమ్మా మీకు ఇంకొక జరిగిన విషయం చెబుతాను. రాఘవయ్య, గంగమ్మ దంపతులు, చాలామంచివాళ్ళు మా ఇంటికి నాలుగో ఇంట్లో ఉండేవారు. వాళ్ళకు ఒక కొడుకు, కూతురు. రాఘవయ్యకు 5 ఎకరాల భూమి 2 ఎకరాల తోట ఉండేది. జీవితం ఇబ్బందిలేకుండా గడచిపోయేది. ఇద్దర్ని బాగా చదివించి, మంచి సంబంధాలతో వివాహం చేశాడు. ఇద్దరూ బెంగుళూర్లో కంపెనీలలో ఉద్యోగాలలో స్థిరపడ్డారు. భార్య భర్త పల్లెటూర్లో జీవనం సాగించసాగారు. అయితే వయస్సుతో వచ్చే ఆనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుండేవి. కొడుకు కూతురు నెలరోజులకోసారి ఫోన్‌లో పలకరించడం, సంవత్సరానికొకసారి ఉదయం కార్లో వచ్చి సాయంత్రం పోవడం జరుగుతున్నది. బెంగుళూరులో కొడుకు కూతురు ఒకరినొకరు పలుకరించుకోవడంలేదు. ఉన్నారంటే ఉన్నారు.

భార్యాభర్తలకు గతంలా హాస్పిటల్‌కు తిరిగే ఓపికలేదు. ఫోన్లో తమ పరిస్థితిని గురించి చెప్పినప్పుడు కొడుకు అన్నీ అమ్మేసుకొని బెంగుళూరుకు వచ్చేయమని సలహా ఇచ్చేవాడు. కాని రాఘవయ్య లోకజ్ఞానం కలవాడు. అక్కడ జరగబోయే తంతును

ఊహించగలగినవాడు. చివరకు భార్య కొడుకు దగ్గర చనిపోవాలన్న కోరిక మేరకు ఆ ఊర్లో ఉన్న ఇల్లు భూమిని అమ్మివేసి, దంపతులిద్దరు బెంగుళూరు చేరారు.

15 రోజులు గడిచాయి. ఒకరోజు సాయంత్రం 7 గంటలయ్యింది. రాఘవయ్యకు ఆకలైంది. భార్యతో అన్నం పెట్టమని అడిగాడు. స్టవ్‌మీద కుక్కర్లో కోడలు పెట్టిపోయిన అన్నం గిన్నెను దించి, పెద్దాయనకు మధ్యాహ్నం కూరలతో అన్నం పెట్టింది. కోడలు 8 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి టేబుల్ మీద ఉన్న గిన్నెను చూచి, అది అత్తగారి పని అని తెలుసుకొని, తాను లేకుండా ఎవర్ని అడిగి ఆ పని చేశారు అని వాపోతు గిన్నెలోని అన్నాన్ని డస్ట్‌బిన్‌లో పోసేసింది. రాఘవయ్య వాకిట్లో కూర్చుని ఇదంతా గమనిస్తున్నాడు. ఈరోజు ఇలా జరిగినందుకు తాను చింతపడలేదు. కాని ఈ విధంగా చాలాకాలం బండిని లాగడం అనవసరం అన్న తీర్మానానికి వచ్చాడు.

తెల్లవారింది. కుమారుడు, కోడలు ఆఫీసుకు పోయినారు. రాఘవయ్య భార్య పక్కన కూర్చుని, ఆమెచేతిని తనచేతిలోకి తీసుకొని, “నాతో వస్తావా! నేను వెళ్ళిపోవాలనుకుంటున్నాను” అని అడిగాడు. జీవితంలో ఏనాడూ అభ్యంతరం చెప్పని ఆమె సరే అన్నట్టు తలూపింది. మధ్యాహ్నం తనతో తెచ్చుకొన్న వస్తువును కూల్‌డ్రింక్‌లో కలిపి ఇచ్చాడు. గంగమ్మ తీసుకున్నది. కొద్దిసేపట్లో ఆమెకు స్పృహ తప్పిపోయింది. రాఘవయ్య కొడుకుకు ఫోన్ చేయడం, అంబులెన్స్ రావడం, హాస్పిటల్‌కు తీసుకు పోవడం జరిగిపోయింది. ఏదైనా పనిచేయడానికి ఒక పనిపిల్ల ఉంటుందని 13 ఏళ్ళ రమ్యను తమ ఊరినుంచి తెచ్చుకున్నారు. చిన్నపిల్ల అయినందున అమాయకంగా కంగారుతో, “గంగమ్మవ్వకు ఏమైంది” అని అడిగింది. రాఘవయ్య “తనకు నూకలు తీరిపోయినాయి” అన్నాడు.

ఆ చిన్నపిల్లకు విషయం అర్థంకాలేదు. సాయంత్రం 5 గంటలకు అంబులెన్స్‌లో నుండి తీసుకొచ్చి వాకిట్లో పడుకోబెట్టారు. పక్కరోజు దహన కార్యక్రమాన్ని జరపడానికి నిశ్చయించుకొన్నారు. రాఘవయ్య గంగమ్మను చూచి తన గదిలోకి వెళ్ళాడు. 9 గంటల ప్రాంతంలో రమ్యతో తాతయ్యను పిలువమంటే, గదిలోకి వెళ్ళి పిలిస్తే పలకడం లేదని వచ్చి చెప్పింది. అంతటితో ఇద్దరు దంపతులు బాధలనుండి విముక్తులయినారు. అని పెద్దామె బాధతో పూర్ణిమకు చెప్పింది.

* * * * *

పూర్ణిమ పి.ఏ. లోపలికి వచ్చి “అమ్మా! మీకోసం ఎవరో ఒకాయన వచ్చివున్నారు.” అరగంట నుంచి కాచుకొని వున్నారు. అపాయింట్‌మెంట్ ఉందా అంటే లేదు అన్నారు.

పేరు చెప్పలేదు. రమ్మని చెపింది పూర్ణిమ. రెండు నిమిషాల్లో పి.ఏ. తలుపుతీసి పట్టుకొంటే ఒకవ్యక్తి లోపలికి వచ్చాడు. గుడ్డలు మాసివున్నాయి. గడ్డం బాగా పెరిగింది. పి.ఏ. కూర్చోండి అన్నది. ఏదో ఫైలు చూసుకొంటున్న పూర్ణిమ రెండు నిమిషాల్లో తలపైకెత్తి చూచి "ఏంకావాలండి" అన్నది. "నేను... నేను... అభిలాష్" మాట పూర్తికాక మునుపే పూర్ణిమ గుర్తుపట్టింది. "ఓ మీరా! ఏమిటిది ఇలా..." అత్తయ్య మామయ్య ఎలావున్నారు?" ఎదుర్కొనడానికి, మాట్లాడ్డానికి ఇష్టంలేక అయోమయంతో అడిగేసింది.

"అమ్మా! నాన్న చనిపోయారు. నా పాపాలు ఈ గతికి తెచ్చాయి. ఈ మధ్యన మీ ఆచూకి తెలిసింది." ఏదైనా పని చూపిస్తే ఉండిపోతాను. నా ప్రవర్తన ఆ రోజు ఏదో చెప్పబోతే, ఆగమన్నట్లు చేత్తో సైగచేసి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి "ఒక వ్యక్తిని పంపుతున్నాను. ట్రైనింగ్ ఇచ్చి, ఎక్కడో ఒకచోట పెట్టండి" అని పి.ఏ.తో వారిని అక్కడికి తీసుకుపొమ్మని సైగచేసింది. ఉంటాను అని చెప్పి, అభిలాష్ పి.ఏ.తో బయటకు వెళ్ళాడు.

ఆరోజు సాయంత్రం, పూర్ణిమ శశితో అభిలాష్ పరిస్థితి, మధ్యాహ్నం జరిగిన విషయం చెప్పింది. "అదృష్టాన్ని కాలదన్నుకున్న వానిని దురదృష్టం తరుముతుంది" అని అన్నాడు. కొంచెంసేపు నిశ్శబ్దం. సీనియర్ అసిస్టెంట్‌గా చేరిన పదిహేను రోజుల తర్వాత అభిలాష్ ఒకరోజు రాత్రి 12 గంటలకు తాగిన మైకంలో డ్రైవ్ చేసి డివైడర్‌కు ఢీ కొట్టి అక్కడికక్కడే చనిపోయాడు.

* * * * *

## అంతరంగం

పూర్ణిమ ఆరుగంటలకు ఇంటికి వచ్చి ఫ్రెషప్ అయి కూర్చుంది. పి.ఏ. వచ్చి ఎవరో నటరాజన్ ఫోన్‌చేశారు. వాళ్ళ కుటుంబీకులు మన టౌన్‌లో ఉండే కొంత ఆస్తిని, ఏదైనా ధర్మకార్యాలకు వినియోగించుకునేందుకు ఇవ్వాలని అనుకుంటున్నారని వీలైతే ఇప్పుడు కూడా కలవడానికి ఇబ్బంది లేదట" అని చెప్పింది. "ఇప్పుడు కాదు రేపు మధ్యాహ్నం 2 గంటలకు ఆఫీసుకు రమ్మని చెప్పు" అని చెప్పింది.

గంట 8.30 అయ్యింది. కాని శశిధర్ రాలేదు. 9 గంటలకు వచ్చాడు. పూర్ణిమ "శశి! రేపట్నుండి ఎన్ని పనులున్నా 6.30 దాటకుండా ఇంటికి వచ్చేద్దాం. 7 గంటలకు రెడి అయి మాట్లాడుకుందాం. ఎంతసేపు చేసినా పనులు మిగిలిపోతూనే

వుంటాయి. వీలైనంత వరకు పని ఇతరులకు అప్పజెప్పే (డెలిగేట్) అలవాటు చేసుకో. అవసరమైతే ఇంకెవరినన్నా అపాయింట్ చేసుకో అని చెప్పింది.

మరుసటి రోజునుండి పూర్ణిమ శశిధర్, ఇద్దరూ అనుకున్న ప్రకారం 6.30 గంటల ప్రాంతంలో రాసాగారు. ఇద్దరూ రెడీ అయి మేడమీద కూర్చుని అనేక విషయాలు వీలైనంత వరకు ఆఫీసుకు సంబంధంలేనివి ముచ్చటించుకోసాగారు. వంటామె, తినుబండారాలు రెడీ చేసి ప్లేట్లలో పెట్టి మెట్లు దిగి వెళ్ళిపోయింది. పూర్ణిమ తనకేమి వద్దని, శశికి రెండు బిస్కెట్లు, ఒక కప్పు కాఫీ తాను రుచి చూచి బాగుందని తీర్మానించుకొని శశికి ఇచ్చింది. ఇద్దరూ కాఫీ తాగారు.

శశిధర్ ఆరోజు వికలాంగుల ఆశ్రమంలో జరిగిన ఏదో ఒక విషయం లేవనెత్తాడు. పూర్ణిమ "ఇలాంటివి రెండు మూడు సార్లు వేరే వాళ్ళ విషయాల్లో కూడా జరిగాయి. అవి అన్నీ సహజమే" ఇంకా ఈ రొటిన్ ఎంతకాలం? ఈ బాధ్యతలన్నిటికి ఒక సుప్రీమ్ కమిటీని వేసి, వాళ్ళకు అప్పజెప్పి దానికొక ఛైర్మన్ సెక్రటరీని అపాయింట్ చేసి, మనం కేవలం ఆనరరీ ఫౌండర్ ఛైర్మన్ సెక్రటరీలుగా వుందాం".

"నీ ఇష్టం నీవెలా చెప్తే అలా చేద్దాం". "ఇక్కడ నుండి కూడా మకాం మార్చి తోటలోనున్న బంగళాకు వెళదాం. అప్పుడప్పుడు హాస్పిటల్ ఎలా ఉందో చూచివద్దాం. అన్నిటికంటే ముఖ్యం, భవిష్యత్తును పరిపాలించే చిన్నపిల్లల చదువులు సక్రమంగా ఉండేట్టు చూడాల్సిన బాధ్యత మనమీద ఉంది. మనదేశ భవిష్యత్తుకు వాళ్ళే పునాది రాళ్ళు" అని అన్నది. శశి "నాకు కూడా అలాగే అనిపిస్తున్నది. చేసిందే చేయడం, చెప్పిందే చెప్పడం, వినిందే వినడం, ఇబ్బందికరంగా ఉంది. ఎక్కడా ఒక క్రియేటివిటీ, నూతనత్వం లేదు. అసలు జీవితంలో థ్రిల్ అనేది లేకుండా పోయింది. 23 సంవత్సరాల క్రిందట మనం ఈ సేవా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు, మనల్ని కరుణించి ఆ మహానుభావుడు ఇచ్చిన చేయూత వలన మనకు ఒక దశా దిశా కనపడ్డది. ఆయన లేకపోతే మనం ఎవరో ఒకరి దగ్గిర, చాకిరీచేయాల్సి వచ్చేది ఒకవేళ ఐ.ఏ.ఎస్. అయితే కూడా. అలాంటి పరిస్థితి లేకుండా వుండే భాగ్యాన్ని కలిగించాడు ఆ పుణ్యాత్ముడు. అది తలచుకుంటే కళ్ళే కాకుండా శరీరంలోని ప్రతి అణువు కన్నీరు కారుస్తుంది. ఈ రోజు కాకతాళీయంగా ఆయన వస్తే, ఆయన వలన పెరిగి పెద్దవైన ఈ సంస్థలన్నీ, తన దయాదాక్షిణ్యాల వలన అని చెప్పి, పాదాభివందనం చేసి, కన్నీళ్ళతో కాళ్ళు కడగాలనిపిస్తుంది" అని గద్గద స్వరంతో మాట్లాడాడు శశి. అంత గంభీరంగా ఆర్ద్రతతో మాట్లాడడం అరుదు. ఈ ఆలోచనలు ఎన్నో రోజుల

నుండి తన అంతరాంతరాల్లో దాక్కుని ఉన్నాయనిపించింది. ఇద్దరూ ప్రశాంతంగా మాట్లాడు కోవాలని వచ్చి ప్రేమ, కరుణ, ఆర్ద్రతల వర్షంలో ముద్దగా తడిసిపోయినారు.

* * * * *

## సమాజ రాజకీయ స్పృహ

పూర్ణిమ పి.ఏ. వచ్చి "మేడం! ఎమ్మెల్యేతో కూడా కలిపి పదిమంది రాజకీయ నాయకులు పదిహేను నిమిషాల నుండి కాచుకొని ఉన్నారు. వాళ్ళు మీతో మట్లాడాలట" అని చెప్పింది. పూర్ణిమ గ్లాసులో నీళ్ళు కొంచెం తాగి, రమ్మని చెప్పింది. ఎమ్మెల్యే రాజగోపాల్ అందరిని పరిచయం చేసి "మీ కాలం చాలా విలువైనది. వృధాచేయడం ఇష్టంలేదు. క్లుప్తంగా చెబుతాను. మా హైకమాండ్ ఆజ్ఞప్రకారం, వచ్చే ఎలక్షన్లలో మీరు ఎమ్మెల్యేగాగాని, ఎం.పి.గా గాని మీకు నచ్చిన దానికి, మీరు పోటీ చేయాలని అభ్యర్థన. ఒకటి మీరు తీసుకుంటే రెండవది శశిధర్‌గారికి కూడా ఇవ్వాలని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మీ అంగీకారం కోసం మమ్మల్ని అందరినీ పంపించారు. మీరు పెద్దమనస్సు చేసుకొని మీ అంగీకారం తెలపాలని అభ్యర్థిస్తున్నాం".

పూర్ణిమ "మీ సహృదయతకు నా కృతజ్ఞతలు. మీరు రూలింగ్‌లో ఉన్నారు. పైగా మీరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మీ స్థానంలోకి నేను రావడం, పైపెచ్చు సేవా కార్యక్రమాల్లో నుండి రాజకీయాల్లోకి రావడం మంచిపద్ధతి కాదు. ఎవరైనా తాము చేసే పనిని నిన్నటి కంటే ఈ రోజు, ఈ రోజు కంటే రేపు, రేపటి కంటే ఆ తర్వాత, ఇంకా, ఇంకా, ఇంకాబాగాచేయాలని ఆశించాలి గాని ఒకరిదాంట్లో ఇంకొకరు తలదూర్చడం మంచిది కాదుకదా! ఒక గొప్ప పెయింటర్‌ను మీరు వేసిన చిత్రాల్లో మీకు ఏది బాగా నచ్చిందంటే ఆయన ఇచ్చిన జవాబు నేనిప్పుడు వేయబోయేది అని జవాబిచ్చాడట.

నిన్న అపోజిషన్ పార్టీ వారు కూడా ఒక ఆహ్వానాన్ని అందజేశారు. వాళ్ళకు కూడా ఇదే విషయం వేరే విధంగా చెప్పాను. దయచేసి నేటి అప్రజాస్వామ్యంలోకి నన్ను దించకండి! ఎందుకంటే ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ స్వాతంత్ర్యం. ప్రతివ్యక్తీ తాను స్వతంత్రంగా తన కాళ్ళమీద తన నైపుణ్యంతో బ్రతకడం జరగాలి. కాని నేటి పరిస్థితి దానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలను రెండు విధాలా చెడగొడుతున్నాము. ఒకవైపు అన్నిరకాల రాయితీలను ఇస్తూ, ఒకరూపాయికే ఒక కేజీ బియ్యం ఇచ్చి, భోజన వసతిని కల్పించి, సారాయి షాపులను పెంచి పోషించి,

మరొకవైపు పని నైపుణ్యాన్ని నాశనంచేసి, సారా త్రాగుడుతో వచ్చే జబ్బులకు ఉచిత వైద్యం చేయిస్తూ, టాక్స్ రూపంలో వ్యాపారస్తులు దగ్గర నుంచి వసూలు చేసిన ప్రజల సొమ్ము దుర్వినియోగం చేయబడుతున్నది. దీనిని ప్రజాసామ్యమని అనడానికి లేదు. జీవులకు, గొడ్లకు నీరు పుష్కలంగా ఇచ్చేందుకు, సారాను తరిమి కొట్టేందుకు, మంచి విద్యను ఉచితంగా పంచేందుకు, జనాభాను తగ్గించేందుకు కంకణం కట్టుకుని మ్యానిఫెస్టోను తయారుచేయండి. నేను మీ తరపున పోటీచేస్తాను.

అన్నిటికంటే నేటి సమస్య, సమాజంలో నైపుణ్యానికి, వృత్తికి ఘర్షణ ఉంది. అన్నిరకాల వృత్తులలో అసమతౌల్యము (Mis-match ) ఏర్పడి ఉంది. రాజకీయ నాయకుడు, వ్యాపారిగా, స్వామీజీగా సినిమా యాక్టర్‌గా అవతారమెత్తుతున్నాడు. స్వామీజీ వ్యాపారం, రాజకీయం చేస్తున్నాడు. ఉపాధ్యాయుడు తన పని తప్ప మిగతావన్నీ చేస్తున్నాడు. వ్యాపారస్తుడు అన్నిరంగాల్లోకి ప్రవేశిస్తున్నాడు. గీతలో చెప్పిన స్వధర్మాన్ని అనగా గుణకర్మ విభాగాన్ని తుంగలోతొక్కి సమాజాన్ని నడిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని ఉద్ధరించడానికి వెయ్యి మంది కృష్ణులు, శంకరులు, బుద్ధులు, అవతారాలు ఎత్తినా వీళ్ళ ముందర చిత్తై ఓడిపోతారు.

రెండవ సమస్య అనర్హతాధికారం (Misplacement). కేవలం పార్టీకి సంబంధించిన వ్యక్తి కొరకు చట్టాన్ని న్యాయాన్ని తుంగలో తొక్కి పెద్ద పదవులను కట్టబెడుతూ అనర్హతను, నిర్వహణ అసామర్థ్యాన్ని పెంచిపోషిస్తున్నారు.

ఏ వ్యక్తియైనా, కుటుంబం అయినా, వ్యవస్థ అయినా, వ్యాపార సంస్థయైనా, ప్రభుత్వం అయినా నడుం వంచి పనిచేయకుండా ఉంటే సమాజం దివాలా తీస్తుంది అన్నది తథ్యం. ప్రస్తుత మన పరిస్థితి అదే. దయచేసి నా చేత అనేక సత్యాలను చెప్పించి, మీ మనస్సును కించపరిచేట్టు చేసుకోవద్దని, ఇప్పటిదాకా నేను మాట్లాడిన దానికి అన్యథా భావించవద్దని, మిమ్ములను అభ్యర్థిస్తున్నాను. సమాజం మీద ప్రేమ, అభిమానం, బీదలపట్ల దయ లేకుంటే రాజకీయాలకు పనికి రారు. రాజకీయ నాయకుడు ఎలా ఉండాలో ఒక్కసారి గాంధీగారిని తలచుకొని ఆ కోవలో నడవాలని కోరుకుంటున్నాను. పేరు ప్రఖ్యాతులకు, బిరుదులకు, పొగడ్తలకు, నా అయిష్టత మీ అందరికీ తెలిసిన విషయమే. దయచేసి నేను చేసే పనిని ఇంకా బాగా చేయాలని, నేను పదిమందికి పనికివచ్చే విధంగా ప్రవర్తించాలని మీరు నన్ను ఆశీర్వదించండి". అనగానే ఎమ్మెల్యేలతోబాటు అందరూ అక్కణ్ణుంచి సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

* * * * *

# 9. సృష్టి స్థితి లయ

సాధారణంగా మూడు నెలలకు ఒకసారి సందర్భానుసారంగా ఊరిలో ఉన్న మేధావులను ఆహ్వానించి కార్యక్రమం జరిపించడం పూర్ణిమకు అలవాటు. ఒక ఆదివారం వ్యాసపౌర్ణమి కావడంతో, కొంతమంది కవులు, గాయకులు, డాక్టర్లు, అడ్వకేట్లు, రెవిన్యూ పోలీస్ ఆఫీసర్లు, కలెక్టర్ ఎస్పీతో సహా ఒక కార్యక్రమం జరిగింది.

నారాయణరావు "ఈ సృష్టి స్థితి లయలో మానవునికి పెద్ద పాత్ర ఉంది. మానవుడు ఈ సృష్టిలో భగవంతుడిని గుర్తించి తన పరిధిలోతెచ్చుకొని, తన తపస్సు ద్వారా అనేక వరాలను పొంది, చివరకు భగవంతుడిని శపించే స్థితికి తీసుకరాగ లిగాడనడంలో విడ్డూరం లేదు. మా అభిప్రాయాన్ని పూర్ణిమ గారు అనేక కోణాల్లో స్పృశించి, నివురుగప్పిన నిప్పులా వుండి పైన బూదిని ఊదేసి, నిప్పు నిజస్వరూపాన్ని ప్రదర్శించమని అభ్యర్థిస్తున్నాం" అని ముగించాడు.

పూర్ణిమ: నమ్రతతో అందరికీ మర్యాద పూర్వకంగా నమస్కారాలు తెలిపి ప్రారంభించింది. "ఈ విశ్వంలో సృష్టి, స్థితి, లయలలో, సృష్టి లయాలు, కేవలం యాదృచ్ఛికాలు. ఎప్పుడు, ఎక్కడ, ఏమి, ఎలా జరుగుతుందో చెప్పలేనిది, యాదృచ్ఛికం. పురాణాల్లో ఈ సృష్టి స్థితి లయాలను బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు ఆపాదిస్తారు. ప్రస్తుతం, భౌతిక శాస్త్రవేత్తలు విశ్వంలో జరిగే సృష్టి లయల యాదృచ్ఛికాలను, బిగ్‌బ్యాంగ్ మరియు బ్లాక్‌హోల్ అని అంటున్నారు. 'సృష్టి' 'ఆది' అయితే, 'లయం' 'అంతం' అవుతుంది.

ఈ సృష్టి లయాల, ఆద్యంతాల మధ్య ఒక 'స్థితి' ఉంది. అంటే ఒక యాదృచ్ఛికం, మరొక యాదృచ్ఛికం మధ్య, పరిణామ, నిర్వహణ, కార్యకారణ ప్రక్రియలు జరుగుతుంటాయి. జీవితంలో రెండు యాదృచ్ఛికాల మధ్య స్థితి, జీవుల కోరికల దురాశల నిరాశల, ఆశల ఆశయాల ఆవేశాల అహంకారాల పోటీతత్వంతో జీవితాన్ని జూదంగా మలచుకొని, ప్రకృతిని వికృతిగా మార్చుకుంటున్న వైనం కనబడుతుంది. విచిత్రమేమిటంటే ఈ 'స్థితి' లో కూడా అనేక యాదృచ్ఛికాలు జరుగుతుంటాయి. ఈ ప్రక్రియ ప్రేమ, పగ, త్యాగం వైరాగ్యం, సుఖం దుఃఖం, తృప్తి అసూయ, చర్య ప్రతిచర్య, స్పందన, ప్రతిస్పందనల 'ప్రత్యామ్నాయాలతో' నడుస్తుంటుంది. కోరిక భయం కారణాలయితే, దుఃఖం, అసూయ, అహం వాటి తాలూకు ఫలితాలవుతాయి. దీనికి విరుగుడు ప్రేమ, త్యాగం, వైరాగ్యం.

ఈ విశ్వంలో ప్రతి అణువుయొక్క, పదార్థ చైతన్యం, ఒక విచిత్రమైన ప్రవాహం. ఏ ఒక్క క్షణం, మరొక క్షణంతో సరితూగదు. అలానే ఏ ఒక్క భౌతిక వస్తువు, మరొక దానితో పోలిక ఉండదు. ఏ జీవి కూడా మరొక జీవిలా ఉండదు. సముద్రం దగ్గర ఉన్న అనంత ఇసుక రేణువులు కూడా ఒకదానితో మరొకటి అన్నివిధాలా సరిసమానంగా ఉండదు. అంటే ఈ విశ్వంలో సరిసమానంగా ఉన్న వస్తువులు ఏవీ రెండు ఉండడానికి వీలులేదు.

మానవుడు సాంకేతిక పరిజ్ఞానంతో ఒకవైపు అనేక శక్తులను ఉపయోగించి, చేపలా నీటిలో ఈదుతూ, పక్షిలా ఆకాశంలో ప్రయాణం చేస్తూ, గ్రహాంతర ప్రయాణం చేస్తూ, అణుబాంబులు తయారు చేస్తూ అనేక వ్యసనాలకు అలవాటు పడి మంచి గుణాలను మరుగున పడదోసు కుంటున్నాడు.

ఇది మానవుడి ప్రతిభా లేక భగవంతుని అనుగ్రహమా అర్థంకాదు. భగవంతుడు ఈ సృష్టి చేసినవాడైతే మానవుడికి నేర్పిన దుర్మార్గాన్ని మిగతా జీవులకు కూడా నేర్పించలేక పోయాడా? మానవుడిని దురాశతో, అసంతృప్తితో, అసూయతో, సృష్టించి జంతువులకు ఒక క్రమశిక్షణ కల్పించాడు. మానవుడు ప్రకృతిని వికృతిగా మార్చి, తద్వారా ఆనందం అనుభవిస్తున్నామన్న భ్రమలో కొట్టుమిట్టాడుతున్నాడు. అయినా తృప్తిలేదు. సంతోషం లేదు.

## యాదృచ్ఛికం

ఈ సృష్టిలో జరిగే అన్ని వ్యవహారాలకు ఒక నిర్ధిష్టమైన ప్రణాళిక భగవంతుని వలన వ్యక్తులవలన జరుగుతున్నది. అని చెప్పడానికి వీల్లేదు. చాలా విషయాలు ఎవరూ

అనుకోనివి, ఊహించనివి, ఒక క్రమపద్ధతి లేనివి, శాస్త్రీయత లోపించినవి జరుగుతుంటాయి.

ప్రకృతిలో ప్రతి విశేషం ఒక మెరుపులా, పిడుగులా, కార్యకారణాలను విశ్లేషించేందుకు వీలుకాని రీతిలో ఉంటుంది. అంటే ఈ జీవితాలలో ఒక తప్పు లేదా ఒప్పు, మన ఊహకు అందకుండా జరుగుతుంటుంది. నిజానికి చావు పుట్టుకలు యాదృచ్ఛికాలు కాదా? ఈ యాదృచ్ఛికాలకు, పదార్థం చైతన్యం ఉపాధులవుతాయి. ఒక్క క్షణంలో పుట్టడం, గిట్టడం, ఊహకు అందని విషయాలు. ఒక శాస్త్రవేత్తకు, ఒక ఆలోచన అనుకోకుండా స్ఫురించడం, అదో ఒక పెద్ద సిద్ధాంతంగా మారడం ఇలా జీవితంలో ఎన్నో యాదృచ్ఛికాలు దొర్లుతుంటాయి. వాటిని గమనించిన వారు గమనిస్తారు. గమనించని వారు పట్టించుకోరు. సద్గురువులకు, అవతార పురుషులకు కూడా యాదృచ్ఛికాలు తప్పవు. బుద్ధుడికి జ్ఞానోదయం అవ్వడం ఒక యాదృచ్ఛికం. ఆత్మ స్థూలతత్వం పదార్థం. చైతన్యం యొక్క స్థూలతత్వం పదార్థం. పదార్థం యొక్క సూక్ష్మతత్వం ఆత్మ. పదార్థం యొక్క చైతన్యం మనస్సు. స్థూలంలో ఉండే సూక్ష్మం ఆత్మ.

ప్రపంచంలో అందరి ఆమోదం పొందగల సూత్రాలు ప్రేమ త్యాగం. అంతకన్నా గొప్ప లక్ష్యాలు మానవాళికి కనపడదు. లక్షలమంది చనిపోతున్నా, గుర్తుపెట్టుకొనగలిగిన వాళ్ళను, వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వాళ్ళు త్యాగజీవులు. శ్రీకృష్ణుడు అర్జునుడిని యుద్ధం చేయమనడంలోని ఆంతర్యం కర్మ ద్వారా త్యాగం చేయమని.

మానవజాతి ఎప్పటినుండో భగవద్దర్శనం కోసం తపిస్తున్నది. దానికొరకు ఎన్నో ప్రార్థనలు, యజ్ఞాలు, యాగాలు, త్యాగాలు చేసి అనేక విశ్వాసాలకు తెరదీసి సిద్ధాంతాలను ఆవిష్కరించి, వాటిని నమ్ముకొని జీవితాలను గడిపిన మహామహుల చరిత్రే వేదాంతసారం. అయితే మానవులు మంచితో చెడును జతచేసి ఒకరినొకరు కించపరచుకుంటూ, ప్రేమ స్థానంలో పగను ద్వేషాన్ని పెంచుకొని యుద్ధాలను చేసుకుంటూ, జీవులను సంపదలను నాశనం చేసుకుంటూ బ్రతకడం అలవాటైపోయింది. ఈ కారణంగా రాజరికం నుండి ప్రజాస్వామ్యం, సోషలిజం, కమ్యూనిజం వరకు అనేక ప్రయోగాలు చేశారు.

నిజానికి వీటన్నిటిద్వారా జరిగిన మంచి కంటే చెడ్డ ఎక్కువ అని చెప్పవచ్చు. ఏది ఏమైనా మానవుడు స్వార్థానికి బాగా కండీషన్ అయిపోయాడు. ఇలాంటి స్వార్థం

చివరకు అతడికి మిగిల్చేది దుఃఖమే. ఎందుకంటే ఈ భూమ్మీద, ప్రేమ, తృప్తి, త్యాగం, తప్ప, మిగాతావేవీ ఆనందాన్ని ఇయ్యలేవని ఎందరో మహానుభావులు ఋజువు చేశారు.

చర్యకు ప్రతిచర్య, స్పందనకు ప్రతిస్పందన, సమానంగా వస్తుంది అని న్యూటన్ సిద్ధాంతాలలో చివరిదైన దానిని సాధారణంగా మనం ఉదాహరణ కింద తీసుకుంటాం. పదార్థం విషయంలో ఈ సిద్ధాంతాన్ని ప్రశ్నించడానికి వీలులేదు. కాని, మానవ సంబంధాలలో ఇదేమి పరమ సత్యం కాదు. ఇక్కడ యాదృచ్ఛికం, యాదృచ్ఛికంగా ఒక మెరుపుదాడిని జరిపేందుకు అవకాశం ఉంది.

ఉదాహరణకు భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు బిడ్డల మధ్య, స్నేహితుల మధ్య, సమానమైన, ప్రేమ పగ ఉండదు. ఒకరు ప్రేమిస్తే ఎదుటి వారు సమానంగా ప్రేమించవచ్చు, తక్కువగా ప్రేమించవచ్చు, ఎక్కువగా ప్రేమించవచ్చు లేదా ద్వేషించ వచ్చు. ఖచ్చితంగా ఇలా జరుగుతుందని చెప్పడానికి ఆస్కారం లేదు. జరిగేవాటికి విధిని, రాతను, గీతను, దేవుడిని అడ్డం పెట్టుకొని, కర్మ అని సరిపెట్టుకుంటారు. కాబట్టి ఈ ప్రపంచంలో ఒక తప్పు మరొక తప్పుకు దారి తీస్తూ ఉంటుందనిపిస్తుంది. కుటుంబంలో కలిగే తగాదాల నుండి ప్రపంచ యుద్ధాల వరకు కారణాలు పరిశీలించి చూస్తే, చిన్న చిన్న తప్పులు యాదృచ్ఛికంగా జరిగినవే తప్ప బలమైన కారణాలను చూపించేందుకు వీలులేదు.

## ప్రత్యామ్నాయ తత్త్వం

ఈ ప్రపంచంలోని పంచభూతాత్మకమైన ప్రతి వస్తువు, సంఘటన, ఆలోచన, ఆచరణ, పని, స్పందన ప్రత్యామ్నాయ ప్రక్రియ అని అర్థంచేసుకోవాలి. ఈ భౌతిక తత్త్వంలోని చైతన్యం, ఒకదానికి మరొకటి సృష్టించుకొని, ప్రత్యామ్నాయంగా ప్రపంచాన్ని నడిపిస్తుంది. పంచభూతాలు పంచేంద్రియాలు కూడా ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలే. కన్ను చూస్తుంది. కాని చెప్పలేదు. నోరు చెబుతుంది కాని చూడలేదు, వినలేదు, వాసన చూడలేదు. ముక్కు వాసన చూస్తుంది. కాని చెప్పలేదు. చెవి చూడలేదు, చెప్పలేదు కాని వింటుంది. నిజానికి గాలి, నిప్పు, నీరు, భూమి, ఆకాశం, ఒకదానికొకటి ప్రత్నామ్యాయాలే. పనికి విశ్రాంతి, విశ్రాంతికి ధ్యానం, ధ్యానం భగవద్దర్శనానికి పత్యామ్నాయాలే. ఘనపదార్థాలకు ద్రవపదార్థాలు ప్రత్యామ్నాయాలే. కోరికలు, ఆకలి, నిద్ర, విశ్రాంతి, మెలకువ అన్నీ పత్నామ్యాయాలే.

వేదాల కర్మకాండకు, బౌద్ధం ప్రత్యామ్నాయం అయింది. బౌద్ధానికి ప్రత్యామ్నాయం అద్వైత్వం. అద్వైతానికి ప్రత్యామ్నాయం విశిష్టాద్వైతం, ద్వైతం. వీటికి మరలా అనేక తత్వాలు ప్రత్నామ్యాయంగా తయారైనాయి. అనేక దేవుళ్ళు ప్రత్యామ్నాయాలుగా మారి, అనేక మతాలు సిద్ధాంతాలు తయారుకాబడ్డాయి. ఒక మతం లోని లోపాలని సరిదిద్దేందుకు, మరొక మతం ప్రత్యామ్నాయంగా తయారైంది. మంచిపనులకు చెడ్డప్రవృత్తులు, నిజానికి అబద్ధం, సత్యానికి అసత్యం, అంతానికి అనంతం, రాత్రికి పగలు, చీకటికి వెలుగు, చల్లదనానికి వేడి, డిమాండ్‌కు విలువ, భయానికి ధైర్యం, దుఃఖానికి సంతోషం, ఆకలికి ఆహారం, ఆవేదనకు ఆహ్లాదం, ఒక ఋతువుకు మరొక ఋతువు, జీవితానికి మరణం ప్రత్యామ్నాయాలుగా తయారై, ప్రస్తుతం మనం చూస్తున్న ప్రపంచ జీవన విధానంగా తయారైంది. జ్ఞాని జీవన గమ్యాన్ని చేరడానికి, ప్రత్యామ్నాయాలు తెలుసుకొని ఆచరణతో జీవించడం ప్రతివేదాంత గ్రంథం అంతరార్థమే.

మానవజాతి ఆదిమ మానవుడి బానిసవ్యవస్థ, రాచరికం, జమిందారీ చట్టం, ప్రజాస్వామ్యం, సోషలిజం లాంటి అన్నిరకాల పభుత్వాలను ప్రత్యామ్నాయా లుగా ప్రయోగాలు చేసింది. కాని మనిషిని మనిషిగా, సోదరభావంతో మెలిగే వ్యవస్థ కొరకు ఇంకా ప్రయత్నాలు చేస్తూనే వున్నది. మతం పేరుతో, దేవుని పేరుతో, అధికారం పేరుతో, అనేక యుద్ధాలు లక్షల సంఖ్యలో జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఒకవైపు దేవుడు, ఆధ్యాత్మికం, వేదాంతం. మరొకవైపు యుద్ధం, రణరంగం. ఇది ఒక విరోధాభాస (ప్యారడాక్స్).

నిజంగా మానవుడికి మనస్సు ఉందా? ప్రేమ ఉందా? దయా దాక్షిణ్యం, అభిమానం కారుణ్యం ఉందా? లేక ఆశ, అహంకారం, ద్వేషం, క్రోధం, క్రౌర్యం, మాత్రమే ఉన్నాయా అన్నది పెద్ద సందేహం. ప్రేమ వలన, పగ వలన ఈ ప్రపంచం ఇంతకాలం నిలబడి ఉందనిపిస్తుంది. ప్రేమ కంటే పగ బలమైనది. నిజానికి సమాజానికి సాహిత్యం దర్పణం. సాహిత్యంలో రస సిద్ధాంతాన్ని తరచి చూస్తే, భరతుడు అష్టరసవాది. తర్వాత హాస్యం లాంటివి అనేకం జతచేసి చివరకు వాటిని ముప్పై పైదాకా దాటించారు. క్రౌర్యము, భయానకము, శృంగారములాంటి వన్నింటిని కుదిస్తే చివరకు ఉండేది ప్రేమ పగ ద్వంద్వం మాత్రమే. ప్రేమ భగవంతునివైపు తిరిగితే భక్తి అవుతుంది. అన్ని రసాల్లోని ప్రకృతి వికృతి అయితే అది హాస్యం

అవుతుంది. సాహిత్యంలో వెలువడిన కావ్యాలు, కథలు, చరిత్ర గ్రంథాలు, సినిమా థీమ్‌లు నూటికి తొంబైశాతం పగ వైపు మొగ్గినవే.

## ప్రకృతి వికృతి

ప్రకృతికి వికృతి ప్రత్యామ్నాయం. మానవుడు దోచుకోవడం దాచుకోవడం నేర్చుకున్న తర్వాత ప్రతిదీ వ్యాపారం అయి పకృతి వికృతిగా మారుతున్నది. విద్య, వైద్యం, దేవుడు ఇలా అన్ని కార్యక్రమాలు వ్యాపార లాభార్జనతో ముడివడియున్నాయి. గతంలో అలెగ్జాండర్, చెంగిజ్‌ఖాన్, హిట్లర్, నెపోలియన్, అశోకుడు, అక్బర్ లాంటి సామ్రాజ్యాల్లో జరిగిన పొరపాట్లు నేటికి కూడా సమాజాలను తరుముతున్నాయి. ఆనాటి రుగ్మతలు ఈనాటి రాజకీయ నాయకులకు ఆదర్శాలై వారు నిరంతరం అబద్ధాలు చెబుతూ పబ్బం గడుపుకోవడం ఆనవాయితీ అయ్యింది. డబ్బులేని వాడికి నిజమైన వైద్యం దొరకదు. ఆదాయం రానిచోట స్కూలు పెట్టరు, గుడి కట్టరు, ఆశ్రమాలను స్థాపించరు. దరిద్రులను దీనులను అంగవైకల్యం కలవారిని, బాధితులను దిక్కులేని వాళ్ళను నిష్కళంకషమైన మనస్సుతో, హృదయంతో చేరదీయడమనేది చాలా అరుదు. దీనికితోడు నకిలీదేవుళ్ళు, స్వాములు, డాక్టర్లు, మంత్రగాళ్ళు, తంత్రగాళ్ళు, రౌడీలు, గూండాలు, స్వార్థపరులు, సమాజంలోని అమాయకులను పీల్చి పిప్పి చేస్తున్నారు.

దేవుడుండేది వీళ్ళ దుష్టచర్యలను సమర్థించడానికో లేదా దుర్మార్గపు కోర్కెలను తీర్చడానికో, స్వార్థాన్ని తృప్తి పరచడానికో కాదని, కొద్దిమంది మహానుభావులకు మాత్రమే ఎరుక. మిగతావాళ్ళు అందరూ ఆ లంపటలో పడి ఆలోచించేవాళ్ళే. దేవుడిని అష్టోత్తరాలతో, సహస్రనామార్చనలతో పొగడడం ఎందుకు? పొగడ్తలకు దేవుడు లొంగుతాడనుకోవడం మూర్ఖత్వం. ప్రసాదాలతో అలంకారాలతో అభిషేకాలతో దేవుడిని వశపరచుకోవాలనుకోవడం దేవుడిని కూడా మోసం చేయాలని ప్రయత్నించడం. ఇలాంటి ఆలోచనల వలన దేవుడిని కూడా సాధారణ మానవుడిగా తీర్చిదిద్ది, ఆయన ఒక అమాయక శిఖామణి అని ఊహించడం మానవుని అల్పత్వం, నీచత్వం అవుతుంది.

దేవుడిని గురించి తెలుసుకోవడమండే పరిపక్వతను పొందడం. సమభావాన్ని కలిగి ఉండడం. సృష్టి స్థితి లయలు సహజమని జీర్ణించుకోవడం. బాహ్యాంతరాల బేధాన్ని తెలుసుకొని రెండూ ఒకటే అని అనుభవించడం, జీవితాన్ని పండించుకోవడం. అది తెలుసుకునేందుకు మానవుడు చాలా ఎత్తుకు ఎదగవలసి ఉంది.

తత్త్వం ఉన్నదానిని లేనిదాన్ని, ఉండి లేనిదాన్ని, ఉండేదిలేక లేనిదిలేక ఉండేస్థితిని ప్రమాణాలకు అతీతమై, సూక్ష్మం బ్రహ్మాండంగా, బహ్మాండం సూక్ష్మంగా మారుతుంటుంది. అది వేదాంతం. లేదు అన్నది ఒక సున్న. అయితే లేదు అన్నది ఒకటి ఉన్నదికదా? ఉన్నది కొంచెం. లేనిది అనంతం. నేను బ్రహ్మంగా ఉన్నాను. బ్రహ్మం నేనుగా ఉంది. ఒకటి (1) నేను, రెండు (2) బ్రహ్మం. అంటే 1+1=1, అద్వైతం. అందులో నుండి ద్వైతం విశిష్టాద్వైతం పుట్టుకొస్తాయి. ఒకటి లేకుండా మరొకటి లేదు.

బ్రహ్మ సృష్టిని ప్రణాళికాబద్ధంగా ప్రారంభించాడు. చిన్న పిల్లలను పుట్టించడం వాళ్ళు తికమకగా రోజుల్లోను, వారాల్లోను, నెలల్లోను, నీళ్ళలోకి దూకి, రాళ్ళను ఢీకొని, ముళ్ళలోపడి, నిప్పులోపడిచనిపోతుండడం, మరలాసృష్టిస్తూ వుండడం తలనొప్పిగా తయారైంది. బ్రహ్మ ఉద్దేశం విత్తు చెట్టై అనేక విత్తనాలుగా తయారుకావాలని. కాని ఈవిధంగా తయారు కావడం తనకు బాధను కలిగించింది. దాంతో దిగాలుగా కూర్చున్న బ్రహ్మ దగ్గరికి తన మానసపుత్రుడైన నారదుడు వచ్చి దిగులుకు కారణం అడిగాడు. దానికి బ్రహ్మ నారదుడు పరిష్కరించే విషయం కాదని, అతని శక్తిచాలదని, సృష్టికర్తనైన తనకే అర్థంకాలేదని, తనని ప్రశాంతంగా ఉండనీయమని చెప్తాడు. కాని నారదుడు అన్నివాదాలను త్రోసిపుచ్చి, బలవంతంచేసి బ్రహ్మకు కోపం తెప్పించి, చివరకు విషయం తెలుసుకుంటాడు. దానికి నారదుడు, అది చాలా చిన్న విషయమని తనదగ్గర దానికి ఒక చిన్న చిట్కా ఉందని చెప్పాడు.

దాంతో బ్రహ్మ విసుగ్గా అదేదో ఏడ్చి పొమ్మని కోపంగా అన్నాడు. అందుకు నారదుడు, "దీనికి నాపేరు, నారదుడిలోని మొదటి అక్షరాన్ని అనగా 'నా' ను వాళ్ళకు పుట్టుకతోనే తగిలిస్తే సమస్య తీరిపోతుందని చెప్పాడు. ఆవిధంగా బ్రహ్మ సృష్టిలో ప్రతిజీవికి 'నా' తగిలించేయడం, దాంతో 'నా శరీరం', 'నా కన్ను', 'నా చేయి', 'నా మనస్సు', 'నా కుటుంబం', 'నా భార్య', 'నా బిడ్డలు', 'నా దేశం', 'నా సంపద', 'నా అధికారం', 'నా ఆరోగ్యం', 'నా ఆశయం' లాంటి అనంతమైన 'నా' లతో మానవజాతి నాశనం అయిపోయింది. ఆ 'నా' కారణంగా 'నీ' 'మన' లాంటివనేకం పుట్టుకొని వచ్చాయి.

## పోటీతత్వం

ఇంతలో గిరిధర్ కల్పించుకొని "పోటీతత్వ సమస్యను మానవజాతి పరిష్కరించ లేదా?" అని ప్రశ్నించాడు.

పూర్ణిమ : "మానవుని పోటీతత్వం, ధనం కూడబెట్టాలన్న తపన, తనకు దక్కనిది ఇతరులకు దక్కకూడదన్న ద్వేషం మొదలైన లక్షణాలు జంతువులలో మచ్చుకకైనా చూడగలమా? మానవుడు, ప్రకృతిమీద ఒక పట్టు సాధించి జంతువుల మీద, వృక్షాల మీద ఆధారపడి జీవిస్తున్నాడు. ప్రపచంలో కోట్లాది మానవులు, జీవులను ఆహారంగా చేసుకోకపోతే మానవుల సంఖ్య ఏనాడో పలచబడిపోయేది. ఆ కారణంగా మానవుడు జంతువులను పెంచి పోషించి, వాటిని మరలా వధించి ఆహారానికి ఉపయోగించు కుంటున్నాడు. మరలా నీతిని న్యాయాన్ని, ధర్మాన్ని, తోటి జీవిని హింసించడం తప్పని బోధిస్తుంటాడు. మానవులను జంతువులతో పోల్చి వాటిని అపహాస్యం చేస్తాడు. ప్రతివాడు కోపం వచ్చినప్పుడు మానవుని ద్విపాద పశువు అని అంటారు. కాని ఏ పశువు తన పరిధిని దాటి పద్దతిని అతిక్రమించి ప్రవర్తించిన సంఘటనలు ఉ ండవు. మానవుడు తనకొక ప్రత్యేకత ఉండాలని అనేక అవకతవకలకు పాటుపడతాడు. ఆ ప్రక్రియలో భగవంతుడికి అనేక రకమైన పూజలు నైవేద్యాలు, జంతుజీవబలులు ఇచ్చి తృప్తి పరచాలని భగీరథ ప్రయత్నాలు చేస్తాడు.

ఒక వ్యక్తికి దేవుడు కనబడి అతని కోరిక ప్రకారం ఉదయం లేచి ఆపకుండా ఎంత దూరం పరిగిస్తే అంత చుట్టుకొలత కలిగిన భూమి, దానిలోని సంపదలన్నీ స్వంతంచేసుకోవచ్చని, దేవుడిచ్చిన వరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉదయం నుంచి పరుగెత్తడం మొదలుపెట్టి, ఆగకుండా పరిగెత్తడం, ఇక సాధ్యం కాదని అర్థమైనా ఇంకొక అంగుళం అంటూ చివరకు కళ్ళుతిరిగి పడి చనిపోవడం తెలిసిన కథే.

మానవజాతి ఈ ప్రపంచాన్ని ఒక యుద్ధభూమిగా మార్చి అనేక యుద్ధాలకు ఒక క్రీడారంగంగా తయారుచేసింది. లక్షల యుద్ధాలతో, కోట్లాది జీవులను నాశనం చేసింది, గొప్ప యోధులకు అనేక సత్కారాలు ఉదాహరణకు సింహం, పులి, డ్రాగన్, ఉక్కు మనిషి, కోబ్రా లాంటి బిరుదులతో సన్మానించింది. ఈ ప్రపంచ సంస్కృతికి మనస్సున్న మానవుడు కన్నీరు పెట్టుకోకుండా ఉండలేడు.

## జూదం

ఇంతలో నాగ ప్రదీప్ కల్పించుకొని "మానవ మస్తిష్కంలో కలిగే జూదం / గాంబ్లింగ్ సమస్యను పరిష్కరించలేమా?" అని ప్రశ్నించాడు.

పూర్ణిమ : "మానవుని జీవితం ఒక జూదవలయం. ఒక గాంబ్లింగ్. ఒక యాదృచ్ఛికం. జీవితంలో దురాశ రాజ్యమేలేదానికి కారణం జూదం. ఎలాంటి వస్తు

ఉత్పత్తికి, ఉత్పాదకతకు దోహదం చేయని, సమాజానికి ఏవిధంగా పనికిరాని, మంచితనానికి మానవత్వానికి పునాది వెయ్యని కార్యక్రమం జూదం. కావేవి జూదానికి అనర్హం. పులి జూదం నుండి, పాచికలు, పేకాట, కంపెనీ షేర్లు, బంగారం, గుర్రపుపందేలు, కోడిపందేలు, జంతువులపందేలు, క్రికెట్, ఎలక్షన్‌ల లాంటి అనేక విచిత్రమైన పందేలతో, ఏపనీ చేయకుండా డబ్బులు సంపాదించాలని, మానవుని లోని దురాశ పెల్లుబుకుతూ, ప్రకృతిని వికృతిగా మారుస్తుంది. గాంబ్లింగ్ అనగా రెండు యాదృచ్ఛికాలను నమ్మడం. జరగనిది జరుగుతుందనుకోవడం, జరిగేది జరగదనుకోవడం జూదం. ఈ కారణంగా జూదం ఎన్నో ఘర్షణలకు, యుద్ధాలకు దారితీసి ఎంతో పతనానికి చరిత్రలో స్థానం కల్పించుకొన్నది.

## ఎండమావులు పశ్చాత్తాపాలు ప్రాయశ్చిత్తాలు

మానవుడు పుట్టినది లగాయితు ప్రతిక్షణం భవిష్యత్తును గురించి గాంబ్లింగ్ కలలు కంటూ జీవిస్తాడు. జరిగిపోయిన దానికన్నా, రాబోయే క్షణాలు గొప్పగా ఉంటాయనే నమ్మకంతో జీవిస్తుంటాడు. ఈ ఆలోచన నిరంతరం ఎండమావులను తలపిస్తుంటుంది. ఈ పరిస్థితి 40 – 50 సంవత్సరాల వయస్సు వరకు నడుస్తుంది. ఆ తర్వాత తాను అనుకొన్నదానికి, జరిగినదానికి, తేడాను గమనిస్తాడు. ఈ నేపథ్యంలో, తనలో ఒక నిరాశా నిస్పృహ ఉదయిస్తుంది. ఎందుకంటే తన వనరులకు, శక్తియుక్తులకు, ఫలితాలు సరితూగడం లేదు. ఆ కారణంగా వయస్సుతో ఆశ సన్నగిల్లి తాను చేసిన తప్పులు, చేయవలసిన పనులు చేయలేకపోయినందుకు, జ్ఞాపకాలు, పీడిస్తుంటే, చేసిన తప్పులకు, పశ్చాత్తాపాలు కుక్కల్లా తరుముతుంటాయి. బ్రతుకు మీద ఆశలు వదులుకొని జీవితానికి ఒక ముగింపు పలకాలని ఆలోచనలు చేస్తాడు. కాని చనిపోయే ధైర్యం ఉండదు. అంటే ప్రతివ్యక్తికి ముందున్న ఎండమావులను తరుము తుంటే అలసిపోయి, పశ్చాత్తాపం తరుముతుంటే పరుగెత్తలేక బాధపడడంతో, గతంలో ఒప్పనుకున్నదంతా తప్పుగామారి దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, అనేక దానధర్మాలు, భగవదారాధన కార్యక్రమాలు చేయడానికి ప్రయత్నిస్తుంటాడు.

మనిషిని పుట్టింది లగాయతు నడిపించేది ఆరాటం. 'నా' తో ఆరాటం ప్రారంభించి, ఆలోచనా జ్ఞానం అనుభవంగా మారుతుంది. ఆరాటం ప్రయాణమయితే, అనుభవం మజిలీ అవుతుంది. అనుభవం లోతుపాతులు, మంచిచెడ్డలు తెలుసుకొన్న

వాడు ఆత్మజ్ఞాని. ఆరాటాన్ని జ్ఞానాగ్నిలో కాల్చినవాడు బ్రహ్మజ్ఞాని, పూర్ణపురుషుడు అయి, ఆనందంతో బ్రహ్మంలో రమిస్తుంటాడు.

భౌతిక ప్రపంచంలో మానవుడు అనేక రుగ్మతలనుండి బయటపడడానికి, అన్ని మతాలవాళ్ళు, ధ్యానం, ధర్మం, దయ, కరుణ, అహింస లాంటి సాధనాలను చెప్పారు. అంటే సిద్ధాంతాలతో, నమ్మకాలతో, మనిషి కట్టడి కాకుండా, స్వతంత్రతను స్వంతం చేసుకొని, సత్యాన్ని దర్శించి పూర్ణత్వాన్ని పొందడము. అంటే తనకు తానుగా ఎలాంటి ప్రభావితానికి లోబడకుండా కట్టుబడకుండా, తాను తానుగా, నిత్య నూతనంగా, క్షణం క్షణం మారకుండా ఉండడం. గతాన్ని వర్తమానాన్ని భవిష్యత్తును ఏక దృష్టితో చూడడం. అలాంటి ఆత్మసిద్ధుడు లోపల వజ్ర సంకల్పంతో ఉండి అతిసున్నితంగా మసలుకుంటాడు. ముక్కలుగా చేసిన మూడుకాలాలను ఒకటిచేసుకొని అనుభవించ గలిగిన దానిని బ్రహ్మజ్ఞానం అంటారు.

జ్ఞానం గమ్యం కాదు. అదొక ప్రవాహం. ప్రవాహంలో ఒకసారి కాలు పెడితే, మరలా అక్కడే కాలు పెట్టలేమని సిద్ధార్థలో హెర్మన్‌హెస్ అన్నట్టు, అసలు కాలు పెట్టిన దానికి, పెట్టాలనుకున్నదానికి చాలాతేడా ఉందని అర్థమైతే, కాలానికి పరిణామానికి ఉన్న సంబంధం అర్థమవుతుంది. విచిత్రం ఏమిటంటే, మానవుడు తనకు తెలియదని ఒప్పుకోడు. తెలిసినవాడు తెలుసని విర్రవీగడు. తెలియని వాడు తెలిసినట్లు నటిస్తాడు. ఒక వ్యక్తి ఎంతపెద్ద మేధావైనా నిజం చెపితే, ససేమిరా ఒప్పుకోడు.

## కమ్యూనిజం సోషలిజం

ఇంతలో ప్రద్యుమ్నుడు కలిపించుకొని "కమ్యూనిజం సోషలిజం లాంటివి ఈ సమస్యలను పరిష్కరించలేవా?" అని ప్రశ్నించాడు.

అందుకు పూర్ణిమ "కమ్యూనిజం, సోషలిజం, ఒక స్థితిలో ఈ ప్రంపంచాన్ని ఉద్ధరిస్తాయని కలలు గన్నారు. కాని కార్ల్‌మార్క్స్ కమ్యూనిజం సోషలిజం వ్యవస్థలకు బీజాలు వేస్తూ, పొరపాటున ఒక్కమాట నోరుజారాడు. ఆయన ఆలోచనా విధానం ప్రకారం: బూర్జువా విధానంతో అలసిపోయిన దేశాలలో, శ్రామికుల యుద్ధం జరుగు తుందని, అమెరికాలాంటి క్యాపిటలిస్ట్ దేశాలలో, సోషలిజం మొదట వస్తుందని, ఒక భవిష్యవాణిని చెప్పాడు. దాంతో అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ జాగ్రత్తపడి, వెనువెంటనే తమ సిద్ధాంతాలలో ఒక 'యు' టర్న్ తీసుకొని సామాజిక బాధ్యత, రక్షణపేర్లతో

ప్రజలను తమవైపుకు తిప్పుకొనడం జరిగింది. దాంతో అంతపెద్ద సిద్ధాంతాలైన కమ్యూనిజం సోషలిజం, దూది పింజలై మరుగున పడిపోయాయి. కాబట్టి ఒక వ్యక్తి ప్రతిపాదించే సిద్ధాంతం అనేక మార్గాలను వెతుక్కొని, మరలా ప్రారంభించిన చోటుకే వచ్చి చేరుతుంది. శాస్త్రకారులలో, కవులలో, వేదాంతుల్లో కూడా ముందుకు వెనుకకు గంతులేసి అవునన్నది మరలా కాదని, కాదన్నది మరలా అవుననడం సహజం. చివరకు ఇదంతా సత్యమని లేదా అసత్యమని, జ్ఞానమని, బ్రహ్మతత్త్వమని, మాయ అని అనేక పదాలతో మానవునిజన్మ దుఃఖభాజనం అని తేలుస్తారు. అటు బుద్ధుడు, ఇటు శంకరుడు, లేదా వేమన ఎవరూ ఏది చెప్పినా చివరకు ఈ ప్రపంచమంతా దుఃఖమయం అని ఒకే ఒక దెబ్బతో తేల్చేశారు.

## పరిష్కారం

ఇంతలో శ్రీహర్ష కల్పించుకొని "ఈ మానవ సమస్యలను పరిష్కరించలేమా?" అని అంటుంటే, వేంకటేశ్వరరావు కల్పించుకొని "ఆర్ట్ ఆఫ్ లివింగ్, వ్యక్తుల జీవితానికి పరిపూర్ణత్వాన్ని సిద్ధింపచేస్తుందా?" అని ప్రశ్నించాడు.

పూర్ణిమ : "ఈ సమస్యను పరిష్కరించేందుకు గతంలోని మూఢనమ్మకాలను వదిలివేసి, ఆ స్థానంలో కొత్త ఆలోచనలకు పదునుపెట్టి, చిత్తశుద్ధితో ఆచరణలకు శ్రీకారం చుట్టడం తప్ప వేరే మార్గాలు లేవు. ఉదాహరణకు వ్యక్తులు పసితనం నుండి వయస్సు మళ్ళేవరకు చేయవలసిన కార్యక్రమాలను పవిత్రతతో జరిపినపుడు సమాజం బాగుపడుతుంది. అనగా ఉత్తమవిద్యను అందించడం, జ్ఞానాన్ని పంచడం, హృదయంతో ఆలోచించడం, మనస్సుతో శ్రద్ధతో, ప్రేమ, త్యాగంతో, కర్మ చేయడం అవసరం.

## 1. విద్య విజ్ఞానం

ఉదాహరణకు, ఈదేశంలో మంచిని పెంచేందుకు, శంకరునిలాంటి మహాను భావులు ఎందరో జ్ఞానసంపదను క్రోడీకరించి, దాన్ని భావితరాలకు పంచడానికి అనేక మఠాలను, పీఠాలను, వ్యవస్థలను స్థాపించారు. వీళ్ళవద్ద వేల లక్షల కోట్ల సంపదలు ఉన్నాయి. వీటిని ఉపయోగించి అనేక పాఠశాలలను, ఆధునిక శాస్త్ర జ్ఞానాన్ని, నైతికతతో జోడించి వృద్ధిలోనికి తెచ్చి వాటిల్లో విద్యార్థులను మంచి పౌరులుగా

తీర్చిదిద్దేటట్టు చేయగలిగితే, రాబోయేతరాల్లో మంచి వ్యక్తులు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు తయారై ఈ సమాజాన్ని ఒక సుందరవ్యవస్థగా తీర్చిదిద్ద గలదనడంలో అసత్యం లేదు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వాలకు అప్పజెప్పినంతకాలం మానవజాతి కుళ్ళును కడగడం సాధ్యంకాదు.

## 2. ప్రేమ త్యాగం

అన్నివృత్తుల వ్యక్తులలో ప్రేమకు, త్యాగానికి పెద్దపీట వెయ్యాలి. అనగా దానం, ధర్మము తననుండే ప్రారంభం కావాలని అన్నట్టు, మొట్టమొదట ఇందుకు ప్రక్షాళన కార్యక్రమం రాజకీయనాయకులు, ఉపాధ్యాయుల నుండి ప్రారంభం కావాలి. అందుకు మానవత్వం మూర్తీభవించి, ప్రేమ త్యాగంతో నిండిన వ్యక్తులు కావాలి. అక్కడ వ్యక్తిత్వం తప్ప, ఇంక ఏ రిజర్వేషనుకు తావు ఉండకూడదు. ఏ రిజర్వేషన్ అయినా ఇంకెక్కడైనా పెట్టుకోవచ్చు. ప్రేమను వర్షింపజేసి, మెరుగైన మానవ సంబంధాలను ఆవిష్కరించి, మనిషికి మనిషి తోడుగా నిలబడి, తమ తమ జ్ఞానాన్ని సంపదను ఆనందాన్ని ఇతరులతో పంచుకొనే వ్యవస్థ ఏదైనా ఒకటే. అది ప్రజాస్వామ్యమా, సోషలిజమా, దైవత్వమా మరింకేదైనా నా అన్నది అసందర్భమైనది అవుతుంది. ప్రేమ లేనప్పుడు, త్యాగంలేనప్పుడు జీవితం శూన్యం అవుతుంది. అది ఎలాగంటే, నిరంతరం కుడిచేయి ఎడమచేతిని, ఎడమచేయి కుడిచేతిని కొట్టుకొని ఆనందించడం లాంటిది. సమాజం బాగుపడాలంటే శ్రమ శ్రమతో, ప్రేమ ప్రేమతో, త్యాగం త్యాగంతో, నీతి నీతితో పోటీపడాలి. అప్పుడు, కరుణ కార్పణ్యం, దయ ధర్మం, నీతి న్యాయం మొగ్గ తొడుగుతాయి. అంతేగాని ప్రస్తుత గ్లాంబింగ్ సమాజాలు ఒకదానితో మరొకటి పోటీపడి తాము చేసే ప్రతిచెడ్డపని వలన ద్వేషం ద్వేషంతో, అసూయ అసూయతో పోటీపడితే దుఃఖం మిగులుతుంది.

## 3. ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి హార్ట్ ఆఫ్ లవింగ్

ఆర్ట్ ఆఫ లివింగ్‌ను పక్కనపెట్టి, హార్ట్ ఆఫ లవింగ్‌ను ఆచరణలోకి తేవాలి. అనగా ఈ ప్రపంచంలో మనుష్యులంతా దుఃఖంతో ఉన్నట్టు ఆలోచిస్తూ, దానిని యోగాలాంటి ప్రక్రియల ద్వారా అధిగమించాలని, కొత్తసిద్ధాంతాలను తెరపైకి తెస్తుంటారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి ముసుగులు వేసి, ప్రవచనకారులు, స్వామీజీలు, దీనికొక రూపాన్ని, ప్రక్రియను తయారుచేస్తున్నారు. అన్నిరంగాల్లో చేసే

తీవ్ర ప్రశాంతపోటీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ మనసును పదునుపెడుతుంది. అదే హార్ట్ ఆఫ్ లవింగ్ హృదయాన్ని కదిలిస్తుంది. అప్పుడు అది ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ని హార్ట్ ఆఫ్ లవింగ్‌గా మారుస్తుంది. అది శ్రీకృష్ణ ప్రేమ. అందరం నీవు నేను, 'నీ' 'నా' తేడా లేకుండా, అది ఇది భేదం లేకుండా, ఉండేది హార్ట్ ఆఫ్ లవింగ్. నేటి సమాజంలో, ఏ వ్యక్తి కూడా తాను తానుగా జీవించడం లేదు. వేరేవాళ్ళ నమ్మకాల మీద నిలబడి బ్రతుకు సాగిస్తున్నాడు. అందుచేత నమ్మకాలు తయారుచేసేవాళ్ళు కొద్దిమంది. వాటిని గుడ్డిగా అనుసరించేవాళ్ళు మెండుగా తయారౌతున్నారు. దీనిని అర్థంచేసుకోవడానికి సరైనపదం బుద్ధుడు వచించిన మూడవ సూత్రం 'అజ్ఞానం'.

అందుచేత తెలుసుకోవాల్సింది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కాదు, హార్ట్ ఆఫ్ లవింగ్. అది తెలిస్తే, అన్నీ తెలుస్తాయి. ప్రేమ మనస్సులో ఉండదు. హృదయంలో ఉంటుంది. నీవు జీవించేదానికి పోటీపడి, ఉన్న శాంతిని పోగొట్టుకుంటున్నావు. శాంతి లోపలుంటుంది. బయట వెతికి పట్టుకోవాలనుకుంటే శాంతి ఎలావస్తుంది? ఉన్నది లోపల అయితే బయట వెతికితే ఎలా? పోయింది ఒకచోట, వెతికేది మరోచోట. ఎందుకంటే 'అక్కడ చీకటి ఉంది', 'ఇక్కడ వెలుతురు ఉంది' అన్నచందాన, వెతుకులాట. మానవుడు ఒక వ్యక్తి కాదు. ఒక శక్తి. ప్రతివ్యక్తి ఒక ప్రపంచం. విశ్వంనుండి విడదీయలేని పూర్ణం. కృష్ణుడిలా తనకవసరం లేకుండా ఇతరుల కొరకు తన శక్తిని వెచ్చించేది ప్రేమ, అది కేవలం ఒక భాగం కాదు, పూర్ణం.

ప్రేమ అంటే ప్రేయసి ప్రియుల మధ్య, భార్యా భర్తల మధ్య, వ్యక్తుల మధ్య, ఆకర్షణ, సంబంధమైన లేక సంసార సుఖానికి పరిమితమైన ప్రేమ అసలు ప్రేమ కాదు. ప్రేమంటే శ్రీకృష్ణ ప్రేమ. తాను ఇతరుల నుండి ఏమీ ఆశించకుండా తన కోరికల కొరకు కాకుండా, ఇతరుల ఆశలను, మనస్ఫూర్తిగా తీర్చే ప్రేమ తత్త్వం, అది విశ్వప్రేమ. అది అనంత ప్రేమ. అది అమృత ప్రేమ.

## అలనాటి హార్ట్ ఆఫ్ లవింగ్

ఈ హార్ట్ ఆఫ్ లవింగ్ ఈనాటిది కాదు. వేదకాలం నాటినుండే చెప్పబడింది. ప్రతి జీవి వేల సంవత్సరాలుగా స్వచ్ఛమైన ప్రకృతి నుండి ఉద్భవించబడిన ఒక శక్తి స్వరూపం. ఒకసారి చరిత్రను గమనిస్తే, కొండ గుహల్లో, సముద్రతీరాల్లో ఋషులు, వాళ్ళ మనసులను, ఆత్మలను పరిశుద్ధపరచుకొని, భావాలను, మాటలను, వేదాలుగా

ఉపని షత్తులుగా, వాటిని, శ్లోకాలుగా మంత్రాలుగా తీర్చిదిద్ది, సామగానంగా మలచి, వాటికి శక్తి స్వరూపాన్ని సంతరించి, ఈ ప్రకృతిని శాసించగలిగే స్థితికి చేరారు. మనం దీనిని మరచిపోయాము. మహర్షులు ఏనాడూ తమ జీవితాలను ఏవగించుకో లేదు స్వార్థానికి వినియోగించుకోలేదు. జీవితాన్ని 100 సంవత్సరాలు సుఖసంతోషా లతో ఆనందంగా ఉండాలని ప్రార్థించారు.

శ్లో. ... "తచ్చక్షుర్దేవహితం పురస్తాచ్చుక్ర ముచ్చరత్ పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం, నందామ శరదశ్శతం, మోదామ శరదశ్శతం, భవామ శరదశ్శతం, శృణవామ శరదశ్శతం, ప్రబ్రవామ శరదశ్శతం, అజీతాస్స్యామ శరదశ్శతం," (దేవతలకు హితుడైన ఆ సూర్యుడిని నూరు శరత్తుల పాటు తిలకిస్తాము. నూరు శరత్తుల పాటు జీవిస్తాము. నూరు శరత్తుల పాటు సంతోషిస్తాము. నూరు శరత్తుల పాటు సుఖిస్తాము. నూరు శరత్తుల పాటు ఉంటాము. నూరు శరత్తుల పాటు వింటాము. నూరు శరత్తుల పాటు పలుకుతాము).

అలాగే తమకు ధీశక్తిని ఈయ్యమని "ఓం భూ ర్భువ స్సువః" గాయత్రి మంత్రంతో ఎలుగెత్తి చాటారు.

నైతికతత్త్వానికి, సంఘం యొక్క, సమాజం యొక్క మంచికి జగత్కల్యాణానికి పూర్వీకులు చేసిన ప్రచారం అమోఘం.

"ఓం భద్రం కర్ణేభిః శృణు యామ దేవా
భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రా
స్థిరై రంగై స్తుష్టు వాగ్ం సస్తనూభిర్
వ్యశేమ దేవహితం యుదాయుః" (ముండకోపనిషత్).

(మంచి వాక్యాలు వినడం. మంచిదృశ్యాలు కనడం. అలాగే అన్ని ఇంద్రియా లతో చేసే పనులు మంచిగా చేయాలని కోరడం. అలాగే మంచి మాటలు వినాలని, చూడాలని, చెయ్యాలని జాతిని ఉత్తేజ పరిచారు.)

అదేవిధంగా కఠోపనిషత్తులో "ఓం సహనావవతు! సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై ।...." (గురుశిష్యులిద్దరూ సమన్వంతో పరస్పర అవగాహనతో విద్య సాగించాలనే శాంతి మత్రం ఇది.)

ఈ ప్రపంచంలోని సకలజీవులు సుభిక్షంగా ఉండాలని “సర్వేజనా స్సుఖినో భవంతు. లోకాస్సమస్త స్సుఖినోభవంతు,” “వసుధైక కుటుంబం” అని ఆశించారు. హార్ట్ ఆఫ్ లవింగ్ అంటే ఇది.

వేలసంవత్సరాల క్రితం అసలు భాష ఎలా వచ్చింది? దానికి వ్యాకరణాన్ని ఎవరు సంతరించారు? మంచి భావనలను ఎలా యోచించారు? ఈనాడు ఎవరో చెప్పిన అబద్ధాలను సిద్ధాంతాలుగా మలచి, ధనం, అధికారం, మానవుని లోని లోపాలను అన్నింటినీ ఆ సిద్ధాంతాలు సరిచేస్తాయన్న వాదనల ద్వారా, కొత్త నమ్మకాలకు ప్రేరణనిస్తూ, ప్రస్తుత మనస్తత్వాలు తయారు అవుతున్నాయి. ఎంత దిగజారుడు తనం? ఎంత అల్పత్వం? ఎంత నిర్వీర్యం? ఎంత నిర్జీవం? గత శక్తులన్నీ తుడిచి పెట్టబడ్డాయి. ఈ ప్రక్రియ వలన, అసలు సిసలైన ఆనందం పొందుతున్నామన్న భ్రమను కలిగిస్తున్నది.

## 4. సుజ్ఞానం సుహృద్భావం

సక్రమమైన జ్ఞానాన్ని పదిమందికి పంచే ప్రక్రియను పటిష్టం చేసి, నెగటివ్ థాట్స్ (చెడ్డ ఆలోచనల) ను పెంపొందించే మాధ్యమాలపై ఒక నిఘా ఉంచడం, సమాజానికి అన్నివిధాలా శ్రేయస్కరం అవుతుంది. కోటానుకోట్ల గెలాక్సీలు నిరంతరం కదిలిపోతుంటే, ఒక పరమాణువు కీర్తి స్థానం, స్థాయి, విలువ ఎంత? గత 5వేల సంవత్సరాల్లో గొప్ప కీర్తిమంతుడంటే అలెగ్జాండర్, బుద్ధుడు, శంకరుడు అని కోట్లమందిలో కొన్ని పేర్లను మాత్రమే చెప్పగలం. కానీ పదివేల సంవత్సరాల్లో, 50 వేల సంవత్సరాల్లో ఇవే పేర్లు చెప్పాలి. అలాగా 1 లక్ష, 50 లక్షలు సంవత్సరాల క్రింద విషయాలు ఎవరికి తెలియదు. అంతమాత్రం దానికి ఇంత ఆర్భాటం ఎందుకు? అనవసరంగా చెత్తంతా నెమరువేసుకుంటూ, కాలాన్ని ఊహల్లో, భ్రమల్లో గడిపివేయడం అజ్ఞానం. తెలియని మంచి విషయాలను తెలుసుకొనుట సుజ్ఞానం. అనుభూతి దశాపరిపాకరమ్యమైన జ్ఞానం ఎఱుక.

ఏ వేదాంతమైనా, వ్యక్తి నీతిధర్మ భావజాలం, సమాజ నీతిధర్మ భావజాలం ఒకటిగా ఉండాలి. లేకపోతే, అనేక భావజాలాలతో, వాళ్ళ గుర్తింపుకోసం ముద్రలకోసం, ఐడెంటిటీ కోసం ఒకరికొకరు పోటీపడి ఇతరులకు అపకారం చేస్తారు. తద్వారా సమాజ శ్రేయస్సును సర్వనాశనం చేయబడుతుంది. మానవులు స్వార్థం కొరకు కొన్ని జంతువుల్లా, అంతకంటే హీనంగా తమ బిడ్డల్ని తామే చంపుకుంటూ,

తల్లిదండ్రుల్ని హింసిస్తూ ఉన్న సంఘటనలు చరిత్రల్లో అనేకం. కొన్ని సందర్భాల్లో చరిత్రలో జనాభా పెరిగితే బ్రతికున్నవాళ్ళకు ఆహారం చాలదని అడవిలో క్రూర జంతువులకు కుక్కలకు తోడేళ్ళకు పుట్టిన పసికందులను వేసిన వైనం చరిత్ర పుటల్లో ఉంది.

భగవంతుడు అనేవాడు ఉంటే ఈ జీవులను ఎందుకు సృష్టించివుంటాడు అన్నది చాలా పెద్ద సందేహం. ఈనాడు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం సముపార్జించి, ప్లేగు మలేరియాకు మసూచికి విషజ్వరాలకు, వ్యాక్సిన్‌ను తయారుచేయగలిగి ఎన్నో వ్యాధులను నయంచేస్తూ, చివరకు గుండెకు గుండెను, కిడ్నీకి కిడ్నీని, లివర్‌కు లివర్‌ను మార్చగలిగి, ఇతర గ్రహాల దగ్గరికి ప్రయాణంచేస్తున్నారు. ఒక అణుబాంబుతో ప్రపంచాన్నంతా సర్వనాశనం చేయగలిగిన శాస్త్రజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. కాని, తెలివి తక్కువవాడిని తెలివిగలవాడిగా, అజ్ఞానిని జ్ఞానిగా, కోపిష్టిని శాంతపరుడిగా, దురాశాపరుడిని త్యాగిగా, పిచ్చివాడిని మంచివాడిగా, నిర్ధయుని దయార్ధ్ర హృదయునిగా, మంచిమార్గంలో నడిచే జీవిగా, దయ సత్యము, ధర్మము దానగుణములు కలిగిన వ్యక్తిగా మలిచేందుకు ఒక వ్యాక్సిన్ తయారుచేస్తే, లేదా బ్రెయిన్ ప్రవర్తను సరిచేసే ఒక చిప్‌ను పెడితే, ఇంతకర్మను అనుభవించవలసిన గతి మానవునికి ఉండదు కదా”!

ఈరోజు ఇంతమంది మేధావుల సమక్షంలో నాకు తెలిసిన కొన్ని విషయాలను ముచ్చటించడానికి అవకాశాన్ని కల్పించిన మీకందరికీ నా కృతజ్ఞతలు. నా సంభాషణ లోని తప్పులకు నేనే బాధ్యురాలను. ఒప్పులకు వేలసంవత్సరాలుగా జ్ఞానాన్ని అందించిన మహానుభావుల కృప. “సెలవు” అని పూర్ణిమ చేతులు జోడించి ముగించింది. సభికులు అందరూ లేచినిలబడి చప్పట్లతో పూర్ణిమను తడిపి ముద్ద చేశారు. తరువాత వందన కార్యక్రమం జరిగింది.

* * * * *

# 10. అంజలి అంతరంగం

ఈ ప్రపంచంలో ఎప్పుడు ఏది జరుగుతుంది అన్నది ఎవరూ ఊహించలేరు. అనుకున్నవి జరగచ్చు జరగకపోవచ్చు. అనుకోనివి జరగచ్చు. అలాంటి యాదృచ్ఛిక సంఘటన ఒకరోజు మధ్యాహ్నం భోజన సమయంలో జరిగింది. శశి దీర్ఘంగా ఆలోచిస్తూ కళ్ళుమూసుకొని కుర్చీలో వెనుకకు వాలి ఉన్నాడు. తన పి.ఏ. అంజలి లోపలికి వచ్చింది. ఆలోచనలతో శశి గమనించలేదు. రెండు నిమిషాలు నిలబడి "సార్! తలనొప్పిగా ఉందా! అమృతాంజన్ తెప్పించి రాసేదా! మాత్ర ఏమైనా కావాలా? తల పట్టేదా" అని నుదిటి మీద చేయిపెట్టబోయింది.

"అయ్యో మీకెందుకు. ఏంలేదు, ఊరికే ఆలోచిస్తూ కూర్చున్నా" అన్నాడు శశి. "అయినా నీవు..." మాటలన్ని పొడి పొడి అయిపోయాయి.

"మీకు తలనొప్పిగా వుంటే, 10 సంIIల నుండి మీ పి.ఏ.గా పనిచేస్తున్న నాకు తల పట్టేందుకు కూడా అర్హత లేదా!" అన్నది అంజలి.

పూర్ణిమ తర్వాత తనమీద అంత శ్రద్ధ చూపించే వ్యక్తి ఎవరూ లేరు అన్న స్పృహ ఉంది శశికి. కానీ ఈరోజు ఇంత చొరవతీసుకొని చూపించే శ్రద్ధ కొంచెం విచిత్రంగా అనిపించింది. ప్రతిరోజూ తనకేది కావాలన్నా తెచ్చివ్వడం, మధ్యాహ్నం భోజనం వడ్డించడం, టీ, కాఫీలు అందించడం, ఏ విషయం వచ్చినా చర్చించడం, సర్వసాధారణంగా జరిగిపోతున్నది. ఇన్నేళ్ళ పరిచయంలో అలా చొరవ తీసుకునే

ప్రయత్నం చేసి  ఉంటుందని తన మనస్సుకు తాను నచ్చజెప్పుకున్నాడు. చిన్న విషయానికి ఆమె అంత తాపత్రయపడ్డం చిన్న అనుమానాన్ని రేకెత్తించింది.

రోజులానే ఏమీ జరగనట్టు  గాబరా లేకుండా భోజనం టైంకు ప్లేట్ తెచ్చి టేబుల్ మీద పెట్టి వడ్డించసాగింది అంజలి. శశి ఒక ముద్ద నోట్లో పెట్టుకుంటూ, "నీ భోజనం అయ్యిందా అంజలి" అని అడిగాడు.

వెంటనే అంజలి "ఈ రోజు నా జన్మ ధన్యమైంది సార్".

"ఏమి అలా అంటున్నావు" అని అడిగాడు.

"నేను మీవద్ద చేరి పదిసంవత్సరాలు అయ్యింది. ఏరోజు ఈ మాట వస్తుందా అని ఎదురు చూచాను. అట్లాంటిది ఈ రోజు అడిగారంటే? నా సంతోషాన్ని ఎలా చెప్పాలి?" అంది.

నిజమే! ఇన్నేళ్ళలో రోజూ ఆమె వడ్డించడం తినడం తప్ప, అవతల ఒక స్త్రీ ఉందని తనకు ప్రేమగా ప్రతిరోజు అడిగడిగి వడ్డిస్తున్నదనే స్పృహలేదు. తన జీవితంలో తనకు మొదటి స్త్రీ మూర్తి వాళ్ళమ్మ, రెండు పూర్ణిమ. తన మైండ్ అలా కండిషన్ అయిపోయింది. పనివాళ్ళు, వాళ్ళ కర్తవ్యాలను జీతానికి పనిచేస్తున్నారు అన్న ఆలోచన తప్ప, ఇంట్లో పనివాళ్ళతో కూడా శశి ఎప్పుడూ మాట్లాడడు.

మరలా అంజలి "పది సంవత్సరాలుగా దొరకని భాగ్యం నాకు నిధిలా ఈ దినం దొరికింది సార్!" అన్నది. "ఎందుకలా! అంటున్నావు" అన్నాడు.

"నాతో ఆఫీసుకు సంబంధించిన విషయాలు తప్ప, పర్సనల్‌గా మాట్లాడడం మీనుండి నేను వినలేదు. అలాంటిది ఇది నా అదృష్టం కాక మరేమిటి?" అన్నది. "ఇందులో అదృష్టానికి ఏముంది" అన్నాడు. ఇంతలో క్యారియర్ బయటపెట్టి అటెండర్‌తో లోపలికి ఎవ్వరిని రానివ్వద్దని చెప్పి లోపలికి వచ్చింది. గ్లాస్‌లో నీళ్ళు పోసి చేతికందించింది అంజలి. నీళ్ళు తాగి గ్లాసు టేబుల్‌మీద పెట్టాడు శశి.

"మీ నాన్నగారు బాగున్నారా!" అన్నాడు. "బాగున్నారు. పెద్దవారైపోయినారు !" అన్నది. తన దగ్గర శ్రద్ధతో పనిచేసేవాళ్ళ బాగోగులు గురించి విచారించాలి కదా అని అనుకున్నాడు. "నాన్నగారు నీకు వివాహ ప్రయత్నాలు చేయడం లేదా" అన్నాడు. "ఎందుకు లేదు? ఎన్నో చూశాడు అన్నది. "అయితే" అన్నాడు. "అవసరం లేదు అని చెప్పాను" అన్నది. "ఎందుకు?..." డబ్బు ఇబ్బందా? మేమున్నాం కదా?" అన్నాడు.

అంజలి "ఇంతదూరం వచ్చాక నేను దాచుకోలేను. నేను చెప్పేదంతా వినండి, నేను మీవద్ద చేరినప్పుడు మేము ఆర్థికంగా బాగా చితికిపోయిఉన్నాం. అప్పుడు మీరు ఆదుకోకపోతే ఆత్మహత్యలు చేసుకున్న వాళ్ళ లిస్టులో ఉండేవాళ్ళము. కానీ ఈలోగా కోర్టులో మా నాన్నగారు మా ఆస్తి తగాదాల్లో గెలుపొందారు. ఈరోజు డబ్బుకు ఇబ్బంది లేదు.

నేను ఉద్యోగంలో చేరిననాడు జీతంకొరకు చేరాను. ఇప్పుడు మీకొరకు ఈ ఉద్యోగం చేస్తున్నాను. నాకు బాగున్నా బాగలేకపోయినా నేను వచ్చి మిమ్మల్ని చూచి మీ అపసరాలు చూడకపోతే ఆరోజు ఎంత అసంతృప్తిగా ఉంటుందో చెప్పలేను. మీరు ఊరిలో లేనప్పుడు నావన్నీ సెలవలే. ఆదివారం వస్తే పిచ్చిపడుతుంది. ఎప్పుడు ఆఫీసుకు వచ్చి మీకు దగ్గరగా ఉండి మిమ్ములను చూస్తూ సేవచేస్తానా అనిపిస్తుంది. అంటే నేను మిమ్మల్ని ప్రేమించడం, ఏదో ఆశించి కాదు. దాన్ని ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఇష్టం, అన్నింటిని కలిపి ముద్దచేసి దానికోపేరు పెడితే, అదే మీ మీద ఉన్న భావన. మీ నుంచి ఏమీ ఆశించను నేను. మిమ్ములను అర్థించేది ఒక్కటే. ఇది విని రేపట్నుంచి నన్ను ఉద్యోగంలో నుండి తీసివేయవద్దు. తీసివేసినా ఫరవాలేదు. కానీ, అంజలికి రేపు ఆఖరురోజు అవుతుంది. క్షమించాలి. నేను మిమ్మల్ని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నానో, అంత నిబ్బరంగా పదిసంవత్సరాల నుంచి ప్రతిక్షణం నా మనస్సును మీముందర పరిచేయాలనే ఆలోచనను ఈరోజు చెప్పగలుగు తున్నాను..."

మరలా "మీరు ఎంత ఎక్కువగా పనిచెబితే అంత సంతోషంతో ఇష్టంగా చేసి మీ ముఖంలో ఆనందం చూడ్డం, ఎప్పుడూ మీకు దరిదాపుల్లో ఉండడం, అంతే నాక్కావలసింది. మీరు ఇక్కడ నుండి వెళ్ళకుండా ఏరోజైనా ఎంత అవసరమున్నా నేను ఆఫీసువదిలి వెళ్ళానా! లేదు. అది అంతే. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. నాలోని బరువునంతా దించేసుకున్నాను. మరొకసారి, నావలన మీకు ఇలాంటి ఇబ్బంది ఉండదు. ఇప్పుడు మాట్లాడిన విషయాల్లో ఏ ఒక్క విషయాన్ని కూడా భవిష్యత్తులో మీతో చర్చించనని మీమీద ప్రమాణం చేస్తున్నాను. మీతో మనసువిప్పి మాట్లాడడం ఇదే మొదలు ఇదే ఆఖరు. మరలా అడుగుతున్నాను. నన్ను ఉద్యోగం నుండి తీసివేయవద్దు. తప్పుగా మాట్లాడివుంటే క్షమించండి" అని కన్నీళ్ళు తుడుచుకుంది.

శశికి కళ్ళు సరిగా కనపడ్డంలేదు. బూజర బూజరగా ఉంది. సమ్మెటతో తలమీద కొట్టినట్టుంది. విచిత్రంగా ఉంది. ఇన్నిరోజులు తను చీకటిలో ఉండి వెలుగులోకి

వచ్చినట్లయింది. అంటే ఇన్నేళ్లనుండి నోటితో చెపితే కాని అర్థం చేసుకోలేని అంధకారంలో జీవిస్తున్నానని అనిపిస్తున్నది. నాలో ఏమిచూచి అంజలి ప్రేమిస్తున్నదో అర్థంకాలేదు. ఎంత పిచ్చిపిల్ల. తన దృష్టిలో పసిపిల్లలా ఉండి అమాయకంగా చెప్పిన ప్రతిపనిని శ్రద్ధతో చేసుకొనిపోతుండే అంజలి ఈరోజు చాలా వింతగా కనపడుతున్నది. తనలో ఎంత ఔన్నత్యం లేకపోతే, తాను తన మనసులోని రహస్యాన్ని, ప్రేమను ఇంతకాలం శుద్ధిచేసి, దాచిపెట్టుకొని, సమయంకోసం ఎదురుచూచే సహనానికి, మనస్సు కరిగిపోతున్నట్టు అనిపించింది. ఇలాంటి విచిత్రమైన పరిస్థితులు ఎందుకు కలుగుతాయో అర్థంకావడం లేదు. తనకు ఈ ప్రపంచంలోని ప్రతిజీవిలో, పదార్థంలో, ఆనందంలో, బాధలో, ఆశయంలో పూర్ణిమ మాత్రమే కనబడుతుంది. తాను, నాకు ఏమీ ఇవ్వలేక పోతున్నానన్న బాధతో అలమటిస్తున్నది. తన బాధ తనకు ఎంతబాధ కలిగిస్తుందో నాకర్థమవుతున్నది. ఈనాడు నాకొరకు అంజలి గతి కూడా అంతేకదా అని అనిపిస్తున్నది. ఏమితోచడం లేదు.

శశి తన ఛాంబర్ నుండి బయటకు వచ్చి అంజలితో కారు తీయమని డ్రైవర్‌తో చెప్పమని, లిఫ్ట్‌లోకి పోతూ వెనుకకు తిరిగి చూచాడు. అంజలి ఫోన్ చేసి టేబుల్ వద్దే నిలబడివుంది. అంజలివైపు తిరిగి తనను కూడా రమ్మనమని చేత్తో పిలిచాడు. అంజలి గబగబా లిఫ్ట్ దగ్గరికి వచ్చింది. ఇద్దరూ లిఫ్ట్‌లో ఎక్కి క్రిందికి వచ్చి కారెక్కారు. డ్రైవర్ అంజలి వైపు చూశాడు ఎక్కడికెళ్ళాల అన్నట్టు. అంజలి శశిధర్ వైపు చూచింది. శశిధర్ తోటకు పొమ్మన్నాడు. కారు కదిలింది.

శశిధర్ అంజలితో భోంచేశావా అని అడిగాడు. అవునన్నట్లు తలూపింది. నిజంగా తినలేదు. శశిధర్ అంజలితో, వాళ్ళ ఇంటి పరిస్థితి బాగా ఉన్నదని తెలిసినా అమ్మానాన్నల ఆరోగ్యం, తమ్ముడి ఉద్యోగం, వివరాలు అడుగు తున్నాడు. కారు తోటలోకి పోయి బంగళాముందు ఆగింది. వాతావరణంగా చాలా ఆహ్లాదంగా ఉంది. పనివాళ్ళు తెచ్చిన రెండు కుర్చీలు మామిడి చెట్టుక్రింద వేశారు. ఒక కుర్చీలో శశి కూర్చున్నాడు. నీళ్ళు గ్లాసులు తెచ్చిపెట్టారు. అంజలి నిలబడి ఉంది.

శశి "రెండో కుర్చీ నీకోసమే. రెండు కుర్చీలలో నేను కూర్చొనలేను గదా! ఇది ఆఫీసు కాదు అంజలి. ఇక్కడ తారతమ్యాలు లేవు. ఇది మన గార్డన్. ఇక్కడ ఫార్మాలిటీస్ లేవు. ఇక్కడ నువ్వు నేను ఒక్కటే. ఇక్కడి చెట్లగాలి అందరికీ సమానంగా వీస్తుంది. ఎవరికి కావలసినంత వారు పీల్చుకోవచ్చు. ఈ చెట్లకు, జంతువులకున్న స్వతంత్రం,

సుఖం మనకు లేదనిపిస్తుంది. వాటికి ఈ బాధలు ఉండవు కదా!" అని అంజలి వైపు తిరిగాడు. అంజలి ఏం మాట్లాడలేదు.

సర్వెంట్ అంజలివైపు తిరిగి కాఫీ, టెంకాయ నీళ్ళు, ఏమీ తీసుకుంటారని అడిగాడు. మరలా అంజలి శశివైపు చూచింది. శశి అందుకొని అతనితో "వంటామెతో చెప్పి నెయ్యి జీడిపప్పు వేసి, మంచిగా ఉప్మా చేయమను. అంజలి మధ్యాహ్నం కూడా భోజనం చేయలేదు" అన్నాడు. అంజలికి కళ్ళలో సుడులు తిరుగుతున్నాయి. శశి తననిగురించి లోతుగా ఆలోచిస్తున్నాడని తన మనస్సుకు అర్థం అయింది.

శశిధర్ "మన జీవితాలు చాలా విచిత్రంగా, అస్వతంత్రతతో నడుస్తుంటాయి. మనం నిరంతరం ఒకరిమీద మరొకరు ఆధారపడి ఉంటాము. జంతువులకు ఆహారం, నిద్ర, సంతానోత్పత్తి తప్ప మిగతా గొడవలు ఉండవు. అందుచేత ఒకదాని మీద మరొకటి ఆధారపడడం ఉండదు. వాటి జీవితాల్లో స్వతంత్రత ఉంటుంది. అవి ఒకదానినొకటి పొరబాటున కూడా అపార్థం చేసుకోవు. వాటికి జాతిభేదం తెలుసు. ప్రకృతి స్థితిగతులు తెలుసు. పొరబాటున కూడా క్రమశిక్షణ తప్పవు. కాని మనుషులకు చదువు, మాట, జ్ఞానం ఉంది. అయినా ఒకర్నినొకరు అర్థంచేసుకునే దానికంటే, అపార్థం మెండుగా ఉంటుంది. ఆకారణంగా అనేక సమాధానాలు లేని సమస్యలతో సతమతమవుతుంటారు. ఇవన్నీ మనం కొని తెచ్చుకున్నవే. మనం ఎంతో కష్టపడి, కాలాన్ని, వనరుల్ని వెచ్చించి సమస్యలను ముడివేసుకుంటాము. ఇది పెద్ద దౌర్భాగ్యం".

"నేను చెప్పినదానికి, నాకంటే మంచి ఉదాహరణ, నీకు దొరకదు. పది సంవత్సరాలుగా నిన్ను దాదాపు ప్రతిరోజు చూస్తూ, నీతో రోజూ కొన్ని గంటలు గడుపుతూ, నీ మనసును అర్థంచేసుకోలేకపోయాను. నీ యోగక్షేమాలు తెలుసుకోలేక పోతున్నాను. దీనికి ఎలా క్షమాపణ చెప్పాలో అర్థంకావడం లేదు. అయాం సారీ అంజలి! జీవితంలో ఇంత గాఢంగా, ప్రేమను త్యాగంగా మార్చిన వైనం తెలిసినప్పుడు, ఎంతో ఆనందం కలుగుతుంది. అయితే ఇంతకాలం చీకటి గుహలో ఉన్నందుకు సిగ్గేస్తుంది. ఈరోజు నా మనసు కలవరపడినంత ఎప్పుడూ కలవరపడలేదు".

ఇంతలో రెండు ప్లేట్లలో ఉప్మా వచ్చింది. ఒక ప్లేట్ చేతిలోకి తీసుకొని అంజలికి అందించాడు. తాను తటపటాయిస్తుంటే స్ఫూన్‌తో కొంచెంతీసి నోటికి అందించే ప్రయత్నం చేయబోయాడు. అంజలి మనస్సు ఒక తన్మయత్వస్థితిలోకి నెట్టబడింది. గబగబా చేతిలోకి స్పూన్ ప్లేటు తీసుకొని "మీరు కూడా తీసుకోండి" అన్నది. అందుకు

"నేను భోంచేశాను కదా!" అని అన్నాడు. "అయినా, నా కోసం" శశి తన ప్లేట్‌లోనుంచి ఒక స్పూన్ తీసుకుంటుండగా, తనచేతిలోని స్పూన్‌ను శశిధర్ నోటికి అందించింది. ఉప్మా కార్యక్రమం, టెంకాయనీళ్ళు తాగడం ముగించారు.

శశి, "నేను నిన్ను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చాను అంటే, నీకు నాగురించి చెప్పాలి. నిన్ను నేను అర్థంచేసుకొన్నాను. నీవుకూడా నన్ను అర్థంచేసుకోవాలి. పది సంవత్సరాల నీ ఆరాధన గుర్తించలేని మూర్ఖత్వానికి నన్ను నేను నిందించుకోవాలి. నీ ఓర్పుకు నేను కృతజ్ఞతలు తెలపాలి. అందుకొరకు నన్ను గురించి నీకు చెప్పాల్సి వస్తున్నది. ఎలాగూ నేను ప్రాయశ్చిత్తం చేసుకొనే స్థితిలో లేను".

"నా జీవితం ఒక ఎడారి. దాంట్లో పూలచెట్లు, పండ్లచెట్లతో తోటను పెంచడం కుదరదు. నా జీవితాన్ని నా మనసును నేను పూర్ణిమకు అంకితం చేశాను. అర్పణ చేశాను. మా ఇద్దరి మధ్య సంబంధం మూడో వ్యక్తికి తెలియదు. అందరూ మమ్మల్ని భార్యా భర్తలనుకుంటారు. మేము అంతకంటే ఎక్కువే. మా ఇద్దరి మధ్య దంపతుల మధ్య ఉండే అన్యోన్యత, అనురాగం, ప్రేమ, త్యాగం అన్నీ ఉన్నాయి. కాని మానసికంగా మేము భార్యాభర్తలం. శారీరకంగా దంపతులం కాదు. నాకు పూర్ణిమ సర్వస్వం. పూర్ణిమకు నేను పరిపూర్ణం. ఈ రహస్యం తెలిసిన మూడో వ్యక్తివి నీవు కావడానికి కారణం, పదేళ్ళనుండి చేసిన నీ త్యాగానికి, అనుభవించిన బాధకు, నేను చాలా బాకీ పడిపోయాను. చాలా పొరబాటు చేశాను. మొదటి రోజులలోనే గమనించి ఉంటే నేను ఈరోజు మాఇద్దరి మధ్యగల సంబంధం చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు. అందుచేత నేను ఎవరికీ ఏమీకాలేను కాబట్టి, ఏమీకాను.

పూర్ణిమ వ్యక్తిత్వం ముందర నేను, నాకు తెలిసిన వ్యక్తులు అందరూ బలాదూర్. నాకు ఈరోజు చాలా బాధాకరమైన రోజు. నాకొరకు జీవితాన్ని త్యాగంచేసే నీలాంటి వ్యక్తికి, నేను అభిమానాన్ని తప్ప మరింకేమి ఇవ్వలేని నా దౌర్భాగ్యపరిస్థితికి, నన్ను చూస్తే నాకే అసహ్యం వేస్తుంది. ఆ బాధను గురించి నాకు క్షుణ్ణంగా తెలుసుకాబట్టి, నేను నీ ఆరాధనను మర్చిపోను. నా పరిస్థితిని అర్థంచేసుకొని నన్ను క్షమించి, నాలాంటి ఎందుకూ కొరగాని వ్యక్తిని వదిలేసి, ఎవరినైనా నీకు నచ్చిన, అంటే వెతికితే నచ్చుతారు, వ్యక్తిని పెళ్ళిచేసుకుంటే బాగుంటుందని నా ఆలోచన. దాని కొరకు నీకు మా విషయాన్ని చెబుతున్నాను" అని ముగించాడు.

మరలా సర్వెంట్‌ను పిలిచి టీ తెమ్మన్నాడు. టీ వచ్చిన తర్వాత తాను ఒక కప్పు తీసుకొని రెండో కప్పు అంజలిని తీసుకోమని సైగచేశాడు. అంజలి తనకు వద్దని అనడంతో ఆ కప్పును తనచేతిలో తీసుకొని "పోనీ, నాకోసం తాగవా అన్నాడు" అంజలి కప్పుతీసుకుంది. టీ తాగడం పూర్తిచేశారు. అంజలికి తన జీవితంలో గత పది సంవత్సరాలలో ఊహించని సంఘటన, మూడు నాలుగు గంటలలో జరగడంతో అయోమయంగా ఉంది.

శశి "ఒకసారి స్కూల్ వరకు పోయి చూచొద్దామా?" అన్నాడు. అందుకు సరే నన్నట్టు అంజలి తలూపింది. మరలా కారు కదిలింది స్కూల్ వైపు. స్కూల్‌కి చేరి స్టాఫ్‌తో కొంచెంసేపు మాట్లాడి, పిల్లల్ని చూచి ఇద్దరు ముగ్గురితో ముచ్చటించి, మరలా కారు ఎక్కారు. అంజలికి తలలోని కోట్లన్యూరాన్లు ఒక్కసారి పనిచేయడం ఆగిపోయాయా అనిపించింది. తాను ఊహించని విషయాలను వినాల్సి వచ్చింది. "ఇంకొంచెం సేపు ఇక్కడే ఉంటే మీకేమైనా అభ్యంతరమా అన్నది అంజలి". "అదేం లేదు" అన్నాడు.

"ఇప్పుడు నేను నా కృతజ్ఞతలు మీకు తెలియజేయాలని తహతహలాడుతున్నాను. మీ రహస్యాలు, ఎవ్వరికీ తెలియనివి, నాతో పంచుకోవడంవల్ల, నాకు అర్థమయ్యింది మీ మనస్సు ఏమిటో. నా జీవితానికి మీరు ఈరోజు కొన్ని గంటలసేపు చూపించిన దయ, ఆర్ద్రత, నూరు సంవత్సరాలకు సరిపోతుంది. ఈ ఆనందం చాలు నాకు. మీమీద ప్రమాణం చేసి చెప్తున్నాను రేపటి నుండి నేను అంజలిని, మీరు మా బాస్ అంతే. నా ప్రేమను మీరు అంగీకరించలేని స్థితిలో ఎలాంటి తిరస్కార భావాన్ని చూపించకుండా, నన్ను చులకన చేయకుండా, మీరు చూపించిన సింపతి, మీ సద్బుద్ధి, మీ సంస్కారానికి తార్కాణం" అని అంటూ శశిధర్‌కు వంగి పాదాభివందనం చేసింది. శశి "అంజలి! అంజలి!" అంటూ కాళ్ళు వెనక్కు లాక్కున్నాడు.

"నేనేదైనా తప్పు మాట్లాడి ఉంటే, తప్పు చేసివుంటే నన్ను క్షమించండి. ఈ అంజలి ఎప్పటికీ మీకు సేవకురాలిగా ఉండాలని, భగవంతుడిని వేడుకొంటున్నది. జీవితంలో ప్రేమయొక్క పరమానందం అంటే ఏమిటో రుచి చూపించారు. భగవంతుడు కరుణామయుడు. నాకు, మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అన్న విషయం మీకు తెలియ జేయడానికి వచ్చిన అవకాశం భగవంతుని కృప. మీ మహోన్నతమైన వ్యక్తిత్వంతో, నా ప్రేమలో, ఆరాధనలో, నా మజిలీ చేరానని, ఎంతో సంతోషంగా ఉంది. ఈ

ఆనందంతో నాగుండె ఆడడం నిలబడిపోతే బాగుండునని పిస్తున్నది. అయినా మీకు నా పి.ఏ. స్థానంలో వేరేవాళ్ళు మిమ్మల్ని అర్థంచేసుకోలేరేమో, అన్న ఒక్క బాధ మనసులో ఉంది. నేను కోరుకున్నదానికంటే ఎక్కువ పొందాను, అనుభవించాను. ఇక వెళదామా" అన్నది. ఇద్దరూ లేచి కారెక్కారు. కారు కదిలిపోయింది.

ప్రేమించడం, ప్రేమను వ్యక్తపరచలేకపోవడం, ప్రేమను పండించుకోలేక పోవడం, అది అనుభవిస్తే గాని దాని బాధ అర్థంకాదు, అని ఆలోచిస్తున్నాడు శశి. కారులో ఇద్దరూ అద్దాల్లోనుండి పరుగెత్తే రోడ్లను, చెట్లను, మనుషులను, చూస్తున్నారు. ఇంతలో శశి డ్రైవర్‌తో "నన్ను ఇంటివద్ద దింపి, అంజలిని ఆఫీసు వద్ద దించు". మనసులో పూర్ణిమ వస్తుంది. ఈరోజు జరిగిదంతా చెప్పాలి అని ఆలోచిస్తుంటే, కారు శశిధర్ ఇంటిదగ్గర ఆగింది. శశి కారులోనుండి దిగి అంజలి చేతిని తనచేతిలోకి తీసుకొని "ఉంటాను బాయ్ గుడ్‌లక్" అంటూ కదిలాడు.

## అంజలి ప్రేమ

రాత్రి 7.30 అయ్యింది. పూర్ణిమ శశిధర్ మేడమీద కూర్చుని ఉన్నారు. శశిధర్ పూర్ణిమతో "ఈరోజు ఒక విచిత్రం జరిగింది. నీకు చెబుతాను వింటావా? అయితే ఒక కండీషన్. నీకు నేను ఎలాగూ అబద్ధం చెప్పలేను. జరిగింది జరిగినట్టుచెబుతాను. నన్ను తిట్టనంటే చెబుతాను. అది అట్లాంటి విషయం కాబట్టి" అని అన్నాడు.

పూర్ణిమ "నిన్ను ఏనాడైనా పల్లెత్తుమాట అన్నానా! ఏం ఫర్వాలేదు చెప్పు. జీవితంలో ఒకరకంగా, జీవితంలో విషాన్ని మింగి, అమృతాన్ని ఇతరులకు పంచాలనే ప్రయత్నం చేస్తున్నాము. మనకు దిగులు, కోపం, పగ, ప్రతీకారం, ఉన్నా యంటావా? నీకు ప్రియురాలినైనా, తల్లినైనా నాకంటే నీకెవరున్నారు? చెప్పు నిన్ను ఏమీ అనను. ఒకవేళ తప్పనిపించినా ఏ ఇబ్బందీ లేదు. మన జీవితాలు చివరిమెట్టులో ఉన్నాయి. ఎవరేమనుకుంటే మనకేమి? దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నట్టు, అవేవీ నువ్వు చదవలేదులే – "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు" అని అంటాడు. అలాగా ఎవ్వరు నవ్వినా, వెక్కిరించినా, లోపాలను ఎత్తిచూపినా, వాటన్నింటికీ అతీతులమని నీకు తెలుసుకదా! అంతమాత్రం దానికి ఇంత సందిగ్ధం ఎందుకు.

శశిధర్ ప్రారంభించాడు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన అంజలి ప్రేమ కథనంతా చెప్పాడు. "నీకింత తెలివుందని

నేను ఎన్నడూ ఊహించలేదు. మొత్తానికి చాలామంచిపని చేశావు. స్వార్థంలేని త్యాగాన్ని ప్రేమను పొందడం, జీవితంలో గొప్ప అదృష్టం. అటు అందించేవారు, ఇటు పొందేవారు ఇద్దరూ జీవితంలో చాలా పుణ్యం చేసివుండాలి. లేకుంటే అలాంటి జన్మలు రావు. పోనీలే! నాకిప్పుడు ఒక ఆశాజ్యోతి చిక్కింది. మనం సాధించింది ఊబిలో కూరుకు పోతుందేమో నన్న భయం ఉండేది. మన తర్వాత వీటిని చూచేవాళ్ళు కావాలి. ముఖ్యంగా నా తర్వాత నిన్ను చూచేవాళ్ళు ఎవరా అని దిగులుపడుతున్నాను" అన్నది. అందుకు శశి "నిజంగా నీకు ఏమనిపించలేదా! నీకు అసూయ అనేది ఉండదని నాకు తెలుసు. అయినా ఏదో..."

కుర్చీలో నుంచి గభాలున లేచి శశిధర్ దగ్గరకు వచ్చి బుగ్గమీద ముద్దుపెట్టుకొని "వేరే విధంగా నాకెందుకు అనిపిస్తుంది. మంచిదే. మనమంచికే జరుగుతున్నదను కోవాలి. రావు ఆశీర్వదించినాటి నుండి ఈనాటివరకు, ఎవరి జీవితంలోనూ జరగని ప్రత్యేకతతో, మనం జీవించినందుకు ఆనందపడాలి. ఒకటి రెండు విషయాల్లో వెలితి ఉన్నమాట నిజమే. అసలు మనం పుట్టనేలేదను కుంటే పోతుంది. లేదా లేమనుకుంటే పోతుంది. లేదా దానికి అర్హత లేదనుకుంటే పోతుంది. లేదా మనం సన్యాసాశ్రమంలో ఉన్నామనుకుంటే పోతుంది. కాని ఎంతమందికి మనం ఆసరాగా నిలబడ్డాం? త్యాగజీవులమని లక్షల మంది అనుకునేదానికంటే ఈ జన్మకు సార్థకత మరేముంటుంది" శశిధర్ కళ్ళల్లో నీళ్లు తిరిగుతున్నాయి.

"పిచ్చోడా, ఎందుకు అలా బాధపడతావు? నేనున్నాను కదా! నేను ఒకవైపు ఆనందిస్తుంటే, ఆ ఆనందాన్ని నువ్వు నాతో పంచుకోకుండా నీవు దిగులుపడితే నేనేం చేయాలి. లేయ్! పోదాం! భోంచేద్దాం! ఈరోజు సుదినం. కళ్ళనీళ్ళు పెట్టుకోకూడదు".

పూర్ణిమ "ఎందుకా కన్నీళ్ళు?" తన పమిట కొంగుతో కన్నీరు తుడుస్తూ దగ్గరకి తీసుకొని కౌగిలించుకుంది. ఏదో ఒక మధురమైన బాధ. ఒక వెచ్చని స్పర్శ. తల్లి ఒడిలో, హృదయానికి హత్తుకొన్న ఆనందం. ఇంకా గట్టిగా కౌగిలించుకోవాలని, కలసిపోవాలని, కరగిపోవాలని అంతరాంతరాల నుండి ఒక శక్తి ప్రోద్బలం చేస్తున్నది. కాని అది చైతన్య జడత్వ సమ్మేళనం. ఆమె కొంగుతో తన ముఖాన్ని తుడిచినప్పుడు ముక్కుపుటాలకు తగిలిన వాసన అన్ని సుగంధాలకు అతీతమైనది. చిన్నప్పుడు తన తల్లి, పైటకొంగుతో తన ముఖాన్ని తుడిచినప్పటి అనుభవం. అది అలానే ఈ మనసులో గీరగా గారకట్టుకొని చెరిగిపోలేదని అర్థమౌతున్నది. అదే తన్మయత్వం, ఆనందం.

“కళ్ళలో నీళ్ళు వచ్చింది అందుకు కాదు. ఆ దైవం నిన్ను నాదగ్గరకి చేర్చినందుకు. కన్నీటితో ఆయన పాదాలు కడుగుదామని” అన్నాడు.

మరలా “నేను అంజలిపై ఎందుకు అంత ఆర్ద్రత చూపించానంటే ఆ బాధేమిటో నాకు తెలుసు. నీకు తెలుసు. మనల్ని ప్రేమించేవాళ్ళను కనీసం ఓదార్చలేకపోతే, ఈసడించుకోకుండా కనీసం ఆదరించలేకపోతే నాలోని మానవత్వం చచ్చిపోయిందని అనిపిస్తుందని ఆలోచించాను”. పూర్ణిమ “మంచిపని చేశావు. నాకు కూడా చాల సంతోషంగా ఉంది” అంటూ ఒకరి భుజంమీద ఒకరు చేయివేసుకొని మెట్లమీదినుండి కిందికి దిగారు.

నెలలు గడుస్తున్నాయి. వ్యవస్థలు సక్రమంగా జరుగుతున్నాయి. పూర్ణిమ శశిధర్ క్రొత్త ప్రాజెక్టును గురించి ఆలోచించి చర్చించడమే కాక, ఇతర దేశాల్లో ఎలావుందోనని ఒక నెల రోజులు ట్రిప్పు వెళ్ళి వచ్చారు.

* * * * *

ఆరోజు అంజలితో మాట్లాడినప్పటినుండి శశిధర్‌తో బాస్ పి.ఏ. సంబంధం తగ్గుముఖం పట్టింది. వ్యవహారాలన్ని అంజలికి అప్పజెప్పడం ఆనావాయితి అయ్యింది. అంజలి తాను స్వంత నిర్ణయాలు తీసుకుంటూ జరిగిన దానిని, మరల శశికి, పూర్ణిమకు రిపోర్టు చేయడం జరుగుతున్నది. పైగా పూర్ణిమ కూడా అంజలిని ఇంటికి పిలిచి సమస్యలను, ప్రణాళికలను, చర్చించడం మొదలు పెట్టింది. అందుచేత పూర్ణిమ శశిధర్‌కు అన్ని విషయాలకు అంతరంగిక వ్యక్తిగా సొంతమనిషిగా అంజలి అన్ని పనులను పర్యవేక్షించడం జరుగుతున్నది.

ఇప్పుడు అంజలి అన్ని వ్యవస్థల్లో, పూర్ణిమ శశిధర్ తర్వాత మూడవస్థానాన్ని ఆక్రమించింది. అలాగని శశిధర్ అంజలి మధ్య, మరలా వెనుకటి ప్రేమకథ తెరమీదికి రావడం జరగలేదు. ఎవరి సంబంధాలు వారివే. ఎవరి ఆలోచనలు వారివే. ఎవరి ప్రేమలు, అభిమానాలు వారివే. ఒక్క కాలంలోని మార్పు తప్ప వాళ్ళమధ్య ఎలాంటి మార్పు లేదు.

* * * * *

# 11. భావ అవధానం

టొరొన్లో పేరున్న ఒక సాహితీ సంఘం కవి సమ్మేళనం, సంగీతం, సాహిత్యం, భావ అవధానం జరిపేందుకు నిశ్చయించి పూర్ణిమను అభ్యర్థిస్తే, ఆమె తన ఆడిటోరియంను ఉచితంగా ఉపయోగించుకొనమని, సాహితీ సంఘం పెట్టుకునే ఖర్చు లోటును భరిస్తానని భరోసా ఇచ్చింది. సంఘం మూడోరోజు పూర్ణిమ గారిచే భావావధానం చేయించేదానికి ఆమెను ఒప్పించారు. అవధాన స్వరూపం : కొంత మంది పృచ్ఛకులు మానవ జీవితాలకు సంబంధించిన విషయాలపై వేసే ప్రశ్నలకు పూర్ణిమ జవాబు చెప్పడం.

కార్యక్రమం మొదటిరోజు కవి సమ్మేళనం, రెండవరోజు సంగీత సాహిత్య కార్యక్రమాలు చక్కగా జరిగాయి. ఇక మూడవరోజు జీవిత సమస్యలు, సమాధానాల అవధాన కార్యక్రమానికి ముఖ్యవక్త పూర్ణిమ వంతు అయ్యింది. ప్రార్థనా గీతం, జ్యోతిప్రజ్వలనం, సాహితీ సమితి వాళ్ళ తొలిపలుకులతో కార్యక్రమం ప్రారంభం అయింది.

పూర్ణిమ సభికులను ఉద్దేశించి వేదిక ప్రాంగణములో ఆశీనులై ఉన్న అందరినీ పరిచయం చేస్తూ, తనపై వాళ్ళ ప్రేమాభిమానాలకు నమస్సుమాంజలులు తెలుపు కుంటూ, ఈ ప్రక్రియ తనకు మించిన భారం అయినప్పటికి, పూజ్యుల ఆహ్వానాన్ని కాదనలేక సమ్మతించడమే తప్ప, తానొక మేధావినని అనుకోవడం లేదని, సవినయంగా విన్నవించుకుని అవధాన కార్యక్రమాన్ని ప్రారంభించమని అభ్యర్థించింది.

**1. ప్రశ్న :** మానవ జీవితాన్ని అనుభవిస్తున్న మనం జీవితాన్ని అనేక కోణాల్లో చూచినప్పుడు మానవుడు నిజంగా ఈ భూమ్మీద సుఖిస్తున్నాడా లేక దు:ఖిస్తున్నాడా? అని ఒక పృచ్ఛకుడు అడగడం జరిగింది.

**జవాబు :** మానవుడు శరీరమనే పదార్థం, మనస్సు బుద్ధి తరంగాల స్రవంతి, జీవం అనే తత్త్వంతో సమ్మిళితమై కాలంతో ముడిపడి ఉంటాడు. ఈ కాలం బహు విచిత్రమైనది. అది రూపం, సైజు, రంగు, రుచి, వాసన లాంటి లక్షణాలతో కొలవ గలిగినది కాదు. కాలాన్ని "కాలయతి ఇతి కాలః" అన్నారు. అనగా ప్రతిదాన్ని కదిలించేది అని అర్థం. ఈ కదలిక వలన, గతంలో నుండి వర్తమానం ద్వారా భవిష్యత్తులోనికి, జారుకుంటుంది జీవితం. గతం ఒక జ్ఞాపకం. వర్తమానం ఒక అనుభవం. భవిష్యత్తు ఒక ఊహ. జీవితం సుఖ దుఃఖ సమన్వయం. సుఖదుఃఖాలనేవి రెండు లేవు. అది ఒక భావం. అయితే తమకు ఇష్టమైనది సుఖమని కష్టమైంది దుఃఖమని భ్రమపడుతారు. అయితే ఉండేది ఒకటే.

**2. ప్ర. :** కోరిక పుట్టుకను, స్వరూపాన్ని, ప్రభావాన్ని, ఫలితాన్ని గురించి వివరించి, కోరికను అదుపులో ఉంచడం ఎలా అన్న విషయాన్ని వివరించమని ప్రార్థన?

**జ :** కోరిక లేకుండా సృష్టి, స్థితి, లయాలు లేవు. కోరిక జీవితాన్ని నడిపిస్తుంది. కోరిక అమృతం లాంటిది. హాలాహలంలాంటిది. బ్రతుకును చైతన్యంతో నడిపిస్తుంది. బ్రతుకును బండబారుస్తుంది. కోరిక ఒకసారి కార్యంగా, మరొకసారి కారణంగా కనబడుతుంది. జ్ఞానానికి, అజ్ఞానానికి, జ్ఞానోదయానికి కోరికే మూలం. కోరిక వెలుగుగా, ఛాయగా భాసిల్లుతుంది. కోరిక పుట్టలా పెరుగుతుంటుంది. దానికి అంతం లేదు. మొదలు కనబడుతుంది. చివరను ఎవరూ చూడలేరు. కోరిక ఆదికి ముందు, అంత్యానికి తర్వాత కూడా ఉంటుంది.

కోరిక కర్మను నిర్ధారిస్తుంది. కోరిక ద్వారా ఈ జన్మలో సాధించిన దానికి వేరేజన్మలో ఫలితాలను అనుభవించవలసి వస్తుందని పెద్దలు చెబుతారు. దాన్నే కర్మ అంటున్నారు. అందుకే నీకర్మను శ్రద్ధతో, ఫలితం ఆశించకుండా చేయమని గీతవాక్యం. తాను చేసిన కర్మలకు ఫలితాన్ని ఆశించేట్టు కోరిక మనిషిని తరుముతుంది. అసలు మనిషి దుఃఖితుడు కావడానికి కారణం కోరిక. అసూయను కల్పించే బలమైన శక్తి కోరిక. కాబట్టి నీవు చేసిన పనికి ప్రత్యుపకారంగా ఏదైనా ఆశించావా, నీలో నీవు నరకాన్ని సృష్టించుకుంటున్నావనేది తథ్యం. చివరకు నీ బిడ్డల నుండి కూడా ప్రత్యుపకారం ఆశించడం కోరికను పెంచిపోషించుకోవడమే.

వెలుగులో వెలుగై. చీకటిలో చీకటై. వెలుగులో చీకటై, చీకట్లో వెలుగై. ఉండగలిగేది కోరిక. కష్టాలకు, కన్నీళ్ళకు ప్రేమకు పగకు మూలశక్తి కోరిక. రాగద్వేషాలకు, అనురాగాలకు, అహంకారాలకు, మమకారాలకు శ్రీకారం చుట్టేది కోరిక. కోరికను నశింపచేయగలిగినది కోరిక మాత్రమే. పగ, దారిద్ర్యం. ప్రేమ, ఐశ్వర్యం. దయా దాక్షిణ్యాలు, ప్రేమానురాగాలు కోరికల సన్నిహితులు. హత్యలు, ఆత్మహత్యలు, యుద్ధాలు, కోరికకు శత్రువులు. ధనం, ద్వేషం, భక్తి, ధైర్యం, పిరికితనం, కోరిక తోబుట్టువులు. విద్వేషాలు, నిగ్రహం, అనుగ్రహం, కామ క్రోధాదులు, భయం, లజ్జ, కోరికకు అనుయాయులు.

మహాజ్ఞానులు కూడా కోరిక చేతిలో ఆటబొమ్మలు. కోరికను జయించాలంటే, త్యజించాలంటే, ప్రేమ త్యాగం లాంటి ఆయుధాలను ఉపయోగించాలి. అయితే త్యజించాలనుకోవడం కూడా ఒక పెద్ద కోరికే. కోరిక నుండి దైవం కూడా పుట్టింది. ప్రపంచం కోరికలో ఇమిడి పోయింది. జీవుని బలహీనత, బలం కూడా కోరికే. కోరిక కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటే మానవుడు ప్రశాంతతో వెలుగొందుతుంటాడు. కోరిక దూరంగా ఉంటే నిశ్చలంగా ఉంటాడు. దగ్గరయ్యే కొద్దీ తాపంతో పరుగెత్తుతాడు. కోరిక చాలా మొండిఘటం. పరిస్థితులు అనుకూలించకపోతే దారిమార్చుకొనిపోదు. జ్ఞానులు తప్ప మిగతా వాళ్ళందరూ మొండిగా కోరికను కౌగిలించుకొని కుప్పకూలి పోతారు.

**3.** **ప్ర. :** మంచితనం, త్యాగం, మానవత్యానికి ప్రమాణం అవుతుందా?

**జ. :** జీవన విధానంలో మంచితనం, మానవత్వం, అంగాల వంటివి. మంచికి రెండువైపులు ఉంటాయి. ఒకరి మంచి, మరొకరికి చెడ్డ కావచ్చు. త్యాగానికిచ్చే బహుమతి ఒకవైపు మెచ్చుకోలు, పొగడ్తలు. రెండవవైపు అసూయ. ఏదో ఒక కుంటిసాకుతో వెక్కిరించడం, తప్పుపట్టడం. ఎవరికైన డబ్బు మూలుగుతుంటే, దానం చేయక ఏంచేస్తారు? ఎక్కడ పెట్టుకోవాలో తెలీయదు. వాళ్ళ పాపాలను కడుక్కునేందుకు ఈ పనులన్నీ చేస్తున్నారు.పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి కదా! అని విమర్శిస్తూ వాళ్ళ త్యాగం రుచిలేనిదని చప్పగా ఉన్నదని, నీళ్ళతో కడిగి చీపురతో చిమ్మి మురికి కాలువలోకి తోసేస్తారు.

**4.** **ప్ర. :** మానవులు చాలామంది, ఊహలలో ఉయ్యాలలూగుతుంటారు, కలలతో జీవితాన్ని నాశనం చేసుకుంటుంటారు అన్నది సరైనదేనా?

**జ :** ఊహ మనస్సును కుదిపేసే శక్తివంతమైన ఆలోచన. దానిని రెండువైపుల నుంచి చూస్తే తప్పు అర్థంకాదు. కవులు, రచయితలు, సైంటిస్టుల ఊహలు, ఒక రూపాన్ని సంతరించుకొని గొప్ప గొప్ప సిద్ధాంతాలుగా, రచనలుగా ఆవిష్కరింప పడ్డాయన్నది సత్యదూరంగాదు.

అదే బంధువులపై, సంతతిపై, శత్రువులపై, చెడ్డవిషయాలపై, దురలవాట్లపై, చేసే దుర్మార్గపు ఊహాత్మక ఆలోచనలు, చెడ్డను మాత్రమే మిగిలిస్తాయి. ఆ కారణంగా మంచి ఊహలు సమాజ శ్రేయస్సుకు, చెడ్డ ఊహలు సమాజ వినాశనానికి దారితీస్తాయన్నది సత్యం.

**5. ప్ర. :** ప్రేమ మీద మీ అభిప్రాయం ఏమిటి? జీవితంపై దాని ప్రభావం ఏమిటి? జీవితంలో ప్రేమ పాత్ర ఎంత?

**జ. :** ప్రేమ అన్న రెండక్షరముల పదం క్షయం లేనిది. ఈ సృష్టిని శాసించే శక్తి ప్రేమనుండి ఉద్భవిస్తుంది. ఆది మధ్యాంతాలకు, దైవం, భగవంతుడు లాంటి పదాలకు మూలం ప్రేమ. ప్రేమ తల్లి వేరులాంటిది. ప్రేమకు సంబంధంలేని పదార్థం ఈ సృష్టిలో లేదు. ప్రేమ ఒక ఉయ్యాల లాంటిది. ఊగినంతసేపు ఊగుతుంది. ఊగినంతసేపు హాయిగా ఉంటుంది. ఊగుతూ జారిపడ్డావో ఒళ్ళు హూనమవుతుంది. మిట్టమధ్యాహ్నపు ఎండలో కాలే ఇనపచట్రంపై పెట్టిన మంచులాంటిది ప్రేమ.

ఇది సంయోగ వియోగాల సరళి. ప్రేమ ఆకర్షణ వికర్షణల సమాహారం. ఉదాహరణకు సూర్యమండలంలోఅనేక గ్రహాలు తమచుట్టూ తాము తిరుగుతూ సూర్యున్ని చుట్టూ ప్రదక్షణం చేస్తూ ఉండడం, ఆకర్షణ వికర్షణ ప్రక్రియే కదా? ప్రేమ ఒక శక్తిస్వరూపం. మానవునిలోని అణుశక్తి విద్యుచ్ఛక్తి, మాగ్నటిక్ శక్తి అన్నీ కలిపి ఒక ఆకర్షణకు వికర్షణకు లోనై, ప్రేమ అనే శక్తిగా ఆవిర్భవించి మనసును తరుము తుంటుంది.

ప్రేమ మహానది లాంటిది. ఆరంభంలో చిన్న పాయలా ప్రారంభమై, పోను పోను మహాప్రవాహంగా రూపుదిద్దుకొని, అడ్డం వచ్చిన వాటినన్నిటినీ అధిగమించి లేదా వాటిని తనలో ఇముడ్చుకొనిపోతూ చివరకు సముద్రంలో కలుస్తుంది. అది ఒక విత్తులాంటిది. మొదట అంకురమై, మొక్కై చెట్టు అయి, మహావృక్షము అయి, పూలు కాయలు పండ్లతో బరువెక్కిపోతుంది.

ప్రేమ ఒక వల, సుడిగుండం ఊబి. అలాగే అది ఒక బృందావనం. అది అర్థం కావాలంటే ఆ బృందావనంలో విహరించాలి లేదా సుడిగుండంలో చిక్కుకోవాలి.

ప్రేమ ఫలించిన క్షణాన పూలు రాలినట్టు, సముద్రం పొంగినట్టు అనిపిస్తుంది. కానీ ప్రేమ విఫలమైతే అన్వేషణ ప్రారంభమవుతుంది. ఆ అన్వేషణకు గమ్యం కనపడదు. మైలు రాళ్ళు ఉండవు. ప్రేమ నిగూఢంగా అంతరాంతరాల్లో దాక్కొని దోబూచులాడుతూ ఉంటుంది. ప్రేమలో విఫలమైన వారు ఆవేదనతో, జుగుప్సతో తమ జీవితానికి అర్థం తెలీక ఆకాశంలోకి చూచి, మనస్సులోనే పొలికేకలు పెట్టుకుంటూ, తమను తాము నిందించుకుంటూ, సమాజాన్ని అసహ్యించు కుంటూ, దిక్కులు పిక్కటిల్లేటట్టుగా గావుకేకలు వేస్తూ, ముళ్ళు, రాళ్ళు దాటుకుంటూ, జీవితాన్ని గడిపేస్తారు. ప్రేమ విఫలమైందంటే అగ్నిపర్వతం బద్దలైనట్టే. సునామీ చుట్టుముట్టినట్టే.

ఎంతోమంది ప్రేమికులు తమ జీవితాలను ఎండగట్టుకొని, జీవచ్ఛవాల్లా రాత్రింబవళ్ళు, ఏమిచూసినా, ఏమిచేసినా, ప్రేమకు పదును పెట్టుకుంటూ కాలం గడిపివేయడం, ప్రేమకున్న శక్తి. వాళ్ళ ఆశ, భావన, ప్రేమ ఫలించదని తెలిసికూడా, వెర్రిగా ఎదురుచూస్తూ, ప్రేమ ఫలించబోతున్నదన్న నమ్మకంతో, భ్రమిస్తూ బ్రతుకుతారు.

ప్రేమ, భక్తి, ఒకే కోవకు చెందినవి. ప్రేమ తనకు నచ్చిన వ్యక్తిని తన స్వంతం చేసుకోవాలని తపన పడుతుంది. భక్తి తమ దైవం క్రీగంటిచూపు తమమీద పడాలనే తపనతో ఉంటుంది. ఇదంతా ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, కలసి చేసే లీల. ప్రేమకొరకు సర్వస్వాన్ని త్యాగం చేయగలిగినప్పుడే, నీకు తిరిగి వస్తుంది.

ఈ ప్రపంచంలో ప్రేమ సృష్టించినన్ని సమస్యల్ని మరి ఏదీ సృష్టించి వుండదు. ప్రేమకు పరాకాష్ఠ ఇతరుల ఆనందంలో తమ ఆనందాన్ని మిళితం చేసుకోవడం, ఇతరుల ఆశను, ఆకలిని అర్థంచేసుకోవడం. ప్రేమ ఒక అనుభవం. అది మాటల్లో చెప్పదగినది కాదు. తీపి ఎలా ఉంటుందో వర్ణించి చెప్పలేం. కొంతవరకూ అనుభవించినవాడు, ఇంకొకడికి చెబితే కొంతకు కొంత అర్థమవుతుంది. సృష్టికి ప్రాణం పోసేది ప్రేమ. ప్రేమ కోరేది ప్రేమ తప్ప మరేదీ ఉండదు. అందుకే బసవరాజు అప్పారావు 'చివర, ప్రేమించు ప్రేమకై, ఏమింకవలెనురా' అని అంటారు.

ప్రేమ చంద్రుడు లాంటిది. అది పూర్ణత్వాన్ని శూన్యాన్ని కలిపిస్తుంది. ప్రేమ స్వార్థాన్ని, ద్వేషాన్ని, అసూయను కలిపించి తద్వారా పగను రగిలిస్తుంది. కానీ ప్రేమలో నుంచి పుట్టిన పగ సూర్యుడి లాంటిది. అది నిరంతరం మండుతూ ఉంటుంది. ప్రేమ హిమాలయం, మహాసముద్రం. ఈ విశ్వమంతా ప్రేమమయం. అందులో ఒక బిగ్‌బ్యాంగ్ బ్లాక్‌హోల్స్ ఉంటాయి.

ప్రేమ లేకుండా దుఃఖం వుండదు. బుద్ధుడు తన సిద్ధాంతంలో మొదటిది దుఃఖం అన్నాడు. కాని ప్రేమలో నుండి దుఃఖం పుడుతుందని చెప్పివుంటే, ఆయన సిద్దాంతానికి ఇంకా పరిపుష్టి కలిగి వుండేది. ప్రతిజీవీ మొట్టమొదట తనను తాను ప్రేమించుకుంటుంది. అనగా తన శరీరం, ఆకలి, అందం, ఆనందం, ఇష్టం, ఇలా తనే సర్వసం. తన తరువాతనే ఈ ప్రపంచంలో మరేదైనా. దానితో సమానమైనది తల్లి ప్రేమ. తనను ప్రేమించినంతగా, తన బిడ్డను కూడ ప్రేమించగలిగినది తల్లి మాత్రమే. ప్రేమ, అంతా తనకే కావాలని, దాంట్లో ఎవరూ భాగస్వాములు వుండకూడదన్న నిబంధన నుండి, ప్రేమ జనిస్తుంది. అనుకున్నది అనుకున్నవిధంగా లేదా ఆశించినది ఆశించినంతగా పొందలేకపోతే ప్రేమ దుఃఖం అవుతుంది.

ప్రేమ సృష్టికి ఆరంభం అవుతుంది. ప్రేమ సృష్టి రెండూ వేరుకాదు. ఒకటే. అదే అద్వైతం. ప్రేమలేని సృష్టి, సృష్టిలేని ప్రేమ వుండదు. భగవంతుడు సృష్టి చేయడానికి వాడిన భావము ప్రేమ. దాన్నే చైతన్యం అంటాము. ఈ సృష్టంతా ప్రేమమయం. ప్రేమసృష్టిలో, శూన్యాన్ని పూర్ణంచేస్తూ, పూర్ణాన్ని శూన్యంచేస్తూ ఉంటుంది.

ప్రేమ త్యాగం కోరుకుంటుంది. భూమిలో నాటిన విత్తు, తాను పగిలి తనలోని శక్తిని ఉపయోగించి, మొలకకు ఆహారం అయి తనను తాను నాశనం చేసుకుని, మొక్కకు కావలసిన జీవాన్ని పంచి తాను మొక్కగా, చెట్టుగా విస్తరిస్తుంది. విత్తనం చావక పోతే మొక్కకు జీవం లేదు. అది చెట్టుగా పూలు, కాయలు, పండ్లతో ఎదగదు. ఇదంతా విత్తనంలోని ప్రేమ చేసిన త్యాగం.

**6.** **ప్ర. :** మానవుడికి ప్రకృతికి ఉన్న సంబంధం ఎలాంటిదో వివరించమని మా విన్నపం.

**జ. :** అన్ని జీవరాశులలో, ఇంద్రియాలతో, మనస్సుతో, బుద్ధితో, సత్త్వరజస్త – మోగుణాలతో జీవించే తత్త్వం కలిగినవాడు మానవుడు మాత్రమే. మానవునిలా ప్రకృతి మీద ఆధారపడే మరే ప్రాణి ఈ సృష్టిలో ఉండదు. మానవుడు చెట్లు, జంతువులు, తోటి వ్యక్తులు, తల్లిదండ్రులు, బిడ్డలు, దేవుళ్ళు లాంటి అన్ని చరాచర జీవులు, వస్తువుల మీద ఆధారపడి జీవిస్తాడు. పుట్టిన జీవిని తల్లి దగ్గరకు తీసుకోకపోతే జీవించే యోగ్యత లేదు. మానవుడు ప్రకృతిని దోపిడీ చేస్తూ చివరకు భూమిని, గాలిని, నీటిని వాటిలోని సకల శక్తులనూ, తనస్వార్థానికి ఉపయోగించుకోవడం మానవుని నైజం. కాని అన్ని జీవులకంటే మానవుడు అత్యుత్తమైన ప్రాణి అని తనకు తానే చెప్పుకుని సంతోషిస్తాడు.

**7.** **ప్ర :** నిజం అబద్ధం, రెండింటి సంబంధం ఎలావుంటుంది? దీనిని కొంచెం విశ్లేషించండి.

**జ. :** నిజమనేది ఎప్పుడూ ఒక్కటే ఉంటుంది. కాని అబద్ధాలు ఎన్నోఉండవచ్చు. అందుచేత వ్యక్తులు ఎక్కువ అబద్దాలు చెపుతారు. అన్ని అబద్ధాల్లో ఏ అబద్ధాన్నైనా ఎంచుకోవడం చాలా సులభం. ఒకచోట చెప్పిన అబద్ధం, మరొకచోట చెప్పవలసిన అవసరం లేదు. ఒక అబద్ధం వంద అబద్ధాలను సృష్టిస్తుంది. కాని నిజం ఒకటే. దాన్ని మార్చేందుకు వీలులేదు. చెబితే దాన్నే చెప్పాలి. చెప్పకపోతే మౌనం వహించాలి. అయితే ఇందులో ఒక విచిత్రం ఉంది. ఉండే నిజం ఒకటి. ఆ ఒక్క నిజాన్ని వెతికి పట్టుకోవాలి. లేకపోతే అది అబద్ధం అవుతుంది. అందుచేత నిజం చెప్పడం కూడా కష్టం. అలాగే వేల అబద్ధాలున్నాయి. దాంట్లో ఒక అబద్ధాన్ని వెతుక్కోవాలి. దాన్ని గుర్తుపెట్టుకోవాలి. అదే అందరికి చెప్పాలి. నిజం చెప్పడం, అబద్ధాన్ని ఎన్నుకోవడం రెండూ కష్టమే. అయితే నీతిమంతునకు నిజం చెప్పడం సులభం. అవినీతి పరునకు అబద్ధం చెప్పడం సులభం.

**8.** **ప్ర. :** సమాజంలో వ్యక్తులు మంచికి చెడ్డకు ఎలా స్పందించాలి?

**జ. :** మంచికి మంచిగా, చెడ్డకు చెడ్డగా పరిపూర్ణ అవతారమైన శ్రీకృష్ణుడ్ని అనుసరించడం సదా ఉత్తమం. చెడ్డ మితిమీరినప్పుడు, భరించలేనప్పుడు చెడుకు, చెడే విరుగుడు. సాధారణంగా మంచికి మంచి సర్వత్రా మంచిది.

**9.** **ప్ర. :** ఈ ప్రశ్న కూడా ముందు ప్రశ్నలా, గుడ్డు ముందా పిల్ల ముందా? విత్తు ముందా చెట్టు ముందా? దీన్ని ఎలా పరిష్కరించాలి?

**జ. :** అసలు ఇవి ప్రశ్నలు కావు. సాంకేతికపరంగా, తర్కపరంగా చెప్పాలంటే, గుడ్డుకు ముందు పిల్ల, పిల్లకు ముందు గుడ్డు. అది లేకపోతే ఇది లేదు. అలాగే విత్తుకు చెట్టు, చెట్టుకు విత్తు. అడిగే ప్రశ్నలో దేనికి ఏది ముందు అని అడగాలి. రెండింటిని ద్వంద్వం చేసి అడిగితే ప్రశ్నకు ఉండవలసిన సహజ లక్షణాన్ని కోల్పోతుంది. అసలు ప్రారంభంలో ఇలాంటి పరిస్థితి లేదు. కోట్ల సంవత్సరాల పరిణామక్రమంలో అనేక మార్పులు చేర్పులు చోటుచేసుకొని కొన్ని లక్షల సంవత్సరాల ముందు బ్యాక్టీరియా నుండి వృక్షాలు, జంతువులు, పక్షుల వరకు తయారైవుంటాయి. అంటే మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్ళిపోయినవి ఎన్నో జాతులు. ఇవన్నీ మార్పుద్వారా పుట్టినవే తప్ప ఈనాటి జీవులే మొదట సృష్టి ప్రారంభమైనప్పుడు కూడా ఉన్నాయనుకుని, దేనికి ఏది ముందు అని ఆలోచించడం, సరైన పద్ధతికాదు. దానికి తర్కం సహాయం చేయదు.

**10.** ప్ర : ఆలస్యం అమృతం విషం. నిదానమే ప్రధానము. ఇలాంటి రిడిల్స్‌ను ఎలా సమర్థించుకోవాలి?

**జ. :** ఇలాంటి విరుద్ధ స్వభావాలను కలిగిన విషయాలను పరిష్కరించడానికి, దానితో సంబంధం ఉన్న మరొక రెండు విరుద్ధ విషయాలను జోడిస్తే అవగాహన, దశ, దిశ ఏర్పడుతుంది. ఈ ప్రపంచం ద్వంద్వ మయం. ఉదాహరణకు పై సందిగ్ధానికి, మంచి చెడ్డ అన్న ద్వంద్వాన్ని జోడిస్తే, పై ప్రశ్నలో 'ఆలస్యం' 'తొందర', 'విషం' 'అమృతం', 'నిదానం ప్రధానం' అన్న ద్వంద్వాలు ఉన్నాయి. వీటికి 'మంచి' 'చెడ్డ' లను జోడిస్తే, మంచిని చేయాలనుకొన్నప్పుడు ఆలస్యం చేయకూడదు. త్వరత్వరగా పూర్తిచేయాలి. లేకుంటే మనసు, పరిస్థితులు, మారిపోవచ్చు లేదా అనేక అడ్డంకులు రావచ్చు. కాని చెడ్డను చేసేటప్పుడు తొందరపడితే, వ్యథ, దుఃఖం, కష్టం, నష్టం రావచ్చు. చెడ్డను మరలా వెనక్కు తీసుకోలేము. అందుకని పెద్దలు ఒకపని చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి చేయండి అని అంటారు. అలాగే ఏపని చేసేటప్పుడైనా, కీడెంచి మేలెంచమంటారు.

**11.** ప్ర. : జీవితంలో సుఖంగా ఉండాలంటే ఎలా ప్రవర్తించాలి?

**జ. :** పుట్టుక మరణం, సుఖం దుఃఖం, తృప్తి అసంతృప్తి, స్వార్థం నిస్వార్థం, ఓర్పు కోపం, నమ్రత అహంకారం లాంటి ద్వంద్వాలను ట్రేడ్ ఆఫ్ (బ్యాలెన్స్) చేయాలి. "అతి సర్వత్ర వర్జయేత్" అన్నది పెద్దల నీతి వాక్యం.

**12.** ప్ర. : జీవితంలో గొప్పతనం అంటే ఏమిటి?

**జ. :** వ్యక్తి నుదుటి మీద ముడతలు రావచ్చు గాని, మనస్సులో, హృదయంలో, రాకూడదు. మరణశయ్య మీద ఉన్నా కూడా తనయొక్క ఉత్సాహం (స్పిరిట్) బలహీన పడకూడదు. మానవునికి అతిపెద్ద సంపద ఉత్సాహం. మిగతా జీవులు తెచ్చుకోలేనిది మానవుడు ఒక్కడే తెచ్చుకోగలిగినది ఉత్సాహం.

**13.** ప్ర. : జీవితంలో విజయం సాధించడానికి ముచ్చట్టగా 4 సూక్ష్మాలు చెప్పండి?

**జ. :** జీవితం సమస్యల వలయం. దాని నుండి తప్పించుకోవాలంటే 4 సూత్రాలను పాటిస్తే అవి, మిగతా వాటికి దోహదాన్ని కల్పిస్తాయి. 1. సింప్లిసిటీ (సాదాతనం). సమస్యలను కొని తెచ్చుకోనీయదు. 2. సైలెన్స్ (మౌనం). సమస్యలను దూరం చేస్తుంది. 3. స్మైల్ (చిరునవ్వు). సమస్యలను పుట్టనీయదు. 4. సందిగ్ధ రహితం – సందిగ్ధం నుండి బయటపడ్డవాడు ప్రశాంతంగా బతుకుతాడు. లేకపోతే సంఘర్షణ.

ఇదా? అదా? వాడా? వీడా? అవునా? కాదా? అన్న సందేహంతో మానసిక యుద్ధాలకు తెరతీస్తాడు.

**14.** ప్ర : సంకల్ప బలం, విధి పూర్వజన్మకర్మ, ఫలితాల తేడా ఏమిటి?

**జ. :** జీవితంలో తనలోపాలను తాను అంగీకరించలేక ఒక దేవున్ని సృష్టించి ఆయన కారణంగా మన జీవితాలు నడుస్తున్నాయని, ఆయన తన కార్పొరేట్ ఆఫీసులో కూర్చొని, ఆయన మనం చేసే తప్పొప్పులను లెక్క రాసుకొని, ఉపకారం, అపకారం చేస్తుంటాడన్నది మిద్యావాదం. మన సంకల్పం మనచేత అనేక చర్యలు చేయిస్తుంటింది. వీటి ఫలితాలు, మరలా సంకల్పాలుగా మారుతుంటాయి. ఇవి ఒకదానినొకటి ప్రభావితం చేస్తుంటాయి. శరీరం భౌతిక శక్తిని, మనసు మానసిక శక్తిని విడుదలచేసి అనేక పనులకు ఉపాధి అవుతుంది. అలాగే ఆత్మశక్తి వాసనాబలాన్ని వాడుకుంటూ శరీరానికి, మనసుకు తోడుంటూ, ఇక ఈ శరీరం, మనసు తనను భరించలేదనుకున్నప్పుడు, పండిన పండు తొడిమనుండి విడిపడ్డట్టు వదిలేస్తుంది. అదే మృత్యువు.

దేవుడు మన ఆలోచనలకు ఊపిరిపోసి ఒక ముద్ర వేస్తాడు. మంచి సంకల్పాన్నైనా, చెడ్డ సంకల్పాన్నైనా సరేనంటాడు. ఈ సంకల్పం వీణకు తగిలించిన తీగలాంటిది. గట్టిగా బిగిస్తే తెగిపోతుంది. అలాగని గట్టిగా బిగించకపోతే శబ్దాన్ని అందించదు.

**15.** ప్ర. : సంతోషానికి దుఃఖానికి ఉపాధులు ఏమిటి?

**జ. :** దుఃఖం అంతా బయట జరిగినవాటినుంచి వచ్చినదే. కాని ఆనందం లోపలినుండి రావాలి. దానికి నీవు నీవుగా ఉంటే, ఆనందం వస్తుంది. ఏ వ్యక్తైనా తాను సుఖించడానికి అవసరమైన, ఇతరులను సంతోషంగా ఉంచేందుకు చేయవలసిన పనిచేయకపోతే, తాను ఆనందంగా ఉండేందుకు అర్హత లేదు. ఎవరైనా సుఖంగా సంతోషంగా ఉండాలంటే, నీ జీవితం ఎలా ఉండాలని కోరుకుంటావో అదే మోతాదులో ఇతరుల జీవితం కూడా ఉండాడానికి నీవంతు కృషి చేయాలి. నీ సంతోషాన్ని సంపదను ఆలోచనను ఆనందాన్ని, ఆహారాన్ని ఇతరులతో పంచుకోవాలి.

సంతోషంగా ఉండడానికి సమయం ఇప్పుడే, స్థలం ఇక్కడే. ప్రక్రియ పంచుకోవడం. విభజించుకోవడం సంతోషానికి వ్యతిరేకం. మానవుడు ప్రకృతి నుంచి చిన్న సత్యాలను తెలుసుకొంటే సంతోషంగా ఉండగలడు. ఉదా॥ చెట్టు తన పళ్ళను తాను తినదు, జంతువు తన పాలను తాను తాగదు. మేఘాలు తమ నీటిని తాము

తాగవు, పుష్పాలు తమ సువాసనను తాము అనుభవించవు. కాని మానవుడు ప్రతిదీ తనకొరకే చేసుకుంటాడు.

**16. ప్ర. :** దేవుడు అన్న విషయాన్ని సమాజం ఎలా అర్థంచేసుకోవాలి? దేవుడు ఎవరు? దేవుడు ఉన్నాడా? దేవుడు ఎక్కడ ఉంటాడు? దేవుడు ఎలా ఉంటాడు? దేవునితో మానవునికి పని ఏమిటి? దేవుడు మానవుడు అవుతాడా? మానవుడు దేవుడు అవుతాడా? దేవుడు మానవుడిని సృష్టించాడా? మానవుడు దేవుడిని సృష్టించాడా?

**జ. :** ఈ ప్రశ్నలకు అనేక రకాల సమాధానాలు చెప్పవచ్చు. ఏ సమాధానం సత్యం అని అడిగితే, దేవుడు సత్యం కాబట్టి అన్ని సమాధానాలు సత్యాలే.

**1.** దేవుడు అనడంలో డు,ము,వు,లు ప్రథమా విభక్తి. ఏకవచన ప్రత్యయం. వ్యాకరణాంశము. అంటే దేవుడు ఒక్కడని అర్థం. సునిశితంగా పరిశీలిస్తే దేవుడు సృష్టికి కర్త. దేవుడు సర్వాంతర్యామి. అయితే మానవుడు దేవుడిని గుర్తించి తన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకున్నాడు. ఉదాహరణకు, భౌతికంగా ఒక పురుషుడు ఒక స్త్రీ సంతానాన్ని కంటే వాళ్ళను తల్లిదండ్రులు అంటారు. బిడ్డలు లేకపోతే తల్లి తండ్రి అనడానికి వీలులేదు. వాళ్ళు దంపతులు మాత్రమే. మానవ సృష్టి ఉద్భవించకపోతే దేవుడు అన్న ప్రశ్న రాదు.

**2.** ఆధ్యాత్మికంగా చూస్తే దేవునికి నామం లేదు. రూపం లేదు. సర్వాంతర్యామి. "ఇందు కలడు అందులేడు". "కలడు, కలండనెడి వాడు కలడో లేడో", ఆది మధ్యాంత రహితుడు. పెంజీకటికవ్వల వెలుగుతున్నవాడు. దేవుడు సత్యం. దేవుడు జ్ఞానం. దేవుడు విశ్వవ్యాపితం, నిత్యం, అనంతం. పరమాత్మ, విశ్వప్రభువు, అనిర్విచనీయుడు, అనంతుడు, అనాధరక్షకుడు, గుణాతీతుడు, దుష్ట శిక్షకుడు, కరుణామయుడు, శిష్టరక్షకుడు, సృష్టికర్త, ధర్మస్థాపకుడు, ధర్మ నిర్వాహకుడు, ప్రేమ మయుడు, నిరహంకారుడు, 'సోహం', 'తత్వమసి', ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మోస్మి, అయమాత్మ బ్రహ్మ.

**3.** చారిత్రాత్మకంగా పరశీలిస్తే ఆదిమ మానవుడు చెట్టుతొర్రలు కొండ గుహల నుండి రాతిని పనిముట్టుగా చేసుకొన్న లగాయితు, రిమోట్ ద్వారా రొబోట్ లాంటి వస్తువుచేత పనిచేయించేంత వరకు ఎదిగాడు. వీటన్నింటికి కారణం మానవ మేధస్సు. ఈ మేధస్సు దైవాన్ని సృష్టించుకొన్నది. ప్రేమను, పగను విడదీసి దేవుని కొరకు యుద్ధాలు నిర్వహించింది.

**4.** మానసికంగా విశ్లేషిస్తే మనస్సే దేవుడిని సృష్టించింది. శబ్దాన్ని మాటగా మలిచి, మాటకు అక్షర రూపాన్ని కలిపించి, అక్షరానికి చందస్సు, వ్యాకరణాన్ని చేర్చి, అనుభూతులను, ఊహలను శాస్త్ర యుక్తంగా కట్టుదిట్టంచేసి సాహిత్యాన్ని సారస్వతంగా మలచి, దైవానికి సమర్పణ చేసింది. అవతారాలను సృష్టించింది. మానవుని ఇంద్రియాలను నియంత్రణ చేయలేని సమయాలలో, దేవుడ్ని ఆవిష్కరించడం మనస్సు చేసిన మహోన్నతమైన ప్రయోగం. భక్తిని, భయాన్ని కలిగించి, కర్మను, ధర్మాన్ని సృష్టించి, సిద్ధాంతీకరించింది. దేవుడిని విశృంఖలంగా వాడు కున్నది. నిజానికి మానవునికి మనస్సు లేకపోతే దేవుని నింపడానికి, నిలపడానికి స్థలం ఎక్కడ ఉండేది? మానవుడు లేకపోతే దేవుడు కూడా అదృశ్యం అవుతాడు.

**5.** మానవతావాదంతో పరిశీలిస్తే, దేవుడిని కొంతమంది సమాజ శ్రేయస్సుకు ఉపయోగించుకున్నారు. మరికొందరు సమాజాన్ని భయపెట్టి దోచుకునేందుకు వాడుకున్నారు. దేవుని ఆసరాగా పెత్తనం చెలాయించే వాడు దేవునిమీద విశ్వాసం ఉన్నట్టు నటించడం సహజం. ఏది ఏమైనా మానవ సమాజం అభివృద్ధికి, దేవుడు చక్కని ఆయుధం. దేవుని మీద భక్తి, భయం అన్న రెండు శక్తులు లేకుంటే మానవజాతి ఇంకా ఎంతో అధర్మంతో హీనంగా బ్రతుకు సాగించి ఉండేది కాబోలు.

**6.** హేతువాదం, గతితార్కిక భౌతిక వాదం దృష్ట్యా విశ్లేషిస్తే దేవుడిని మానవుడిలో చూచారు. కొందరు మానవసేవే మాధవసేవ అని దరిద్ర నారాయణుల్ని ఉద్ధరించడం దైవకార్యంగా భావించారు. మిగతా వాదులు మానవుడిని దేవుడిలో చూచారు.

అయితే నేటి మానవులు తమ స్వార్థం, అహంకారం, గొప్పతనం, ఉనికి, గుర్తింపు కొరకు దేవుళ్ళకు పూజలు జరిపి తమ కోర్కెలు తీర్చుకోవడంలో, కృత కృత్యులవుతున్నారు. ఒక్కొక్క దేవుడికి వందల పూలమాలలు, సహస్ర ఘటాభిషేకాలు, పంచామృత స్నానాలు, కోట్ల దీపాలు, అన్నదానాలు జరపటం ఆనవాయితీ అయిపోయింది. పాలు లేని బిడ్డలు, వంటకు చమురులేని గృహాలు ఎన్నో ఉన్నా, వీళ్ళ దృష్టికి అవి కనపడవు. దేవుడి పేరు చెప్పి అన్ని వృధాగా మట్టిలో కలిసిపోయి ఎవరికీ ఉపయోగపడకుండా జరుపుతున్న తంతును అర్థంచేసుకున్న బహుకొద్దిమంది, కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

**17.** ప్ర : పుట్టుకకు మరణానికి తేడా ఏమిటి?

**జ. :** మరణం జీవితాన్ని ప్రశ్నించిందట, నేనంటే మానవులకు ఎందుకు ఇష్టముండదు? అదే పుట్టుకను చూచి సంతోషిస్తారు కదా! అని. దానికి జీవితం

సమాధానం చెప్పింది. నేను "ఒక సుందరమైన స్వప్నాన్ని. సత్యాన్ని". పుట్టుక యాదృచ్ఛికం. పుట్టుక సూర్యోదయం లాంటిది. ఎన్నో కలలను సాకారం చేసుకో గలనని ఆశిస్తుంది. కాని మరణం సూర్యాస్తమయం లాంటిది. చీకటిలోకి జారుకుంటుంది. జననం తర్వాత కామాలు, సెమికోలన్లు, కోలన్లు, హైఫన్లు పెట్టుకుంటూ పోతాము. ఫుల్‌స్టాప్ పెట్టం. అదే మరణం ఫుల్‌స్టాప్ కాబట్టి దుఃఖం. పుట్టుక తర్వాత జీవులు తాము కష్టపడి సంపాదించిన జ్ఞానాన్ని, సంపదను అనుభవించే అవకాశం ఉంటుంది. కాని మరణం తర్వాత సంపాదించిన జ్ఞానం, సంపదనంతా ఇక్కడే వదిలేస్తుంది. కాబట్టి, మరణం అంటే భయం, కోపం, అసహ్యం.

**18.** **ప్ర :** సంకల్ప బలం ఏమిటి? మంచి సంకల్పాలను కల్పించుకొని మంచి ఫలితాలను సాధించడానికి వీలవుతుందా?

**జ. :** సంకల్ప వికల్పాలు, కార్యకారణాలకు దోహదపడి ఒక గొలుసుకట్టును సృష్టించి, ఒకదానినొకటి ప్రభావితం చేస్తుంటాయి.

సరైన సంకల్పం విత్తనం లాంటిది. దాంట్లో కనపడని మహా మర్రి వృక్షం దాక్కుని ఉంటుంది. ఒక నక్షత్రం నావికుడికి దారి చూపిస్తుంది. ఒక మంచిమాట లక్ష్యం అవుతుంది. ఒక ఓటు ప్రభుత్వాన్ని మార్చేస్తుంది. ఒక దీపం కొండంత వెలుగునిస్తుంది. ఒక్క అడుగు సుదీర్ఘ ప్రయాణానికి ప్రారంభం అవుతుంది. ఒక అక్షరం మంత్రం అవుతుంది. ఒక భావం విజ్ఞానాన్ని ఇస్తుంది. ఒక హృదయం సముద్రమంత ప్రేమనిస్తుంది. ఒక సంకల్పం, ప్రపంచపు రూపురేఖలను మార్చగలదు, చరిత్రను తిరగరాయగలదు, సంకల్పం బలం మనిషిని దేవుడిగా చేయగలదు. ఒక సంకల్పం సాధారణ జీవులచేత అసాధారణ కార్యక్రమాలను చేయించగలదు. ఒక సంకల్పం అసాధారణ వ్యక్తులను అహంకారంతో, అత్యాశతో చతికిలపడేట్టు చేస్తుంది.

**19.** **ప్ర.:** ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు దిగజారడానికి కారణాలను వివరించమని అభ్యర్థన?

**జ. :** దీనికి కారణం స్వార్థం. ఇది గాయం లాంటిది. దీన్ని తమకు తామే స్పృశించుకుంటూ సంతోషిస్తుంటారు. ఉదాహరణకు ఒక కుక్క, కాలువ పక్కన పడివున్న ఎండిపోయిన ఎముకను తీసుకొని, కొరికి నములుతూ, ఆ తునకలు తన చిగుళ్ళకు గుచ్చుకొనగా దానిలో నుండి కారుతున్న రక్తం ఎముక నుండి వచ్చిందని భ్రమపడు తుంది. వీళ్ళ ఆలోచన కూడా అంతకుమించి వేరే విధంగా ఉండదు. ఈ సమస్యకు కారణం స్వార్థం, అసూయ, పగ. దీనికి సమాధానం: ప్రేమ త్యాగం.

**20.** **ప్ర. :** హక్కుల విధుల తేడాలను ఎలా అర్ధంచేసుకోవాలి? తెలియ పరచగలరు.

**జ. :** జీవించే హక్కు విధిని నిర్వర్తించడం. అంటే ప్రతి వ్యక్తి తమ విధిని సక్రమంగా నిర్వర్తించేవారే హక్కును అనుభవించేందుకు అర్హులు. అందువలన ఏ వ్యక్తికీ హక్కులు లేవు. విధులు మాత్రమే ఉంటాయి. హక్కు ఉంటుంది. ఆ హక్కు, విధులను నిర్వర్తించడానికి మాత్రమే ఉపయోగించాలి.

భగవద్గీతలో ఎక్కడా హక్కుల ప్రస్తావన లేదు. శ్రీకృష్ణుడు అర్జునినితో నీ స్వధర్మాన్ని నీవు నిర్వర్తించు, అంటే నీ విధిని నువ్వు నిర్వర్తించు. అందుకు ప్రతిఫలం కోసం ఎదురుచూడవద్దు అన్నాడు. ప్రతిమానవుడు ఈ ప్రకృతినుండి అనేక వనరులను అరువుగా తెచ్చుకున్నాడు. ఆ అప్పును తీర్చడం అతని బాధ్యత. దాన్నే విధి అంటున్నాము. అందుకనే వాటిని ఋణాల రూపంలో తీర్చాలని ప్రాజ్ఞులు చెప్పివున్నారు. ఉదాహరణకు: పితృఋణం, దేవఋణం, ఋషిఋణం లాంటివి.

**21.** **ప్ర :** మానవుడు స్వచ్ఛమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాడా?

**జ. :** శిశువుకు తల్లిగర్భం, ఆత్మకు మనస్సుకు శరీరం జైలు. శరీరం ఇంద్రియాలకు జైలు. జీవికి క్రమశిక్షణ జైలు. నేరస్తుడిని జైల్లో వేస్తారు. కాని నిజంగా జైల్లో వేయడం శిక్షకాదు. ఎందుకనగా జైలో అన్ని వసతులు ఉంటాయి, ఒక తోడు తప్ప. ఒంటరితనం అన్ని శిక్షలకంటే భయంకరం.

మనం భయంతో మన ఇళ్ళకు తాళంవేసుకొంటాము. అదే ఖైదీని జైల్లో పెట్టి, జైలరు తాళం వేస్తాడు. తాళం వేసుకోవడం ఇద్దరికి ఒక్కటే. ఒక తాళం కష్టం, మరొక తాళం ఇష్టంగా ఉంటుంది. నిజానికి ప్రపంచం పెద్ద జైలు. బడి, ఆఫీసు, గుడి, దేవుడు, నమ్మకం, అవిశ్వాసం అన్నీ మనల్ని జైల్లో ఖైదీల్లా బందిస్తాయి.

**22.** **ప్రశ్న :** మానవులకు శాఖాహారం మంచిదా? లేక మాంసాహారం మంచిదా? తెలియజేయగలరు.

**జ. :** ప్రపంచంలో శాఖాహారులు, మాంసాహారులు అనే రెండు రకాలు ఉండరు. అది భ్రమ. శాఖాహారి ఆహారం, మాంసాహారి ఆహారం రెండూ, మాంసం రక్తము మజ్జ ఎముకలుగా తయారవుతాయి. చివరకు నీరు పాలు, కాయ పండు అన్నీ మాంసముగా తయారవుతాయి. ప్రతి జీవి తన తల్లి నుండి రక్తమాంసాలను పంచుకొని పుడుతుంది. అందుచేత పుట్టుకతో, జీవన పరిణామంతో ఏ వ్యక్తీ శాఖాహారని చెప్పుకోలేడు. కాదంటే శాకాహారము, మాంసాహారాన్ని మనం హింస అహింసలతో

జతచేసినప్పుడు, మనం జీవించేందుకు ఇతర జీవులను చంపి ఆహారంగా తీసుకోవాల్సిన అవసరం ఉందా అన్నదాంట్లో అర్థం ఉంది. నా ఇంటికి నీ ఇల్లు ఎంత దూరమో, నీ ఇంటికి నా ఇల్లు అంతే దూరం. నీవు జీవించు. నన్ను కూడా జీవించనీ. నీ ప్రాణం నీకెంతో, నా ప్రాణం నాకు అంతే. నీవు జీవించేదానికి నన్ను చంపుతావా, అని మూగజీవులకు మాట వచ్చి ఉంటే అడగవా? అందుకు నీ దగ్గర జవాబు లేదుకదా. అందుకే బుద్ధుడు అహింస పరమో ధర్మః అన్నాడు. తోటి జీవిని హింసించడం కష్టపెట్టడం తప్పన్న నీతినీ, న్యాయాన్నీ, ధర్మాన్నీ బోధించాడు. బుద్ధం శరణం గచ్ఛామి / ధర్మం శరణం గచ్ఛామి / సంఘం శరణం గచ్ఛామి అందుకే ఆయన చెప్పిన మిగతా సిద్ధాంతాలకంటే 'అహింస' బుద్ధుడిని అవతార పురుషుడుగా చేసింది.

బుద్ధుడు గతించాడో లేదో బౌద్దం అన్నిరకాల విభజనలకు, సిద్ధాంతాలకు తెరతీసింది. బౌద్ధం పేరుతో జరగవలసిన చెడ్డంతా జరిగిపోయింది. భారతదేశంలో పుట్టిన బుద్ధుడు బౌద్ధం చైనా, జపాన్, హాంకాంగ్, కొరియా, థాయ్‌లాండ్ లాంటి దేశాల్లో బుద్ధుడు దేవుడుగా, బౌద్ధం, మతంగా తయారయ్యింది. కాని అక్కడ, అహింస స్థానంలో హింస, సత్యంలో అసత్యం, సద్గుణాల్లో దుర్గుణాలు, దశవ్యసనాల రూపంలో 10 కమాండ్‌మెంట్స్‌గా పనిచేస్తున్నాయి. ఈ దేశాల్లో బుద్ధుడి విగ్రహాలు, గుడులు ఆ దేశ ప్రజల సంఖ్య కంటే ఎక్కువగా ఉంటాయి. అందుచేత మానవుడు ఒకటి అనుకొని, ఇంకోటి చెప్పి, మరొకటి చేయబోయి, వేరొకటి చేయడంతో, మంచికి చెడ్డకు కనీస పొంతన, కార్యకారణం లేకుండా పోయింది. బౌద్ధాన్ని సమర్థించేవారిలో, బుద్ధుని సిద్ధాంతం, అహింసాధర్మం పాటించేవారిలో ఎంతమంది శాఖాహారులు, అహింసావాదులు ఉన్నారనే ప్రశ్నను, ఎవరికి వారు వేసుకోవాలి".

అంటూ పూర్ణిమ తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు పేరు పేరునా కృతజ్ఞతాభి వందనములు తెలుపుకొన్నది. అందుకు కార్యకర్తలు ఊహించని రీతిలో పూర్ణిమకు అభినందనలు తెలిపి, ఆమెకు ఇష్టంలేకపోయినా సన్మానాన్ని ఘనంగా జరిపారు.

* * * * *

# 12. నిష్క్రమణ

ఒకరోజు ఉదయం 6 గంటలకు యథావిధిగా శశిధర్ నిద్రలేచాడు. పక్కనే ఉన్న పూర్ణిమ ఇంకా నిద్రలేవలేదు. సాధారణంగా తాను 5–6 గంటల మధ్య తనకంటే ముందుగానే లేస్తుంది. శశిధర్ లేవగానే, ఇద్దరూ కలిసి కాఫీ తాగడం అలవాటు. శశి కాఫీ తాగకుండా పూర్ణిమ కాఫీ తాగదు. ఓ అరగంట ఆలస్యమైనా, తాను కాచుకొని ఉంటుంది. గంటపైనే గడచింది. 8 గంటలు అయ్యింది. పూర్ణిమ లేవలేదు. శశిధర్‌కు అనుమానం వచ్చి పక్క మీద కూర్చుని, మెల్లగా తలమీద చేయి వేశాడు, జ్వరం ఏమైనా ఉందా అని చూద్దాం అని, కాని అలాంటిదేమి లేదు. పూర్ణిమ తిన్నగా కళ్ళు తెరచింది. "ఒంట్లో బాగాలేదా! ఎప్పుడూలేంది 8 గంటలు అయింది. ఇంకా లేవలేదు.

జ్వరం ఏమైనా వచ్చిందా అని చూద్దామని వచ్చాను. ఇంకొంచెంసేపు నిద్రపోతావా" అని అడిగాడు. "అప్పుడే 8 గంటలు అయ్యిందా? కాఫీ తాగావా లేదా అని పక్కమీదనుంచి లేచి తిన్నగా మంచం దిగి, ఎందుకో ఒళ్ళంతా బలహీనంగా ఓపిక లేకుండా ఉంది" అంటూ తిన్నగా బాత్‌రూమ్‌కు వెళ్ళి బ్రెష్ చేసుకొని వచ్చి కుర్చీలో కూర్చుంది. పనిపిల్ల కాఫీ తెచ్చి, టీపాయ్ మీద పెట్టింది. ఇద్దరు కాఫీ తాగారు. పూర్ణిమ రోజులా ఇష్టంగా తాగలేక సగం కప్పు వదిలేసింది. గంట 9 అయ్యింది. శశిధర్ రెడీ అయ్యాడు. పూర్ణిమకు ఓపికలేదు. అందుచేత తాను ఆఫీసుకు

రానని, ఇంట్లోనే ఉంటానని, ఎద్దైనా అవసరమైతే అంజలిని ఇంటికి రమ్మనమని చెప్పింది. ఫోన్ చేస్తే తాను ఓపిగ్గా మాట్లాడలేనని అందుచేత నేరుగా కలవమని, వీలైనంత వరకు తననే తీర్మానం చేయమని చెప్పింది. శశి సరేనన్నట్టు తలూపి "డాక్టర్‌ను ఒకసారి రమ్మని చెబుతాను" అన్నాడు. "అక్కరలేదులే. కొంచెంసేపు రెస్ట్ తీసుకుంటే అదే పోతుంది" అని అన్నది. శశిధర్ ఆఫీసుకు కదిలాడు.

ఎప్పుడూ చాలా యాక్టివ్‌గా ఉండే పూర్ణిమకు మగతగా ఉన్నది. ఉత్సాహం లేదు. అయినా స్నానంచేసి టిఫిన్ చేద్దాం అనుకుంది కాని రుచించలేదు. అందుచేత మరలా పోయి పడుకున్నది. మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది. పనివాళ్ళకు పూర్ణిమను లేపే ధైర్యం లేక, శశిధర్ ఆఫీస్‌కు ఫోన్ చేసి, భోజనానికి లేవలేదని చెప్పారు. శశిధర్ డాక్టర్‌కు ఫోన్ చేసి అంజలితో కలసి ఇంటికి వచ్చాడు. మూడు గంటలు అయ్యింది. అయినా నిద్రపోతూనే ఉన్నది పూర్ణిమ. ఇంతలో డాక్టర్ వచ్చాడు. పూర్ణిమను లేపి "ఎలావుంది అన్నాడు.

"మగతగా నిద్రవస్తున్నది" అని అన్నది. పూర్ణిమను పరీక్ష చేశాడు. ఆయనకు జ్వరం వచ్చే సూచనలు ఉన్నట్టు అనిపించినా ఖచ్చితంగా ఏమీ చెప్పలేక "పైకి ఏమీ తెలియడం లేదు. అయినా ఒకసారి జనరల్ చెకప్ చేయిస్తే మనకు క్లారిటి వస్తుంది. రేపు ఉదయం ఏమీ తినకుండా, ఎప్పుడు వీలైతే అప్పుడు వస్తే అన్ని ఏర్పాట్లు చేసిపెడతాము" అని చెప్పాడు. ఎందుకైనా మంచిదని రెండుమూడు మాత్రలు హాస్పిటల్ నుంచి పంపుతాను అని అన్నాడు."ఇంత మాత్రానికి హాస్పిటల్‌కు ఎందుకు దగ్గర్లోని మెడికల్‌షాపులో తెప్పిద్దాం" అని డ్రైవర్‌ను కేకేసి డాక్టర్ ప్రిస్క్రిప్షన్, డబ్బులు ఇచ్చి పంపించాడు శశి.

పూర్ణిమ జీవితంలో పగలు నిద్రపోవడం అనేది శశిధర్ చూడలేదు. ఏదైనా ఆదివారం, అదీ వీలైతే ఒక పదినిమిషాలు కునుకు తీస్తుంది. ఒక ప్లేట్లో అన్నం కలుపుకొని తీసుకొనివచ్చి మంచం దగ్గరే అంజలి స్పూన్‌తో పెడుతున్నది. ఏ ఐటం కలిపినా రెండు స్పూన్లకంటే ఎక్కువ తినడంలేదు.

అంజలికి, శశికి ఏమీ అర్థంకాక మాట్లాడడం లేదు. పూర్ణిమకు ఉత్సాహం లేనందున మాట్లాడే ప్రయత్నం చేయడం లేదు. అయినా, శబ్దానికంటే నిశ్శబ్దానికే శక్తి ఎక్కువ ఉంటుంది. అందులో మానవుని మేధస్సులోని నిశ్శబ్దం శబ్దాన్ని చీల్చుకుని

వస్తుంది. పూర్ణిమ వాళ్ళ పరిస్థితిని అర్థంచేసుకొని, "నాకు బాగానే ఉంది. గాబరా పడాల్సిన పనే లేదు. రెండ్రోజులు రెస్ట్ తీసుకుంటే అన్ని సర్దుకుంటాయి. ఇంతకు ఆఫీసు విషయాలు ఏంది" అని నిదానంగా మాట్లాడింది.

అంజలి "మిమ్మల్ని ఇలాడల్‌గా చూడ్డం ఇదే మొదటిసారి. అందువలన కొంచెం బాధగా భయంగా ఉంది. అక్కడ ఆఫీసులో చెప్పుకోదగిన విషయాలు ఏమీలేవు. మీకు ఓపిక వుంటే ఏదైనా మాట్లాడితే మాకున్న దిగులు మటుమాయమైపోతుంది. అయినా ప్రస్తుతం మీకు రెస్ట్ అవసరం" అని అన్నది.

పూర్ణిమ ఓపిక చేసుకొని లేచికూర్చుని, వెనుక రెండు దిండ్లు వేసుకొని ఆనుకొని కూర్చున్నది. "ఈ శరీరం ఎక్కడో ఒక్కచోట చిన్న ఇబ్బందికి లోనయితే బలహీనపడి పోతుంది. ఏదో సామెత చెప్పినట్టు ఒక చిన్న రంధ్రం చాలు పెద్ద ఓడను ముంచేందుకు. ఒక చిన్న మార్పు ఈ ప్రంప్రంచ చరిత్రను మారుస్తుంది. పాస్కల్ సైంటిస్ట్ అంటాడు, "ఒకవేళ క్లియోపాత్రా ముక్కు కొంచెం సొట్టగా ఉండిఉంటే ఈ ప్రపంచ చరిత్రే వేరేవిధంగా ఉండేది. ఎందుకంటే ఆ ముక్కు సొట్ట వలన తాను అంత అందంగా ఉండడానికి కుదిరేది కాదు. అప్పుడు సీజర్, ఆంటోని లాంటి మహాయోధులు, తనకు ఊడిగం చేసే అవసరం ఉండేది కాదు. ఆ కారణంగా సీజర్ హత్య, ఈజిప్టు రోమ్ యుద్ధాలు ఉండేవి కావు. ఆ కారణంగా ఈజిప్టు రోమన్ చరిత్రలు వేరుగా ఉండేవి అంటే ప్రస్తుతం మనం చదువుకునే ప్రపంచ చరిత్ర వేరుగా ఉండేది".

మరలా "శరీరంలో కూడా చాలా చిన్న వైరస్ శరీరాన్ని క్రుంగదీసి మింగేస్తుంది. దాని పరిణామం ఒక మైక్రోస్కోపు ద్వారా తప్ప చూడలేము. కంటికి కనబడని సూక్ష్మజీవి ఇంతపెద్ద శరీరాన్ని ముప్పతిప్పలు పెడుతుంది. మానవజీవితం కూడా అంతే. ఒక చిన్న సంఘటన భవిష్యత్తును, ఇటువైపుకో అటువైపుకో, అనగా మంచికో చెడ్డకో విసిరివేయగలదు. ఇది జీవితం. ఇది ఒక మహాసత్యం. అందుకే ఎంత పెద్దదాన్నైనా నాశనం చేయడానికి ఒక ఆటంకం చాలుకదా".

కొంచెంసేపు మాట్లాడిన పూర్ణిమకు అలసట వస్తున్నది. అయినా మాట్లాడడం, మంచి విషయాలు వేరేవాళ్ళతో ముచ్చటించడం తనకిష్టం కాబట్టి, ఇష్టం కష్టాన్ని లెక్కచేయదు. కాబట్టి మాట్లాడ గలుగుతున్నది. పైగా తాను ఉత్సాహంగా వున్నట్టు వాళ్ళకు నమ్మకం కలిగించాలి.

"అందరమూ కాఫీ తాగుదామా" అన్నది పూర్ణిమ. కొంచెంసేపట్లో చకచకా కాఫీ తయారై రావడం శశి అంజలి కాఫీ తాగారు. కాని పూర్ణిమకు కాఫీ అంటే చాలా ఇష్టం అయినా, ఉదయంలానే సగం తాగి పెట్టేసింది. శరీరం రుగ్మతతో ఉన్నప్పుడు బాగా ఇష్టమైనవి కూడా అయిష్టంగా మారుతాయి.

శశివైపు చూస్తూ "మేమిద్దరం, ఒక చిన్న విత్తనాన్ని నాటిన రోజును తలుచుకుంటే ఇంత పెద్ద సంస్థలను ఈ రీతిలో నడపడం మాకు ఒక నమ్మశక్యంగాని అద్భుతం అనిపిస్తుంది. మేము చేసిన కార్యక్రమాలు మేమే చేశామా అన్న అనుమానం మమ్ములను ఎప్పుడూ తరుముతూ ఉంటుంది. అసలు కార్యక్రమాలను మేమే చేశాము అనేదాని కంటే కార్యక్రమాలు మమ్మల్ని తరిమాయి అనడం సత్యం. జీవితం ఒక భూతద్దం. చిన్నదాన్ని పెద్దదానిగా చేస్తుంది. అదే చూడ్డానికి పనికిరాని అద్దం, పెద్దదాన్ని కూడా చూడలేకుండా చేస్తుంది. అంటే ఓడలు బండ్లు, బండ్లు ఓడలు, లేదా రాజే కింకరుడు, కింకరుడే రాజుగా మారడానికి ఎంతో కాలం పట్టదు. ఈ ప్రపంచాన్ని కదిలించేది, మార్పు తెచ్చేది కాలం. మనమంతా కాలానికి వశులం. అందుకే కనబడిన ప్రతిదీ అదృశ్యమౌతుంది 'యదృశ్యం తన్నశ్యం' అని అంటారు.

జీవితం అర్థమైతే చిన్న పెద్ద తేడా ఉండదు. అర్థంకాకుంటే చిన్నది పెద్దదౌతుంది. పెద్దది చిన్నదౌతుంది. ఈ ప్రక్రియను అర్థంచేసుకోలేకపోవడానికి, ప్రతిమనిషి మెదడులో కావలసినంత జ్ఞాన సామగ్రిని అమర్చబడి ఉండకపోవడం, అమర్చి ఉన్నా, ఉపయోగించుకోక పోవడం కారణం". పూర్ణిమ చాలా లోతైన విషయాలు చెబుతున్నప్పటికి తన ఆరోగ్యం మీద ఆదుర్దా శశిధర్ అంజలి మనసుల్లో తిష్టవేసుకున్న కారణంగా, అటు వినలేక ఇటు అడ్డుచెప్పలేక సతమతమవుతున్నారు.

* * * * *

నాలుగు నెలలు గడిచాయి. పూర్ణిమ ఇంట్లో, రోజులా వెన్నెల కురవడం లేదు. చీకట్లు ముసురుకుంటున్నాయి. పూర్ణిమకు ఆరోగ్యం క్షీణిస్తున్నది. తన పరస్థితి తనకు, మిగతా వారికి కూడా అర్థమవుతున్నది. నిజానికి పూర్ణిమకు జీవితం మీద విరక్తి కలిగింది. అని చెప్పడానికి వీలుంది, వీలులేదు. ఎందుకంటే జీవితం ఒక రొటీన్‌కు అలవాటుపడ్డం, వయసు ముదిరేకొద్దీ దాన్ని జీర్ణించుకోవడం కష్టమే.

ఎంత తాపసిక ప్రవర్తన, త్యాగనిరతి, సేవాప్రేరణ ఉన్న పూర్ణిమలాంటి వారికి కూడా విరక్తి కలగడం వింతకాదు. మనసు విషయంలో శశిధర్‌కు పూర్ణిమకు పెద్ద తేడాలేదు. కాని నిజానికి పూర్ణిమ సంకల్ప బలం, ప్రేరణ, శక్తి అందరికి వీలుకాదు.

శారీరక మార్పు అంతగా కనపడకపోయినా లోపల శక్తి క్షీణిస్తున్నది. స్వంత హాస్పిటల్ డాక్టర్లు, అందరికీ అర్థమయ్యే విషయం. కానీ ఎవరూ ఆ పరిస్థితిని ఒప్పుకునేందుకు ఇష్టపడరు. ఆ వివరాలు అర్థమయిన వాళ్ళు శశిధర్, పూర్ణిమ, తనకు చాలా ఏళ్ళుగా ఎరిగి ఉండి ప్రస్తుతం తన హాస్పిటల్లో చీఫ్‌గా ఉంటూ తనను పరిక్షిస్తున్న డాక్టర్‌కు మాత్రమే తెలుసు. ప్రస్తుతం అంజలి కూడా ఈ సమస్యలో పాలుపంచు కొంటున్నది.

పూర్ణిమకు క్యాన్సర్ వ్యాధి ముదిరిపోయింది. దేశవిదేశాల డాక్టర్లు నిర్ధారణ చేయడం జరిగింది. వ్యాధి అన్ని అంగాలకు విస్తరించి తీవ్రంగా ఉన్నందున ఎవరూ చేయగలిగింది ఏమీ లేదు. కాదంటే ఎంతకాలం అన్నది ప్రశ్న. జవాబు చెప్పలేం. ఎప్పుడైనా ఏదైనా జరగవచ్చు.

గంట 12 అయ్యింది. కొన్ని నెలలుగా ఎప్పుడైన ఒకగంట అవసరమైతే ఆఫీసుకు వెళ్ళడం, లేకపోతే ఇంట్లో పూర్ణిమ దగ్గరనే కూర్చునిఉండడం చేస్తున్నాడు శశిధర్.

పూర్ణిమ శశితో "అంజలిని అక్కడ అర్జెంటుపనులు చూచి, మిగతావి పక్కనపెట్టి భోజనానికి ఇక్కడికి వచ్చేయమని ఫోన్ చెయ్యి" అన్నది. అనుకున్నదాని కన్నా ముందుగానే అంజలి వచ్చింది. అవకాశం కోసం ఎదురుచూస్తున్న అంజలి కొన్ని విషయాలు పూర్ణిమతో చర్చించ ప్రయత్నించింది. ఒకటి రెండు ముక్తసరిగా విన్నది,

"అదంతా సహజమే నీవు శశి ఆలోచించి ఏదో ఒకటి చేయండి అన్నది. పైపెచ్చు ఏది ఎటుచేసినా కూడా, కుడి ఎడమ తేడా. వీటన్నింటిని సీరియస్‌గా తీసుకుంటే మనటైం వేస్టుఅవుతుంది దానివలన మనకు ఒరిగే ఇబ్బంది ఏమిలేదు. ఇందులో మన స్వార్థం లేదు. పైగా ప్రతిదానిలో ఒక ఉపయోగం, దాన్ని తరుముతూ మరొక నిరుపయోగం ఉండనే ఉంటుంది. మనకు, ఇతరులకు ఇబ్బంది లేకుండా ఉంటే, వయా మీడియా సిద్దాంతం అన్నివిధాలా శ్రేయస్కరం అవుతుంది" అన్నది.

అంజలి మనసులో పూర్ణిమ జ్ఞానం, ఆలోచనా విధానం తర్కం, విచక్షణా పద్ధతి, ఇతరుల కష్టనష్టాలను గురించిన అవగాహన, నిస్వార్థతకు ఆశ్చర్యం కలుగుతుంది. ఇలా ఆలోచిస్తూ ఉన్న సందర్భంలో పూర్ణిమ, “అంజలీ! నిన్ను చాలా ముఖ్యమైన విషయాన్ని చర్చించేందుకు పిలిపించాను. ఈరోజు శశి నేను నువ్వు ఈ సంస్థలకు మూలస్తంభాలు. నాపని తీరిపోయింది. అందుకు నేను చింతించడం లేదు. ఈరకంగా జీవితాన్ని గడపగల్గిన అదృష్టానికి ఆనందించాలి. నా జీవితం ఇలా ముగిసి పోవాలని ఉన్నది. పోనీ ఒకవేళ ఇంకా కొంతకాలం బ్రతకాలని అనుకున్నా, ఇంకా కొంతకాలం బ్రతికినా ఇంతకంటే బాగా చేయగలిగింది ఏమీ లేదు. కాదంటే ఉన్న వాటిని ఇంకొంచెం పెంచుతాం. నేను లేని లోటును తీర్చేందుకు ఎలాగూ శశి నీవు ఉన్నారు.

ఈ సంస్థలు ప్రతిదానికీ ఒక ప్రత్యేక ట్రస్ట్, దాని అభివృద్ధికి తోడ్పడుతూ ఉండేవిధంగా తీర్చిదిద్ద బడ్డాయి. ఏ ట్రస్ట్ కూడా భవిష్యతుల్లో ఇబ్బందుల్లో పడదు. ఇప్పుడు మన ట్రస్టు లావాదేవీలు మీద అజమాయిషీ కొరకు ఏడు మంది ఆడిటర్లు ఉన్నారు. ఏదైనా చట్టపరమైన సమస్యలను తీర్చేందుకు ముగ్గురు అడ్వకేట్‌లు ఉన్నారు. ఇవన్నీ నీకు తెలియాలని చెప్తున్నాను. శశికి ఎలాగూ తెలుసు. అయినా నీకు కూడా తెలిసిఉండడం మంచిది. కొంతమంది దాతలు ఇచ్చిన ఆస్తి వ్యవహారాల్లో ఒక 20, 30 మంది వరకు కోర్టుకు పోతామని గతంలో ప్రయత్నించారు. కాని పరిస్థితుల్ని కోర్టు గుమ్మానికి రానీయకుండా, సమర్ధవంతంగా, న్యాయంగా, చట్టబద్దంగా మనకు అన్నీ హక్కులున్నా మనం అడ్వకేట్ల కృషితో, వాళ్ళకు సంతృప్తి కలిగే విధంగా పరిష్కరించాము. రెండు రోజుల్లో వాళ్ళందర్నీ ఒకచోట చేర్చి ఈ ట్రస్ట్‌ల పేర్లను మార్పుచేస్తే బాగుంటుంది. ఏ ట్రస్ట్‌లో కూడా నా పేరు ఉండకూడదు. అవసరం అయిన చోట శశిధర్ అంజలి మాత్రమే ఉంటారు”.

ఈలోగా 1 గంట దాటిపోతుంటే భోజనం టైమయ్యిందని సిస్టర్ వచ్చి ఒక పక్కగా నిలబడింది డిస్టర్బ్ చేయకూడదని. శశిధర్ లేచి నిలబడ్డాడు. అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. శశి అంజలి వాళ్ళు ఏమి తినాలో అన్న ఆలోచన కంటే, పూర్ణిమ ఏమి తింటుందని ఆలోచిస్తున్నారు. డైటీషియన్ చెప్పిన ప్రకారం పూర్ణిమకు వడ్డించారు. భోజనాలు పూర్తయ్యాయి. పూర్ణిమ నేరుగా తన బెడ్‌రూంలోకి పోయి అరగంట సేపు విశ్రాంతి తీసుకున్నది. ఆ తర్వాత మరలా సమావేశమైనారు.

ఈ మధ్యలో ఆఫీసు విషయాలు పెండింగులో ఉన్నవి శశిధర్‌తో చెప్పింది అంజలి. శశిధర్ కూడా తనకు తోచిన విధంగా చేయమని ముక్తసరిగా చెప్పాడు. అంతలో పూర్ణిమ వచ్చి కూర్చుంది. వెనుకనే కాఫీ టీ బిస్కెట్ల ట్రేతో పనిమనిషి వచ్చింది. పూర్ణిమ తప్ప మిగతా ఇద్దరూ టీ పూర్తి చేశారు. పూర్ణిమ కాఫీ చప్పరించి వదిలివేసింది.

అంజలివైపు చూస్తూ పూర్ణిమ మరలా ప్రారంభించింది. "మన అజెండాలో మిగిలిపోయిన విషయాలు అన్నీ నోట్ చేసుకొని ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేసే బాధ్యతను సంపూర్ణంగా నీ భుజస్కంధాలమీద ఎంతో నమ్మకంతో పెడుతున్నాను, అన్న విషయం నీకు నిరంతరం గుర్తుండాలి. దానికి అంజలి సరే నన్నట్టు తలూపి, "ఎలాంటి కొరత లేకుండా నా శక్తికొలది నేను పనిచేస్తాను" అన్నది.

పూర్ణిమ "సమాజంలో ఫైన్‌ఆర్ట్స్, సంగీతం, కవిత్వం, ప్రవచనాలు చాలా ముఖ్యమైనవి. 365 రోజులు ఆడిటోరియంలో, ఏదో ఒక కార్యక్రమం జరిగేలా జాగ్రత్తలు తీసుకోండి. స్కూలు విషయంలో చాలా శ్రద్ధ వహించాలి. పిల్లలు భవిష్యత్తుకు పునాదిరాళ్ళు. ఆశ్రమాల గురించి. నాకు ఒక అభిప్రాయం ఉంది. మన రికార్డులల్లో గాని ఆశ్రమాల బోర్డుల మీదగాని అనాధలు, వికలాంగులు అన్న వెలితి పదాలు ఉండకూడదు. కేవలం వృద్ధులు లేదా శిశువుల సంరక్షణ సంస్థలు లేదా ఆలయాలు లేదా ఆశ్రమాలు అని పాజిటివ్‌గా ఉండే భాషను వాడాలి. సంక్షేమ సంరక్షణ ఆశ్రమం అనే అర్థం స్ఫురించాలి. అవి దేవాలయాలు. వీలైతే అన్నింటికి ఒక్కొక నెంబర్ ఉదాహరణకు, వృద్ధుల ఆశ్రమానికి ఎ1, ఎ2, ఎ3 అని మిగతా వాటికి బి1, సి1 అలాగా పేర్లు మారిస్తే బాగుంటుంది.

వాళ్ళ లోపాలతో వాళ్ళను ఎత్తి చూపించడం మనకు సంస్కారం అనిపించు కోదు. 'ఉమర్ ఖయ్యాం' అంటాడు. 'కుండ సొట్టబడితే అది కుమ్మరి తప్పుగాని కుండది కాదు'. అందువల్ల ఎవర్ని వేలెత్తి వాళ్ళ రుగ్మతలను, బలహీనలతలను, లోపాలను ఎత్తిచూపడం భావ్యంగా ఉండదని, నేను ఆలోచిస్తున్నాను. మీరు కూడా మిగతా పెద్దలతో యోచించి ఒక నిర్ణయానికి రండి".

"ఏ ట్రస్ట్ బోర్డ్ మీదకూడా మనపేర్లు ఉండకూడదు. ఆఫీసు రికార్డులలో తప్పదు కావున పేర్లు వాడుకోవాల్సి వస్తుంది. ఇది కొన్ని గంటలలో రోజులలో, అయ్యేపని కాదు. ఇదంతా నీకు నేనిచ్చే అజెండా. దీనికి మీటింగు రెజల్యూషన్స్

రాసి అందరిచేత సంతకాలు తీసుకోవాలి. వీలైనప్పుడు నిదానంగా తప్పులేకుండా, ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయండి. ఇదంతా మన సంస్థలను గురించిన వ్యవహారం. ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను.

ఒక మంచి రోజు చూచుకొని, నీ కిష్టమైతే, మీ తండ్రిగారితో చర్చించి, నీకవసరమైన వస్తువులను తీసుకొని ఇక్కడికి వచ్చి మాతో ఉండాలి. మిద్దెమీద నీకు రూము రెడీగా ఉంది. నీకేమైనా ఇబ్బంది అయితే సంకోచించకుండా చెప్పేయ్. నిన్ను రమ్మనడంలో ఉద్దేశ్యం, నీతోడు నాకు శశికి, చాలా అవసరం. ఏ విషయాన్ని అయినా చర్చించు కోవాలంటే, నువ్వుంటే ఇబ్బందిలేకుండా ఉంటుంది. అందుచేత నేను ఈ ఆలోచన చేస్తున్నాను. నిజానికి ఈ మాట శశితో కూడ ఇప్పటివరకు అనలేదు. పైపెచ్చు నువ్వు ఈ వాతావరణానికి వ్యక్తులకు, పనివాళ్ళకు చేరువలో ఉంటే బాగుంటుంది. నీకేమైన అభ్యంతరం ఉందా? మీవాళ్ళతో మాట్లాడవలసిన అవసరం ఉంటే మీ నాన్నగారితో నేను మాట్లాడుతాను" అని అన్నది పూర్ణిమ.

దానికి "అయ్యో ఎవ్వరితో మాట్లాడవలసిన పనిలేదు. నాన్నగారు కాదనరు. నేను స్వేచ్ఛాజీవిని. నా స్వేచ్ఛను మీకు శశిధర్ గారికి, సంస్థలకు ఏనాడో అంకితం చేశాను మేడం!" అన్నది.

"నన్ను మేడమ్ అంటే నీకు నాకు దూరం పెరుగుతుంది. అందుకని నీవు అక్కా! అని పిలువు".

"ఏనాటికైనా మీరు మాకు మేడం, కాదు, ఒక దేవత. అలా అలవాటయింది కాబట్టి మార్చుకోవడానికి ప్రయత్నిస్తాను" అన్నది అంజలి.

అంజలితో "శశి ఇంట్లోనే ఉంటాడు. నీ కారులో నువ్వు ఇంటికి వెళ్ళి అన్నీ సర్దుకొని వీలైతే ఈరోజు లేదా రేపు ఇక్కడికి మకాం మార్చు".

"అలాగే మేడమ్, సారీ! సారీ! అక్కా! నేను మీరు చెప్పినట్టు పనిపూర్తిచేసుకొని వస్తాను అని కుర్చీలోంచి లేచి పది అడుగులువేసి హాలు గడపదాటపోతుంటే, వెనుకనే అడుగులు వేసుకుంటూ వచ్చిన పూర్ణిమ "అంజలీ! నాకోసం నీవు ఒక పని చేస్తావా? లేదు ఎవరినైనా పురమాయించి, బజారులో అమ్మేది కాకుండా, చెట్టునుండి కోసిన గోరింటాకును, సంపాదించి తీసుకురావాలి. రాత్రికి దాన్ని నీచేత పెట్టించుకోవాలని

ఉంది. ఆఫీసు నుండి ఎవరినైనా ఆ పనిమీద పంపేఏర్పాటు చేయి, ఒకవేళ ఈరోజు కాకపోతే రేపైనా ఫరవాలేదు. నాకు గోరింటాకు పెట్టుకోవాలని ఉంది. చాలా ఏండ్లు అయ్యింది. మా అమ్మ నా చిన్నప్పుడు రెండు చేతులకు చక్కగా, గోరింటాకు పెట్టి, నా చేతులుచూచి ఎంతమురిసిపోయేదో! ఇప్పటికీ అది నా కళ్ళముందర తారాడు తున్నది. ఈరోజు మా అమ్మ నాకు చాలాసార్లు గుర్తుకు వచ్చింది. అందుచేత ఆ పని నీచేత చేయించుకోవాలని అనిపించింది. మరొక విషయం. నీవు వచ్చేటప్పుడు పది మూరలు మల్లెపూలు తీసుకొనిరా. మా అమ్మ ప్రతిరోజు నా తల్లో పూలు పెట్టేది" అన్నది.

అంజలికి పూర్ణిమ మనస్సు గతంలోకి ప్రయాణం చేయడం, వాళ్ళఅమ్మను గుర్తుపెట్టుకోవడం వింటుంటే ఏం మాట్లాడాలో తెలియక, "అలాగే తప్పక చేస్తాను" అని గిర్రున తన కళ్ళ నీళ్ళను చూపించకుండా ఉండాలని గబగబా కారు దగ్గరికి నడిచిపోయింది.

సాయంత్రం ఏడు గంటలయ్యింది. అప్పటి దాకా శశి, పూర్ణిమ పక్కనే కూర్చుని ఉన్నాడు. పూర్ణిమ ఆలోచనలు ఆమె ఆరోగ్యం మీద నుంచి పక్కకు తప్పించాలని, ఎప్పుడో జరిగిన విషయాలు, జ్ఞాపకాలు ప్రస్తుతం జరుగుతున్న కొన్ని వ్యవహారాలు మాట్లాడుతుంటే పూర్ణిమ సంతోషంగా వింటూ కూర్చున్నది. పూర్వం పూర్ణిమ మాట్లాడేది. ఇప్పుడు ఆ పాత్రను శశి పోషిస్తున్నాడు.

గంట 8 అయ్యింది. ఇంతలో అంజలి తనకు అత్యవసరమైన లగేజీని తీసుకొని వచ్చి పూర్ణిమకు కనబడి, అప్పటికే సిద్ధం చేసి వున్న రూములో సామాన్లు పెట్టి స్నానంచేసి తయారై వచ్చేసి "అక్కా ముందు గోరింటాకు పెట్టేస్తాను మరలా నిద్రపోయేదానికి కొంచెం టైము ఉంటుంది. మీకు నేను భోజనం కలిపి స్పూన్‌తో పెడతాను. ఈరోజు నాకు ఆ అదృష్టాన్ని కలుగచేయి" అన్నది. దానికి పూర్ణిమ "నీవు కోరుకునే ఇలాంటి అదృష్టాలు ఇక ఎన్ని వస్తాయో, అన్నింటికీ తయారుగా ఉండు" అని సరేనని తలూపింది.

అంజలి పూర్ణిమ చేతులకు గోరింటాకును పెట్టి ఆ తరువాత భోజన కార్యక్రమాన్ని పూర్తిచేసింది. మధ్యలో పూర్ణిమ అంజలి చాలావిషయాలు ముచ్చటించారు.

పూర్ణిమ "గత 22 సంవత్సరాల నుండి మా హెూటల్ నుండి వచ్చే ఆదాయంతో మా ఖర్చులు అనగా ఇంటి ఖర్చు, చివరకు కార్ల మెయింటెనెన్స్ జరుపుకుంటున్నాం. నీవు అలా కాదు. ఒక డైరెక్టరుగా నీకు పారితోషికం తీసుకునేందుకు హక్కు ఉంది. మాకు కూడా హక్కు ఉంది. మేము కూడా తీసుకుంటున్నాము. అయితే ఆ మొత్తాన్ని మరలా అవసరమున్న ట్రస్ట్‌లకు డొనేట్ చేస్తున్నాము. నిజానికి హెూటల్ ఆదాయంలో నుండి వచ్చే డబ్బులు ఖర్చులకు పోను ఇంకా మిగులుతుండేది. ఈరోజు మా అవసరాలకు మించి, కావలసినంత డబ్బు ఉన్నది. ఆరు నెలల కిందట చిన్నదిగా ప్రారంభమై చాలాపెద్దగా పెరిగిన హోటలును వేరేవాళ్ళకు అమ్మేసాము. దాంతో చాలా డబ్బులు జమ అయినాయి. ట్రస్ట్‌ల నుండి ఏనాడూ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అప్పుడప్పుడు ఆశ్రమాల మెస్స్‌ల్లో భోజనం ఎంత రుచికరంగా చేస్తున్నారు అన్న విషయాలు తెలుసుకోవడానికి రుచి చూడడం తప్ప, మరేవిధమైన అవకాశాలను దుర్వినియోగం చేసుకోలేదు. ఆ కారణంగా మన ట్రస్ట్‌లకు అంత పేరు వచ్చింది.

"ఈనాడు నాకు నా అన్నవారు ఎవరూ లేరు. అమ్మా, నాన్నా, అన్నదమ్ములు భర్త అన్నింటినీ కలిపి ఒక మూసలో పోసి నాకు వచ్చిన బహుమతి 'శశి' మాత్రమే. ఎప్పుడూ నా ఆలోచనా అంతా శశి చుట్టూ తిరుగుతుంటుంది. ఈరోజు మా అమ్మను గుర్తుచేసి ఆ లోటును తీర్చావు నువ్వు. నాకు చాలా ఆనందంగా ఉంది. ఈరోజు నిన్ను ఒకటి అడగాలనుకుంటున్నాను. అడగమంటావా?" అదే సమయంలో శశి ఫోన్లో మాట్లాడుతూ హాల్లోకి వెళ్ళిపోయాడు.

"మీరడిగితే దానికి అడ్డమేమున్నది. మీరు ఏమి అడిగినా, వినని వాళ్ళు, చేయని వాళ్ళు ఎవరు ఉంటారు? నేను ఇంతకు ముందే నా అంకితాన్ని గురించి మీకు చెప్పుకున్నాను".

అయితే విను "నీవు నాకు గోరింటాకు పెట్టావు మా అమ్మలాగా. నేను వెళ్ళిపోయిన తర్వాత నీవు శశిని కడుపులో పెట్టుకుని చూచుకుంటావని ప్రమాణం చేస్తావా?"

మాట పూర్తి కాకమునుపే అంజలి ఏడుస్తూ "నేను మీలాగా చేయలేను గాని, నా ప్రయత్నంలో అణువంత లోపం కూడా రానీయను, మీమీద, నా తల్లిదండ్రుల మీద, దైవంమీద, నేను ప్రేమించే శశిమీద ప్రమాణం చేస్తున్నాను. శశిధర్‌ను నేను

ఎంతగానో ప్రేమించానన్న విషయం మీకు ఎరుకే కదా! కాబట్టి ఎలాంటి లోటులేకుండా నా జీవిత సర్వస్వాన్ని ఆయన ఆనందం కొరకు ధారపోస్తాను". పూర్ణిమ ఒక పెద్దరిలీఫ్‌గా ఫీలైంది.

ఇంతలో శశి వచ్చాడు. అంతటితో ఆ చర్చ ఆగిపోయింది. పూర్ణిమ విశ్రాంతి తీసుకోవాలని నర్స్ వచ్చి గుర్తు చేస్తున్నది. అంజలి రూములో నుండి బయటకు వచ్చి తన రూముకు వెళ్ళిపోయింది. శశి పూర్ణిమకు దుప్పటి కప్పి, తాను కూడా తలవాల్చాడు.

అంజలికి తన జీవితంలో జరుగుతున్న మార్పులు, తన గతం, వర్తమానం, భవిష్యత్తు అంతా వింతగా ఉంది. కాల పరిస్థితులు ఇలా నెట్టుకొస్తాయని ఊహించలేదు. తెలివితేటలు, నిండుతనం, మానవత్వం, నిస్వార్థం, ఒకే వ్యక్తిలో నిబిడీకృతం ఉండడం చాలా అరుదైన విషయం. మంచి తనానికి మారుపేరు, అందానికి నిర్వచనం అయిన పూర్ణిమ లాంటి వ్యక్తికి, ఇలాంటి అనారోగ్యం రావడం కర్మసిద్ధాంతం అనుకోవాలా లేక ప్రకృతి మంచివాళ్ళ మీద అసూయతో పగబడుతుందనుకోవాల. ఈ ఆలోచనలతో మగత నిద్రతో రాత్రి గడిపిన అంజలిని సూర్యుడు యథాప్రకారం తట్టి లేపాడు. అంజలి లేచి స్నానంచేసి డ్రస్‌చేసుకొని రెడీ అయ్యి వచ్చి కుర్చీలో కూర్చుని పేపర్ తిరగేస్తున్నది. పనివాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

శశిధర్ లేచి ఫ్రెష్ అప్ అయి కూర్చున్నాడు. అంజలి, "కాఫీ తాగుతారా అని అడిగింది". ఇంతలో పనిమనిషి రెండు కప్పుల కాఫీ తెచ్చి శశికి, అంజలికి, ఇచ్చింది. కాఫీ తాగి శశి "నేను రెడీ అవుతాను". పూర్ణిమ లేచే లోపల తను రెడీ అయినా, పూర్ణిమ ఎప్పుడు లేస్తుందా అని కాచుకొని కూర్చున్నాడు. 10 గంటల ప్రాంతంలో పూర్ణిమ లేచింది.

శశి "నిద్రపట్టిందా! నొప్పులు ఇబ్బంది పెట్టాయా?" అని విచారించి అక్కడకే బ్రెష్ తెప్పించి ముఖం కడిగి, కాఫీ తెప్పించాడు. పూర్ణిమ ఒక అరకప్పు తాగి ఇక చాలు అని పక్కన పెట్టేసింది. అంజలిని బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసుకొని ఆఫీసుకు పొమ్మని చెప్పాడు శశి. అంజలి పూర్ణిమ వద్దకు వెళ్ళి ఆఫీసుకు వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళింది. కొంచెసేపు తర్వాత పూర్ణిమ శశి బ్రేక్‌ఫాస్ట్ ముగించుకొని పక్కపక్కనే కూర్చున్నారు.

ఏదో అవసరం ఉంటే తప్ప పూర్ణిమను వదలి ఆఫీసుకు పోవడం శశికి ఇష్టంలేదు. ఎప్పుడూ పూర్ణిమ ప్రక్కనే కూర్చుని ప్రతిక్షణం తనకు ఏంకావాలో గమనిస్తున్నాడు. అర్జంట్ అయితే తప్ప అంజలి కూడా, ఫోన్‌చేసి మాట్లాడదు, రమ్మనదు. తనకు శశి మనసు తెలుసు కాబట్టి సందర్భానుసారంగా నడుచుకుంటున్నది అంజలి. రోజులు గడుస్తున్నాయి. నిజానికి ఒక ముక్కలో చెప్పాలంటే, శశి లోలోపలే బాగా కృంగిపోయాడు. పూర్ణిమ శశి దిగులుపడతాడని, పైపెచ్చు జీవితం మీద ఒక అవగాహన కలిగిన మహోన్నత వ్యక్తిత్వమున్న స్త్రీ కాబట్టి, నిబ్బరంగా నిండుదనంతో, లోపల బాధను బయటకు తెలియనీయకుండా, శశి దిగులుపడకుండా ఉండేందుకు, మాటలతో కాలం గడుపుతున్నది.

ప్రతిరోజు 11 గంటలకు డాక్టరు వచ్చి పూర్ణిమను చూసి మాడ్లాడి పోతుంటాడు. ఆరోజు డాక్టరు వచ్చి పూర్ణిమను చూసి ఇక మీదట ఇంట్లో వద్దని, పూర్ణిమ వాళ్ళ మూన్ రే హాస్పెటల్లో ఆరవ ఫ్లోర్ మొత్తం ఖాళీ చేసి అన్ని ఏర్పాట్లు చేసున్నామని, అందుచేత అక్కడికి షిఫ్ట్ అయితే ట్రీట్‌మెంట్‌కు వసతిగా ఉంటుందని, మనసుకు ప్రశాంతత ఏర్పడుతుందని పూర్ణిమను అభ్యర్థించాడు. 12 గంటలకే అంజలి ఇంటికి వచ్చేసింది. పూర్ణిమ ఒక అరగ్లాస్ జ్యూస్ తాగి ప్రశాంతంగా కూర్చుని ఉంది. కొద్దిసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

పూర్ణిమ అందుకొని “చర్చించవలసిన విషయాలు నిన్న పూర్తిచేయలేక పోయినాము అంటూ, మీరిద్దరూ ఇక నా గురించి ఎక్కువగా ఆలోచించవద్దు. ఇది సహజం. ఇది ప్రకృతి. ఏదైనా ఒక వ్యక్తి, భావమూ, పదార్థం కదిలిపోతూ పరిణితి చెందిన వెంటనే మరలా వెనుకకు మారుతుంది. అదే మార్పు. ముందుకైనా మార్పే, వెనుకకైనా మార్పే. మార్పే విశ్వ రహస్యం.

ట్రస్ట్‌ల ఆస్తులు, వ్యవహారాల ఫైల్సును, తమ స్వంత ఆస్తుల ఫైల్స్ నుండి సెపరేట్ చేసి ఇంటికి చేర్చండి.

మనకు మొత్తం 772 ఎకరాల తోట ఉంది. దాన్లో 25 ఎకరాలు, గెస్ట్‌హౌస్‌తో సహా శశి పేరుమీద ఉంది. అది మన స్వంతం. వచ్చిపోయేదానికి వసతిగా ఉంటుందని దాన్ని రోడ్డు పక్కనే ఉంచుకున్నాం. మిగతాది అంతా ట్రస్ట్‌ల పేరుమీద ఉంది.

ఒకరోజు ఆడిటర్లతో మీటింగు పెట్టుకొంటే తప్ప మీకు క్లారిటీ రాదు. మిగతా భూములు రెండు చెరువులు స్కూలు, కాలేజీ సపరేట్ ట్రస్ట్‌ల పేరుతో ఉండి మిగతా ట్రస్ట్‌లు దీనిద్వారా సపోర్టు పొందేలా ఏర్పాటుచేసుకొని ఉన్నాము. ట్రస్ట్ డీడ్‌లను చాలా బందోబస్తుగా తయారుచేసి ఉన్నాము. మనం లేకపోయినా అవి అలా జరిగి పోవటానికి ఏ సమస్య రాకుండా ఉండేట్లు చేసి ఉంచాం.

మిగతా కొన్ని విషయాలు మీతో చర్చించాల్సిన అవసరం ఉంది. రేపు 11 గంటలకు అన్ని పనులు పూర్తిచేసుకొని నీవు, శశిధర్ ఉంటే కొన్ని ముఖ్యమైన విషయాలు చర్చించుకుందాం".

మరుసటి దినం ఉదయం 11 గంటలకు డాక్టరు వచ్చి వెళ్ళిన వెంటనే అంజలిని శశిని ఆఫీసుకు పోవద్దని అనేక విషయాలు మాట్లాడాలని చెప్పింది పూర్ణిమ. "మీకు నాకు తెలుసు. నా మజిలి దగ్గిరలోనే ఉందని. పక్క స్టేషన్‌లో నేను దిగేస్తాను. కాలం లేదా ప్రకృతి తనపని తాను చేసుకొనిపోతున్నది. అందుచేత నేను ఊహించని దిశలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇందులో ఆనందమైన విషయం శశి నాకు ఆసరాగా ఉండడం, నీవు శశికి ఆసరా కావడం సంతోషాన్ని ఇస్తున్నది.

ఇప్పుడు నాకున్న పెద్ద సమస్య, నా ఆరోగ్యం కంటే శశి భవిష్యత్తు నన్ను అమితంగా వేధిస్తున్నది. అయితే నాకున్న ఆశాకిరణం నీవే అంజలి. నీవు శశిని కంటికి రెప్పలా కాచుకుంటావన్న నమ్మకం నాకు కలిగింది. హాస్పిటల్లో 6వ ఫ్లోర్ రెడీ చేశారట. రేపు అందరం అక్కడికి చేరుతాము. ఇదంతా తెల్లవారక ముందే జరిగిపోవాలి".

మరలా "బహుశా ఈ ఇంటిని ఇచ్చిన మహాత్ముడు ఎలా వదిలివెళ్ళాడో, అలాగే నేను వెళ్ళిపోతున్నాను. ఇదంతా ఒక చక్రభ్రమణం. ఆ మహాత్ముడిని నేను అక్కడ కలుసుకొని నా కృతజ్ఞతలు తెలుపుకుంటాను."

అంజలి "అలా మాట్లాడవద్దు అక్కా! ఇది విని భరించే మానసిక స్థైర్యం మాకు లేదు. మీరు అన్నిటికి అతీతులు. కాబట్టి మీరేదైనా మాట్లాడగలరు. మీరేదైనా ఎదుర్కోగలరు. మీ మొండిధైర్యం మమ్మల్ని బలహీనులను చేస్తున్నది" అన్నది.

శశిధర్ నోరు మెదపలేదు. మొఖంలో ఎలాంటి కదలికలులేవు. ప్రత్యామ్నాయంగా కళ్ళలో నీటిసుడులు తిరుగుతున్నాయి. అక్కడ్నుంచి లేచిపోయి అందరికీ కాఫీ తెమ్మని

చెప్పి కళ్ళు తుడుచుకుని లోపలికి వచ్చాడు. పూర్ణిమ పరిస్థితిని అర్థం చేసుకొంది. రేపటి ప్రోగ్రాముకు డాక్టరుతో మాట్లాడి మానిటర్ చేయమని అంజలితో అన్నది పూర్ణిమ.

"నిన్నటి చర్చలో మిగిలిన విషయాలు ఏమంటే –

పవిత్రమైన ప్రవర్తన కలిగివుండేవాళ్ళే మన ట్రస్ట్‌ల్లో ఉండాలి.

మన వ్యవస్థలో తాగుడు అలవాటున్న వారికి స్థానం లేదు.

ప్రతి ట్రస్టుల్లో ముగ్గురు లేక ఐదుగురుకి మించి మెంబర్లు ఉండకూడదు. ఎక్కువమంది ఉంటే విభజించి పాలించే గొడవలు ఎదుర్కోవలసి వస్తుంది" అన్నది.

"నేను గతంలో చాలామందికి నచ్చచెప్పాను. ఎవరైనా కొత్త దేవాలయాలు కట్టదలచుకుంటే మనము ఎలాంటి చేయూతను ఇవ్వలేమని. ఏదైనా పాత గుడిని గోపురాన్ని పునరుద్ధరించదలచుకుంటే మనవంతు ధన సహాయాన్ని ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. ఇప్పటికే మనం వంద దేవాలయాలకు పైన్నే ధనాన్ని ఇచ్చివున్నాము".

"అన్నిటికంటే మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసినది, ఎవరైనా చనిపోతే వాళ్ళ వాళ్ళ ఆచార వ్యవహారాలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలను జరిపించాలి. వాళ్ళ బిడ్డలకు తెలియపరచాలి. వాళ్ళ ఇష్టప్రకారం కార్యక్రమాలు చేయాలి. పుట్టుక కంటే మానవునికి మరణం చాలా గొప్పది. కాబట్టి బ్రతికున్న వ్యక్తులమీద చూపించిన శ్రద్ద వాళ్ళ మరణంలో కూడా చూపించాలి. దీని విషయంలో ఎలాంటి అశ్రద్ధ పనికిరాదు.

శశి పూర్ణిమవైపు తిరిగి "ఇవన్నీ విని ఆలోచించే పరిస్థితుల్లో మేమున్నామా?" పూర్ణిమ!

"అదేంటి శశి! మనమిద్దరమూ రాగ ద్వేషాలకూ, అహంకార మమకారాలకు అతీతులమే కదా! నిజం నిప్పులాంటిది. దాన్ని మర్చిపోతే మనల్ని మనం మోసం చేసుకున్నవాళ్ళమవుతాం. ప్రస్తుతం ఆనందంగా వుండాలంటే నిజాన్ని నిప్పులా చేత్తో పట్టుకోవాలి. ఎవరో వేదాంతి అన్నట్టు వెలుగు కావాలంటే నిప్పు పట్టుకోవాలి. అంతకు మించి మార్గం లేదు.

ప్రస్తుత పరిస్థితి తెలిసి దాన్ని ఎదుర్కొనడానికి ధైర్యాన్ని పోగొట్టుకుంటే, మిగిలేది ఏమి ఉండదు. నాడైనా నేడైనా నీకు కావల్సింది నేను. నాక్కావల్సింది నీవు. నేను

అది అందిపుచ్చుకొన్నాను కాని నిలుపుకోలేకపోతున్నాను. నేను నీకు అందనంత దూరం వెళ్ళిపోతాను. ఇది సత్యం శివం సుందరం.

కీట్స్ సత్యాన్ని సుందరాన్ని, 'ట్రూత్ ఈజ్ బ్యూటీ', 'బ్యూటీ ఈజ్ ట్రూత్' అని తన "ఓడ్ ఆన్ ఎ గ్రీషియన్ అర్న్" లో అన్నాడు. పాశ్చాత్యులకు 'సత్యం' 'సుందరం' మాత్రమే తెలుసు. మనకు 'శివం' కూడా ఉంది. ప్రస్తుతం మనవద్ద ఆశకు నిరాశకు స్థానం లేదు.

మనకు కర్తవ్యం ఉంది. కర్తవ్యం ఒక డిలైట్, అందం ఆనందం. మనమిద్దరం కూడా అదే. ఇదంతా ఎందుకు మాట్లాడుతున్నానంటే నీ మనస్సును నీవు ఎలా మలచుకోవాలో తెలియజెప్పాలని. నా మనస్సు, రాతికి నవనీతానికి తేడా లేని స్థితికి చేరుకుంది".

"అంజలీ! నీవు కూడా ఇదంతా అర్థంచేసుకోవాలి! మనం ఈ ట్రస్ట్‌లకు, కేవలం ట్రస్టీలము, కాపలాదారులము, అర్చకులము మాత్రమే. దీన్ని ప్రఖ్యాత కంపెనీలను నడిపినట్లు ప్రత్యేకంగా నడపాలి. ఇప్పుడు నిన్ను ఎంచుకొన్నది కూడా అందుకే. ఇది ఇలాగే సాగిపోవాలి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఎవరికి ఎరుక ప్రస్తుతం మన ఆలోచనలతో అక్రమాన్ని సక్రమంగా మలచడం మన బాధ్యత, కర్తవ్యం. దీంట్లో మన పెట్టుబడి కంటే, ఇతరుల శ్రమ, దాతల దాతృత్వం, సహృదయుల సహకారం ఎన్నో ఉన్నాయి. మనం నిమిత్తమాత్రులం. ఎక్కడో ఉత్పత్తి అయిన కరెంటు కాంతి నిచ్చే బల్బు వెలగడానికి వాడే రాగి తీగలాంటి వాళ్ళము మనం. కాకుంటే మన పూనిక, ఇతరులకు మనం ఇచ్చిన ప్రేరణ, ఎనలేని నమ్మకాన్ని ప్రేమను కలిగించాయి. నిజానికి చాలమంది వాళ్ళ సర్వస్వాన్ని, కారణమేదైనా, ధారపోశారు. దాంట్లో నువ్వు కూడా ఉన్నావన్న విషయాన్ని మర్చిపోవద్దు" అని అంజలి వైపు చూచింది.

"ఎంతోమంది ప్రేమను దయను మన ట్రస్ట్‌ల వైపుకు మళ్ళించారు. వాళ్ళకు మనం కృతజ్ఞతలు చెప్పగలిగిన స్థితిలో లేము. అందులో వాళ్ళు పొందిన ఆనందం, అపరిమితమైనది. మేము కావాలనుకుంటే ట్రస్ట్ నిధుల ద్వారా కార్లు బంగళాలు అనేక లగ్జరీలు అనుభవించి వుండవచ్చు. అసలు మా స్వార్జితం ట్రస్టులోకి పోయింది కాని, అటునుండి ఇటువైపు ఒక పైసా కూడా రాలేదు. కాని మా శ్రమతో సంపాదించిన

దాన్ని పొదుపు చేసుకొని జీవితాన్ని గడిపాం. మా ఇద్దరి కార్లు మా డబ్బుతో కొన్నవి. మా జీవితాన్ని, మమ్మల్ని నమ్ముకొన్న వాళ్ళ జీవితాలను పోషించడానికి మా దగ్గర చాలినంత ఆస్తులు ఉన్నాయి. సారీ మా కాదు మన అంటే ప్రస్తుతం మన ముగ్గురం అంతకు ముందు ఇద్దరమే. మరల త్వరలో ఇద్దరు అవుతారు" అని ముగించింది.

## అంతిమయాత్ర

మూన్ రే హాస్పిటల్లో ఆరో ఫ్లోర్లో పెద్దహాలు. అన్ని వైద్య సంబంధమైన వసతులతో, ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడింది. మిగతా రూముల్లో, డాక్టరు నర్సులు ఎక్విప్‌మెంట్ అమర్చారు. ఆ అంతస్తులో ఇతర పేషంట్లు ఎవ్వరూ లేరు. ఢిల్లీ, బొంబాయి ఇతర దేశాల్నించి వచ్చిన గెస్ట్ డాక్టర్లకు కూడా వసతి అక్కడే అరేంజ్ చేశారు. పూర్ణిమకు చేయగలిగిన వైద్యం చేయబడుతున్నది.

నెలరోజులు దాటాయి. పూర్ణిమకు తన నిష్క్రమణతో రెండు బాధలు తీరుతాయి అన్నది అంజలికి తెలీదు. తన శరీరం పెట్టే మరణయాతన ఒకవైపు వుంటే, మరొకవైపు రాత్రింబవళ్ళు తన మంచానికి తల ఆనించి లేదా పక్కనే పడుకొని నిదురను మర్చిపోయి తనవైపే చూస్తూ ఉండే శశిధర్ బాధను పూర్ణిమ భరించలేకపోతున్నదన్నది, అనుభవించే తనకు తప్ప, ఎవరికీ పూర్తిగా అర్థంకాదు. ఈ బాధను ఇలా భరించే దానికంటే దీనికొక పరిష్కార మార్గాన్ని వెతకాలనే నిర్ణయానికి వచ్చింది పూర్ణిమ. పూర్ణిమ శశి వేరుకాదు. శశి బాధ పూర్ణిమ బాధ. పూర్ణిమ బాధ శశి బాధ. అందుచేత ప్రస్తుతం తన బ్రతుకు కంటే, అనగా తాను ఇంకా బ్రతకాలనే ఆశ కంటే, హాయినిచ్చేది శశి బాధను చూడకుండా ఉండే స్థితి. అందుకే పూర్ణిమ శశితో "శశీ! ఇంక నన్ను పంపించేయవా? ఈ స్థితి నన్ను ప్రతిక్షణం చంపుతూ, నరకయాతన పెడుతున్నది" అని శశి కళ్ళలోకి చూచింది.

శశి పూర్ణిమ కళ్ళలోకి చూచాడు. అవి తాను ఇన్నేళ్ళు చూచిన కళ్లు కాదు, పూర్వం తాను చూచిన చూపు కాదు. గతంలో తాను ఎన్నడూ అంత దీనంగా చూడలేదు. తన కళ్ళు విప్పారిన పద్మాల్లాంటివి. తన చూపు చంద్రోదయం. అది ఆకర్షణ. అది వెలుగు. వాటి ప్రభావం నుండి ఎవరూ తప్పించుకోలేరు. కాని ఇప్పుడు ఇలా దీనంగా, కాంతి విహీనంగా, తానెప్పుడూ చూడని చూపును చూస్తున్నాడు. ఒక్క క్షణం ఆలోచించాడు. మతిపోతున్నది. పెనువేదన తన మనసును చుట్టేసింది.

ఒక పెనుభూతం ఆవహించింది. తాను గుడ్డివాడు, పిచ్చివాడు అయ్యాడు. ఇంద్రియాలు పనిచేయడం లేదు. తన రెండు చేతులు పూర్ణిమ ముఖాన్ని చుట్టేసాయి. చేతులు అలానే ఉన్నాయి. పూర్ణిమ శరీరంలో చలనం ఆగిపోయింది. రెండు చేతులు చలనం లేని ఆ శరీరాన్ని కౌగలించుకున్నాయి. శబ్దంలేని ఏడుపు. కన్నీళ్ళు రాని ఏడుపు. నీళ్ళు రాకుండే ఏడ్చే కళ్ళు. మొద్దుబారిన శరీరం. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు.

యథాప్రకారం మధ్య మధ్యలో మూడు గంటలకొకసారి వచ్చి పరిస్థితిని గమనించి అవసరాలను తీర్చే అంజలి, పక్క రూము నుండి వచ్చి చూస్తే, పరిస్థితి విషమించినట్టు అర్థమయ్యింది. గబగబా శశిధర్‌ను బలవంతంగా ఇవతలకు లాగింది. శశిలో ప్రాణం వుంది. కాని చలనం లేదు. మొద్దుబారిన శరీరాన్ని తిన్నగా జరిపి పక్క బెడ్‌లో పడుకోబెట్టింది. పూర్ణిమ లేదని అర్థమయ్యింది. వెంటనే వేరే రూములో ఉన్న డాక్టర్ కోసం పరుగెత్తింది. డాక్టర్ వచ్చి చూశాడు. విషయాన్ని తీర్మానం చేశాడు. శశిధర్‌ను చూచాడు. అతని పరిస్థితి కూడా బాగాలేదు. వెంటనే నర్స్‌ను పిలిచి రెండు మూడు ఇంజక్షన్లు ఇచ్చి సెలైన్ పెట్టాడు. రెండు గంటలకు శశి తేరుకున్నాడు. కళ్ళు తెరిచాడు.

తెల్లవారు ఝాము 3 గంటలయ్యింది. పూర్ణిమ గతంలో తన విల్లులో చెప్పిన విధంగా ఉదయం 5 గంటల్లోగా వాళ్ళ తోటలో అంతా పూర్తయ్యింది. శశిధర్‌లో ఎలాంటి బాధ వేదన లేదు. ఒక జీవచ్ఛవంలా, పిల్లవాడిలా చెప్పింది చెప్పినట్టు చేస్తున్నాడు. సూర్యోదయంతో ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు. శశిని అంజలి గెస్ట్‌హౌస్‌లోకి తీసుకెళ్ళి స్నానం చేయించింది. కాఫీ తయారుచేయించి తాగించింది. కావాలనీ, వద్దనీ ఏమి అనలేదు శశి.

"ఎలా వుంది శశీ!" అని అడిగింది అంజలి. ఒకసారి అంజలి ముఖంలోకి చూచాడు. శశి కళ్ళు రెండు గాజు గోలీల్లా ఉన్నాయి. నోట మాటలేదు. ఉన్నట్టుండి ఏడ్చాడు. ఏడుపు పెద్దదయింది. అంజలిని కౌగిలించుకున్నాడు. అంజలి తిన్నగా పట్టుకొని దిండు సర్ది పడుకోబెట్టింది. ఏడుపు మూలుగయ్యింది. చిన్నపిల్లలకు మాదిరి జోకొట్టడం ఆరంభించింది. శశి కళ్ళు మూతపడ్డాయి. కొన్ని నెలలుగా లేని నిదురంతా ఒక్కసారి వచ్చిందన్నట్టు నిద్రలోకి జారాడు. అంజలి కూడా పడుకొని నిద్రలోకి జారింది. మధ్యాహ్నం గంట 12 అయ్యింది. పనివాళ్ళు దిగాలుగా కూర్చుని ఉన్నారు.

అంజలికి మెలకువ వచ్చింది. శశి ఇంకా నిదురపోతున్నాడు. పుట్టుకకు చావుకు మధ్య నిద్ర, చావు నమూనా. ఎంతసేపు నిద్రపోతే నిద్రపోనీ అనుకొని వరండాలోకి

వచ్చి కుర్చీలో కూర్చుంది అంజలి. నలుగురు పనివాళ్ళు వచ్చి కొంచెం దూరంలో నిలబడి ఏడుస్తున్నారు. తనకు కూడా ఏడుపు వస్తున్నది. ఎవరిని ఎవరు సముదాయించాలో ఎవరికీ తెలీయడంలేదు. కొంచెంసేపు గడిచింది. ఏడుపు అందరి దగ్గర విశ్రాంతి తీసుకున్నది. ఒక్కొక్కరు అక్కడ నుంచి నిష్క్రమించారు.

కొంచెంసేపు తర్వాత  పనిమనిషి రజని వచ్చి, "కాఫీ తాగుతారా" అని అడిగింది అంజలిని. తెమ్మన్నట్లు తలూపింది. కొంచెం సేపట్లో రజనీ తెచ్చిన కాఫీ తాగింది అంజలి. అంతా ఒక సినిమా రీలులా తనముందు కనబడుతున్నది. పూర్ణిమ శశి మధ్య ఏం జరిగింది అన్నది పెద్ద ప్రశ్నగా వేధిస్తున్నది. మరలా లోపలికి వెళ్ళి చూసింది. శశి నిదుర పోతున్నాడు. ఇవతలికి వచ్చి పనివాళ్ళతో ఇల్లంతా కడిగి భోజనాలు తయారుచేయమన్నది. మధ్యాహ్నం 2 గంటలు అయింది. శశి లేచాడు. అంజలి బ్రతిమలాడి రెండు ముద్దలు తినిపించింది.

* * * * *

# 13. పూర్ణిమ జ్ఞాపకాలు

తెలతెలవారుతున్నది. 5 గంటలు అయ్యింది. అంజలికి మెలకువ వచ్చి రోజులా ప్రక్కన వుండే శశి కోసం చూసింది. మంచం ఖాళీగా ఉంది. హాల్లోకి వచ్చింది. అక్కడా అలికిడి లేదు. "గంగా! గంగా!" అని కేక వేసింది. వంటింట్లో నుండి గంగ పరుగెత్తుకుంటూ వచ్చి, "ఏమ్మా పిలిచారా" అని అడిగింది. "సార్ ఎక్కడ?" అని అడిగింది అంజలి. "బయట లాన్‌లో ఉయ్యాల మీద కూర్చుని వున్నారు". అప్పటికి పోయిన ఊపిరి వచ్చింది అంజలికి. గబగబా హాల్లో నుండి తలుపుతోసుకొని లాన్‌వైపుకు ఉరికింది.

శశిధర్ ఉయ్యాలమీద కూర్చొని, సూర్యోదయం అవుతుంటే చూస్తున్నాడు. అంజలి దగ్గరికి వచ్చి "తొందరగా మెలకువ వచ్చిందా? నన్ను లేపితే నేను వచ్చేదాన్ని కదా? వంటరిగా ఎందుకు వచ్చావు?" అని భుజం మీద చేయి వేసి పక్కన కూర్చున్నది. శశి ఏమి మాట్లడలేదు. శశికి ఆ ఊయల అంటే చాలా ఇష్టం. దాని మీద శశి, పూర్ణిమ కూర్చుని చాలా గంటలు గడిపేవారు. ఎన్నో విషయాలు ఏకాంతంగా చర్చించుకునేవారు.

"కలొచ్చింది. పూర్ణిమ నేను ఈ ఊయల మీద మాట్లాడుతున్నట్టు. చాలాసేపు నడిచింది కల. మెలకువ వచ్చింది. అందుకని ఇటు వచ్చి కూర్చున్నాను. నీ నిద్దుర చెడగొట్టడం ఎందుకని లేపలేదు" అన్నాడు.

"బ్రష్ చేసుకుంటావా? కాఫీ తాగుదామా" అని అడిగింది.

జవాబు లేదు. దగ్గరగా జరిగి భుజంమీద చేయివేసి,

"అక్క కలలో ఏమంది అని అడిగింది",

"అంతా గుర్తు లేదు. హిమాలయాల్లాంటి కొండలు, ఏదో రెస్టారెంట్, ఇద్దరం కూర్చుని మాట్లాడుకుంటున్నాం. ఇంతలో మేఘాలు కమ్ముకోవడం వర్షం రావడం, ఒకటే చలి. గబగబా లేచి తినేది వదలిపెట్టి రూములోకి పరిగెత్తాము. తోటలు, చెట్లు, కార్లో పోవడం, ఎవరో మాతో కూడా ఉన్నారు. నాకు గుర్తులేదు. నేను వరాండాలో వెళుతూ జారాను. నన్ను పట్టుకుందామని పూర్ణిమ ముందుకు వంగి నా చెయ్యి పట్టుకుంది. ఇంతలో మెలకువ వచ్చింది. అంటే ఇంకా నా చెయ్యి పట్టుకొని వుందని అర్థం కదా, అంజలి? ఇంకొంచెం సేపు కల ఉంటే ఎంత బాగుండేదో".

"అక్క ఎక్కడికి పోయింది? మన మధ్యే ఉన్నది కదా! అక్క మరల వస్తుంది కదా" అని పనివాళ్ళతో బకెట్‌తో వేడినీళ్ళు ట్రే, పేస్ట్, బ్రష్ తెమ్మని పురమాయించింది. అన్నీ సిద్ధం చేయబడ్డాయి. బ్రష్‌కు పేస్ట్‌చేర్చి నురుగు పైనబడకుండా ఒక టవల్ కప్పి బ్రష్ చేతికి అందించింది. బ్రష్ చేసుకున్న శశికి కాఫీ కప్పు అందించింది. తాను కప్పు తీసుకొని ఇద్దరూ కాఫీ తాగడం పూర్తిచేశారు. అంజలి శశికి దగ్గరగా జరిగి ఉయ్యాలమీద తిన్నగా ఊగుతూ భుజంమీద చెయ్యివేసి

"ఇంకా ఏం చెప్పింది అక్క. గుర్తుందా" అని అడిగింది.

శశి "ఏదో మాట్లాడింది, నాకు గుర్తులేదు. నాకు నేపాల్లో కొండలు, లోయలు చూస్తున్నట్టు అనిపించింది, ఈలోగా నయాగరా జలపాతం దగ్గర ఉన్నాం. ఈ మధ్యలో ఏం జరిగిందో తెలీదు. మర్చిపోయాను. లేచినప్పుడు బాగా గుర్తు ఉండింది. మరలా మర్చిపోయాను" అన్నాడు.

"రంగడు రోజూ వచ్చిపోతున్నాడు. గడ్డం ఎలా పెరిగిందో చూడు. అక్క వుంటే ఒక్కరోజు గడ్డం చేసుకోకపోయినా వొప్పుకునేది కాదు కదా! ఇలా గడ్డం పెంచుకుంటే ఏమైనా అనుకోదా" అన్నది. శశి ఏం మాట్లాడలేదు.

ఇదే అదను అనుకొని అన్ని అరేంజ్‌మెట్లు చేసి, శశికి హేర్ డ్రస్సింగ్, గడ్డం గీయించడం కార్యక్రమాలు అయ్యాక స్నానం చేయించి ట్రిమ్‌గా తయారు చేయించింది అంజలి. శశి చిన్నపిల్లాడిలా బార్బర్ చెప్పినట్టు విని హేయిర్ కట్టింగ్ పూర్తి చేసుకొని

స్నానం చేసుకున్నాడు. అంజలి తనకు నచ్చిన డ్రస్సు సెలెక్ట్‌చేసి ముస్తాబుచేసి అద్దం దగ్గరకి తీసుకెళ్ళి "చూడు ఎంత చక్కగా ఉన్నావో?" అన్నది.

శశి కూడా "బాగుంది, బాగుంది, థ్యాంక్స్ అంజలి!" అన్నాడు. "రోజూ ఇలానే ఉండాలి" అన్నది.

ఈరోజు ఆఫీసుకు పోయి ఒక గంటకంటే ఎక్కువసేపు ఉండకుండా వచ్చేద్దాం. కొన్ని చెక్కులు నీవు కూడా సంతకాలు చేయాల్సి ఉంది. నీకిష్టం లేకపోతే ఇక్కడికే తెమ్మంటాను. అలసటగా ఉంటే రెస్ట్ తీసుకుందువు" అని చేయి పట్టుకొని "టిఫిన్ చేద్దువుగాని రా" అని తీసుకొనిపోయింది. "ఈరోజు నీకిష్టమైన పొంగలి, వడ చేయించాను" అన్నది. "థ్యాంక్స్" అన్నాడు శశి. బ్రేక్‌ఫాస్ట్ అయిన తర్వాత ఇద్దరూ కార్లో ఆఫీసుకు బయలుదేరారు.

కారు ఆఫీసు ముందర ఆగింది. ఆదమరచి ఉన్న అందరూ, ఎక్కడివాళ్ళు అక్కడ అలర్ట్ అయిపోయి ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయ్యేదానికి పరుగు తీయసాగారు. శశిధర్ ఆఫీసుకు రావడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. ఈ మధ్యకాలంలో ఆయను చూడడం ఎవరికీ వీలుకాలేదు. ఒక గంటలో పనులన్నీ అయ్యేట్లు ఆర్గనైజ్ చేసింది అంజలి. రూములో కూర్చుని మాట్లాడుకొని ఎవరి పనులు వారికి అప్పజెప్పి, ఇద్దరూ కార్లో ఇంటికి బయలుదేరారు.

కారు కొంతదూరం పోయిన తర్వాత శశి "ఈరోజు నయాగరా హోటల్‌కు వెళదామా" అని అడిగాడు. "అలాగే అన్నది అంజలి". పూర్ణిమ వున్నప్పుడు నెలకు ఒకటి రెండుసార్లు శశితో ఆ హోటల్‌కు పోవడం అలవాటు. అందుచేత పూర్ణిమ గుర్తుకు వచ్చిన కారణంగా హోటల్‌కు పోవాలనిపించి ఉంటుంది అని అనుకొని అంజలి డ్రైవర్‌తో నయాగరాకు పొమ్మని చెప్పింది. ఆ హోటల్లో వీళ్ళు ఒక ప్రత్యేక క్యాబిన్లో కూర్చునేవారు. హోటల్ వాళ్ళకు పూర్ణిమ అంటే ఎనలేని గౌరవం. పూర్ణిమ నుండి ఫోన్ వస్తే ఆ క్యాబిన్‌ను ఎంతసేపైనా ఖాళీగా ఉంచేవాళ్ళు. హోటల్ చేరారు. ఇంతలో హోటల్ వాళ్ళు అక్కడ వేరేవాళ్ళు కూర్చునివుంటే వాళ్ళను రిక్వెస్ట్ చేసి ఆ క్యాబిన్‌ను ఖాళీ చేయించి శుభ్రం చేస్తున్నారు. రెండు నిమిషాల్లో క్యాబిన్ రెడీ అయ్యింది. ఇద్దరూ క్యాబిన్‌లో కూర్చొని, మెనూ ఏమి ఆర్డర్ చేద్దాం అని అంజలి అడిగింది. "మన మెనూ నీకు తెలుసుగా అంజలి" అన్నాడు. పూర్ణిమకు ఒక స్టాండెర్డ్ మెనూ ఉండేది. శశితో పూర్ణిమతో దగ్గరయిన రోజుల్లో తానుకూడా వాళ్ళతో

హోటలుకు వస్తుండే కారణంగా తనకు వాళ్ళ అభిరుచి తెలిసింది. ఆ ప్రకారమే మెనూ ఆర్డర్ ఇచ్చింది. ఇద్దరూ భోజనం ముగించారు. మధ్యలో కొన్ని పెండింగ్ విషయాలు ఇలా చేద్దామా, అలా చేద్దామా అని శశిని డైవర్ట్ చేయడానికి అంజలి మాట్లాడుతున్నది. దానికి ముక్తసరిగా శశి "నీకు తెలుసుకదా, నీ ఇష్టప్రకారం ఎలా మంచిగా ఉంటే అలా చెయ్యి" అన్నాడు శశి.

ఉన్నట్టుండి శశి "ఒకరోజు ఏమైందో తెలుసా? నేను ప్లేటును అటునుండి ఇటు జరపబోయి స్లిప్ అయి ప్లేటు పూర్ణిమ మీద పడిపోయింది. తన బట్టంతా ఖరాబయ్యింది. ఆరోజు ఎంత నవ్వు వచ్చిందో మా ఇద్దరికి అంటూ నవ్వసాగాడు. అయినా ఎంత స్పోర్టివ్‌గా తీసుకునేదో?"

శశి మాట్లాడడం ఆపి, మరలా "తను ఒక మహా మనిషి. నాకు భగవంతుడు అనుగ్రహించిన సర్వ సంపద. తానొక దేవత. నేనే దురదృష్టవంతుడిని. తానందించిన ప్రేమ ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను. ఋణం తీర్చుకోకపోగా, తనను ఈలోకం నుండి నా చేతులతో నేనే పంపించివేశాను. తాను నన్ను ఒకే ఒక్క కోరిక కోరింది. దాన్ని కాదనలేక పోయాను. ఇంతకు మించి తనకు నేను చేయగలిగిన ఘనకార్యం ఏమీ ఉండదని నాకు తెలుసు. పోనీలే అట్లాగైనా ఋణం తీర్చుకుందాం అనుకున్నా, ఏమంటావు అంజలి" అన్నాడు.

అప్పటి దాకా అంతా వింటూ ఏం మాట్లాడాలో తెలీయక కనీసం అట్లా అయినా ఏదో ఒకటి మాట్లాడి లోపల ఆవేదనను చల్లార్చుకుంటాడు అనుకొని "అక్క అందరికీ దేవతే కదా? స్వార్థం ఎరుగని ఒక మునీశ్వరి. అందుకని దేవుడు కూడా అసూయతో తనను మననుండి తీసుకెళ్ళాడు. నేను కూడా తన ఋణాన్ని తీర్చుకోలేను కదా! నిన్ను నాకు ప్రసాదించి తాను వెళ్ళిపోయింది. నిజానికి కష్టాలు మీవి, సుఖాలు నావి. నా కోరిక ఫలించింది. కొంచెం సేపు నిశ్శబ్దం. మన సంస్థల్ల ద్వారా మనం అనేక దాతలను, రాజకీయనాయకులను, జ్ఞానులను చూచాము. కాని అక్క ఔన్నత్యం ముందు వీళ్లందరూ బలాదూరే అనిపించింది. అంత ఉదాత్తత కలిగిన వ్యక్తిని, నిస్వార్థజీవిని గురించి మనం చూడలేదు వినలేదు. తన ముఖంలో కోపాన్ని ఒక్కరోజు కూడా నేను చూడలేదు". అంజలికి కొంత అర్థమౌతున్నా కూడా పూర్తిగా పూర్వాపరాలు తెలీయడం లేదు. పూర్ణిమ తాను కోరడమేమిటి? తనని శశి ఈ లోకం నుంచి పంపించివేయడం ఏమిటి? వీటికి అర్థం తనకు తెలియడం లేదు.

* * * * *

శశి, అంజలి మామిడి చెట్టుకింద కుర్చీలు వేసుకొని కూర్చుని పూర్ణిమతో తమ తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. “నేను తనను కలిసిన మొదటి రోజుల్లో నా దీనగాథను విన్నంతనే రెండువేల రూపాయలు నాకు ఇచ్చింది. అసలు ఒక్కసారి రెండువేలు నా జేబులో పెట్టుకున్న స్థితి నా జీవితంలో నాకెన్నడూ కలుగలేదు. ఆ తర్వాత మేము హోటల్ పెట్టే వరకు నా పరిస్థితిని గమనించి, నేను అడక్కుండా ఖర్చులకిచ్చేది. పూర్ణిమ మనస్సు నవనీతం. తాను లేకుండా నేను బతికున్నానంటే నమ్మకం కుదరడం లేదు. నేను వెళ్ళి ఉండేవాడిని, కాని నిస్వార్థంగా తాను పదిమందికి పంచిన మంచిని తుంచేస్తే తన ఆత్మ ఘోషిస్తుంది. అందుచేత నా చేతులు కట్టివేయ బడ్డాయి. తాను ఎంత పని ఒత్తిడిలో ఉన్నా, నేను ఎక్కడ ఉన్నాను, ఏం చేస్తున్నాను, నాకు ఏంకావాలి అని గమనిస్తుండేది. ఎక్కడికి పోయినా ఇద్దరం ప్రయాణమై పోయే వాళ్ళం”.

“పూర్ణిమ రోజుకు దాదాపు 18 గంటలు పనిచేసేది పూర్ణిమ. రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు రకరకాల పుస్తకాలు చదివేది. సంగీతం అంటే మహా ఇష్టం. లేకపోతే కంప్యూటర్లో ఏదో చేస్తుండేది. నేను నిద్రపోయేవాడిని. తను ఏ విషయాన్నైనా సులభంగా అర్థం చేసుకోగలిగేది. ఎవరితోనైనా సామాన్యుడి నుండి వేదాంతులు, సైంటిస్టులు వరకు మాట్లాడగలిగి ఉండేది. వాళ్ళు చెప్పిన దానికి తాను చాలా సులభంగా స్పందించి వాళ్ళు చెప్పిన దాన్ని పెంచి మాట్లేడేది. ప్రతివాళ్ళు పూర్ణిమ జ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోయేవాళ్ళు. ఎవరికీ తెలియదు. పూర్ణిమ చాలా చక్కగా పాడేది. నాకు పాతపాటలు వినిపిస్తుంటే ఆనందించేవాడిని.

ఎప్పుడైనా తీరికలేక ఈ ప్రాజెక్టు పనులలో అలసిపోతే ఎవరికి తెలియకుండా ఏదో ఒక హిల్ స్టేషన్‌కో లేక సముద్ర తీరాలకో పోయి నాలుగు రోజులు గడిపి వచ్చేవాళ్ళము. నాకు తెలియని అనేక విషయాలను అర్థమయ్యేట్టు చెప్పేది. అయినా నాకు సగం అర్థం అయ్యేవి. కాని శ్రద్ధగా వినేవాడిని. జవాబు చెప్పడం చాలా అరుదుగా ఉండేది. తాను మాట్లాడుతుంటే, కనపడీ కనపడని చక్కని పలువరుస, ఎవరో నాట్యమయూరి భంగిమలాంటి కళ్ళ కదలికలు కదులుతుంటే, నొసలు పైకి కిందికి కదులుతుంటే వాటిని చూస్తూ భక్తుడు ఒక దేవత సాక్షాత్కారాన్ని చూస్తే పొందే తన్మయత్వం పొందుతుండేవాడిని. నాకు తాను చెప్పే విషయానికంటే తన భంగిమలను చూడడంలో మధురానుభూతి పొందేవాడిని. ఇంత అందం ఔన్నత్యం

నా స్వంతం అయినందుకు నేను ఎంత మురికిపోయేవాడినో, ఈ ప్రపంచంలో అందరికంటే చాలా అదృష్టవంతుడినని ఆనందించేవాడినో అది నాకే తెలుసు". శశి మాట్లాడడం ఆపి ఎక్కడో గతంలో జ్ఞాపకాలను గుర్తుచేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

ఇంతలో అంజలి అందుకొని "నీ జీవితం పూర్ణిమ వలన సంపూర్ణం అయ్యింది. నీవు ఎంతో అదృష్టవంతుడివి శశి! నీ వలన నేను కూడా చాలా అదృష్టాన్ని పొంద గలిగాను. నీ సహచర్యం వలన, నీ ప్రేమాభిమానం, అక్క అభిమానం వలన మీకు సేవచేసుకునే భాగ్యం కలిగింది. తాను పది సంవత్సరాలు నన్ను ఆదరించి పోషిస్తే నాకు తనసేవచేసుకునే అవకాశం కల్పించినందుకు, నీకు నా కృతజ్ఞతలు. నామీద ప్రసరించబడ్డ నీ దయ మరో జన్మంటూఉంటే అప్పుడు తీర్చుకుంటాను".

అంతలో మరలా శశి అందుకొని "ఇంకొక విచిత్రమైన విషయం చెబుతాను". ఒకరోజు పూర్ణిమ ఒక వింత ప్రశ్న వేసింది. "మనిద్దర్లో ఎవరు ముందు పోతారు?" అని అడిగింది. నేను అసలు ఆ ఆలోచనను భరించే మానసిక స్థైర్యం లేక ఊపిరి బిగబట్టుకొని "నేను పోతే అదృష్టవంతుడ్ని, లేకపోతే భయంకరమైన జ్ఞాపకాలతో ప్రతిరోజూ చచ్చిబతుకుతుంటాను. ముందు పోతే జ్ఞాపకంతో పనిలేదు కాబట్టి బాధలేదు." అన్నాను. తాను "అయితే ఇద్దరం ఒకేసారి పోతే పోతుంది కదా" అన్నది.

"ఇప్పుడు జరుగుతున్నది అదే కదా అంజలి. నేను చచ్చి బ్రతికి ఉన్నాను. కాకుంటే ఎక్కడో ఒక చిరుదీపం వెలుగుతుందని ఊహించలేకపోయాను. అది నీవే. ఆ వెలుగులో నీ చేతిని పట్టుకొని నడుస్తున్నాను". అన్నాడు. పక్కనే ఉన్న అంజలి శశిని వాటేసుకొని ముద్దుపెట్టుకుంటూ ఒక మాధురానుభూతితో ఉక్కిరిబిక్కిరై చాలాసేపు ఉండిపోయింది. శశి కదల్లేదు, మెదల్లేదు. మొద్దులా అలానే ఉండిపోయాడు. తాను అంతకుమించి ఇంకేమో చెయ్యాలని తపన, చెయ్యలేదన్న బాధ, చెయ్యకపోతే ఏమౌతుందోనన్న బెంగ ఇలాంటి వాటన్నింటికీ అతీతంగా భూమి, ఆకాశం మధ్య శూన్యంలో అలా ఏ ఆధారం లేకుండా ఉన్నాడు. నిజానికి శశికి అంజలి ఒక పెద్ద ఓదార్పు. అంజలికి శశి ఒక ఆసరా, తృప్తి.

శశి, "అంజలి! అసలు మానవులకు ఇలాంటి విషమ పరిస్థితులు ఎందుకు వస్తాయి? వీటిని ఎవరు సృష్టిస్తారు. వీళ్ళ మనసా? భగవంతుడా? అంతా మాయలా కనపడుతుంది. మాయ అయినా, అనుభవాన్ని కాదనలేము కదా. బాధను కాదనలేము.

ఆనందాన్ని కాదనలేము. అంటే జరిగింది అనుభవం. జరుగుతున్నది అనుభవం. జరగబోతున్నది అనుభవం. పుట్టుక మరణం మధ్య జీవితం ఒక అనుభవం. అయితే పుట్టుకకు అనుభవాన్ని ఆస్వాదించడం ఉంటుంది. మరణానికి అనుభవం గుర్తుండదు".

జీవితం ఒక సూర్యోదయం. సూర్యాస్తమయం లాంటిది. సూర్యునిలా కళ్ళు తెరవడం, కన్ను మూయడం, మధ్యలో ఉన్నది నిచ్చెనలాంటిది. నిచ్చెన ఎక్కితే దిగి తీరాల్సిందే. ఇలాంటి ఆలోచనలతో శశి అంజలి మధ్య నిశ్శబ్దం ఏర్పడింది. మరలా శశి అందుకొని "అంజలీ! జన్మలంటూ ఉన్నాయో లేదో నాకు తెలీదు. మరలా మనిద్దరం ఈవిధంగా, ఈమార్గంలో పయనిస్తామని గ్యారంటీ లేదు. నాకు పూర్ణిమ లేని వెలితిని కొంతవరకైనా పూడ్చాలంటే నాకు నీవే ఆధారం".

పూర్ణిమ అనేకసార్లు "నీకు ఎలా కావాలంటే అలా చేయి. నాకెలాంటి అభ్యంతరం లేదు. నిన్ను నిరంతరం చూస్తూ వుంటే, నీ సమక్షంలో ఉంటే చాలు" అనేది. "నేను ఆ అరువు తెచ్చుకున్న ఆ మాటలను ఇప్పుడు నీకు ఒప్పచెబుతున్నాను" అన్నాడు.

అందుకు అంజలి "నీ యిష్టం, నా యిష్టం అంటూ ఏమీ లేదు. ఉండకూడదు. అదే నా ఆనందం. మనిద్దరం అక్క కనుసన్నల్లో మెలిగాం. ఆమె శిక్షణతో ఇంత వారమైనాము. మన ప్రతిమాట, చర్య, అక్క మన దగ్గర, కాదు కాదు అక్క సన్నిధిలో ఇంకా మనం ఉన్నాము అన్న స్పృహను ఎప్పుడూ కలిగిఉండాలి".

అంజలి, "అక్కను గురించి ఇంకేమైనా విశేషాలను చెప్పకూడదా వినాలని ఉంది" అన్నది.

శశి ఒకరోజు "చంద్రుని చూస్తూ ఇక్కడే మనిద్దరిలాగే పూర్ణిమ నేను కూర్చుని ఉన్నాం" పూర్ణిమ అన్నది "నీకు శశిధర్ అనే పేరు కంటే శశాంకుడు అని ఉంటే బాగుండేది కదా అన్నది". అందుకు నేను "ఏదైతే నేం నీవు శశి అని పిలిస్తే నాకు హాయిగా ఉంటుంది" అని అన్నాను.

మరలా "ఒక విషయం నీకు చెప్పలేదు కదూ? ఒక ఆరేడు సంవత్సరాలు అయి వుంటుంది సరిగా గుర్తులేదు. ఎవరికీ తెలియకుండా ఇద్దరమూ వాళ్ళ వూరికి వెళ్ళి, ఒకరోజులో తన ఆస్తులన్నింటినీ అమ్మేసి, ఇంటిని ఒక పెద్ద లైబ్రరీగా తీర్చిదిద్దమని ఒక కమిటీని, ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి వచ్చాము. లైబ్రరీని వాళ్ళ అమ్మానాన్న పేర్ల మీద

ఏర్పాటుచేసింది. తనకు చదువు, పుస్తకాలు, లైబ్రరీ అంటే అంత ఇష్టం. మన ఆడిటోరియం దగ్గర లైబ్రరీని నీవు చూస్తున్నావు కదా?" అన్నాడు.

అంజలి : "తన జీవితపు నిష్క్రమణ ఇతరులకు ఎవ్వరికీ తెలీయకూడదని అక్క ఎందుకు చెప్పింది? తన అంతిమ యాత్ర గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోవాలని ఎందుకు మనలను అన్ని జాగ్రత్తలు తీసుకోమని చెప్పింది."

శశి! : "తనకు ఈయడం తప్ప తీసుకోవడం తెలియదు. రెండోది తన చివరి దశను చూచి తట్టుకోలేని వాళ్ళు వేలమంది ఉన్నారు. తనకు పరిచయమున్న వ్యక్తులు, తల్లి లేనివారు పూర్ణిమను తల్లిగా, సోదరి లేనివారు సోదరిగా, దిక్కులేనివాళ్ళు తానే దిక్కని భావించేవారు. తమ జీవితాలకు ఆసరాగా ఉన్న వ్యక్తి మరణం వల్ల తన అభిమానులు బాధపడకూడదని ఆమె ఉద్దేశ్యం. అదీగాక అలాంటి దృశ్యాన్ని చూడలేక ఏమౌతుందో నన్న భయం. ఇవన్నీ తన చావును గోప్యంగా ఉంచడానికి కారణాలైనాయి. అందుచేత మనం ఒకవారం రోజులు ఆవిషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డాము. అప్పటికీ ఎంత గందరగోళం అయ్యిందో నీకు తెలుసుకదా?

ఇంకొక విషయం చెప్పడం మరిచాను. మేము మొదట ఆశ్రమాలలో వృద్ధులను చేర్చుకునేందుకు వారి సంతానంతో చర్చించి వాళ్ళకు కౌన్సిలింగ్ ఇచ్చి వీలైతే మరల వాళ్ళ తల్లిదండ్రులను చూచుకునేట్టు చేసిన సంఘటనలు చాలావున్నాయి. కొంతకాలం తరువాత ఆశ్రమాల్లో ఉన్న తల్లిదండ్రులను వాళ్ళబిడ్డలు వెనుకకు తీసుకొని పోవాలని ప్రయత్నంచేస్తే, వాళ్ళు ససేమిరా ఒప్పుకోని సంఘటనలు అనేకం. ఎందుకనంటే వాళ్ళు ఇక్కడ పొందే ఆనందం వాళ్ళ బిడ్డలు వాళ్ళకు ఇయ్యలేరని ఒకవిశ్వాసం ఏర్పడింది. పూర్ణిమ అంత ఘనంగా శ్రద్ధతో వాళ్ళను గమనించేది.

కాలము, మనస్సు రెండూ పెనవేసుకొని ఉంటాయి. కాలానికి మనస్సుకు ఉన్న అగాధం మరపు. ఒకవేళ తన అంతిమ యాత్రను చూచినప్పుడు, తనకన్నా గొప్పవాళ్ళను గూడా ఎంతకాలం గుర్తుపెట్టుకుంటారు. జ్ఞాపకం కాలంతోకూడా పల్చబడి రంగు వూసిపోతుంది. మనము ఎంతమందిని గుర్తుపెట్టుకుంటున్నాము. మనకు పూర్ణిమ ఎంత గుర్తున్నా మొదటిరోజుకు ఈరోజుకు తేడా వుంది కదా? పూర్ణిమ నాతో 'నీకు, అంజలికి ఈప్రక్రియలో పాలుపంచుకొని, దుఃఖాన్ని దిగమ్రింగు కోకపోవడం ఎలాగూ తప్పదు. ఈ దారిద్ర్యాన్ని అందరికి పంచడం నాకు అసలే ఇష్టం లేదు. బుద్ధుడు తన బిడ్డను బ్రతికించమని కోరిన ఒక తల్లితో, ఈ ప్రపంచంలో

బ్రతికున్న వాళ్ళు అతి కొద్దిమంది. చనిపోయిన వాళ్ళ అనంతం, ఆ అనంతంలో మర్చిపోయిన వాళ్ళ లిస్ట్‌లో త్వరగా చేరిపోవాలని ఉంది".

* * * * *

శశి : "దుఃఖం, సుఖం కాలంతో పల్చబడి సూక్ష్మమైపోతాయి. దగ్గర నుండి చూస్తే రంగు చిక్కగా ఉంటుంది. అదే దూరం పెరిగితే పల్చబడిపోతుంది. అలాగే కొండ దగ్గర నుండి చాలా పెద్దది. దూరం నుండి చాలా చిన్నది అవుతుంది. అదే కొండను అద్దంలో చూస్తే ఇంకా చాలా చిన్నదిగా ఉంటుంది. అనుభవించే వ్యక్తి దుఃఖాలు కొండలా ఉంటాయి. భూతద్దంలో చూచినట్లుంటాయి. అదే ఇతరుల దుఃఖాలు అద్దంలో కొండను చూచినట్లు ఉంటాయి. ఈ మనసులో ఎక్కడో ఒక ఎర్రర్, పొరబాటు లేదా తప్పు ఉందనిపిస్తుంది. అది మనస్సులోని కుడి ఎడమ మెదడుల పరస్పర లావాదేవీలు, కలయిక విభజనలవలన కలిగే చర్యల ప్రతిచర్యల ఫలితం. ప్రతి మనస్సుకు ఇతర మనస్సుల గురించి అర్థమయ్యే దానికంటే, తన మనస్సును గురించి తాను అర్థంచేసుకోవడం చాలా స్వల్పంగా ఉంటుంది. ఉదాహరణకు చర్మము అన్ని స్పర్శలను అనుభవించగలదు. కాని తన చర్మము స్పర్శను తాను అనుభవించలేదు. దీన్నే లిమిటేషన్ లేదా పరిమితి అని అంటాము. ఈ లిమిటేషన్ అన్ని జీవులకు సర్వకాల సర్వావస్థలయందు పనిచేస్తుంది. వనరులు, సంపదలు, శక్తిసామర్థ్యాలు ఎన్నైనా ఉండవచ్చు. కాని వాటికి ఒక చెలియలికట్ట ఉంటుంది. దాన్ని దాటడం కష్టం. మానవునికి లిమిటేషన్ దేవుడు. దేవునికి లిమిటేషన్ మానవుడు. మానవునికి లిమిటేషన్ ప్రకృతి. ఇది అంతా నా జ్ఞానం కాదు, పూర్ణిమది. ఇవి చిలుక పలుకులు".

* * * * *

అంజలికి శశికి, పూర్ణిమ ఆశయాలను పరిపూర్ణంగా నెరవేర్చేందుకు తమవంతు శక్తియుక్తులను వెచ్చించి ఆనందించడానికి అలవాటు పడిపోయారు. అందులో వాళ్ళకు ఆనందం తప్ప అలసట తెలియడం లేదు. సిటీలోని రాజకీయ, వ్యాపార సేవా రంగాలలో ఉన్న గొప్ప వ్యక్తులు 'పూర్ణిమ' నిలవెత్తు కాంస్య విగ్రహాన్ని మంచి కూడలిలో పెట్టాలని, అంజలిని శశిని ఒప్పించేందుకు ప్రయత్నించారు. కాని అలాంటివి పూర్ణిమకు ఇష్టం లేదని వాళ్లు మొగ్గుచూపలేదు. అయినప్పటికీ కార్యక్రమం కనీవినీ ఎరుగని రీతిలో జరిగిపోయింది. దీని ఆధారంగా ప్రతి ట్రస్టు, వాళ్ళ వాళ్ళ సంస్థల్లో పూర్ణిమ విగ్రహాలను పెట్టడం జరిగింది. జరుగుతున్న వ్యవహారాలకు శశికి, అంజలికి ప్రేక్షకపాత్ర

వహించడం అలవాటయ్యింది. పూర్ణిమ ప్రతి వర్ధంతిని పెద్దపండుగలా జరుపు కుంటున్నారు. తమ ఆలోచనలు ఎలా ఉన్నా మిగతా వాళ్ళ మనసుల్లో పూర్ణిమ మీది ప్రేమ, అభిమానం, కృతజ్ఞతలను కాదనే స్థితిలో లేరు.

* * * * *

పూర్ణిమ నిష్క్రమించి ఐదు సంవత్సరాలు దాటిపోయాయి. శశి, అంజలి కాలాన్ని తోడుచేసుకొని తమ ప్రయాణం సాగిస్తున్నారు. వాళ్ళ ప్రేమను, త్యాగాన్ని శ్రద్ధతో సంస్థల అభివృద్ధికి వెచ్చించడం తప్ప, మనస్సులో హృదయంలో ముడతలు రాని ఆలోచనలతో, ఆశయాలతో, ఒకరికొకరు తోడై పూర్ణిమను మనసునిండా నింపుకొని, తన ఆశయాన్ని : "నాకు సుఖం మీద కోరికలేదు. నాకు అధికారం మీద మక్కువ లేదు. నాకు మోక్షం మీద మోహం లేదు. అయితే శోకతప్త హృదయాలకు స్వాంతన కల్పించాలనే తపన ఉంది", తమ హృదయాల్లో పదిలపరచుకొని, అన్నిసంస్థల్లో అందరి మనసులకు హత్తుకునేలా ఫలకాలు పెట్టించి ప్రయాణం సాగిస్తున్నారు.

* * * * *

# THE SOLE PURPOSE
# OF
# EVERY SOUL IS
# TO
# CONSOLE
# THE
# BROKEN SOUL.

# పూర్ణిమ

ప్రకృతి, జీవుడు ద్వంద్వమయం. ఏ ద్వంద్వమైనా ఒకటి లేకుండా మరొకటి ఉండదు. అది వుంది అంటే ఇది వుంది. ఇది లేదంటే అది లేదు. ఈ సత్యాన్ని ఆవిష్కరించదానికి వేదాంతం కూడా 'మాయను' 'భ్రమను' 'లీలను' ఆధారం చేసుకొన్నది. ఏది ఏమైనా, మానవుని ఉత్కృష్టమైన ఆశయం ఆనందం. ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకోవదానికి, ఈ సృష్టిలో పుట్టిన ప్రతిజీవి నిరంతరాయంగా కృషిచేస్తున్నది. కాని అది ఎండమావుల వెంటపరిగెత్తడమేనని ఋజువవుతున్నది. ఇది ఒకయుద్ధం, లంపట, తంతు.అయినా జీవిత లక్ష్యాల దృఢత్వాన్ని బట్టి, ప్రయత్నాల పెళుసుతనం పెరుగుతుంది. ఈ జీవన సమరంలో, శూన్యాన్ని పూర్ణాన్ని కలబోసితే, ఉద్భవించేది ప్రేమ, త్యాగం. అలాంటి ప్రేమ త్యాగం, పెనవేసుకున్న ఇతివృత్తం ఈ 'పూర్ణిమ'.



Acharya Seshaiah Kandamuru, M.Com., Ph.D. is a retired Professor of Commerce and Management of Sri Venkateswara University, Tirupati. Primarily, he is a teacher at heart apart from being an administrator, researcher, consultant, trainer and a mentor. He was the Founder Secretary of Bharatiya Vidya Bhavan, Tirupati Kendra School and Ex-Honorary Director of Andhra Pradesh Productivity Council, Tirupati.

He has organized thousands of programmes covering Leadership, Motivation, Communication, Organizational Behavior (OB) and Entrepreneurial Development including PMRY and CMEY. His mission is to convert problematic and lethargic children into successful career oriented people. He is a recipient of "*Pratibha Puraskar*", "Best Citizens of India" "Vijnana Vidvanmani" and "*Siksha Ratna*". His mission is to solve the real and notional problems of people. He mentors parents, children, men and women of all ages and positions to come out of their utopian thinking that damages their health, wealth and relationships. He authored articles and books on Banking, Commerce, Children's Stories, "21 Leadership Lessons" (Co-authored),"Fate & Free-Will : The Philosophy of Fate and the Science of Free Will", "Leadership Proverbs", "Communication Skills", "Personality Development", "Mentor to Leader", "Sri Sreenivas Charitam" (Telugu Lyrics), "Nitya Jeevitamlo Bhagavad Gita" (Telugu), "Krishna", "Bala Kadha Sudha" and Brahmana Chaitanyam (Telugu).

'తరాల అంతరం' (నవల), "Lokagnanam", "The Work Culture in Bhagavad Gita", "The Physics of Philosophy" and "The Philosophy of Physics" are under print.